
# జాతీయ స్ఫూర్తి

పక్షపత్రిక

RNI Regn No. 52879/93

2021 మార్చి 1-31

వెల : రూ. 50


## మహిళల ఉద్యమ స్ఫూర్తి

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం - 2021

## ప్రత్యేక సంచిక

# మన దేశంలో మహిళల స్థితిగతులు

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక 2019

### మహిళల పై అత్యాచారాలు

- ☞ భర్త,అతని కుటుంబ సభ్యుల అకృత్యాలు
  ప్రతి 4 నిముషాలకు ఒకటి
- ☞ యాసిడ్ దాడులు ప్రతి 2. 3 రోజులకు ఒకటి
- ☞ వరకట్నం చావులు
  ప్రతి 1 గంట 13 నిముషాలకు ఒకటి
- ☞ సామూహిక మానభంగాలు /హత్యలు
  ప్రతి 1 రోజు 6 గంటలకు ఒకటి
- ☞ వ్యభిచార గృహాలకు తరలింపు ప్రతి 4 గంటలకు ఒకటి
- ☞ మానభంగాలు ప్రతి 16 నిముషాలకు ఒకటి
- ☞ మానభంగ ప్రయత్నాలు ప్రతి 2 గంటలకు ఒకటి
- ☞ స్వాభిమానం పై దాడులు ప్రతి 6 నిముషాలకు ఒకటి



### దేశంలో మహిళలపై జరిగిన నేరాలు

| | |
|---|---|
| 2018 లో మొత్తం నేరాలు | 3,78,236 |
| 2019 లో మొత్తం నేరాలు | 4,05,861 |
| భర్త, కుటుంబ సభ్యుల ఆగడాలు | 30.9 శాతం |
| ఇతర దురాగతాలు | 21.8 శాతం |
| కిడ్నాపులు, నిర్బంధాలు | 17.1 శాతం |
| మానభంగం కేసులు | 7 శాతం |

ప్రతి లక్ష మంది మహిళలలో ఏదో ఒక దురాగతానికి గురవుతున్న వారు 2018 లో 58.8 కాగా 2019 లో 62.4 మంది. ఈ నేరాలలో ఉత్తరప్రదేశ్ 59,853, రాజస్థాన్ 41,550, మహారాష్ట్ర 37,144 కేసులతో ముందున్నాయి

### 2011 జనాభా లెక్కలలో మహిళలు

మొత్తం జనాభా 121.06 కోట్లు మహిళల శాతం 48.5

స్త్రీ -పురుషుల నిష్పత్తి

ప్రతి 1000 మంది పురుషులకీ 943 మంది స్త్రీలు

0-19 వయస్సు వారిలో స్త్రీ - పురుష నిష్పత్తి 908 మాత్రమే

మహిళల సగటు వివాహ వయసు 22.3 సంవత్సరాలు

జీవిత కాలం

పురుషులకు 64. 4 కాగా మహిళలకు 69.6

ప్రసవ కాలంలో మరణాల రేటు

2001 లో 307, 2011 లో 167 కి తగ్గింది

శిశు మరణాల రేటు (IMR)

ఆడపిల్లలలో 40, మగ పిల్లలలో 37గా వుంది

అక్షరాస్యత పురుషులలో 84.7 శాతం, స్త్రీలలో 70.3 శాతం

### ఉపాధి రంగంలో మహిళలు

ఉపాధి రంగంలో మహిళలు 25. 51 కాగా

పురుషులు 53. 26 శాతం

ఇందులో అసంఘటిత రంగంలోనే 59.3 శాతం వున్నారు

గ్రామీణ ప్రాంతంలో స్థిర వేతనాలు పొందేవారిలో

మహిళలు 5. 6 శాతం కాగా పురుషులు 10 శాతం

శ్రామిక జనాభాలో స్త్రీలు - పురుషులు

మహిళలు 24.8 శాతం (గ్రామీణ) 14.7 శాతం (పట్టణ )

కాగా పురుషులు 54. 3 శాతం (గ్రామీణ)

54. 6 శాతం (పట్టణ)




### చట్ట సభలలో మహిళలు

- ⁕ ప్రస్తుత లోక్ సభలో 543 మందిలో 78 మంది మహిళలు (14.4 శాతం )
- ⁕ 2014 లో మహిళలు 62 మంది (11 శాతం)
- ⁕ ప్రస్తుతం రాజ్యసభలో 245 మందికి 25 మంది మహిళలు ఉన్నారు
- ⁕ రాష్ట్రాల శాసన సభలలో 3759 మంది పురుషులు కాగా 359 మంది మహిళలు (9 శాతం)
- ⁕ పంచాయితీలలో మొత్తం స్థానాలు 2,91,736 కాగా అందులో 1,34,773 మంది మహిళలు (46 శాతం)
- ⁕ చాలా రాష్ట్రాలలోమహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించారు

# మహిళల ఉద్యమాల నుండి ప్రభవించిన
# అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**సంపాదకీయం**

19వ శతాబ్దంలోనే ప్రపంచంలో అనేక దేశాలలో మహిళలు తమ పని పరిస్థితులను మార్చుకునే పోరాటాలకు నాంది పలికారు. ఈ ఉద్యమాల నేపథ్యం నుండి 1910లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రూపుదిద్దుకుంది. ఇది మౌలికంగా శ్రామిక మహిళల పోరాట దినం. అన్ని రకాల వివక్షలకు వ్యతిరేకంగా అందరు మహిళలు సాగించే ఉద్యమ దినం.

శ్రామిక మహిళలు తమ దుర్భర పరిస్థితులపై తిరుగుబాటుగా పని గంటల కుదింపు కోసం ప్రారంభమైన ఉద్యమం అటు తర్వాత విద్యాహక్కు కోసం, రాజకీయంలో పాత్ర కల్పించే ఓటు హక్కు కోసం, సమాన పనికి సమాన వేతనం కోసం, మహిళ తన అస్తిత్వాన్ని ప్రకటించు కోవడానికి, సాధికారతను సాధించడానికి, సమస్త వివక్షల బంధనాలను తెంచుకోవడానికి ఈ ఉద్యమం విస్తరించింది. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి కూడా ప్రకటించింది. ఇప్పుడు దేశదేశాలలో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు జరుగుతున్నాయి. దేశ ప్రభుత్వాలే ఈ ఉత్సవాలను నిర్వహించే సంప్రదాయం చాలా దేశాలలో ప్రారంభమైంది.

ఈ విస్తృతి మనం ఆహ్వానించదగిందే అయినా దీని వల్ల మహిళలు సాగిస్తున్న ఉద్యమస్ఫూర్తి మసకబారకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మహిళా ఉద్యమం ముందున్నది. ఈ సంవత్సరం పాటు సాగాల్సిన మహిళా కార్యక్రమాలకు ఐక్యరాజ్యసమితి రూపొందించిన నినాదం అర్థవంతంగా ఉంది. 'సవాళ్లను ఎంచుకుందాం – ఐక్యంగా ప్రతిఘటిద్దాం' అన్న నినాదం మహిళలు సాగించే ఉద్యమాలకు ప్రేరణ ఇచ్చేది అవుతుంది. ఈ నినాదాన్ని (Choose to Challenge) వివరిస్తూ చెప్పిన మాటలు మహిళల సాధికారతకు, సాగించాల్సిన పోరాటాలకు స్ఫూర్తినిచ్చేవిగా వున్నాయి.

"ప్రశ్నిస్తేనే ప్రపంచం జాగృతం అవుతుంది. మన ఆలోచనలకూ ఆచరణకు ఎల్లప్పుడూ మనమే బాధ్యులం. అందుకే, ప్రశ్నించేందుకే మన సిద్ధమవుదాం. ఆడా మగా పక్షపాతాన్ని అసమానతనూ బోనెక్కిద్దాం. మహిళలు సాధించిన ఘనవిజయాలను చాటి చెప్దాం. ఆనందంలో సంబరాలు జరుపుకుందాం. అందరికీ సమాన అవకాశాలుండే ప్రపంచాన్ని అందరం ఒకటై నిర్మించుకుందాం. ప్రశ్నే మార్పుకు దారి తీస్తుంది. ప్రశ్నించేందుకే సంసిద్ధమవుదాం". ఈ సందేశం మహిళా దినోత్సవ సమావేశాలలో చర్చనీయాంశం కావాలి. మహిళలు సాధించిన ఉద్యమాలను, సాధించిన విజయాలను స్మరించుకుందాం. వాటి నుండి ప్రేరణ పొందుదాం. వివక్షనీ, అసమానతనీ బోనెక్కించే ఉద్యమాలకు ఊపిరిలూదుదాం. సవాళ్లను ఎదుర్కొని సమానత్వాన్ని సాధించే పోరాటాలకు సన్నద్ధులం కావడమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తిగా భావిద్దాం.

జాతీయస్ఫూర్తి ప్రత్యేక సంచిక ఈ దిశగా ప్రేరణ పొందడానికి దోహదం చేస్తుందని భావిస్తున్నాం. చిన్న పత్రిక, పేజీలు తక్కువ కావడంతో ఈ సంచికలో కొన్ని వ్యాసాలను సంక్షిప్తంగా ఇచ్చాం. అలాగే చాలా సమాచారాన్ని కుదించి ఇచ్చాం. వివిధ పత్రికల నుండి సేకరించిన సమాచారాన్ని, కొన్ని స్వీయ రచనలను ఇచ్చాం. మహిళలు సాగించిన ఉద్యమాలను, ఉద్యమ నేతలుగా స్ఫూర్తిప్రదాతలైన వారి సంగ్రహ పరిచయాలను, వర్తమానంలో సాగుతున్న ఉద్యమాలను చాలా సంక్షిప్తంగా అందిస్తున్నాం. ఇందులో విస్మరణకు గురైన అంశాలు చాలా వున్నాయి. ఇన్ని పరిమితులలో మహిళా ఉద్యమాల వైవిధ్యాన్ని రేఖామాత్రంగా అందించడానికి చేసిన ఈ ప్రయత్నాన్ని ఆహ్వానిస్తారని ఆశిస్తున్నాం. ❑

జాతీయ **స్ఫూర్తి** పక్షపత్రిక

వ్యవస్థాపక సంపాదకులు, ప్రచురణకర్త
నిడదవోలు వెంకటేశ్వరరావు

2021 మార్చి 1-31 సంపుటి : 29 సంచిక : 11,12

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్

వెల : 50/- రూపాయలు

## ఈ సంచికలో...


3 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం!
"సిఎఎ" వ్యతిరేక పోరులో మహిళా ఉద్యమస్ఫూర్తి - శివలక్ష్మి
8 భారత స్వాతంత్ర్యోద్యమంలో మహిళల పాత్ర
9 ఇద్దరు చిట్టగాంగ్ వీర నారీమణులు - గబ్బిట దుర్గాప్రసాద్
11 స్వాతంత్ర్యోద్యమంలో మహిళలు
15 జాతీయ ఉద్యమం – తూర్పు గోదావరి జిల్లా మహిళలు - చల్లా హైమవతి
18 తెలంగాణా సాయుధ పోరాటంలో వీర వనితలు
ఎర్రజెండా రెపరెపల్లో మెరిసిన విద్యుల్లత మల్లు స్వరాజ్యం - వేములపల్లి సత్యవతి
25 ఎర్ర మందారం – ఆరుట్ల కమలాదేవి
27 విప్లవాగ్ని చాకలి ఐలమ్మ
28 ధీరవనిత కమలమ్మ
30 సామాజిక విప్లవకారిణి సావిత్రీబాయి పూలే
32 భారత కార్మికోద్యమాలలో మహిళల ధీరోదాత్త పాత్ర - డా॥ బివి విజయలక్ష్మి
37 సారా వ్యతిరేక ఉద్యమ సారథి దూబగుంట రోశమ్మ
38 మహిళా గ్రూపుల అక్షరాస్యతా ఉద్యమం - డా॥ సి. కృష్ణమోహనరావు
40 పర్యావరణ పరిరక్షణ ఉద్యమాల్లో మహిళల మహోన్నత పాత్ర - డా. పి.నారాయణ రావు
44 ఐక్య రాజ్య సమితి మహిళా సమ్మేళనం 2020 -ఎ.అన్నపూర్ణ
45 నూతన సహస్రాబ్దిలో వృత్తి, ఉద్యోగాలలో స్త్రీల పాత్ర - డా.ఆలూరి విజయలక్ష్మి
49 సవాళ్లను స్వీకరిస్తేనే సాధికారత - యస్. మనోరమ
52 స్త్రీవాదం కేవలం లింగ వివక్షకే పరిమితం కాదు, కాలేదు
54 స్త్రీవాద కవిత్వం – ఒక పరిశీలన - అద్దేపల్లి రామమోహనరావు
61 మరో వందేళ్లూ మహిళలకు సమానత్వం కలే! - సతీష్ ఊరుగొండ
63 రోజుకు 87 అత్యాచారాలు..మహిళలపై హింస పెరుగుతోంది - నాగమణి
64 మహిళా స్వావలంబన దిశగా కేరళ మరో ముందడుగు


## జాతీయ స్ఫూర్తి ప్రత్యేక ప్రకటన

**ఉచితంగా జాతీయ స్ఫూర్తి**

జాతీయ స్ఫూర్తి పత్రికను ఆసక్తి గలవారందరికీ ఉచితంగా అందించాలని భావించాం. అందువల్ల ఆసక్తి గల మిత్రులందరూ తమ పోస్టల్ అడ్రసును 8500678977 నెంబరుకు మెసేజ్ లేదా వాట్సాప్ ద్వారా పంపించండి.

**సంవత్సర చందాలకు స్వస్తి**

ఆసక్తి గల వారందరికీ జాతీయ స్ఫూర్తి పత్రికను ఉచితంగా అందించాలని భావించినందున వార్షిక చందాల పద్ధతికి స్వస్తి చెబుతున్నాం. ఇకపై సంవత్సర చందాలు పంపవద్దని తెలియజేస్తున్నాం. గతంలో చందాదారులుగా వున్న వారికి పత్రికను పంపిస్తాం.

### విరాళాలను పంపండి

పత్రిక నిర్వహణలో వున్న వ్యయప్రయాసలు అందరికీ తెలిసినవే. ఈ పత్రిక పది కాలాలు నిలబడడానికి, ఆసక్తి గల వారందరికీ ఉచితంగా పంపించడానికి అందరి ఆర్థిక తోడ్పాటు అవసరం. మీరు నగదు రూపంలో, ప్రకటనల రూపంలో మీ విరాళాలను జాతీయస్ఫూర్తి అకౌంటుకు పంపండి. మీరు పంపిన మొత్తం వివరాలు, మీ పోస్టల్ అడ్రసులను 8500678977 నెంబరుకు మెసేజ్/వాట్సాప్ ద్వారా తెలియచేయండి.

***NEFT లేదా RTGS పంపడానికి***
**JAATEEYA SPURTHI**
**A/c No.3620 101 0000 380**
**Syndicate Bank, Eluru Main Branch**
**IFSC Code : SYNB0003620**

జాతీయ స్ఫూర్తి పత్రికకు మీ సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరుతున్నాము.

ఇట్లు
**జాతీయ స్ఫూర్తి సంపాదక వర్గం**

# అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం!
# "సిఎఎ" వ్యతిరేక పోరులో మహిళా ఉద్యమస్ఫూర్తి



- శివలక్ష్మి

"అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం" అంటే జరిగిన అభివృద్ధిని సమీక్షించుకుని సాధించవలసిన హక్కుల కోసం భవిష్యత్తు కార్యాచరణని చర్చించుకునే రోజు. ప్రపంచవ్యాప్తంగా మన ముందు తరాల మహిళలు అవమానాల్నీ, ఘోరాపజయాల్నీ వారు ఎదుర్కొని మనకి మాత్రం సౌకర్యాలను సాధించి పెట్టిన సాహస వనితల సమర శీల పోరాట చరిత్రని మన భావి తరాలకు అక్షరమక్షరం పొల్లు పోకుండా చేరవేయడానికి ప్రతిజ్ఞ తీసుకునే రోజు 'మార్చి8'!

'అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినా'నికి ఒక గొప్ప స్ఫూర్తిదాయకమైన పోరాట చరిత్ర ఉంది. ప్రపంచంలో స్త్రీలకు సంబంధించి అంతర్జాతీయంగా చెప్పుకోదగిన వాటిలో ప్రధానమైనది మహిళా ఉద్యమం పుట్టుక. ఇది పెట్టుబడిదారీ యుగ ప్రారంభంలోనే మొదలైంది. మానవ చరిత్రలో మొట్ట మొదటిసారి శతాబ్దాల అణచివేత నుంచి విముక్తి కోసం దిక్కులు పిక్కటిల్లేలా మహిళలు ప్రపంచం నలుమూలల నుంచీ ఉద్యమించారు. సాధారణమైన శ్రామిక మహిళలు వందేళ్ళకు పైబడి అసాధారణమైన త్యాగాలకూ, కష్టనష్టాలకూ ఓర్చుకుని పోరాడిన కృషి ఫలితంగా "మార్చి8- అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం" గా చరిత్రలో స్థిరపడింది!




గత చరిత్రను అవలోకిస్తే, మానవాభివృద్ధి ప్రారంభ సమయంలో వ్యవసాయం ప్రధాన వృత్తిగా గల మూలవాసులలో మహిళలే ఇంటి యజమానులుగా, మాతృస్వామ్య సమాజం ఉండేది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధితో మహిళల్ని సామాజిక ఉత్పత్తికి దూరం చేసి, ఇంటి పనికీ, పిల్లల పెంపకానికీ పరిమితం చేసి పితృస్వామ్యాన్ని స్థిరీకరించారు. ఆ క్రమంలోనే ఆస్థి, సంతానం మీద హక్కులు కోల్పోయింది మహిళ. ప్రాచీనయుగం, మధ్యయుగాల్లో ప్రపంచవ్యాప్తంగా స్త్రీలందరూ కట్టు బానిసలే! ద్వితీయ శ్రేణి పౌరులే!! పారిశ్రామికీకరణతో తలెత్తిన సంక్షోభం సమాజంలో గొప్ప కుదుపులకు కారణమైంది.

1800 ప్రాంతాల్లో మహిళలు కడుపు కింత తిండీ, కంటికి నిద్రా, ఒంటికి బట్టా, తలదాచుకోవడానికి గూడూ లేక దుర్భరమైన పరిస్థితుల్లో మగ్గిపోయేవారు. మహిళలకు ఏ హక్కులూ లేని కాలంలో పిల్లలతో సహా పని ప్రదేశాల్లో 16 గంటల పైబడి వెట్టి చాకిరీ చేసేవారు. బండ పని, ఎటువంటి సౌకర్యాలూ లేని హీనమైన పని పరిస్థితులు, అతి తక్కువ వేతనాలు, స్త్రీ-పురుష అసమానత్వం మొదలైన కారణాలతో నరక యాతనలు పడుతున్న మహిళాలోకం మార్పు కోసం తపన పడి గొంతెత్తడం మొదలెట్టింది. పోరాటాల గతంలోకి వెళితే 1820లో ఇంగ్లండ్ లో "టైలరింగ్ మహిళల పోరాటం" చరిత్రలో మొదటిది! ఈ పోరాటం ఎన్నోదేశాల్లో ఎందరో మహిళలకు స్ఫూర్తి నిచ్చింది!

ఆ రోజుల్లో ఆస్ట్రియా, బెల్జియం, క్యూబా, కెనడా, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, జర్మనీ, గ్రీస్, ఐర్లాండ్, ఇటలీ, పోలండ్, లిథువేనియా, నెదర్లాండ్స్, నార్వే, పోర్చుగల్, రష్యా, స్కాట్లాండ్, స్పెయిన్, సిరియా, టర్కీ, మెక్సికో మొదలైన చుట్టు పక్కల దేశాల ప్రజలు జీవిక కోసం అమెరికాకు వలస వచ్చేవారు. అలా వచ్చినవారిలో అన్ని దేశాల మహిళా కార్మికులు నూలు మిల్లులలో పని చేసేవారు. ఊపిరి సలపనివ్వని పనితో సతమతమయ్యే మహిళలు 1900 సంవత్సరంలో చికాగోలో స్థాపించబడిన "అంతర్జాతీయ మహిళా దుస్తుల తయారీ శ్రామికుల యూనియన్"లో చేరారు. ఈ యూనియన్ సారథ్యంలో మహిళలు గడ్డ కట్టుకు పోయే చలిలో నెలల తరబడి ఫ్యాక్టరీల ముందు ఆకలే కాదు, అవమానాలే కాదు, ఎన్నో చెప్పరాని దుర్భరమైన హింసల కోర్చుకుని పికెటింగులు, సమ్మెలు చేశారు.

లాఠీ దెబ్బలు తిని జైళ్ళకు వెళ్ళారు. సమాజం నుంచి హీనమైన, అవమానకర, నిందారోపణలను ఎదుర్కొన్నారు. అయినా సరే, పట్టు వదలకుండా దృఢదీక్షతో వీరోచిత పోరాటాల బాటను వేసి, ముందు తరాలకు వెలుగు దారులు పరిచారు. కొన్ని అపజయాలెదురైనప్పటికీ ఈ ఉద్యమ స్ఫూర్తితో 1908 లో పదిహేను వేల మంది మహిళలు తక్కువ పని గంటల కోసం, ఓటు హక్కు కోసం, మెరుగైన జీతాలకోసం న్యూయార్క్ నగర వీధులలో బ్రహ్మాండమైన కవాతు నిర్వహించారు. 1909లో అమెరికాలోని సోషలిస్ట్ పార్టీ ఆదేశం మేరకు మొట్టమొదటి ''నేషనల్ ఉమెన్స్ డే'' ను 'ఫిబ్రవరి ఇరవై ఎనిమిది' న జరుపుకున్నారు.

1910 లో పదిహేడు దేశాల ప్రతినిధులు 'జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ' కి చెందిన 'క్లారా జెట్కిన్' నాయకత్వంలో డెన్ మార్క్ రాజధాని 'కోపెన్ హేగన్' లో సమావేశమయ్యారు. ఆయా దేశాల్లోని మహిళల సమస్యలను చర్చించడానికి–డిమాండ్ల సాధన కోసం ప్రతి దేశంలో, ప్రతి సంవత్సరం ఒకే రోజున ప్రపంచ వ్యాప్తంగా ''మహిళా దినం'' జరువు కోవాలని క్లారా ప్రతిపాదించారు. వివిధ యూనియన్లు, సోషలిస్ట్ పార్టీలు, ఉమెన్స్ క్లబ్బులకు చెందిన పదిహేడు దేశాలకు చెందిన వంద మంది మహిళా ప్రతినిధులే కాక ఫిన్నిష్ పార్లమెంట్‌కి మొట్టమొదటిగా ఎంపికైన ముగ్గురు మహిళా ప్రతినిధులు కూడా ఏకగ్రీవంగా క్లారా ప్రతిపాదనను ఆమోదించారు. ఈ మహాసభలో 'మార్చి 8 ని – అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం' గా జరపాలని నిర్ణయించారు!



**'క్లారా జెట్కిన్', రోజా లగ్జెంబర్గ్**

ఒక మిలియన్ కి మించి స్త్రీ–పురుషులు పని హక్కు కోసం, ఓటు హక్కు కోసం, పబ్లిక్ మీటింగులు పెట్టుకునే స్వేచ్ఛ కోసం, వివక్షని అంతం చెయ్యాలంటూ నినదిస్తూ, ప్రచారం చేస్తూ ఉద్యమించారు! కానీ మార్చి ఇరవై ఐదున న్యూయార్క్‌లోని ''ట్రయాంగిల్ స్క్వేర్'' వద్ద అంతులేని దోపిడీ, పీడనలకు గురౌతున్న 140 మంది శ్రామిక మహిళలు పని ప్రదేశంలో బందీలై పోయి తప్పించుకునే వీలే లేక సజీవంగా అగ్నికి ఆహుతై పోయారు. ఈ భయంకరమైన సంఘటన లేపిన దుమారం మహిళా కార్మికుల లేబర్ లెజిస్లేషన్ మీదా, స్త్రీల పని పరిస్థితుల మీదా ప్రపంచం దృష్టిని మహిళల వైపుకి దిగ్భ్రాంతి కరంగా మరల్చేలా చేసింది!

మహిళల పోరాటాల ఫలితంగా సాధించిన విజయాలను గమనిస్తే – ప్రపంచవ్యాప్తంగా మహిళల ఉద్యమాల ఫలితంగా రష్యాలో 'మార్చి8' ని "ద హీరోయిక్ వుమెన్ వర్కర్ డే" అని పిలుస్తారు. పదిహేడు దేశాల్లో 'మార్చి8' ని 'సెలవు దినం' గా ప్రకటించారు. జపాన్‌లో ప్రతి ఇంట్లో ఒక "అమ్మ గది" ఉంటుంది. అంటే అమ్మకి కొంత స్పేస్ కావాలని గుర్తించేలా చేయగలిగారు. ఫిలిప్పీన్స్ లో 97% మహిళలు 'ఉన్నత పదవులు' సాధించారు! 1975, అక్టోబర్ 24 న ఐస్‌లాండ్ మహిళలు పురుషులతో సమాన హక్కుల కోసం, సమాన వేతనాల కోసం, లింగ సమానత్వం కోసం చేసిన బ్రహ్మాండమైన సమ్మె, ఫలితంగా ప్రపంచంలో మొదటి మహిళా అధ్యక్షురాలుగా ఒక మహిళ ఎన్నికవడమే గాకుండా ఐస్ లాండ్ మహిళలు ప్రపంచంలోనే అత్యధికంగా లింగ సమానత్వాన్ని సాధించారు!

పోరాటాలు–యూనియన్లు పురుష ప్రపంచానికే పరిమితమైన ఆ రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా మహిళలు తమ సుదీర్ఘమైన పోరాటాల ద్వారా స్త్రీలకు చట్టపరమైన రక్షణ, మహిళాభ్యుదయం, అట్టడుగు మహిళలకు నేరుగా మద్దతు, సహాయ సహకారాలందిస్తానని చెప్పేలా "ఐక్యరాజ్య సమితి" ని ఒప్పించగలిగారు!

మన దేశంలో కూడా మన ముందు తరాలవారు తమ త్యాగాలతో 8 గంటల పని దినం, ఓటు హక్కు, ప్రభుత్వ రంగంలో స్త్రీ–పురుష వివక్ష లేని వేతనాలు–మొదలైన హక్కుల్నే గాక ఇప్పుడు మనం అనుభవిస్తున్న ఎన్నో సౌకర్యాలను సాధించి పెట్టారు. స్త్రీల రక్షణకి సంబంధించి, 1975లో ఐక్యరాజ్యసమితిలో భారత్ సంతకం చేసింది. ఫలితంగా జాతీయ మహిళా కమీషన్, స్త్రీలకి కొన్ని హక్కులతో పాటు, కుటుంబ హింస చట్టాలొచ్చాయి!

ఇదంతా పోరాటాల ద్వారా సాధించిన అభివృద్ధి అనుకుంటే ప్రపంచీకరణ దుష్ప్రభావాలు అన్ని దేశాల మహిళల జీవితాల్ని అతలా కుతలం చేస్తున్నాయి. చదువుల్లో సామాజికరంగంలో అంతరిక్షాన్ని అందుకోగలిగిన మహిళలు కుటుంబ హింసలో

అధోగతి పాలవుతున్నారు. విమానయానంతో ప్రపంచాన్ని చుట్టి వస్తున్నా ఉన్న ఊళ్ళో, సొంత వీధి లోనే, అసలు సొంత ఇంట్లోనే స్వేచ్ఛ లేక అలమటిస్తూ అత్యాచారాలకు బలవుతున్నారు! ఈ దుర్మార్గమైన పరిస్థితుల్ని 2012 లో దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన నిర్భయ, ఇటీవల అంటే 2019 లో హైదరాబాద్‌లో జరిగిన 'దిశ' సంఘటనలు రుజువు చేశాయి! కంటితుడుపు చర్యలుగా ప్రభుత్వం 'నిర్భయ', 'దిశ' చట్టాలు తెచ్చినప్పటికీ, వాటిని అమలు పరచడంలోని లోపాల వల్ల అత్యాచారాలు ఆగడం లేదు. ఈ రెండు సంఘటనలూ సంచలనాత్మకమయ్యాయి గానీ వెలుగులోకి రాని కొన్ని వేల పేదమహిళలపై, పసి బిడ్డలపై జరిగే అత్యాచారాలు కలవరపెడుతున్నాయి! స్త్రీ-పురుష సమానత్వసాధన కోసం మహిళలు నిరంతరం దేశవ్యాప్తంగా ఉద్యమిస్తున్నారు!

1911 లోనే ఆర్థిక దోపిడీ (బ్రెడ్) పైనే కాకుండా మహిళలు ఎదుర్కొంటున్న మానసిక, సామాజిక అణచివేత (రోజెస్) పైన కూడా పోరాడాలని గుర్తించిన స్త్రీలందరూ రొట్టెతో పాటు స్వేచ్ఛ కూడా కావాలంటూ "బ్రెడ్ అండ్ రోజెస్" ఉద్యమాన్ని 1912 లో అమెరికాలోని మసాచుసెట్స్ లో నడిపారు. గురి పెట్టబడిన తుపాకీ మొనల్లో పదునైన బాకులు బిగించి నిలబడిన భీకరమైన సైన్యానికి ఎదురుగా ధీటుగా నిలిచి, బెదరని స్థిర చిత్తంతో వేలాది మహిళలు శాంతియుతంగా పోరాడారు. 40 దేశాల మహిళలు అతి దారుణమైన చలిలో రెండు నెలలు జనవరి నుంచి మార్చి వరకూ గొప్ప సంకల్పబలంతో సమ్మె కొనసాగించారు!

ఒక శతాబ్దం పైబడి కాలం గడిచాక ఇప్పుడు 2019 డిసెంబర్ 15వ తేదీనుంచి మళ్ళీ అలాంటి ఉపద్రవమే వచ్చి పడింది. ఇక్కడే పుట్టి, ఇక్కడే గిడుతున్న వారిని అసలు మీరీ దేశపౌరులవునో కాదో తేల్చుకోమంటూ ప్రజల ఉనికికే ఎసరు పెడుతున్నారు పాలకులు! దాదాపుగా అవే నెలల్లో వణికించే భీకరమైన చలిలో 29 రోజుల పసిపాప (రెహానా ఖాతూన్- అనే బాలింతరాలి పాపాయి) నుంచి 90 ఏళ్ళు దాటిన ఆస్మా ఖాతూన్, బిల్కిస్ బానూ లాంటి అవ్వల వరకూ ప్రాణాలకు తెగించి దుష్ట మూకలకు ఎదురొడ్డి పోరాడుతూ దేశ రాజ్యాంగాన్ని రక్షించడానికి రాత్రీ-పగలనే తేడా లేకుండా ఎడతెగని తపన పడుతున్నారు మహిళలు!

"భారత దేశ ప్రజలమైన మేము... భారత దేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా... అందరి పౌరులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ-న్యాయం, భావ ప్రకటనా స్వేచ్ఛ, విశ్వాసము, ధర్మము, ఆరాధనా స్వేచ్ఛ, అంతస్తులోనూ, అవకాశాలలోనూ సమానత్వాన్ని సాధించుకొంటూ వ్యక్తి గౌరవం, జాతి ఐక్యతను, దేశ అఖండత ను చేకూర్చు విధంగా సౌభ్రాతృత్వం పెంపొందించుకొనుటకు సత్యనిష్టపూర్వకముగా తీర్మానించుకుని 1949 వ సంవత్సరం నవంబర్ 26వ నాడు రాజ్యాంగ సభలో రాసుకున్న రాజ్యాంగంను అంగీకరించి అధిశాసనం చేసుకుని మాకు మేము ఇచ్చుకుంటున్నాము" అని రాసుకున్న దేశ ప్రజలందరికీ సంబంధించిన రాజ్యాంగ శాసనాన్ని అమలు పరచమని ప్రజలు శాంతియుతంగా పోరాటాలు చేస్తున్నారు. ముస్లింల పట్ల 2002 నుంచి బాహాటంగానే వివక్ష చూపిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం, భారత రాజ్యాంగపు సెక్యులర్ పునాదుల్ని సమూలంగా నిర్మూలించే సన్నాహాలను సూచించే కొత్త పౌరసత్వ సవరణ చట్టం ఆమోదించినప్పటినుంచి దేశ రాజధాని ఢిల్లీ మహిళలు షాహీన్ బాగ్ అనే ఒక మారుమూల ప్రాంతంలో నలుగురితో శాంతియుత నిరసన ప్రారంభిస్తే, దాని వెలుగులు దేశంలోని గల్లీలూ, మూలలూ సకల ప్రాంతాలకూ ప్రసరించి, ఉత్తేజకరమైన పాటలు, కవితలు, నినాదాలతో లక్షలాది ప్రజల్ని కదిపి ఏకం చేసింది. అంతేకాదు, ప్రపంచమంతా షాహీన్ బాగ్ లు వెలిశాయి!

మొదటగా ఈ వేడి సెగలు అస్సాం రాష్ట్రాన్ని తాకాయి. అక్కడ 19,06,657 మంది పౌరుల జాబితాను తొలగించారు. 23 మంది చనిపోయారు. అక్కడి వాతావరణం భగ భగ మండుతున్నదనే విషయాన్ని 'జీనీ', 'బృందా' అనే ఇద్దరు టీనేజ్ బాలికలు ఒక వీడియో ద్వారా వివరించారు. "మేము విద్యావంతులం, మా ప్రజలకి ఏం జరుగుతుందో తెలుసుకోగలం. అమిత్‌షా 'దేశంలో ఎక్కడా నిరసనలు జరగడం లేదనీ, జరగ డానికి వీల్లేద'నీ చెప్పారు. కానీ ఇక్కడ మా ప్రజలు మంటల్లో కాలిపోతున్నారు. డిటెన్షన్ క్యాంపులలో నరక యాతనలు పడుతున్నారు! ప్రజాస్వామ్యం అనే పదానికిక్కడ అర్థం లేదు! మాదొక ప్రత్యేకమైన సంస్కృతి, మా భాష ఇక్కడ మైనారిటీ ప్రజల మధ్య మాత్రమే బతుకుతుంది. మేమిక్కడ మైనారిటీలం. మా సంస్కృతినీ, భాషనూ నాశనం చెయ్యాలని పాలకులు చూస్తున్నారు. మమ్మల్నీ, మా ఆత్మగౌరవాన్నీ కించ పరుస్తున్నారు. మా జాతిజనుల్ని విపరీతంగా గాయపరుస్తున్నారు. ఇవాళ మీరు భద్రంగా ఉన్నారని అనుకోకండి, మాకంటిన దట్టమైన వేడి సెగ రేపు మీకూ వ్యాపించబోతుంది. ఈ క్లిష్ట పరిస్థితులు దేశమంతా, అన్ని రాష్ట్రాల్లోనూ రాబోతున్నాయి కానీ మా అస్సాం భౌగోళికంగా బంగ్లాదేశ్ సరిహద్దులో ఉంది కాబట్టి ఆ సి ఏ ఏ, ఎన్ ఆర్ సి

సెగలు అందరికంటే ముందు మాకు తగులుతున్నాయి" అని అన్నారు. ఇంకా మిలియన్లలో విదేశీయులు సరిహద్దుల్ని దాటి వస్తున్నారనీ, అంత మంది కాందిశీకుల మధ్య మాకేమీ కాదనీ నిశ్చింతగా ఉండమనీ, మా హక్కుల్ని పరిరక్షిస్తామని అబద్ధాలు ఎలా చెప్పగలరనీ, మేము పుట్టిన మా స్వంత నేలలో మేమెలా విదేశీయుల మౌతామని ప్రశ్నించారు. ఇదంతా 'పచ్చి మోసం' అన్నారు. ఇక్కడ కర్ఫ్యూ ఉంది. ఇంటర్నెట్ బంద్ చేశారు. కాలు బయట పెడితే అసంఖ్యాకంగా ఉన్న పారా మిలిటరీ దళాల గన్నులు మామీద గర్జించడానికి సిద్ధంగా ఉన్నాయి. అస్సాం నిలువునా కాలిపోతున్నా మీడియాలో వార్తలు రావడం లేదు. ఈ వీడియోని షేర్ చేసి సహాయం చెయ్యండి. జాతీయ మీడియా, అస్సాం వెలుపల ఉన్న ప్రజలందరూ స్పందించేలా చూడమనీ, ఈ వార్తలను ప్రపంచ మీడియాకి తెలియజెయ్యమనీ గన్నులను తప్పించుకుని తెలివిగా వీడియోలో అభ్యర్థించారీ అమ్మాయిలు!

పేరు తెలియని ఒక ధీర యువతి "పౌరసత్వ చట్ట సవరణ బిల్లు' కి వ్యతిరేకంగా మేమెందుకు నిరసన తెలుపుతున్నామో తెలుసా? రాష్ట్రీయ స్వయం సేవక్ ముఖ్య నాయకుడు 'ఎం ఎస్ గోల్వాల్కర్ ఏలుతున్న వారికి దేవుడు. ఆయన చెప్పిందే వేదం. జర్మనీలో హిట్లర్ నాజీ సైన్యం నిర్బంధ కేంద్రాలు పెట్టి అరవై వేల యూదు ప్రజలను జాతి హననం చేశారు. మానవత్వానికి విరుద్ధంగా జరిగిన పైశాచిక మారణ కాండను "We and Our Nationhood Defined" అనే పుస్తకంలోని పేజీ నంబర్లు 87, 105 లలో గోల్వాల్కర్ పొగుడుతూ, భారత్ దానిని ఆదర్శంగా తీసుకోవాలంటాడు. 'పౌరసత్వ చట్ట సవరణ బిల్లు' కి పూర్తి మూలాలు ఇందులో ఉన్నాయి"– అని చెప్పింది.

బెంగుళూరు నుంచి ఇంకొక యువతి దాదాపు ఇవే విషయాలు చెప్పింది గానీ "మీకు అధికారం ఇచ్చింది ప్రజలమీద దాష్టీకం చూపిస్తూ నిరంకుశత్వంగా పరిపాలించడానికి కాదు, ప్రజలకి సేవ చెయ్యడానికి ఓట్లేసి గెలిపించాం" అని ప్రభుత్వాలకి బలంగా బహు శక్తివంతంగా సవాలు విసిరింది!

జామియా మిలియా యూనివర్శిటీలో లా విద్యార్థిని అనూజ్ఞ విలపిస్తూ "ఈ దేశం మొత్తంలో అమ్మాయిలకు సురక్షితమైన ప్రదేశం లేదు. నా ఇల్లు లాంటి యూనివర్శిటీని నాశనం చేశారు. నిరసన తెల్పినందుకే అన్యాయంగా నా స్నేహితురాల్ని చంపేశారు. నా స్నేహితులమీద దాడులు చేశారు" అని చెప్పింది.

పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల సమయంలో జరిగిన హింస గురించి జర్నలిస్టు రవీష్ కుమార్ జామియా మిలియా ఇస్లామియా మహిళా విద్యార్థినులతో



మాట్లాడారు. నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. కలవరపాటుతో చెదిరిపోయిన విద్యార్థులు పొదల్లోకీ, లైబ్రరీల్లోకీ పరిగెత్తారు. మామీద టియర్ గ్యాస్ ప్రయోగించారు. మా యూనివర్శిటీలో మేమే దొంగలమైనట్లు దాక్కున్నాం. ఒక్క లేడీ పోలీస్ కూడా లేరు. తర్వాత మమ్మల్ని చేతులు కట్టుకుని కిందకు దిగమన్నారు. దిగింతర్వాత జిరాక్స్ సెంటర్‌లో "మీరు ఇక్కడి సొమ్ము తింటూ పాకీస్తాన్ పాట పాడతారనీ, ఇక్కడెందుకు, అక్కడికే వెళ్ళమనీ, మీరు హిందువులు కారు. మీరు పాకీస్తాన్లు" అని నానా మాటలంటూ భయంకరంగా బూతులు తిట్టిపోస్తూ శారీరక, మానసిక దాడులు చేశారు. పైకి మాత్రం పోలీసులు బయటి వ్యక్తులు వస్తుంటే వాళ్ళని నిలవరించడం కోసం మేము లోపలికి ప్రవేశించామని చెప్తున్నారు. పోలీసుల వాదనను విద్యార్థులు ఖండించారు. "యూనివర్శిటీ సెక్యూరిటీ గార్డులు వారి గుర్తింపు కార్డులను తనిఖీ చేసిన తర్వాతే విద్యార్థులను గేట్ లోపల అనుమతించారు. కాబట్టి బయటి వ్యక్తి ఎవరూ క్యాంపస్‌లోకి ప్రవేశించలేరు" అని వారు తెలిపారు. నిజంగా ప్రభుత్వం పైకి చెప్తున్నట్లు ఈ చట్టాల వెనక ఏ కుట్రా లేకపోతే ఇంత కిరాతకంగా ప్రవర్తించవలసిన అవసరముందా? అని ప్రశ్నించారు.

బర్ఖాదత్ ఢిల్లీలో నిరసనలో పాల్గొన్న వివిధ విశ్వ విద్యాలయాలకి చెందిన విద్యార్థినులను ప్రశ్నించింది. ఏ రాజకీయ పార్టీ అండదండలు లేకుండా మీరింత గొప్ప ఉద్యమాలను ఎలా నిర్మించగలుగుతున్నారు అనే ప్రశ్నకు "అధ్యయనం, చైతన్యంతో సంఘటితపరుచు, ప్రతిఘటించు" ఇదే మేము పాటిస్తున్న మా మూల సూత్రమని చెప్పారు. ఒక్కమాటలో మీ స్ఫూర్తి ఏమిటి? అని బర్ఖాదత్ అడిగితే "ఇంక్విలాబ్ జిందాబాద్" అన్నారు. 'ఎప్పటివరకూ పోరాడతారు' అని అడిగితే "ఈ చట్టాలు ఉప సంహరించుకునేంతవరకూ" అని ధైర్యంగా సమాధానమిచ్చారు. ఇది సాధ్యమేనా అని రెట్టించి ప్రశ్నిస్తే "మేము చరిత్రను సృష్టిస్తాం" అని సాహసవంతంగా బదులిచ్చారు!

బాగా వైరల్ అయిన ఒక వీడియోలో ఒక యువకుడి చుట్టూ వలయంలా నిలబడ్డ యువతులు పోలీసుల లాఠీ దెబ్బలనుండి విద్యార్థినులు రక్షించారు.

షాహీన్ బాగ్‌లో పెల్లుబికిన చైతన్యం రెండు నెలలుగా ఒక పెద్ద సుడిగాలిలా ప్రపంచాన్ని చుట్టుముట్టి, ఎవరినీ ఊపిరి సలపనివ్వడంలేదు. 'నవమితా చంద్రా' అనే జాదవపూర్ యూనివర్శిటీ విద్యార్థిని డిగ్రీ సర్టిఫికెట్ తీసుకోవడానికి వేదిక నెక్కి "నాతోటి విద్యార్థులను కొడుతూ, వాళ్ళను గాయపరుస్తూ గుడ్డివాళ్ళుగా చేస్తుంటే, వాళ్ళను హత్యలు చేస్తున్న ఈ వాతావరణంలో నేను సంబరంగా డిగ్రీ అందుకోలేను"అని రాసిన ప్లకార్డును ప్రదర్శిస్తూ వైస్ చాన్స్‌లర్ చేతుల నుంచి సర్టిఫికెట్ తీసుకోలేదు. ఇదెంత సాహసం! ఇవి మచ్చుకి కొన్ని ఉదాహరణలు మాత్రమే! దేశవ్యాప్తంగా అసంఖ్యాకంగా పాల్గొని, పోరాటాలను క్రమశిక్షణతో నడిపిన విద్యార్థులు మోసపు కేకల నుంచి, అక్రమాల మధ్య నుంచి, హత్యల నుంచి, అంతులేని దౌర్జన్యాలనుంచి తప్పించి భారతదేశానికి నవ యవ్వన కాంతులతో, ప్రకాశవంత మైన ఆలోచనలతో మంచిరోజులు తెస్తారనే భరోసా కలిగించారు!

ఇంతకీ ఈ సామాజిక ఉద్యమాలు ఇనప పద ఘట్టనల కిందపడి ఇంతటితో ఆగిపోతాయనుకుంటే పొరపాటే! ఈ పౌరసత్వ పోరాట దీక్షల్ని అత్యద్భుతంగా మలుస్తున్న కొందరు యువతుల ఆలోచనలను గమనిస్తే అమితంగా ఆశ్చర్యపోతాం! నూతన ఆర్థిక విధానాల అమలు తర్వాత పుట్టిన ఈ యువతరం ఎంతసేపూ తమ దృష్టిని 'వారి కెరీర్ మీద తప్పించి ప్రజాసమస్య లని పట్టించుకోరు' అనుకునే పెద్దతరం ఊహల్ని పటాపంచలు చేసేశారు! ఎంతోకాలం నుంచి కవులూ, రచయితలూ, మేధావులూ తమ సృజనాత్మక రచనల్లో, ఉపన్యాసాల్లో గంటల తరబడి వివరించిన విశేషాలను ఈ పిడుగుల్లాంటి విద్యార్థినులు చిటికెలో 5, 10 నిమిషాల వీడియోల్లో పాలకుల స్వభావాలనూ, ప్రజా వ్యతిరేక విధానాలనూ వివరిస్తూ సకల జనుల దృష్టినీ కార్యాచరణల వైపుకి మళ్ళిస్తున్నారు. సమాచార మాధ్యమాలను సమర్థవంతంగా వాడుకుంటున్నారు. స్వేచ్ఛ, సమానత్వం, విద్య, నిరుద్యోగం, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందుకూ, రాజ్యాంగాన్ని అమలు చెయ్యమంటున్నందుకే హింసలు ప్రయోగిస్తున్నారని వారికి తెలిసిపోయింది! ఈ విషయంలో వారికి వారే సాటి. అంతర్జాలంతో వ్యాపార సామ్రాజ్యాలని నిర్మించాలని కార్పొరేట్ శక్తులు, అగ్రరాజ్యాధినేతలు, వారికి వత్తాసు పలికే పాలకులు చూస్తుంటే, అదే అంతర్జాలాన్ని ప్రభావవంతంగా వాడి ఉద్యమాలు కార్చిచ్చులా వ్యాపింపజేస్తున్నారు విద్యార్థులు, యువతరం. 'పాలకులు వారు తీసుకున్న గోతిలో వారే పడతార'న్న దానికిదే నిదర్శనం!

ఇక షాహీన్ బాగ్ ప్రదర్శనల విషయానికొస్తే ఎన్నడూ గడప దాటి ఎరుగని సాధారణ గృహిణులు ఒకరినుండి మరొకరు బలం పుంజుకుంటూ సమిష్టి చైతన్యంతో చావో, బతుకో తేల్చుకోవడానికే పగలూ- రాత్రీ తేడా లేకుండా సిట్-ఇన్లు నిర్వహించారు. సిట్-ఇన్ అనేదే ఒక నిరసన రూపం. దీనిలో ప్రదర్శనకారులు ఒక స్థలాన్ని ఆక్రమిస్తారు. వారి డిమాండ్లు నెరవేరే వరకు అక్కడనుండి కదలడానికి నిరాకరిస్తారు. జీవితానుభవాలనుంచే పాఠాలు నేర్చుకుని ''పోరాడకపోతే బతుకే లేదని'' తెలుసుకుని తిరగబడుతున్నారు.

విద్యార్థులు గానీ, దేశమంతా షాహీన్ బాగుల్ని వెలిగించిన మహిళలు గానీ బొత్తిగా పోరాటాలు తెలియనివారు. మొదటి సారి రోడ్లమీద కొచ్చినవాళ్ళు. కొత్త ఉద్వేగాలతో న్యాయం కోసం ఆక్రోశించిన వాళ్ళు. మిల్టన్ "Paradise Lost"లో లాగా పదకొండు సార్లు సైతాను గెలిచాకే పన్నెండోసారే మనదైన స్వర్గాన్ని గెలుచుకుంటామని తెలియనివాళ్ళు. అయినా సరే, పూర్తి న్యాయం వైపే ఉన్నారు. ఆర్థిక, సామాజిక, మానసిక అణచివేతలకు వ్యతిరేకంగా నడిపిన "బ్రెడ్ అండ్ రోజెస్" ఉద్యమం లాగే ఈ సమరశీల మహిళల పోరాటం చరిత్రలో మహిమాన్వితమైన స్ఫూర్తిగా నిలుస్తుంది!

రాజ్యాంగానికి ఉల్లంఘనలు జరుగుతుంటే ప్రప్రథమంగా మేల్కొని జాతిని మొద్దునిద్ర నుంచి తట్టి లేపింది కూడా మహిళలే! పొద్దస్తమానం రకరకాల దుమ్ముదులుపుకుంటూ, ఎదురయ్యే చెత్తను వదిలించుకుంటూ రొష్టు పడుతూ ఉంటారు గనుక మహిళలకు ఆచరణజ్ఞానం మెండుగా ఉంటుంది! మనం పురుషులకు వ్యతిరేకం కాదు. 'అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం' స్ఫూర్తితో మనతో కలిసొచ్చే పురుషులతో వ్యవస్థ మార్పు కోసం జరిగే నిర్మాణాత్మకమైన నూతన సమాజ పోరాటంలో భాగం కావాలి! పితృస్వామ్య భావజాలం పట్ల అప్రమత్తంగా ఉండి మడమ తిప్పని పోరాటాలను ఎక్కుపెట్టాలి!

మనుస్మృతిని భారత రాజ్యాంగంగా మార్చడానికి హిందూ ఫాసిస్టు శక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా శ్రామిక తత్త్వ శాస్త్రాన్ని అర్థం చేసుకుని తమ కష్టంతో సంపదలు సృష్టిస్తున్న ప్రజలతో మమేకం కావాలి! పాలకుల స్వభావాలు, చేష్టలు క్రూరంగానే ఉంటాయి. దానికి విరుగుడుగా మనం మానవీయ స్పందనలు పెంపొందించుకోవాలి!! ❑

కొలిమి సౌజన్యంతో...

# భారత స్వాతంత్ర్యోద్యమంలో మహిళల పాత్ర

స్త్రీవాద సంస్థలు మహిళల ఆర్థిక, రాజకీయ హక్కుల కోసం ఒక వైపు పోరాటం చేస్తూనే సంస్కరణలు, విద్య ద్వారా స్త్రీల స్థితిని మెరుగుపరిచేందుకు ప్రయత్నించాయి. విదేశీ పాలనను అంతమొందించాలనే లక్ష్యంతో ఈ సంస్థలు స్వాతంత్ర్యోద్యమం లో పాల్గొన్నాయి. 1905లో జరిగిన స్వదేశీ ఉద్యమంలో, 1916 ఉద్యమంలోనూ మహిళలు పాల్గొన్నారు. కానీ గాంధీ నాయకత్వ బాధ్యతలు చేపట్టాక స్వాతంత్ర్య పోరాటంలో స్త్రీల భాగస్వామ్యం పెరిగిందని చెప్పవచ్చు. గాంధీ చేపట్టిన మొదటి జాతీయ స్థాయి ఉద్యమం సహాయ నిరాకరణ. ఇందులో స్త్రీలకు ప్రత్యేక పాత్ర కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన సత్యాగ్రహాల్లో ముఖ్యంగా బోర్సాదే, బార్డోలి సత్యాగ్రహాల్లో రైతు కుటుంబాలకు చెందిన స్త్రీల పాత్ర మరువలేనిది.

### ఉప్పు సత్యాగ్రహం

గాంధీ నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహంలో ఎంతోమంది స్త్రీలు పాల్గొన్నారు. ఈ సమయంలో సుమారు 17 వేల మంది స్త్రీలు నిర్బంధానికి గురయ్యారు. దీన్ని బట్టి స్వాతంత్రోద్యమంలో మహిళల భాగస్వామ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. సరోజినీ నాయుడు, రాణి గైడిన్ల్యు, కమలానెహ్రూ, హన్సా మెహతా, సత్యవతి, పార్వతీభాయ్, రుక్మిణీ లక్ష్మీపతి, దుర్గాబాయి, కమలాదేవి ఛటోపాధ్యాయ తదితరులు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు.

దేవిదేవికా సంఘ్, నారీ సత్యాగ్రహసమితి, మహిళా రాష్ట్రీయ సంఘ్, లేడీస్ పికెటింగ్ బోర్డ్, స్త్రీ స్వరాజ్య సంఘ్, స్వయం సేవికా సంఘ్ తదితర ఎన్నో మహిళా సంఘాలు స్వాతంత్రోద్యమ సమయంలో విదేశీ వస్తువుల బహిష్కరణ, సారా వ్యతిరేక ఉద్యమం మొదలైన కార్యక్రమాలు చేపట్టాయి.

### క్విట్ ఇండియా ఉద్యమం

క్విట్ ఇండియా ఉద్యమంలో స్త్రీల పాత్ర మరువలేనిది. జాతీయ నాయకులను ముందుగానే నిర్బంధించడంతో అరుణా అసఫ్అలీ లాంటి స్త్రీ నాయకులు ఈ ఉద్యమాన్ని నడిపారు. శాంతి, సునీతి, బీనాదాస్, కల్పనాజోషి, ప్రీతి లతా మొదలైనవారు విప్లవ మార్గాన్ని ఎంచుకొన్నారు. నేతాజీ నేతృత్వంలోని భారత జాతీయ సైన్యంలో మహిళా విభాగం ఝాన్సీ లక్ష్మి రెజిమెంట్‌కు కెప్టెన్ లక్ష్మీసెహగల్ సారథ్యం వహించారు.

స్వాతంత్ర్య పోరాటంలో స్త్రీలు పాల్గొన్నప్పటికీ, స్వాతంత్ర్యా నంతరం వారి పరిస్థితి అంతగా మెరుగుపడలేదు. వలస పాలనకు వ్యతిరేకంగా వీరు పోరాటం చేశారు. కానీ స్త్రీ సాధికారత కోసం ప్రయత్నించలేదు. భారత సమాజంలో పితృస్వామిక ఆధిపత్యాన్ని స్త్రీలు ప్రశ్నించలేదు. స్వాతంత్ర్య సాధన అనే లక్ష్యాన్ని చేరుకున్నాక కొంత మంది స్త్రీలు గృహ జీవితానికి మరలగా, మరి కొంతమంది ప్రజాసేవను కొనసాగించారు.

### శ్రామిక ఉద్యమాల్లో స్త్రీలు

1918లో అనసూయ సారాబాయి నేతృత్వంలో నేతృత్వంలో అహ్మదాబాద్ టెక్స్‌టైల్స్ కార్మికులు సమ్మె చేశారు. 1920లో మజ్దూర్ మహాజన్ నాయకత్వంలో అహ్మదాబాద్ మిల్లు కార్మికుల సంఘం ఏర్పాటైంది. దీని ఆధ్వర్యంలో అనేక ధర్నాలు చేశారు. మణి బెన్కేరా రైల్వే కార్మికుల నాయకురాలిగా అవతరించారు. ఉషాబాయి దాంగే, పార్వతి భోరీ నేతమిల్లు కార్మికుల నాయకులుగా ఎదిగారు.

భారత జాతీయ కాంగ్రెస్ 1938లో నెహ్రూ అధ్యక్షతన జాతీయ ప్రణాళికా సంఘాన్ని స్థాపించింది. దీని 29 ఉప సంఘాల్లో 'ప్రణాళిక ఆర్థిక వ్యవస్థలో స్త్రీ పాత్ర' ఒక ఉపసంఘం. ఈ కమిటీలో ఎంతో మంది ప్రముఖ స్త్రీలు సభ్యులుగా ఉన్నారు. స్త్రీ జీవితం–పని అనే అంశంపై విస్తృత ప్రతిపాదనలు వచ్చాయి. ఈ అంశం గురించి భారీ స్థాయిలో సమాచారం స్వీకరించారు.

### మొదటి దశ స్త్రీవాద ఉద్యమాలు - అంచనా

మొదటి దశ స్త్రీవాద ఉద్యమాన్ని పరిశీలిస్తే.. పరదా, సతీ, స్త్రీవిద్య, బాల్య వివాహాలు, వితంతు వివాహాలు తదితర అంశాల గురించి పోరాటాలు జరిగాయి. స్త్రీలను జాతీయ పోరాటంలో పాల్గొనమని ఆహ్వానించినప్పుడు తల్లిగా, గృహిణిగా వారి బాధ్యతలను ప్రశ్నించలేదు. స్త్రీ చదువుకుంటే కుటుంబం, సమాజం బాగుపడతాయని భావించారు. ఈ దశలో రాజకీయ హక్కులు, సంప్రదాయ చట్టాల్లో మార్పులే స్త్రీవాద ఉద్యమాల లక్ష్యం. జాతీయోద్యమంలో ఉన్నత వర్గాల స్త్రీలు, విద్యావంతులు మాత్రమే కాకుండా గ్రామీణ, పేద, చదువుకోని స్త్రీలు కూడా పాల్గొన్నారు. మూఢాచారాల నిర్మూలన, రాజకీయ హక్కుల సాధన, స్వాతంత్ర్య సముపార్జన లక్ష్యంగా ఈ కాలం స్త్రీలు పోరాడారు. స్వాతంత్ర్య పోరాటంలో మహిళల భాగస్వామ్యం.. స్వతంత్ర భారత ప్రభుత్వ పాలనలో, నిర్ణయాల్లో భాగస్వామ్యాన్ని కోరుకునే అవకాశం కల్పించింది. స్వాతంత్ర్య పూర్వ స్త్రీవాద ఈ ఉద్యమాన్ని మహిళల పోరాటాల్లో మొదటి దశ అని చెప్పవచ్చు. ఈ దశలో తమ దుస్థితికి సంప్రదాయాలు, మతం కారణమని స్త్రీలు భావించారు. విద్య, న్యాయవ్యవస్థల్లో మార్పుల ద్వారా తమ స్థితి మెరుగుపడు తుందని వారు ఆశించారు. ❑

# ఇద్దరు చిట్టగాంగ్ వీర నారీమణులు



- గబ్బిట దుర్గాప్రసాద్

భారత దేశ స్వాతంత్ర్య సమరంలో బెంగాల్ రాష్ట్రం లోని చిట్టగాంగ్ జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. అక్కడి వీర నారీమణులు సాయుధ పోరాటం చేసి చరిత్రకెక్కారు. వారిలో కల్పనా దత్తా, ప్రీతి లతా వాడేదార్ ల గురించి తెలుసు కొందాం

## కల్పనా దత్తా



కల్పనా దత్ అనే పేరుతో పిలువబడే కల్పనా దత్తా జాతీయ బెంగాలీ విప్లవ నారి. బెంగాల్‌లో చిట్టగాంగ్ జిల్లా సిరిపూర్ గ్రామంలో 1913 జులై 27న జన్మించింది. చిట్టగాంగ్‌లో చదివి మెట్రిక్ పాసై కలకత్తా చేరింది. బెతూనే కాలెజిలో సైన్స్‌లో డిగ్రీకోర్స్‌లో చేరింది. అక్కడే వీణా దాస్, ప్రీతీ లాల్ వాడేకర్ ల ఆధ్వర్యంలో నడుస్తున్న చిన్న విప్లవ సంఘం "చాత్రి సంఘం"లో సభ్యురాలై చురుకైన కార్యకర్త అయింది .

1930 ఏప్రిల్ 18న జరిగిన చిట్టగాంగ్ ఆయుధ దోపిడీలో చిట్టగాంగ్‌లోని ఇండియన్ రిపబ్లికన్ ఆర్మీ తరఫున సూర్య సేన్‌తో కలిసి పని చేసింది. 1931లో సూర్యసేన్ కల్పనకు, ప్రీతీలతకు చిట్టగాంగ్‌లోని యూరోపియన్ క్లబ్ పై దాడి జరిపే బాధ్యతను అప్పగించాడు. కాని ఒక వారం ముందే ఆమె ఆ ప్రాంతంలో సంచరిస్తుండగా అనుమానమొచ్చి బ్రిటిష్‌ప్రభుత్వం అరెస్ట్ చేసింది. బెయిల్‌పై విడుదలై సాయుధ పోరాటం కోసం అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిపోయింది. 1923 ఫిబ్రవరి 17న వారి స్థావరాన్ని గుర్తించి పోలీసులు చుట్టుముట్టి సూర్యసేన్‌ను అరెస్ట్ చేశారు. కల్పన వారికి అందకుండా తప్పించుకొన్నది. సుమారు పదేళ్ళ తర్వాత 19-5-1933న ఆమెను పోలీసులు అరెస్ట్ చేయగలిగారు. చిట్టగాంగ్ ఆయుధ దోపిడీపై రెండవ సారి జరిగిన విచారణలో యావజ్జీవిత ఖైదు విధించారు. కాని 1939లో ఆరేళ్ళ తర్వాత విడుదల చేశారు.

కలకత్తా యూనివర్సిటీ నుండి1940లో సైన్స్‌లో డిగ్రీ పొందింది. భారత కమ్యూనిస్ట్ పార్టీలో చేరి 1943లో వచ్చిన బెంగాల్ కరువు, ఆ తర్వాత బెంగాల్ విభజనలలో బాధితుల సేవా కార్యక్రమాలలో పాల్గొని ఆదుకోన్నది. అప్పుడే కమ్యూనిస్ట్ పార్టీ జనరల్ సెక్రెటరి పూర్ణ చాంద్ జోషిని వివాహమాడి ఇద్దరు కుమారులను కన్నది. పెద్దకొడుకు చాంద్ జోషి గొప్ప జర్నలిస్ట్. హిందూస్తాన్ టైమ్స్‌లో పనిచేశాడు. ఆయన 1985లో రాసిన "భింద్రేన్ వాలే -మిత్ అండ్ రియాలిటీ" పుస్తకం బహుళ ప్రచారం పొందింది. "చిట్టగాంగ్ ఆయుధ దోపిడీ జ్ఞాపకాలు" అనే స్వీయ జీవిత చరిత్రను కల్పన రాసింది. ఇది 1945లో ఆంగ్లభాషలో అచ్చయింది. 1946 బెంగాల్ శాసన సభకు జరిగిన ఎన్నికలలో కమ్యూనిస్ట్ పార్టీ తరఫున చిట్టగాంగ్ నుంచి పోటీ చేసింది కాని గెలవలేదు. తర్వాత ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్ స్టిట్యూట్‌లో చేరి, అక్కడే రిటైర్ అయింది. 8-2-1995న 82 ఏళ్ళ వయసులో స్వాతంత్ర సమర యోధురాలు కల్పనా దత్త మరణించింది.

కల్పనా దత్తా పై సినిమా తీశారు. అందులో దీపికా పదుకొనే కల్పన పాత్ర ధరించింది. హిందీలో తీసిన ఈ సినిమా పేరు "ఖేలేన్ హం జీ జాన్ సె". ఇందులో చిట్టగాంగ్ సాయుధ దోపిడీ, ఆ తర్వాత జరిగిన పరిణామాలు చిత్రించారు. పూర్వపు నాసా సైంటిస్ట్ వేదవ్రత పైన్ దర్శకత్వం వహించాడు. 12-102012న ఈ సినిమా విడుదలైంది.

## ప్రీతీ లతా వాడేదార్



మధ్యతరగతి వైద్య బ్రాహ్మణ కుటుంబంలో ఇప్పటి బంగ్లాదేశ్‌లో ఉన్న చిట్టగాంగ్ ఉపజిల్లా పాటియా లోని దాల్ఘాట్ గ్రామంలో 5-5-1911న ప్రీతిలతా వాడేదార్ జన్మించింది. తండ్రి జగబందు వాడేదర్ చిట్టగాంగ్ మునిసిపాలిటీ గుమాస్తా. తల్లి ప్రతిభామాయి గృహిణి. వారి 6గురు సంతానంలో ప్రీతి రెండవది. ఇంట్లో "రాణి" అని ముద్దుగా పిలిచేవారు. తండ్రికి వంశ పారంపర్యంగా వచ్చిన "దాస్ గుప్త" బిరుదు ఉంది. పిల్లకు తనకున్న శక్తి సామర్థ్యాలతో, ఆర్థిక వనరులతో విద్య నేర్పించాడు. చిట్టగాంగ్‌లోని డాక్టర్ ఖాస్త గిర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో చేర్పించాడు. మెట్రిక్ పాసైంది. అక్కడే టీచర్‌గా ఉన్న విద్యార్థుల అభిమానం పొందిన "ఉషాదీ" చెప్పే ఝూన్సి లక్ష్మీ బాయి చరిత్ర లతా, ఆమె సహ విద్యార్థులలో జాతీయ భావనను ప్రేరేపించింది. ప్రీతిలో సాహసం ధైర్యం రావటానికి ఇదే కారణమైంది. కల్పనా దత్తా ఈమెకు సహ విద్యార్థిని. ప్రీతికి కళా సాహిత్యాలు ప్రీతి పాత్రమైనాయి. ఢాకాలోని ఈడెన్ కాలెజిలో చేరి ఇంటర్‌లో మొదటి స్థానం సాధించింది.

అనేక సాంఘిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేది. లీలానాగా నడిపే శ్రీ సంఘంలో దిపాలీ సంఘం ఆధ్వర్యంలో పని చేసింది.

కలకత్తా వెళ్లి బెతూనే కాలేజిలో చేరి రెండేళ్ళు ఫిలాసఫీ చదివి డిస్టింక్షన్‌తో గ్రాడ్యుయేట్ అయింది. కాని బ్రిటిష్ అధికారులు ఆమె సర్టిఫికేట్‌ను యూనివర్సిటీ జారీ చేయకుండా నిలిపేశారు. చనిపోయాక 2012లో ఆమెకూ, వీణాదాస్‌కు మరణానంతర డిగ్రీ ప్రదానం చేశారు. డిగ్రీ తర్వాత చిట్టగాంగ్ చేరి నందన్ కానన్ అపర్ణాచరణ్ స్కూల్ హెడ్ మిస్ట్రెస్‌గా పని చేసింది. భారత స్వాతంత్ర్యయుద్ధం వార్త విని తానూ పాల్గొనాలని నిర్ణయించుకొన్నది. సూర్య సేన్ ఆమె భావాలను గమనించి తమతో విప్లవసంఘంతో కలిసి సాయుధపోరాటంలో పని చేయమని ఆహ్వానించాడు. 1932 జూన్13న దాల్ఘట్ క్యాంప్‌లో సూర్యా సేన్, నిర్మల్ సేన్‌లను కలిసింది. సహ విప్లవకారుడు వినోద్ బీహారీ చౌదరి ఆడవాళ్ళను చేర్చుకోవద్దని అభ్యంతరం పెట్టాడు. ఆయుధాలను చేరవేయటంలో అనుమానం రాకుండా, పట్టుబడకుండా నైపుణ్యంగా చేర వేసే సామర్థ్యం స్త్రీలకే ఉందని చెప్పి సూర్యసేన్ ఒప్పించి చేర్చుకొన్నాడు.

చిట్టగాంగ్ ఇన్స్‌పెక్టర్ జనరల్ క్రైగ్‌ను హత్య చేయటానికి సూర్యసేన్ విప్లవ దళం నిర్ణయించింది. రామకృష్ణ బిశ్వాస్, కాళీ పాద చక్రవర్తిలకు సేన్ ఈ బాధ్యత అప్పగించాడు. కాని వీళ్ళు పొరబాటున చందాపూర్ ఎస్పిని, త్రయాణీ ముఖర్జీని కాల్చి చంపారు. దీనికి బిశ్వాస్‌ను చక్రవర్తిని ప్రభుత్వం 2-12-31న అరెస్ట్ చేసింది. విచారణ తర్వాత బిశ్వాస్‌ను ప్రాణం పోయే దాకా ఉరితీసే శిక్ష విధించారు. చక్రవర్తిని సెల్యులర్ జైలుకు ప్రవాసం పంపారు. చిట్టగాంగ్ నుంచి ఆలీపూర్ జైలుకు వెళ్ళటానికి కుటుంబసభ్యుల వద్ద డబ్బు లేదు. కలకత్తాలో ఉంటున్న ప్రీతిలత ను ఆలీపూర్ జైలుకు వెళ్లి బిశ్వాస్‌ను కలుసుకోమని పంపారు.

సూర్య సేన్ బృందంతో కలిసి విప్లవ కార్యక్రమాలు చేస్తూనే ప్రీతి టెలిఫోన్, టెలిగ్రాఫ్ ఆఫీసులపై దాడి నిర్వహించింది. రిజర్వ్ పోలీస్‌లను జలాలాబాద్ పోరాటంలో పట్టుకొన్నది. విప్లవ కారులకు ప్రేలుడు సామగ్రి అందజేసే బాధ్యతను ప్రీతీ లతా స్వీకరించి సమర్ధవంతంగా నిర్వహించింది. "కుక్కలకు, ఇండియన్‌లకు ప్రవేశం లేదు" అని వ్రేలాడదీసి ఉన్న ప్రహర్తాలి యూరోపియన్ క్లబ్‌పై ఆ వాక్యంపై ఉన్న తీవ్ర ఆవేదన నిరసనలతో 1932లో దాడి చేయాలని సూర్య సేన్ ప్రణాళిక సిద్ధం చేశాడు. దీన్ని అమలు చేయటానికి మహిళకు బాధ్యత ఇవ్వాలని సేన్ భావించాడు. కాని కల్పనా దత్త వారం రోజులు ముందే అరెస్ట్ అయింది. అందుకని ఈ బాధ్యతను ప్రీతిలతకు అప్పగించాడు సేన్. ప్రీతిలత కొటోవాలి సముద్ర తీరం చేరి ఆయుధ విద్యలో శిక్షణ పొంది ఆరితేరింది. ప్లాన్ అంతా సిద్ధం చేసుకొన్నది.

డిసెంబర్ 23న దాడికి పక్కా ప్లాన్ సిద్ధమైంది. బృందానికి పొటాషియం సైనేడ్ ఇచ్చి పట్టుబడితే మింగేసి చనిపొమ్మని ఆజ్ఞలు జారీచేశాడు నాయకుడు సేన్. దాడి చేసే రోజున ప్రీతి పంజాబీ మగవాడి దుస్తులు ధరించింది. ఆమె అనుచరులు కాళీ శంకర్‌దే, శాంతిలాల్ చక్రవర్తి పంచె చొక్కా వేషం వేసుకొన్నారు. మహేంద్ర చౌదరి, సుశీల్ దే, పన్నా సేన్‌లు లుంగీ చొక్కాతో సిద్ధమయ్యారు. ఈ విప్లవ బృందం ఆ రాత్రి 10-45కు క్లబ్ దగ్గరకు చేరి, దాడి ప్రారంభించారు. అప్పుడు క్లబ్‌లో 40 మంది ఉన్నారు. విప్లవ బృందం మూడు గ్రూపులుగా చీలి దాడి చేయాలని భావించింది. క్లబ్ లోపల ఉన్న కొందరు పోలీస్ ఆఫీసర్లు తమ రివాల్వర్‌లతో ఎదురు కాల్పులు సాగించారు. ప్రీతిలతకు చిన్న బులెట్ గాయం అయింది. పోలీస్ రిపోర్ట్ ప్రకారం ఈ దాడిలో సల్లివాన్ అనే ఇంటి పేరున్న స్త్రీ చనిపోయిందని నలుగురు మగాళ్ళు ఎందరో ఆడవాళ్ళు గాయపడ్డారని ఉంది. గాయపడిన ప్రీతిలతను వలపన్ని బ్రిటిష్ పోలీసులు పట్టుకోబోయారు.

ఆమె సైనేడ్ మింగి అరెస్ట్ కాకుండానే వీరమరణం పొందింది. మర్నాడు ఆమె శవాన్ని గుర్తించి ప్రీతిలత చనిపోయిం దని తేల్చారు. ఆమె వస్తువులను సోదా చేస్తుంటే బిశ్వాస్ ఫోటో, విప్లవ సాహిత్యం బుల్లెట్లు ఈ దాడికి సిద్ధం చేసిన ప్లాన్ ప్రతి దొరికాయి. పోస్ట్‌మార్టం తర్వాత ఆమెకు తగిలిన బులెట్ గాయం చాలా స్వల్పమైనదని, సైనేడ్ తీసుకోన్నందుకే చనిపోయిందని తెలిసింది. బెంగాల్ చీఫ్ సెక్రెటరీ లండన్‌లోని బ్రిటిష్ ప్రభుత్వాధికారులకు సందేశం పంపుతూ "ప్రీతి, టెర్రరిస్ట్ బిశ్వాస్ భార్య కాదని, దాల్ఘాట్‌లో అరెస్ట్‌ను తప్పించుకోబోయే సమయంలో కెప్టెన్ కేమరాన్ పడిపోయినప్పుడు పోలీస్ కాల్పులలో మరణించిన నిర్మల్‌సేన్ భార్య అని కొంత సమాచారం ఉంది" అని తెలియజేశాడు.

బంగ్లాదేశ్ రచయిత సాలీనా హోస్సైన్ రాస్తూ "ప్రీతీ జీవితం అందరికి ఆదర్శమని, ఆమె జ్ఞాపకార్థం ఒక ట్రస్ట్ ఏర్పాటుచేశారని, ఆ ట్రస్ట్ ప్రీతిని బీకన్ లైట్ అంటే దారి దీపం అనీ అంది అని చెప్పింది. ఆమె పుట్టిన రోజును ట్రస్ట్ బంగ్లా దేశ్, భారతదేశాలలో ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తోందని, చిట్టగాంగ్‌లో ఒక వీధికి "ప్రీతిలత వాడేదార్ మార్గం" అని పేరు పెట్టి గౌరవించారని, 2012లో ఆమె బస్ట్ సైజ్ కాంస్య విగ్రహాన్ని చారిత్రాత్మక యూరోపియన్ క్లబ్ దగ్గరున్న ప్రహర్తాలి రైల్వే స్కూల్ సమీపంలో ఏర్పాటు చేశారని రాసింది. 2010లో వచ్చిన బాలీవుడ్ సినిమా "ఖేలేన్ హం జీ జాన్ సే"లో ప్రీతిలత పాత్రను విశాఖా సింగ్ పోషించింది. 2012లో వచ్చిన చిట్టగాంగ్ హిందీ సినిమాలో ప్రీతిలత వాడేదర్‌గా వేగా తమోషియా నటించింది. భారత స్వాతంత్ర దినోత్సవం సమీపిస్తున్న సమయంలో ఈ ఇద్దరు వీర విప్లవ నారీమణులను గురించి తెలుసుకొని ధన్యులమవుదాం. వారి బలిదానానికి నివాళులర్పించి ఋణం తీర్చుకొందాం. ❑

*విహంగ మహిళాసాహిత్య పత్రిక సౌజన్యంతో...*

# స్వాతంత్ర్యోద్యమంలో మహిళలు

## అరుణా అసఫ్ అలీ



భారతదేశం యొక్క స్వాతంత్ర్య పోరాటం మరియు ఆనాటి ప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుల ప్రస్తావన లేకుండా భారత చరిత్రను పూర్తి చేయలేము. తన కాలానికి ముందున్న భారత స్వాతంత్ర్య సమరయోధురాలు అరుణ అసఫ్ అలీని మనం ఒకసారి గుర్తు చేసుకొందాము.

క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రసిద్ధి గాంచిన భారతీయ మహిళా స్వాతంత్ర సమరయోధురాలు అరుణా అసఫ్ అలీ. స్వాతంత్ర్య ఉద్యమం యొక్క 'గ్రాండ్ ఓల్డ్ లేడీ' గా ప్రసిద్ధి చెందిన ధీర వనిత అరుణ అసఫ్ అలీ.

మహాత్మా గాంధీ ఆదర్శాలు మరియు నమ్మకాలతో ఆమె బాగా ప్రభావితమైంది. అరుణ అసఫ్ అలీ 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న విప్లవాత్మక వామపక్షవాది.

ఆగష్టు 8, 1942 న, కాంగ్రెస్ క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించింది మరియు మహాత్మా గాంధీ. జవహర్‌లాల్ నెహ్రూతో సహా కాంగ్రెస్ ప్రముఖ నాయకులందరినీ బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసింది.

"చేయండి లేదా చనిపోవాలి DO or DIE" అన్న గాంధీజీ పిలుపుకు స్పందిస్తూ, 1942 ఆగస్టు9న బొంబాయిలోని గోవాలియా ట్యాంక్ మైదాన్ (ఇప్పుడు ఆజాద్ మైదాన్) వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా బ్రిటిష్ వారిని ధిక్కరించి, క్విట్ ఇండియా ఉద్యమ విజయానికి అరుణ ఆసిఫ్ అలీ తోడ్పడినది. బ్రిటిష్ పోలీసులు ఆమె కోసం వెతుకుతున్నందున ఆమె అరెస్టు నుండి తప్పించుకొని అజ్ఞాతంలోకి వెళ్లింది.

ఆమె అజ్ఞాతంలో ఉన్నప్పుడు అజ్ఞాత రేడియో, కరపత్రాలు మరియు 'ఇంక్విలాబ్' వంటి పత్రికల ద్వారా తన పోరాటాన్ని కొనసాగించింది. 1946లో ఆమెకు వ్యతిరేకంగా ఉన్న వారెంట్ ఉపసంహరించబడింది మరియు ఆమె అజ్ఞాతం నుండి బయటకు వచ్చింది. స్వాతంత్ర్యం తరువాత, ఆమె ప్రజాసేవలో చురుకుగా పాల్గొన్నారు మరియు 1958లో ఢిల్లీ యొక్క మొట్టమొదటి మహిళా మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆమె పేట్రియాట్ వార్తాపత్రిక మరియు లింక్ వారపత్రికను నడిపింది.

ఆమె జూలై 16, 1909 న ఉదార బ్రహ్మో కుటుంబంలో అరుణ గంగూలీగా జన్మించింది. ఆమె తండ్రి, ఉపేంద్రనాథ్ గంగూలీ, రెస్టారెంట్ యజమాని, ఆధునిక బంగ్లాదేశ్‌లోని బారిసాల్ నుండి యునైటెడ్ ప్రావిన్సెస్ (ప్రస్తుత ఉత్తర ప్రదేశ్)కు వలస వచ్చారు.

ఆమె లాహోర్ యొక్క సేక్రేడ్ హార్ట్ కాన్వెంట్ నుండి పాఠశాల విద్యను పూర్తి చేసింది మరియు తరువాత నైనిటాల్ లోని ఆల్ సెయింట్స్ కాలేజీకి వెళ్ళింది. కలకత్తాలోని గోఖలే మెమోరియల్ స్కూల్లో టీచర్‌గా ఆమె మొదటి ఉద్యోగం చేసింది.

1928 లో ఆమె ముస్లిం మరియు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (INC) లో ప్రముఖ నాయకుడు మరియు భగత్ సింగ్ తరుపున వాదించిన ఆసఫ్ అలీని వివాహం చేసుకుంది. ఆమె వివాహాన్ని ఆమె తల్లిదండ్రులు వ్యతిరేకించారు. ఆసిఫ్ అలీ ఆమె కన్నా 23 సంవత్సరాల సీనియర్, మరియు అతను 1953 లో మరణించాడు.

ఆమె తన భర్త అసఫ్ అలీ ద్వారానే రాజకీయ ప్రపంచానికి మొదటిసారి పరిచయం అయ్యింది. ఆమె తన భర్త అడుగుజాడలను అనుసరించి, కాంగ్రెస్‌పార్టీలో చురుకైన సభ్యురాలిగా మారింది. 1930లో సాల్ట్ సత్యాగ్రహంలో చురుకుగా పాల్గొనడంతో ఆమె రాజకీయాల్లోకి అడుగు పెట్టారు.

అరుణ అసఫ్ అలీకి వివాహం అయిన రెండేళ్లలోనే 1931లో ఆమెను అరెస్టు చేశారు, ప్రజల బహిరంగ నిరసనల తరువాత మహాత్మా గాంధీ జోక్యంతో ఆమె విడుదల అయ్యారు.

1932 లో, ఆమెను అరెస్టు చేసి తీహార్ జైలులో ఉంచారు. అక్కడ ఇతర రాజకీయ ఖైదీల పట్ల అనుసరిస్తున్న జైలు అధికారులు అనుసరిస్తున్న వివక్షత/ ట్రీట్‌మెంట్‌కు నిరసనగా ఆమె నిరాహార దీక్ష ప్రారంభించింది. ఇది వారి జీవన పరిస్థితుల మెరుగుదలకు దారితీసింది ఆ తరువాత ఆమెను అంబాలాలో ఏకాంత ఖైదుకు తరలించారు, మరియు విడుదలైన తర్వాత క్విట్ ఇండియా ఉద్యమం వరకు పదేళ్లపాటు రాజకీయంగా క్రియారహితంగా ఉన్నారు.

1942 తరువాత, ఆమె ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని విక్రయించినది. ఆమె అజ్ఞాతంలోకి వెళ్లి, కాంగ్రెస్ యొక్క మాస పత్రిక ఇంక్విలాబ్‌ను రామ్ మనోహర్ లోహియాతో కలసి ఎడిట్ చేసినది.

ఆమె స్వతంత్ర భావాలకు పేరుగాంచిన ధీరవనిత. 1946 లో తనకు తాను లొంగిపోవాలన్న గాంధీ అభ్యర్థనను ఆమె అంగీకరించలేదు. ఆమె తన ఆదర్శాలకు కట్టుబడి ఉంది మరియు రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటుకు మద్దతు ఇచ్చినందుకు గాంధీ ఆమెను విమర్శించెను.

1948 లో అరుణ కాంగ్రెస్ నుంచి వైదొలిగి సోషలిస్ట్ పార్టీలో చేరారు. 1950 దశకం ప్రారంభంలో ఆమె కమ్యూనిస్ట్ పార్టీలో చేరిన తరువాత 1956లో ఆమె పార్టీ నుండి వైదొలిగినది.

1958 లో ఆమె ఢిల్లీకి ఎన్నికైన మొదటి మహిళా మేయర్‌గా పనిచేశారు

తన కాలానికి ముందు ఉన్న అభ్యుదయ మహిళ ఆమె. అరుణ అసఫ్ అలీ 29 జూలై 1996 న కన్నుమూశారు.

స్వాతంత్ర్యానంతరం ఆమె మహిళా విద్యను ప్రోత్సహించడం ద్వారా మహిళల హోదాను మెరుగుపర్చడానికి కృషి చేసింది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఆమె 'వీక్లీ' మరియు 'పేట్రియాట్' అనే వార్త పత్రికను కూడా ప్రారంభించింది

ఆమె జీవితాంతం వామపక్షవాదిగా ఉండి, సిపిఐ యొక్క మహిళల విభాగమైన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్‌ను అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించింది. అరుణ దళితుల సమీకరణకు తన మద్దతు ప్రకటించారు మరియు పర్యావరణ క్షీణతకు మరియు సామాజిక పరాయీకరణకు దారితీసే "అనవసరమైన పారిశ్రామికీకరణ" ను వ్యతిరేకించారు. మహిళల అభ్యున్నతి కోసం ఆమె కృషి చేసారు. రిజర్వేషన్ల కంటే విద్య మరియు మెరుగైన ఆరోగ్య సంరక్షణ మహిళలకు ఎక్కువ మేలు చేస్తుందని ఆమె నమ్మారు.

క్రియాశీల రాజకీయాల నుండి వైదొలిగినప్పటికీ, 1964లో ఆమె తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. అత్యవసర పరిస్థితిని విమర్శించినప్పటికీ ఆమె ఇందిరా గాంధీతో సన్నిహితంగా ఉంది.

అరుణను జాతీయవాదులు మరియు వామపక్షాలు సత్కరించాయి. ఆమెకు ఆర్డర్ ఆఫ్ లెనిన్ మరియు 1965లో లెనిన్ శాంతి బహుమతి లభించింది. 1992లో ఆమెకు పద్మ విభూషణ్ మరియు 1997లో భారత రత్న అవార్డు మరణానంతరం లభించింది. ఆమె అంతర్జాతీయ అవగాహన కోసం ఉద్దేశించబడిన నెహ్రూ అవార్డు గ్రహీత కూడా.

## కెప్టెన్ లక్ష్మీ సెహగల్



ప్రముఖ సంఘసేవకురాలు, రాజ్యసభ సభ్యురాలు. ఈమె భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేసిన తొలి మహిళ. ఈమె తండ్రి స్వామినాథన్ మద్రాసులో ప్రముఖ న్యాయవాది. తల్లి ఎ.వి.అమ్ము కుట్టి సామాజిక సేవా కార్యకర్త. చిన్నతనంలోనే సెహగల్ విదేశీ వస్తు బహిష్కరణ, మద్యనిషేధం వంటి జాతీయ పోరాటాలలో పాల్గొన్నారు. 1938లో మద్రాసు వైద్య కళాశాలలో ఎం.బి., బి.ఎస్. గైనకాలజీ పూర్తయిన తరువాత 1940లో సింగపూర్ వెళ్ళి, అక్కడ భారతీయ నిరుపేదల వాడలో వైద్యశాల స్థాపించి, స్థానికంగా ఉన్న భారతీయ కార్మికులకు సేవలందించారు. అక్కడే నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రసంగాలకు ప్రభావితురాలై స్వాతంత్ర్యోద్యమంలో 'ఆజాద్ హింద్ ఫౌజ్' మహిళాదళాల్లో చేరి, కెప్టెన్ హోదా పొంది, డాక్టర్‌గా వైద్యసేవలు కూడా అందచేశారు. ఆయన స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఝాన్సీ రెజిమెంట్‌కు ప్రాతినిధ్యం వహించారు. లక్ష్మీ సెహగల్ 1947లో లాహోర్‌కు చెందిన కర్నల్ ప్రేమ్‌కుమార్ సెహగల్‌ను లాహోర్‌లో వివాహం చేసుకొని కాన్పూర్‌లో స్థిరపడి కాన్పూర్ ప్రజలకు వైద్యసేవలందించారు. స్వాతంత్ర్యానంతరం ఆల్ ఇండియా డెమొక్రటిక్ ఉమెన్స్ అసోషియేషన్ (ఐద్వా) ఉపాధ్యక్షురాలిగా వివిధ స్థాయిలలో సమాజసేవకు అంకితమయ్యారు. 1971లో, సీపీఎం తరపున లక్ష్మీ సెహ్‌గల్ రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. 1998లో ఈమెకు పద్మ విభూషణ్ పురస్కారం ప్రదానం చేయబడింది. 2002లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో ఆమె వామపక్షాల మద్దతుతో బరిలోకి దిగారు. (ఆ ఎన్నికల్లో అబ్దుల్ కలామ్ రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు.) 97 సంవత్సరాల వయసులో లక్ష్మీ సెహ్‌గల్ 2012, జూలై 23న కాన్పూర్‌లో మరణించారు. ❑



## సరోజినీ నాయుడు



ఈమె క్రీ.శ. 1879 వ సంవత్సరం ఫిబ్రవరి నెల 13వ తేదీన హైదరాబాద్‌లో జన్మించారు. తండ్రి డా. అఘోరనాథ్ చటోపాద్యాయా, తల్లి శ్రీమతి వరద సుందరి. అఘోరనాథ్ చటోపాధ్యాయగారు హైదరాబాదు కాలేజికి, (అనగా నేటి నిజాం కాలేజీ) మొట్టమొదటి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసారు. తల్లి వరదాదేవి చక్కని రచయిత్రి.

సరోజినీ లండన్ కింగ్స్ కాలేజీలోను కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ అధ్వర్యంలోని గిర్టన్ కాలేజిలోనూ విద్యాధ్యయనం చేసింది. ఆమె రచించిన కావ్యాలలో "కాలవిహంగం" (Bird of time), "స్వర్గ ద్వారం" (the Golden Threshold), విరిగిన రెక్కలు (the broken wings) అనేవి చాలా ప్రసిద్ధమైనవి.

1898 వ సంవత్సరం విదేశాలలో విద్య పూర్తి చేసుకుని భారతదేశం తిరిగి వచ్చాక, ఆమె శ్రీ ముత్యాల గోవిందరాజులు నాయుడు ఆనాడే వర్ణాంతర వివాహం చేసుకుంది. ప్రముఖ సంఘ సంస్కర్త శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు గారు వీరి వివాహం జరిపించారు..

### రాజకీయ రంగ ప్రవేశం :

వీరు మహిళాభివృద్ధికి ఎంతో కృషి చేసి 1906లో మహిళలకు విద్య అవసరమని దేశమంతా ఎన్నో మహిళా సమావేశాలు ఏర్పరచి మహిళల్లో చైతన్యం తీసుకురావడానికి ఎంతో పాటు పడ్డారు. స్వాతంత్ర్య సాధనలో తనూ పాలుపంచుకోవాలని ఆలోచించిన శ్రీమతి సరోజినీ నాయుడు కాంగ్రెస్ జాతీయ భావాలకు అనుగుణంగా నడుచుకో నారంభించింది. 1915వ సంవత్సరం బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ మహాసభలకూ, 1916లో జరిగిన లక్నో కాంగ్రెస్ సభలలో ఆమె పాల్గొనటం జరిగింది. "జాతి వేరనీ, దేశం వేరనీ, నువ్వు వేరనీ విడిగా ఉండకు, నీకు జరిగితే దేశానికి జరిగినట్టే, దేశం అనుభవించే బానిసతనం నీవూ అనుభవించవలసినదే" అంటూ దేశమంతా తిరిగి దేశభక్తిని నూరిపోసించా వీరతిలకం.

### శాసన ధిక్కారం :

స్వాతంత్ర్యోద్యమ చరిత్రల పుస్తకాలను అమ్మకూడదని, బ్రిటిష్ ప్రభుత్వం ఆజ్ఞలు జారీ చేసింది. ఆ ఆజ్ఞలు ఫలితంగా చాలా పుస్తకాలను అమ్మటం మానేశారు. గాంధీజీ సలహాపైన ఆ పుస్తకాలన్నింటినీ ప్రతివీధిలోనూ అమ్మి ప్రభుత్వ శాసన ధిక్కారం జరిపింది సరోజినీనాయుడు.

ఆ సమయంలోనే ఒక బహిరంగ సభలో ఉపన్యసిస్తూ, బ్రిటిషు పాలకులు భారతదేశాన్ని స్వంతంగా భావించడమే అపరాధం. భారతీయుల హక్కుల గురించి బానిసలుగా చేసి వారి ప్రాణాలు సైతం బలి తీసుకోవటం క్షమించరాని అపరాధం" అంటూ గర్జించింది.

ఒక భారతీయ మహిళ చేస్తున్న ఉద్యమ ప్రచారానికి బ్రిటిష్ ప్రభుత్వం బెంబేలెత్తిపోయింది. ఆమెను స్వేచ్ఛగా తిరగనీయడం తనకూ, తన దగాకోరు పరిపాలనకూ తగదని తలంచి 1930వ సంవత్సరం మే 23 వతేదీన శ్రీమతి సరోజినీ నాయుడును అరెస్టు చేసింది.

భారతీయ ప్రతినిధిగా 1931వ సంవత్సరంలో లండన్ రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్‌కు వెళ్ళింది సరోజినీ నాయుడు. క్విట్ ఇండియా ఉద్యమంలో 1942లో బ్రిటిష్ ప్రభుత్వాన్నెదిరించి ఎన్నో రకాలుగా స్వాతంత్ర్య పోరాటం సాగించిందామె. అందుకు ఫలితంగా అరెస్టు చేయబడి, దాదాపు 1945 వరకు దుర్భర కారాగారవాస జీవితం నవ్వుతూ అనుభవించింది. అనారోగ్యంగా ఉన్న కారణంగా ఆమెను విడుదల చెయ్యవలసి వచ్చింది.

శ్రీమతి సరోజినీనాయుడు దేశానికి చేసిన సేవలు దృష్టిలో ఉంచుకుని ఆమెకు ఉత్తర ప్రదేశ్‌కు గవర్నర్ పదవి యిచ్చి సత్కరించడం జరిగినది. జీవితమంతా మానవ సేవకు, దేశ సేవకూ అంకితము చేసి తన డబ్బైవ యేట 1949 మార్చి 2 వ తేదీన లక్నోలో ప్రశాంతంగా కన్ను మూసింది.

# దుర్గాబాయి దేశ్‌ముఖ్



(జూలై 15, 1909 – మే 9, 1981) దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ లోని రాజమండ్రిలో, 1909 జూలై 15న మధ్యతరగతి కుటుంబంలో రామారావు, కృష్ణవేణమ్మ దంపతులకు జన్మించారు. 8 ఏండ్ల వయసులో ఆమె మేనమామ సుబ్బారావుతో వివాహమయింది. తరువాత ఆమె ఆ వివాహాన్ని వ్యతిరేకించింది. ఆమె నిర్ణయాన్ని తండ్రి, సోదరుడు అంగీకరించారు. బాల్యం నుండి ప్రతిభాపాటవాలను కనబరుస్తూ పది సంవత్సరాల వయస్సులోనే హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, బెనారస్ విశ్వవిద్యాలయం నుండి మెట్రిక్యులేషన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ (పొలిటికల్ సైన్స్), 1942లో ఎల్.ఎల్.బి పూర్తిచేసింది. న్యాయశాస్త్రం చదివిన తరువాత మద్రాసులో హైకోర్టు వద్ద సాధన ప్రారంభించింది.

### స్వాతంత్ర్య పోరాటం :

దుర్గాబాయి చిన్ననాటి నుండే స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకుంది. తన 12 యేండ్ల వయసులో ఆంగ్ల విద్యపై పోరాటం ప్రారంభించింది. ఆమె రాజమండ్రిలో బాలికలకు హిందీలో విద్యను అందించడానికి బాలికా హిందీ పాఠశాలను ప్రారంభించింది. తెలుగుగడ్డపై మహాత్మా గాంధీ రాకను పురస్కరించుకుని 12 ఏళ్ళ వయసులోనే ఈమె విరాళాలను సేకరించి ఆయనకు అందజేసింది. మహాత్ముని సూచన మేరకు మారు ఆలోచించకుండా తన చేతులకు ఉన్న బంగారు గాజులను కూడా విరాళంగా అందించింది. 1923లో కాకినాడలోని కాంగ్రెస్ సభలకు వాలంటీరుగా పనిచేస్తూ నెహ్రూ వద్ద టిక్కెట్ లేని కారణము చేత ఆయనను అనుమతించక, తన కర్తవ్య నిర్వహణకు గాను ఆయన నుండి ప్రశంసలను పొందింది. ఆ పై మహాత్ముని ఆంధ్ర పర్యటనలలో ఆయన హిందీ ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించింది. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని అరెస్టు కాబడింది. స్వాతంత్ర్య సమరకాలంలో ఉద్యమాల్లో పాల్గొని విరామ సమయాల్లో విద్యాభ్యాసం చేసి ఎంఎ, బిఎల్, బిఎ ఆనర్స్ చేసి న్యాయకోవిదురాలిగా, ప్రఖ్యాత క్రిమినల్ లాయర్‌గా పేరు గాంచింది.

### సామాజిక సేవలు :

దుర్గాబాయి అనేక మహిళా సంస్థలు, సాంఘిక సంక్షేమ సంస్థలను ప్రారంభించి స్త్రీల అభ్యున్నతికి కృషి చేశారు. ఈమె ఆధ్వర్యంలో 1937లో చెన్నపట్నంలో (ప్రస్తుత చెన్నైలో) ఆంధ్ర మహిళా సభ స్థాపించబడింది. 1937లో లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే బాల సంఘాన్ని ప్రారంభించింది. ఈమె 1941లో ఆంధ్ర మహిళ పత్రికను స్థాపించి, సంపాదకత్వ బాధ్యతలను నెరవేర్చింది. 1958లో హైదరాబాదులో ఆంధ్ర మహిళా సభను స్థాపించారు. భారత రాజ్యాంగ నిర్మాణ సభలో 1946 నుండి 1950 వరకు సభ్యురాలిగా పనిచేసిన పిమ్మట, 1952లో ప్లానింగ్ కమిషన్ సభ్యురాలిగా పనిచేసింది. ఆ సందర్భంలో సి.డి.దేశ్‌ముఖ్ తో కలిగిన పరిచయం పరిణయానికి దారి తీసింది. వీరి వివాహము 1953 జనవరి 22న జరిగింది. ఈవిడ 1953 ఆగస్టులో భారత ప్రభుత్వంచే నెలకొల్పబడిన కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డుకు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా పనిచేసింది. ఢిల్లీలో ఉన్న బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా పనిచేసింది.

### అవార్డులు :

1975 – పద్మ విభూషణ్. అదే సంవత్సరం ఆవిడ భర్త సి.డి.దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొందారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ ❑

# జాతీయ ఉద్యమం - తూర్పు గోదావరి జిల్లా మహిళలు



చల్లా హైమవతి

జాతీయ ఉద్యమంలో మహిళలు భాగస్వాములు కావాలని గాంధీ గారు భావించారు. త్యాగం, సహనం వారి లక్షణాలు కాబట్టి ఉద్యమం పవిత్రంగా సాగుతుందని అభిలషించారు. అందుకే సహాయ నిరాకరణ ఉద్యమంలో మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనుటకు వీలుగా కార్యాచరణ రూపొందించారు.

గాంధీగారు జాతీయ ఉద్యమంలో అడుగు పెట్టే ముందు మహిళల సంఖ్య ఉద్యమంలో చాలా తక్కువ. 1900 సంవత్సరంలో రవీంద్రనాథ్ ఠాగూర్ సోదరి స్వర్ణకుమారి దేవి మరియు గంగూలి అనే ఇద్దరు మాత్రమే జాతీయ కాంగ్రెస్ సమావేశాలకు హాజరు అయ్యారు. గంగూలీ కాంగ్రెస్ వేదిక నుండి మాట్లాడిన మొదటి మహిళ. తరువాత అనిబిసెంట్ మరియు సరోజిని నాయుడు జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష స్థానం పొందారు. 1925లో సరోజిని నాయుడు స్ఫూర్తిదాయకమైన అధ్యక్షోపన్యాసాన్ని ఇచ్చారు.



## సహాయ నిరాకరణ

గాంధీ గారి అభిప్రాయాలు మహిళలను ఆకర్షించాయి. "మహిళలను బలహీనులు అనడం అన్యాయం" అని గాంధీ గారు అభిప్రాయం వెలిబుచ్చారు. మహిళలకు నైతిక విలువలు ఉంటాయి అని గాంధీ గారి అభిప్రాయం. ఈ విధమైన అభిప్రాయాలు మహిళలలో ఆత్మగౌరవం మరియు ఆత్మ విశ్వాసం కలిగించాయి.

తూర్పుగోదావరి జిల్లాలో దువ్వూరి సుబ్బమ్మ సహాయ నిరాకరణ ఉద్యమంలోకి అడుగు పెట్టారు. వీరికి బలుసు సాంబమూర్తి గారి ప్రోత్సాహం వుంది. 1921లో జిల్లా మహాసభలో పాల్గొన్నారు. ఆ సభకు ప్రకాశం పంతులు గారు అధ్యక్షులు. ఆ సభలో "పూర్ణ స్వరాజ్యం' అను ప్రతిపాదనకు మద్ధతును తన ప్రసంగం ద్వారా వెలిబుచ్చారు. మహా భారతం మరియు భగవద్గీతల నుండి శ్లోకాలు చదివి సమావేశంలోని వారిని మెప్పించారు. ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు.

1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో 12 ఏళ్ళ వయసున్న దుర్గాబాయమ్మ శక్తిమంతంగా పని చేయడానికి ముందుకు వచ్చారు. ఆమె నిర్మాణాత్మక కార్యక్రమాలలో పని చెయ్యడానికి హిందీ నేర్చుకున్నారు. విదేశీ వస్తు బహిష్కరణ చేశారు. రాట్నంపై నూలు వడకడం నేర్చుకున్నారు.

ఆనాడు జాతీయ కాంగ్రెస్ సభ్యుల నాయకుల కుటుంబాలకు చెందిన మహిళలు చాలా ఎక్కువగా పాల్గొన్నారు. వేదాంతం కమలాదేవి, పెద్దాడ కామేశ్వరమ్మ, బలుసు సుభద్రమ్మ మొదలైన వారు రాజకీయ కుటుంబాలకు చెందినవారే. బ్రహ్మజ్యోసుల సుబ్రహ్మణ్యం గారి తల్లి గారు లక్ష్మీనరసమ్మ గారు కూడా పాల్గొన్నారు. మహిళలను ఉద్యమంలోకి తీసుకురావడానికి దువ్వూరి సుబ్బమ్మ గారి ప్రయత్నం చాలా గొప్పది. ఆమె చాలా ప్రదేశాలు పర్యటించి తన ప్రసంగాల ద్వారా మహిళలలో స్ఫూర్తి నింపారు. దుర్గాబాయమ్మ మహిళా సదస్సు ఏర్పాటు చేసి మహిళలలో జాతీయ స్ఫూర్తి నింపారు. 'తిలక్ స్వరాజ్య నిధి'కి చందాలు ప్రోగు చేసి తన నాయకత్వ లక్షణాలను కనబరిచారు. గాంధీ గారు కాకినాడ పర్యటనకు వచ్చినప్పుడు మహిళా సమావేశం ఏర్పాటు చేసి దానిలో గాంధీ గారి ప్రసంగం ఏర్పాటు చెయ్యాలని అభిప్రాయపడి, నాయకులను ఒప్పించారు. రెండు నిమిషాలు ప్రసంగం కోసం అనుమతి పొంది, సమావేశానికి గాంధీ గారు వచ్చేట్లు చేశారు. వెయ్యి మంది మహిళలతో సమావేశం ఉండడం చూసి గాంధీ గారు సంతోషించారు. అనుకున్న రెండు నిముషాల కన్నా ఎక్కువ సేపు గాంధీ గారు తన ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రసంగ సమయంలో మహిళలు బంగారు నగలు, తమ వద్ద ఉన్న డబ్బు తిలక్ నిధికి సమర్పించారు. మొత్తం కానుకల విలువ 25 వేలుగా లెక్కించారు. దుర్గాబాయమ్మ గాంధీ గారి హిందీ ప్రసంగాన్ని తెలుగులోకి అనువదించారు. అప్పటి నుండి గాంధీ గారు పర్యటనకు వచ్చినప్పుడల్లా అనువాదకురాలుగా కొనసాగారు.

సహాయ నిరాకరణ ఉద్యమంలో స్వదేశీ భావన ప్రచారం చేసి, దేశ ఆర్థిక స్థితిగతులు మెరుగుదలకు, స్వదేశీ భావన అవసరం అని గాంధీ గారు భావించారు. 'స్వదేశీ' అమలు చెయ్యడానికి ఖాదీ ప్రచారం చెయ్యడం, రాట్నంతో నూలు వడకడం అనే కార్యక్రమాలు అమలులోకి వచ్చాయి. మహిళలకు ఖాదీ ప్రచార బాధ్యత అప్పగించారు. గ్రామీణ పరిశ్రమ అభివృద్ధికి రాట్నాలను ఉద్యమకారులకు పంచిపెట్టే ప్రణాళిక అమలయ్యింది. విదేశ వస్తు బహిష్కరణ బాగా సాగింది. అధిక సంఖ్యలో మహిళలు నూలు వడకడం ప్రారంభించారు. దువ్వూరి సుబ్బమ్మ గారి నాయకత్వంలో భారీ ప్రచారం నిర్మాణాత్మకంగా సాగింది. సుబ్బమ్మ గారి ప్రసంగాలు ప్రజలను, మహిళలను ఆకట్టుకున్నాయి. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారు, చెరుకువాడ నరసింహం పంతులు గారితో సుబ్బమ్మ గారు ప్రసంగించ గలిగారు. సుబ్బమ్మ గారు ఇతర జిల్లాలలో కూడా పర్యటించేవారు.

ప్రభుత్వం 1922 నుండి ఉద్యమాన్ని అణిచివేయడానికి సంకల్పించింది. అందుకు నాయకులను, ఉద్యమకారులను జైళ్ళలో పెట్టింది. దువ్వూరి సుబ్బమ్మ జైలుకు వెళ్ళిన మొదటి మహిళ. మహిళలను ఉద్యమం నుంచి విరమింపచెయ్యడం, జైళ్ళలో పెట్టడం అధికారులు ఇబ్బంది పడ్డారు. అందుకుని సుబ్బమ్మ గారిని క్షమార్పణ చెప్పించి వదిలివెయ్యాలని ఆర్థర్ కెంపు అనే అధికారి ప్రయత్నించారు. ఆమె క్షమార్పణకు ఒప్పుకోలేదు. అందుకని ఆమెకు ఒక సంవత్సర కాలం జైలు శిక్ష విధించారు.

తూర్పుగోదావరి జిల్లాలో ఉద్యమం ప్రబలింది. అమలాపురంలో జొన్నలగడ్డ మల్లపరాజు కూతురు నండూరి చంద్రమతి పాల్గొన్నారు. నూలు వడకడంలో చాలా కృషి చేసి, 200 గజాల నూలు ఒక్కో నెలలో వడికేవారు.

## కాకినాడ కాంగ్రెస్ - మహిళలు

కాకినాడ కాంగ్రెసులో "పూర్ణ స్వరాజ్" ప్రతిపాదనపై చర్చ జరిగినప్పుడు దువ్వూరి సుబ్బమ్మ మరియు యామిని పూర్ణతిలకం చర్చలో చురుకుగా పాల్గొన్నారు. కాకినాడ కాంగ్రెస్ ఈ ప్రతిపాదనకు అంగీకరించింది. కాకినాడ కాంగ్రెస్ సాహిత్య సమ్మేళన జరిపింది. ఈ సందర్భంగా ఖాదీ ప్రదర్శన చేశారు. అందుకు మహిళా వాలంటీర్లు అవసరమయ్యారు. 400 మంది మహిళా వాలంటీర్లకు హిందీ నేర్పారు. అందుకు దుర్గాబాయమ్మ పర్యవేక్షణ చేశారు. కాకినాడ కాంగ్రెస్ మహిళా విభాగం ఏర్పాటు చేసింది. మహిళా కాంగ్రెస్ సమావేశంలో కస్తూరిబాయి గాంధీ ప్రసంగించారు. మహిళలు చేస్తున్న కార్యక్రమాలను సంతృప్తిగా వున్నాయని మెచ్చుకున్నారు. దువ్వూరి సుబ్బమ్మ గారి వక్తృత్వాన్ని శ్లాఘించారు. ఆ తరువాత 1923లో సుబ్బమ్మ గారికి కాంగ్రెస్ తరపున 'దేశ బాంధవి' అను బిరుదు కూడా ఇచ్చారు. 'చౌరీ చౌరా' సంఘటనతో సహాయ నిరాకరణ ఆపేయడంలో కొంత స్తబ్దత ఏర్పడింది.

## 1923-1930 మహిళలు పాత్ర

సహాయ నిరాకరణ ఆపినప్పటికీ నిర్మాణాత్మక కార్యక్రమాలు కొనసాగాయి. జాతీయ కాంగ్రెస్‌లో భాగంగా స్వరాజ్య పార్టీ ఎన్నికలలో పాల్గొంది. కౌన్సిళ్ళలో ప్రతినిధ్యం వహించి ప్రభుత్వంలో సహాయ నిరాకరణ కొనసాగించింది.

1927లో ఏర్పడిన సైమన్ కమిషన్ 1928లో భారతావనికి వచ్చినప్పుడు సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా 'సైమన్ గోబ్యాక్' అని ఆందోళన, హర్తాళ్ళు జరిపారు. నల్ల జెండాలతో ఊరేగింపులు జరిగాయి. రాజమండ్రిలో మల్లిపూడి పళ్ళంరాజు ఆధ్వర్యంలో నల్లజెండాల ప్రదర్శనలో కాశీభట్ల రమణమ్మ, బత్తుల కామాక్షమ్మ, పెద్దాడ కామేశ్వరమ్మ, దువ్వూరి సుబ్బమ్మ, శివరాజు సుబ్బమ్మ, మద్దూరి రమణమ్మ మొదలయిన వారు పాల్గొన్నారు. 1924-30 మధ్య క్రొత్త సభ్యులను కాంగ్రెస్‌లోకి చేర్చుకొనే కార్యక్రమం మొదలుపెట్టారు. 1925 మే నెల 28న తూర్పుగోదావరి జిల్లా పలివెలలో జరిగిన సమావేశానికి 300 మంది మహిళలు హాజరు అయ్యారు. గోటేటి మాణిక్యాంబ సమావేశంలో సభ్యులను ఆహ్వానించగా, దువ్వూరి సుబ్బమ్మ అధ్యక్ష ఉపన్యాసం చేశారు. ఖద్దరు ప్రచారం చేశారు. మరల 1929లో గాంధీ గారు జిల్లాలో పర్యటించారు. పోముకంటి పాపాయమ్మ గాంధీ గారితో పాటు పర్యటనలో పాల్గొన్నారు. 'ఖద్దరు నిధి'ని వసూళ్ళు చేశారు.

## ఉప్పు సత్యాగ్రహం

జాతీయ కాంగ్రెస్ జనవరి 2, 1930న లాహోరు సమావేశంలో చేసిన ప్రతిపాదన ప్రకారం జనవరి 26, 1930న స్వాతంత్ర్య దినం పాటించాలి.



ఉప్పుపై విధించిన ఆంక్షలను వ్యతిరేకించాలని నిర్ణయించారు. మార్చి 12న గాంధీ గారు ఉప్పుపై పన్నుకు వ్యతిరేకంగా దండి వరకు పాదయాత్ర మొదలు పెట్టారు. తూర్పు గోదావరి జిల్లాలో సీతానగరం ఆశ్రమం నుండి చొల్లంగి వరకు ఉప్పు చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఉప్పు

తయారు చెయ్యాలని నిర్ణయించారు. రాజమండ్రిలో దువ్వూరి సుబ్బమ్మ గారు సత్యాగ్రహులకు స్వాగతం పలికి భోజనాలు ఏర్పాటు చేసి తన మద్దతు కూడా తెలిపారు. కాకినాడలో వేదాంతం కమలాదేవి, వేముకంటి పాపాయమ్మ పాదయాత్రికులను కలిసి, తాము కూడా పాల్గొన్నారు. ఉప్పాడలోను, కొత్తపల్లిలోను కూడా శిబిరాలు ఏర్పాటు చేశారు.

రాజమండ్రిలో కాశీభట్ల రమణమ్మ, శివరాజు సుబ్బమ్మ, పెద్దాడ కోటేశ్వరమ్మ, దువ్వూరి సుబ్బమ్మ, గాడిచెర్ల మంగమ్మ మరియు గోటేటి శ్యామలాంబ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని శ్రద్ధానంద ఘాటులో ఉప్పు తయారుచేశారు. ఈ సందర్భంగా ఉప్పుపై పన్నును వ్యతిరేకిస్తున్నందుకు పోలీసులు దువ్వూరి సుబ్బమ్మను అదుపులోకి తీసుకొని 6 నెలల జైలుశిక్ష విధించారు. నెల్లూరు జైలుకు పంపారు. కాకినాడలో వేములకొండ తాయారమ్మ, రంగనాయకమ్మ ఉప్పు తయారీలో పాల్గొన్నారు. అమలాపురంలో బెండమూరి లంక నుండి ఉప్పునీళ్ళు తెచ్చి ఉప్పు తయారుచేసి, చిన్న పొట్లాలు కట్టి వాటిని 40 రూపాయలకు అమ్మి ఆ సొమ్మును 'స్వరాజ్ నిధి'కి జమ చేశారు. ఈ కార్యక్రమంలో బెహరా రత్నమాంబ, చాగంటి శేషగిరమ్మ, యర్రమిల్లి శేషమ్మ మరియు నందూరి చంద్రమతి పాల్గొన్నారు.

మొదట మద్రాసులో సత్యాగ్రహ శిబిరం పెట్టలేదు. కాశీనాధుని నాగేశ్వరరావు, టంగుటూరి ప్రకాశం పంతులును ఒప్పించిన దుర్గాబాయమ్మ మద్రాసులో ఉప్పు సత్యాగ్రహ శిబిరం పట్టుదలతో పెట్టించారు. ఆ శిబిరానికి ఆమెను నాయకురాలు చేశారు. విశాఖ శిబిరానికి జానకీబాయి నాయకురాలు.

మహిళలు తూర్పుగోదావరి జిల్లాలో డియస్‌పి (DSP) ముస్తఫా ఆలీఖాన్ నుండి లాఠీలను ఎదుర్కొన్నారు. పోలీసు అకృత్యాల వల్ల మహిళలు బాధలు పడ్డారు.

పెద్దాపురంలో గార్డెన్ పార్టీని ఒక రహస్య సమావేశం చేయడానికి ఏర్పాటు చేశారు. విషయాన్ని పసిగట్టిన పోలీసులు గార్డెన్‌లోకి వచ్చి సభ్యులను లాఠీలతో కొట్టారు. క్రొవ్విడి లింగరాజు గారు, పెద్దాడ కామేశ్వరమ్మ గారు బాగా దెబ్బలు తిన్నారు.

ఉప్పు సత్యాగ్రహం సంఘటనలలో వాడపల్లి రథోత్సవం చెప్పవలసిన సంఘటన. మార్చి 31, 1931న వాడపల్లిలో రథంపై నాయకుల పటములను అమర్చారు. ముఖ్యంగా గాంధీ, నెహ్రూ మరియు సరోజినీ నాయుడు పటములను అమర్చారు. వాటిని వెంటనే రథంపై నుండి తీసెయ్యాలని పోలీసులు పట్టుబట్టారు. పోలీసులతో సహకరించకపోవడం వల్ల వెంటనే పోలీసులు లాఠీలను ఝళిపించారు. చాలా మంది ఉద్యమకారులకు దెబ్బలు తగిలాయి. ముఖ్యంగా ఈ సంఘటనలో ఆత్రేయపురానికి చెందిన క్షత్రియ మహిళలు కూడా లాఠీలు ఎదుర్కొన్నారు.

మరల 1932లో నిరసన కొనసాగింది. దీనిలో కాశీభట్ల రమణమ్మ, నందూరి రమణమ్మ మరియు శివరాజు సుబ్బమ్మలను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. కాశీభట్ల రమణమ్మ గర్భవతిగా వున్నా ఆమెను అదుపులోకి తీసుకుని రామచంద్రపురం పంపారు. మిగిలిన వారిని నెల్లూరు జైలుకు పంపారు.

1930-31 మధ్య 'తెల్లగుర్రము బండి' సంఘటన గుర్తు చేసుకోవాలి. కంభంపాటి మాణిక్యాంబ (కంభంపాటి సత్యనారాయణ గారి భార్య) ఉద్దరాజు మాణిక్యాంబలు కలిసి కొవ్వూరులో నిరసన కార్యక్రమాలు చేశారు. పోలీసులు సివిల్ దుస్తులలో వచ్చి వారిని బెదిరించి తెల్ల గుర్రము బండి ఎక్కమన్నారు. అనేక ప్రశ్నలు అడిగారు. నాయకుడి గూర్చి ఆరా తీశారు. సమాధానం చెప్పలేదని వారిని ఏలూరు పవర్‌పేట స్టేషన్ వద్ద దించారు. ఆ తరువాత కంభంపాటి మాణిక్యాంబను తెనాలి తాలూకా సమావేశంలో పాల్గొన్నందుకు అదుపులోకి తీసుకుని 6 నెలల కారాగార శిక్ష విధించారు. అప్పటికే జైలులో ఉన్న దిగుమర్తి లక్ష్మీబాయి, జానకీబాయి, తల్లాప్రగడ విశ్వ సుందరమ్మ, వేదాంతం కమలాదేవిలతో మాణిక్యాంబ కలిసారు. ఇదే కార్యక్రమం కోసం కాకినాడలో గోపరాజు సరస్వతి పాల్గొన్నారు. గాడిచర్ల మంగమ్మ నిర్మాణాత్మక కార్యక్రమాలు చేశారు. ఖాదీ ప్రచారం చేశారు. ప్రభుత్వ సంస్థల నుండి బహిష్కరణ ఒక పెద్ద కార్యక్రమం.

చల్లపల్లి సీతమ్మ, దిగుమర్తి సరస్వతి, తోలేటి శేషమ్మ నిరాకరణ ఉద్యమంలో పాల్గొంటూ జాతీయ భావాలను దేశభక్తిని పెంపొందించే నాటకాలు ప్రదర్శించారు. ఝూన్సీలక్ష్మీబాయి నాటకాన్ని విస్తృతంగా ప్రదర్శించారు. ఈ విధంగా పోలీసులకు వణుకు పుట్టించే కార్యకలాపాలు చేశారు. తీవ్రవాది అయిన ప్రతివాద భయంకరాచారిని బాంబు కేసులో ఉన్నప్పుడు కాకినాడకు చెందిన కమలమణి ఆయనకు ఆశ్రయం కల్పించారు. ఈ విషయాన్ని గాంధీ గారు తన 'యంగ్ ఇండియా' పత్రికలో ప్రకటించారు. ఆమెను అభినందించారు. 1924 బెంగాల్ కాంగ్రెస్ సమావేశంలో కమలమణికి నాణ్యమైన నూలు వడికినందుకు బంగారు పతకాన్ని బహుకరించారు. ప్రత్యేకమైన చరఖా ద్వారా 430 కౌంటు నూలు వడికి ఆమె మన్ననలు అందుకున్నారు. ఈ వషయాన్ని 'యంగ్ ఇండియా'లో గాంధీ గారు ప్రకటించారు. ఈమె కాకినాడలో చరఖా శిక్షణ కూడా నడిపారు.

☞ **మిగతా 39వ పేజీలో**

## తెలంగాణా సాయుధ పోరాటంలో వీర వనితలు

# ఎర్రజెండా రెపరెపల్లో మెరిసిన విద్యుల్లత మల్లు స్వరాజ్యం

వేములపల్లి సత్యవతి

యుద్ధభూమిలో అరివీర భయంకరులై శత్రువులతో పోరాడి అసువులు బాసినవారిని వీరులని, వీర మరణం పొందారని అంటాము. జాతి స్వేచ్ఛ, దేశ స్వాతంత్ర్యాల కొరకు కంకణం కట్టుకుని ఉద్యమాలను స్థాపించి ధన, మాన, ప్రాణాలను ఫణంగా పెట్టి సమిధలైన వారిని త్యాగధనులని, లబ్ధప్రతిష్టులని, నిష్కళంక దేశభక్తులని కొనియాడతాం. పైన పేర్కొన్న ఇరు వర్గాలకు చెందినవారు, మన దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములే. ప్రథమ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆంగ్లేయ సేనలనెదిరించి టిప్పు సుల్తాన్, తాంత్యాతోపే, ఝాన్సీరాణి లక్ష్మీభాయి, హజరత్ బేగం మొదలైనవారు అసమాన ధైర్యసాహసాలతో పరాక్రమశాలురై పోరాడి వీర మరణం పొందారు.



రవి అస్తమించని ఆంగ్ల సామ్రాజ్య ఆధిపత్యాన్నుండి మాతృదేశపు దాస్య శృంఖలాలను బద్దలు కొట్టడానికి విప్లవ వీర కిశోరాలు భగత్‌సింగ్, ఖుదీరాం బోస్, అష్ఫాఖుల్లా ఖాన్ మొదలగు యువకులు ఉరితాళ్ళను పూలదండల వలే మెడలకు తగిలించు కుని చిరు మందహాసంతో ఉరికంబాలకెక్కారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆంగ్లేయ పాలకుల కంటిమీద కునుకు లేకుండా ముప్పుతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్ళు తాగించాడు. ఆ మన్యం వీరుని గుండె తుపాకీ గుళ్ళకు గురైంది. గాంధీజీ నాయకత్వాన జరిగిన పోరాటాలలో దేశ ప్రజలు జాతి, మత, కుల, వర్ణ, లింగ, ప్రాంత బేధాలు లేకుండా ఏకత్రాటిపైన నడిచారు. మహిళలు సాంఘిక కట్టుబాట్లను తెగత్రెంచుకుని ఉద్యమాలలో కురికారు. ఒంటిమీదున్న బంగారాన్ని నిలువుదోపిడి గా గాంధీజీకి సమర్పించారు. కాపురాలను కాలదన్నుకున్నారు. కొంత మంది దేశభక్తుల జీవితాలు అండమాను జైళ్ళలోనే అంతమయ్యాయి. చివరకు బ్రిటిష్ వారి వలస పాలన నుంచి ఆగస్టు 15, 1947లో మన దేశం స్వతంత్రమైంది. స్వతంత్ర మయ్యే నాటికి దేశంలో పెద్దా, చిన్నా, చితకా అన్నీ కలిపి 625 సంస్థానాలు ఉన్నాయని లెక్క తేలింది. వాటన్నింటినీ భారత యూనియన్‌లో విలీనం చేయటం జరిగింది.

సంస్థానాలలో అన్నింటికంటే హైద్రాబాద్ సంస్థానం పెద్దది. సంస్థానాధీశుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ ముల్కుల్క్. తాను యూనియన్‌లో విలీనం చేయనని, స్వతంత్రంగానే ఉంటానని భీష్మించుకుని కూర్చున్నాడు. ఆనాటి సంస్థాన ప్రజల జీవన పరిస్థితులను తెలుసుకోవలసిన అవసరముంది. సంస్థానం లోపల జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, బడా బడా భూస్వాములు ఉండేవారు. వారు నివసించే గడీలు కొన్ని ఎకరాల స్థలంలో కట్టబడ్డాయి. వారి ఆధీనంలో కొన్ని గ్రామాలు, వేల ఎకరాల భూములుండేవి. వారు ప్రజల రక్తమాంసాలను పీల్చి పిప్పి చేసి ధనార్జన చేసి నవాబుకు నజరానాలు సమర్పించేవారు. ప్రజలు వీరి దౌర్జన్యాలకు, దోపిడీకి, హింసకు, అత్యాచారాలకు గురయ్యేవారు. అణగారిన, అణగద్రొక్కబడిన వారి నోటి నుంచి 'నీ బాంచను (బానిస) దొరా, నీకాల్మొక్కుత దొరా' అనే మాటలు తప్ప వేరే మాటలు వారి నోటినుండి వెలువడేది కాదు. ఆడా, మగ తేడా లేకుండా పటేల్-పట్వారీల దగ్గర నుండి జాగీర్దార్లకు, దేశ్‌ముఖ్ లకు, ప్రభుత్వ ఉద్యోగులకు వెట్టిచాకిరీ చేయవలసిందే. కంటికి కనబడిన కన్నెపిల్ల దొరల గడీలకు రవాణా చేయబడేది. లేకపోతే వారి గుండాల చేతుల్లో నరక యాతనలకు గురయ్యేవారు. గుండాలు బలవంతంగా లాక్కెళ్ళేవారు. ఎర్ర టోపీల వాళ్ళను (పోలీసులను) చూస్తే దళిత జనుల బట్టలు తడిసేవి. భయం నీడలో నిత్యం వారి బతుకులు తెల్లవారేవి. గ్రామాల్లో వారి ఇండ్లలో దారిద్రం తాండవించేది. కడుపు నిండా తినడానికి తిండి లేకపోగా తాగడానికి మూడు పూటలా గంజి నీళ్ళు కూడా ఉండేవి కావు. గ్రామాల్లో విద్య, వైద్యం రెండూ ఉండేవి కావు. ఉన్న ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు జంట నగరాల్లోనే ఉండేవి. జిల్లా కేంద్రంలో మగపిల్లలకు మాత్రమే ఒకే ఒక్క స్కూల్ ఉండేది. విద్యాబోధన ఉర్దూలో ఉండేది. ప్రజలేమో నూటికి 80 శాతం తెలుగులోనే మాట్లాడేవారు.

బ్రిటీష్ ఇండియాలో జరిగిన స్వాతంత్ర పోరాటాల ప్రభావం సంస్థానంలో చదువుకున్న యువకులమీద, విద్యార్థుల మీద పడింది. అంతకు ముందే సంస్థానంలో ఆంధ్రమహాసభ ఏర్పడి ఉంది. అతివాద భావాలు కల యువకులు ఆంధ్ర మహాసభను వేదికగా చేసుకుని దేశ్‌ముఖ్‌ల, జాగీర్దార్ల, నిజాంసర్కారు నిరంకుశ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పనిచేయడం ప్రారంభించారు. రావి నారాయణరెడ్డి, రాజబహదూర్, మఖ్దుం మొహియుద్దీన్, దేవులపల్లి వెంకటేశ్వరరావు, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల సోదరులు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, చిర్రావూరి లక్ష్మినరసయ్యాగారు, సర్వదేవభట్ల రామనాదం మొదలైన త్యాగధనులు, లబ్ధ ప్రతిష్టులైన నాయకులు ఉద్యమాలకు లభించారు. వారితోపాటు ఆరుద్ర కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి మహిళా నేతల అశేష త్యాగాలతో తెలంగాణా ప్రజా పోరాటం దినదిన ప్రవర్ధమానంగా ఎదిగింది. ప్రజాకవులైన కాళోజీ, దాశరధి కృష్ణమాచార్యులు తమ రచనల ద్వారా ఉద్యమానికి ఊపిరందించారు. కుటుంబాలకు కుటుంబాలు ఆంధ్ర మహాసభలో చేరి తర్వాత కమ్యూనిస్టు పార్టీ వైపు అడుగులు వేశారు. అటువంటి కుటుంబాలలో ఆరుట్ల వారు, దేవులపల్లి వారు, భీమిరెడ్డి నర్శింహారెడ్డి వారు, కొండవీటి ఇందిరమ్మ మొదలగు కుటుంబాలతో పాటు అనేక కుటుంబాలు చేరాయి.

ఈ పోరాటాలకు గుండెకాయ వంటిదని, తలమానికంగా నిలిచిందని పేరు పొందినది నల్గొండ జిల్లా. ఆ జిల్లాలోని తుంగతుర్తి మండలంలోని కొత్తగూడెం గ్రామంలో 500–600 ఎకరాల భూస్వామి రామిరెడ్డి గారు. వారి భార్య చొక్కమ్మగారు. రాగి, వెండి కలవని బంగారాన్ని మేలిమి బంగారమని అంటారు. నిజంగా అటువంటి మేలిమి బంగారమే చొక్కమ్మ. భూస్వామి భార్యనన్న దర్పం ఏనాడూ ప్రదర్శించలేదు. పేదలంటే దయాదాక్షిణ్యాలు కలిగి ఉండేది. ఆ దంపతులకు 1930–31 సంవత్సరంలో ఒక ఆడపిల్ల పుట్టింది. ఆ పిల్లే భవిష్యత్తులో అరుణతారై, తెలంగాణా గెరిల్లా యోధురాలిగా పేరు ప్రఖ్యాతులు గాంచింది. చొక్కమ్మ ఆ బిడ్డకు స్వరాజ్యం అని పేరు పెట్టుకున్నారు. అందుకు ఒక కారణముంది. ఆమె బంధువు, మేనల్లుడు అయిన దాయం రాజిరెడ్డి బ్రిటీష్ ఇండియాలో జరిగే జాతీయ కాంగ్రెస్ మహాసభలకు వెళ్ళి వచ్చేవారు. గాంధీగారిని గురించి, కాంగ్రెస్‌ను గురించిన సంగతులు వారి ద్వారా చొక్కమ్మ వినేవారు. ఆమె మదిలో దేశభక్తి దాగి వుంది. అందుకే తన కూతురికి స్వరాజ్యం అని తన ఇష్టప్రకారమే నామకరణం చేసింది. రామిరెడ్డి గారికి వేరే పేరు పెట్టాలని ఉంది. స్వరాజ్యం గారికి ఎనిమిదవ యేట తండ్రి గతించారు. అంతకు పూర్వం ఒక పంతులు గారిని ఏర్పాటు చేసి పిల్లలందరికీ తెలుగు చదవడం, రాయడం నేర్పించారు. రామిరెడ్డిగారు ఆడపిల్లలకు కూడా గుర్రపు స్వారీ, ఈత మొదలగునవి నేర్పించారు. వారు గతించడంతో వాటితోపాటు చదువు కూడా అటకెక్కింది. సంతానంలో పెద్దవాడైన భీమిరెడ్డి నరసింహారెడ్డి హైద్రాబాద్లో చదువుతుండే వారు. అప్పుడే వారు ఆంధ్ర మహాసభవైపు ఆకర్షితులయి కార్యక్రమాలలో పాల్గొంటుండేవారు. తండ్రిగారి మరణానంతరం ఇంటికి వచ్చి వ్యవసాయం పనులు చూసుకోసాగారు. కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే ఆంధ్ర మహాసభ కార్యక్రమాలను స్వంత ఊర్లోనే చేపట్టారు. వ్యవసాయ కూలీలను, రైతులను తమ ఇంటిలో సమావేశపరచి వారిలో చైతన్యం కలిగించడం మొదలుపెట్టారు. ఒకరోజు రాత్రి వ్యవసాయ కూలీలను సమావేశపరిచి కూలీ పెంచడానికి సమ్మె చేయాల్సిన అవసరం గురించి మాట్లాడు తున్నారు. వారి చిన్నాయనగారు పోలీసులకు ఉప్పందించారు. అరెస్టు చేయడానికి పోలీసులు ఆ రాత్రే వచ్చారు. ఆనాటి నిజాం సర్కారు చట్టం ప్రకారం జనానా (ఆడవారు) ఉన్న ఇండ్లలో రాత్రివేళ పోలీసులు ప్రవేశించి సోదాలు చేయకూడదు. ఆ చట్టాన్ని గురించి తెలిసిన చొక్కమ్మ కిటికీ తలుపు తెరిచి సోదా చేయడానికి తెల్లవారిన తర్వాత రమ్మనమని పోలీసులకు చెప్పారు. విధి లేక పోలీసులు వెనుదిరిగారు. ఈలోగా నర్సింహారెడ్డి ఇంటి వెనుక నుంచి తప్పించుకున్నారు. అన్నగారికి దారిలో తిండికి ఇబ్బందవు తుందని తలచిన స్వరాజ్యం దిండు కవరు నిండా జొన్నలు పోసి అన్న గారికి అందించారు.

చొక్కమ్మ పెద్ద కూతురు శశిరేఖ అరెస్టయి హైద్రాబాద్‌లోను, ఔరంగాబాద్, గుల్బర్గా జైళ్ళలో మూడు సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించారు. చుక్కమ్మ పెద్దల్లుడూ, శశిరేఖ భర్త అయిన రాజిరెడ్డి తప్పించుకున్నారు. చొక్కమ్మ గారి మిగతా బిడ్డలు కుశలవరెడ్డి, సరస్వతి ఇద్దరూ నిజాం వ్యతిరేక పోరాటాలలో పాల్గొని నిర్బంధాలను ఎదుర్కొన్నారు. భీమిరెడ్డి నర్సింహారెడ్డి తెలంగాణా సాయుధ పోరాటంలో పార్టీ ఆదేశాల మేరకు అయిష్టంగానే ఆయుధాన్ని కిందకు దించిన పోరాటవీరుడు, నేత. చొక్కమ్మ ఇల్లు ఆంధ్ర మహాసభకు కేంద్రమైంది. వారి ఆస్తులు ధ్వంసం చేయబడ్డాయి. చొక్కమ్మను కూడా స్టేషన్‌లో నిర్బంధించారు. కానీ ఆమె విచారించలేదు. తన బిడ్డలు దొంగలు కాదు, దోపిడీలు చేయడం లేదు, పేదల కోసం

పాటుపడుతున్నారని ఆమె ఏనాడూ అడ్డు చెప్పలేదు. బిడ్డలందరినీ పోరాటాలకు ఉసిగొల్పిన దేశభక్తిగల తల్లి. వీరమాత చొక్కమ్మగారు పేరుకు తగిన సార్థకత చేకూరింది.

ఎర్రజెండా రెపరెపల మధ్య మెరిసిన విద్యుల్లత స్వరాజ్యం. అన్నగారి వెంట, అక్కగారి వెంట నడచి పన్నెండవ యేట ఆంధ్ర మహాసభలో అడుగుపెట్టింది. ఆనాటి నుండి ఈనాటి వరకూ ఎప్పుడూ వెనుదిరిగి చూడకుండా ఉద్యమాలలో పయనించారు. ఒకసారి హైద్రాబాద్‌లో జరిగిన ఆంధ్ర మహాసభకు అన్నగారితో కలిసి వెళ్ళారు. ఆంధ్ర మహాసభతోపాటు ఆంధ్ర మహిళా సభ కూడా జరిగేది. ఆ మహిళా సభలో తానంతట తానే ప్రేరేపితురాలై మాట్లాడింది. ఆటల్లో పాల్గొని బహుమతులను పొందేది. ఆనాడు తప్పించుకుని దొడ్డిదారిన వెళుతూ వెళుతూ నర్సింహారెడ్డి కూలీల సమ్మెను జరిపే బాధ్యతను స్వరాజ్యానికి అప్పజెప్పారు. తెల్లవారి కూలీలు పనికి వెళ్ళేవేళ కూడలి దగ్గర దారిలో అడ్డంగా పడుకుంది స్వరాజ్యం. కూలీకెళ్ళే స్త్రీలకు దొరబిడ్డను దాటి వెళ్ళడం సాధ్యం కాలేదు. వారికి స్వరాజ్యం "అందరూ గుంపుగా వెళ్ళకుండా సందుగొందుల నుంచి ఒక్కొక్కరే ఇండ్లకు తిరిగి వెళ్ళ"మని సలహా ఇచ్చారు. వారంతా ఆ విధంగానే చేశారు. మర్నాడు భూస్వాములు కులపెద్దలను పిలిపించి పనికి రానందుకు పంచాయతీ పెట్టారు. ఈ సంగతి తెలుసుకున్న స్వరాజ్యం అక్కడ ప్రత్యక్షమయింది. భూస్వాములు నిశ్చేష్టులయ్యారు. స్వకులస్థుల పిల్ల, భూస్వాముల బిడ్డ కనుక ఏమీ అనలేదు. కూలీలను మందలించి పంపేశారు. మరునాడు స్వరాజ్యం కూలీల వద్దకు వెళ్ళి పనికి వెళ్ళవద్దని ప్రచారం చేశారు. ఎవరూ కూలీకి వెళ్ళలేదు. భూస్వాములు దిగి వచ్చి కూలీ పెంచారు. అలా మొదటి పోరాటంలో విజయుల య్యారు. తెలంగాణా కమ్యూనిస్టు మహిళలకు ఆద్యురాలు ఆరుట్ల కమలాదేవి. ఆమె కమ్యూనిస్టు రాజకీయ క్లాసులు చెప్పేవారు. స్వరాజ్యం ఆ క్లాసులకు వెళ్ళింది. పార్టీ విజయవాడలో మహిళలకు రాజకీయ పాఠశాల నడిపింది. కోస్తా జిల్లాల్లోని, తెలంగాణాలోని కమ్యూనిస్టు మహిళలు ఆ పాఠశాలకు హాజరయ్యారు. ఆ క్యాంపు నెలరోజులకొకటి నిర్వహింపబడేది. తెలంగాణా నుంచి రావి సీతాదేవి, స్వరాజ్యం, దేవులపల్లి శ్రీరంగమ్మ, శశిరేఖ, లలిత, ప్రియంవద, భీమిరెడ్డి సరోజిని ఇంకా తదితరులు ఆ క్యాంపులలో శిక్షణ కొరకు వెళ్ళేవారు.



1942లో ఖమ్మంలోని భువనగిరిలో జరిగిన పన్నెండవ ఆంధ్ర మహాసభకు బద్దం ఎల్లారెడ్డి అధ్యక్షునిగాను, రావి నారాయణరెడ్డి కార్యదర్శిగానూ ఎన్నికయ్యారు. అదే సందర్భంలో పోటీ ఆంధ్ర మహాసభ ఏర్పడింది. అప్పటివరకూ స్టేట్ కాంగ్రెస్ వారు, కమ్యూనిస్టులు ఆంధ్ర మహాసభను వేదికగా చేసుకుని పనిచేశారు. అతివాదులుగా, మితవాదులుగా ఏర్పడ్డారు. మితవాద పార్టీకి మందుముల నర్సింగరావు, పులిజాల రంగారావు మొదలగువారు శ్రీకారం చుట్టారు. పోటీ సంఘం ప్రజల్లోకి చొచ్చుకుపోలేక పోయింది. అతివాద యువకులు పోటీ సంఘం మీద పాట పాడేవారు.

“ఎందుకయా పోటీ సంఘం మందుములయ్యా, ఉన్న సంఘమే చాలు పులిజాల రంగయ్యా”

అతివాద సంఘం నాయకులు, కార్యకర్తలు గ్రామాలలోకెళ్ళి దొరల దోపిడీకి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రచారం చేపట్టారు. భూస్వాముల, దేశ్‌ముఖ్‌ల, జాగీర్దార్ల, పటేల్, పట్వారీల పెత్తందారీతనానికి, అరాచకాలకు, అత్యాచారాలకు, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి సభలు, సమావేశాలు జరిపి వారిలో చైతన్యం కలుగచేశారు. పార్టీ అండదండలతో ప్రజలు సంఘటితమయ్యారు. పోరాటానికి నాంది పలికారు. పాత సూర్యాపేట, బాలెంల, పాలకుర్తి, మెంద్రాయి, కడివెండి, పులిగళ్ళ గ్రామాల ప్రజలు తిరగబడ్డారు. సర్కారు పులిగళ్ళలో పోలీసు శిబిరాన్ని పెట్టి వందలాదిమంది రైతులను జైళ్ళలో పెట్టింది. బాలెంల, పాత సూర్యాపేట రైతులు వడిశెలతో, రాళ్ళతో నిజాం పోలీసులను ఎదుర్కొన్నారు. వడిసెల పోరాటంలో స్వరాజ్యం పాల్గొంది. దేవులపల్లి వెంకటేశ్వరరావు, ఆరుట్ల రామచంద్రారెడ్డి ప్రజల వద్ద వుండి వారికి ధైర్యం నూరిపోశారు. 1946లోనే తాళ్ళవెల్లెం గ్రామాన్ని అర్థరాత్రి 400 మంది రిజర్వ్ పోలీసులు చుట్టుముట్టారు. అక్కడి నాయకులు కొండవీటి బుచ్చిరెడ్డి, యలమంద, మురహరిరావు కోసం ఇల్లిల్లూ గాలించారు. ప్రజల రాకపోకలను అడ్డుకున్నారు. పోలీసుల రాకను పసిగట్టిన

నాయకులు అంతకుముందే తప్పించుకున్నారు. ప్రథమంగా ఈ ప్రజా పోరాటాలు నల్లగొండ జిల్లాలో ప్రారంభమయ్యాయి. అందుకే నల్లగొండ జిల్లా తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి, మిగతా పోరాటాలకు గుండెకాయ వంటిది. తలమానికంగా కూడా నిలిచింది. దీని అర్థం మిగతా జిల్లాలకు ప్రాధాన్యత లేదనికాదు. ఖమ్మం, వరంగల్ మొదలైన జిల్లాలకు ఉద్యమం వ్యాపించింది. విసునూరు దొర రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా పోరాడిన ధీరురాలు చాకలి ఐలమ్మ. ఆ పోరాటం చరిత్రాత్మకమైనది. విసునూరు దొరలాంటి కిరాతకుడు, క్రూరుడు, నరరూప రాక్షసుడు భూమ్మీద మరొకరు లేరంటే అతిశయోక్తి కాదు. అతనికి వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగసిపడిన పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించింది. నాయకత్వం వహించిన భీమిరెడ్డి నర్సింహారెడ్డి తదితరులను విసునూరు పోలీస్‌స్టేషన్లో ఉంచారు. తాగడానికి నీళ్ళడిగితే మూత్రం ఇచ్చారు. తినడానికి మిరపకాయలిచ్చేవారు. అతని గూండాలు పచ్చి బాలింతలను సైతం పొలంలో పనిచేయడానికి బలవంతంగా గుంజుకెళ్ళేవారు. పసికూనలకు పాలివ్వడానికి కూడా వెళ్ళనిచ్చే వారు కాదు. పాలు సేపులకొచ్చి పాలిచ్చి వస్తామన్నా పంపకుండా మోదుగు ఆకుల దొప్పల్లో పాలు పిండించి పొలాల గట్లమీద పారపోయించేవారు. గుడిసెలో గుడ్డ ఉయ్యాలలోని పసికూనలు ఆకలితో గుక్కపట్టి ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లేవారు. ఒకరిద్దరు పిల్లలు గొంతెండిపోయి చనిపోయారు కూడా.

ఆ సమయంలో దేవరప్పుల గ్రామంలో స్వరాజ్యం తన మేనత్త ఇంట్లో ఉంది. ఆ ఊరు విసునూరుకు దగ్గర. చుట్టాల ఇంటిలో ఉన్న స్వరాజ్యం ఊళ్ళోని ప్రజల వద్దకు వెళ్ళి పోరాటాన్ని గురించి చెబుతుండేది. అది ఆమె మేనత్త భర్తకు ఇష్టముండేది కాదు. ఆయన కాంగ్రెస్ వాది. అయినా స్వరాజ్యం వెనకడుగు వెయ్యలేదు. విసునూరు ఘటన విని స్వరాజ్యం హుటాహుటిన అక్కడికి చేరుకుంది. ప్రజలపై దొర దురాగతాలను విని, చూసి చలించిపోయింది. సందర్భం, సమయానుకూలంగా నిర్ణయం తీసుకోవడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. అప్పటికప్పుడు బతుకమ్మ పాట బాణీలో ఉయ్యాల పాట గేయ రచన చేసి పాడారు. తెలంగాణాలో అంతకు ముందు బతుకమ్మ పాట ఉన్నత కులాల మహిళలే పాడి పండుగ చేసుకునేవారు. ఉద్యమాలకు పాటలు ప్రాణవాయువులాంటివి. పాటల ద్వారా సమస్యలను ప్రజలు అవగాహన చేసుకుంటారు. స్వరాజ్యం ఉద్యమ ఆశయాలను ప్రజలకు తెలియజేయడానికి గేయ రచనను వాహకంగా వాడుకున్నారు. విసునూరు దొర దురాగతాల మీద రాసిన ఉయ్యాల పాట (గేయ రచన) వ్యవసాయ కూలీలు, హరిజన, గిరిజన మహిళల నృత్యంగా రూపుదిద్దుకుంది. ఇప్పటికీ స్వరాజ్యం ప్రతి మీటింగ్‌లోను ఈ పాట పాడుతుంది.

ఆ పాట చుట్టుప్రక్కల 30–40 గ్రామాలలో ప్రచారమయింది. స్వరాజ్యానికి బతుకమ్మ పండగంటే బహు సంబరం. ఆ గ్రామాలలో ప్రచారానికి వెళ్ళినపుడు అన్ని కులాల మహిళలతో కలిసి విసునూరు దొరమీద రాసిన గేయాన్ని బతుకమ్మ ఆటలాగానే ఆడుతూ పాడుతూ ఉండేవారు. విసునూరు దొర తల్లి కరివెండి గ్రామంలోని గడీలో ఉండేది. ఆమె దురాగతాలలో కొడుకు రామచంద్రారెడ్డికన్నా ఏడాకులు ఎక్కువే చదివింది. మహా కర్కోటకురాలు. విసునూరులో పార్టీ చుట్టుపక్కల గ్రామాల ప్రజల తోడ్పాటుతో వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, తర్వాత కరివెండిలో పెద్ద ప్రజా సమూహంలో ఊరేగింపు జరిగింది. ఆమె దుష్టత్వాన్ని నిరసిస్తూ ప్రజలు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేస్తూ ఊరేగింపుతో ముందుకు సాగారు. గడీ ముందుకు రాగానే లోపలి నుండి గూండాలు కాల్పులు జరిపారు. దొడ్డి కొమరయ్య ఆ తుపాకీ గుళ్ళకు గురయి అమరుడయ్యాడు. ఓ భూకామందు బందగీ అనే ముస్లిం వ్యక్తి భూమిని స్వాధీనం చేసుకున్నాడు. బందగీ కోర్టులో కేసు వేశాడు. 12 సంవత్సరాల తర్వాత బందగీకి అనుకూలంగా తీర్పు వెలువడింది. అది సహించలేని ఆ భూస్వామి ఒంటరిగా వస్తున్న బందగీని గూండాలచేత దారిలోనే హత్య చేయించాడు. బందగీ ఆ విధంగా బలయ్యాడు. కొమరయ్య ఈ విధంగా నేలకొరిగాడు. కరివెండి పోరాటంలో స్వరాజ్యం పాల్గొన్నారు. ఉద్యమం ఖమ్మం, వరంగల్ మొదలగు జిల్లాలకు వ్యాపించింది. పేద ప్రజలు ప్రతిచోటా పార్టీకి ఘనస్వాగతం పలికారు. దినదిన ప్రవర్థమానమవుతున్న ఉద్యమ కార్యక్రమాలను అమలు చేయడానికి డబ్బు అవసరం కూడా ఏర్పడింది. రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దుం, దేవులపల్లి, రాజ బహదూర్ గౌర్ వంటి నేతలతోపాటు విరాళాల కోసం స్వరాజ్యాన్ని కోస్తా జిల్లాలకు పంపాలని నిర్ణయం తీసుకున్నారు.

స్వరాజ్యం కోస్తా జిల్లాల్లో, విజయనగరం నుండి మద్రాసు వరకు సుడిగాలి పర్యటన చేసింది. అప్పటికి ఆమె వయసు 15–16 సంవత్సరాలు. గంగా ప్రవాహంలాగా ఉద్వేగపూరితమైన స్వరాజ్యం ఉపన్యాసాలు వినడానికి జనం తండోప తండాలుగా తరలి వచ్చేవారు. నిజాం నిరంకుశ పాలన, ప్రజల కడగండ్లను

గురించి కళ్ళకు కట్టినట్లు వివరిస్తుంటే ప్రజలు చలించిపోయేవారు. 15-16 సంవత్సరాల బాలిక ఉపన్యాసాలు విని విస్తుపోయేవారు. అప్పటికే ఆమె మంచి వక్తగా ఎదిగారు. ఉపన్యాసాల తర్వాత విరాళాల కోసం విజ్ఞప్తి చేసేవారు. ప్రజల నుంచి అంచనాలకు మించి విరాళాలు పోగయ్యేవి. ప్రజలిచ్చిన భూరి విరాళాలతో స్వరాజ్యం చీర చెంగు, ఒడి నిండిపోయేవి. ప్రజలు చూపిన ఆదరాభిమానాలకు స్వరాజ్యం ఆనందభరితులయ్యేవారు. ఆ సమయంలో స్వరాజ్యం ఉబ్బసంతో బాధపడుతుండేవారు. తలకు మఫ్లర్ చుట్టుకుని ఆయాసంతో రొప్పుతూ విజయవాడలోని ప్రజాశక్తి నగర్‌లోని పాకలలో చాపమీద పడుకున్న ఆమె రూపం ఇప్పటికీ నా కళ్ళల్లో కదలాడుతూ ఉంటుంది. నేడు ఉబ్బసానికి ఉన్న వైద్య సౌకర్యం ఆ రోజుల్లో లేదు. అలా బాధపడుతూనే సభలలో, సమావేశాలలో పాల్గొని ఉపన్యసించేది.

ఆంధ్రాలో కమ్యూనిస్టు పార్టీ మహిళా సంఘాన్ని స్థాపించి నట్లుగా తెలంగాణా కమ్యూనిస్టు పార్టీ ప్రత్యేకించి మహిళా సంఘాన్ని స్థాపించలేదు. కోస్తాంధ్ర బ్రిటీష్ ఇండియాలో ఉంది. అక్కడ ప్రజలకు విద్య, వైద్యం మొదలగు సౌకర్యాలుండేవి. తెలంగాణా ప్రజలు నిజాం నిరంకుశ పాలనలో అజ్ఞానాంధకారం లో చిక్కుకుపోయారు. ఇక్కడి గ్రామీణ స్త్రీ పురుషులందరి ముందు ఉన్న ప్రథమ సమస్య ఒక్కటే. కూడుకోసం, గూడు కోసం, గుడ్డ కోసం, భుక్తి కోసం, భూమి కోసం, దొరల, దేశ్‌ముఖ్‌ల, జాగీర్దార్ల దోపిడీ నుండి, దౌర్జన్యాల నుండి, వెట్టి చాకిరీల విముక్తి కోసం పోరాడటమే. అందుకే కమ్యూనిస్టు మహిళలు పురుషులకు ధీటుగా ఉద్యమాలలో పాల్గొని పోరాడేవారు.

నిజాం రాజ్యంలో ఎవరి భూముల్లోనైతే తాడిచెట్లు, ఈతచెట్లు ఉండేవో వాటిమీద ఆ భూమి గలవానికి ఆ చెట్లమీద హక్కు ఉండేదికాదు. అవి నిజాం సర్కారు సొత్తే. "గీసే వాడివే చెట్లు. దున్నే వాడిదే భూమి" అనే నినాదాలతో పార్టీ పోరాటానికి పిలుపునిచ్చింది. గ్రామ రాజ్యాల నిర్వహణ కూడా చేపట్టింది. సూర్యాపేట తాలూకాలో దీని నిర్వహణ బాధ్యతను పార్టీ స్వరాజ్యానికి అప్పజెప్పింది. సూర్యాపేటను కేంద్రంగా చేసుకుని తోటి కార్యకర్తలను కలుపుకుని గ్రామ రాజ్యాలు, గ్రామ రక్షణ మహిళా దళాలు ఏర్పరచడం, గ్రామ పంచాయతీల కమిటీలను ఏర్పాటు చేయటం, ఆ కమిటీలలో ఇద్దరు మహిళలకు స్థానం కల్పించటం, తాళ్ళ పంపకం, భూ పంపకం, వాటి నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసి పంపకాలలో ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడడం, బాల సంఘాల ఏర్పాట్లు మొదలైన పనులను స్వరాజ్యం కడు సమర్థతతో, బాధ్యతాయుతంగా, సక్రమంగా నిర్వహించేది. సూర్యాపేట తాలూకాలో ఎర్రపాడు అనే గ్రామం ఉంది. ఆ ఊరి దొరగారికి వేలల్లో కాక లక్షల ఎకరాల భూములున్నాయి. వేల ఎకరాలలో మామిడి తోటలుండేవి. ఆ తోటల్లో దేశంలోని అన్ని ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన మామిడి పళ్ళు ఉండేవి. ఆ రోజుల్లో ఆ తోట మన దేశంలోనే ప్రసిద్ధి చెందినదిగా చెప్పుకునేవారు. అటువంటి దొరల భూములు, పేద ప్రజల నుంచి ఆక్రమించుకున్న భూ కబ్జాదారుల నుంచి దాదాపు పది లక్షల ఎకరాల భూమిని పార్టీ తరపున పేద ప్రజలకు పంచారు. సమాజంలో మహిళా సమస్యలపైనా స్వరాజ్యం గణనీయమైన కృషి చేశారు. అగ్ర కులాల, భూస్వామ్య కుటుంబాలలో కూడా తండ్రి ఆస్తిలోను, భర్త ఆస్తిలోను హక్కు ఉండేది కాదు. భర్త చనిపోయిన ఆడపిల్లలున్న మహిళలకు కూడా భర్త ఆస్తిలో భాగముండేది కాదు. అదే మగపిల్లలైతే మేజర్లయిన తర్వాత హక్కుదారులయ్యే వారు. భర్త వదిలిపెట్టిన మహిళల జీవితం కడు దుర్భరంగా ఉండేది. పుట్టినింటిలో తండ్రి ఆస్తిలో హక్కులేక, అత్తవారింటిలో ఉండే వీలులేక వారి జీవితాలు రెంటికి చెడిన రేవడిలాగా ఉండేవి. కొంతమంది భార్య బ్రతికుండగానే ఇద్దరిని, ముగ్గురిని పెండ్లి చేసుకునేవారు. అలా చేసుకోవడం మొదటి భార్యకు, రెండవ భార్యకు ఇష్టమున్నా లేకున్నా పడి ఉండాల్సిందే. అగ్ర కులాలలో కూడా మహిళలు భర్తల చేతుల్లో దెబ్బలు తినేవారు. అటువంటి బాధిత స్త్రీలు కొంతమంది స్వరాజ్యం దగ్గరికొచ్చి ఫిర్యాదు చేసినవారున్నారు. స్వరాజ్యం వారి భర్తలతోను, కుటుంబ సభ్యులతోను మాట్లాడి, పోట్లాడి, నచ్చచెప్పి కొంత భూమిని అటువంటి బాధిత మహిళలకు ఇప్పించేవారు. కొంతమంది మహిళలు విడిపోయి పార్టీలోకొచ్చి పనిచేసేవారు. ఆ రోజుల్లో అగ్రకులాల్లో విడాకులు లేవు. అయినా విడిపోదలచిన మహిళలకు అటువంటి తీర్పు చెప్పడానికి సాహసం చేయవలసి వచ్చేది. అటువంటి సందర్భాలలో స్వరాజ్యం తాళిబొట్లను తెంపేదన్న అపవాదును కూడా భరించవలసి వచ్చేది. శ్రామిక మహిళలకు, నిమ్న కులాల మహిళలకు ఈ బాధలేదు. వారికి ఉన్నదీ లేదు, పోయేదీ లేదు. భర్త చనిపోయినా, వదిలిపెట్టినా పెండ్లిని పెద్దలే చేసేవారు. ఆ పద్ధతిని మారు మనువనేవారు.

వెట్టిచాకిరీని నిర్మూలించిన ఘనత పార్టీకే చెందుతుంది. పార్టీ ఆధ్వర్యంలో ప్రజారాజ్య పాలన 200-300 గ్రామాలలో నిరాఘంటంగా సాగింది. దొరలు గడీలు వదిలిపెట్టి పట్నం దారి

పట్టారు. ఇదంతా గమనించిన నిజాం నవాబు తన నిరంకుశ పాలన సౌధం బీటలు వారుతోందని గ్రహించాడు. రజాకార్లకు ఆయుధాలనిచ్చి ఉసిగొల్పి ఊరుమీదికొదిలాడు రజాకార్ల నాయకుడు ఖాసింరజ్వీ. 'ఇత్తేహద్ద ముసల్మాన్'ను స్థాపించాడు. ముస్లింలలో మతద్వేషం పురిగొల్పడం ఆ సంస్థ చేసే పని. రజాకార్లు ఆయుధాలతో లారీలలో గ్రామాల మీద విరుచుకుపడి నానా భీభత్సం సృష్టించారు. కంటికి కనిపించిన ధనధాన్యాలను దోచుకుని లారీలలో తీసుకెళ్ళే వారు. ఇత్తడి, పుత్తడి, మహిళల మెడలోని పుస్తెలు, చెవుల గంటీలు, కాళ్ళ కడియాలు సమస్తమూ దోచుకుపోయారు. మహిళలపై సామూహిక అత్యాచారాలు చేశారు. బాలెంల, పాత సూర్యాపేట మొదలగు గ్రామాలలో ప్రజలను వరుసగా నిలబెట్టి పిట్టల్ని కాల్చినట్లు కాల్చివేశారు. గ్రామాలను తగులబెట్టారు. పార్టీ కార్యకర్తలు ప్రజలను సంఘటిత పరిచి దళాలు ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లలో స్వరాజ్యం పాల్గొన్నారు. ప్రజలు తమ ఇళ్ళలో ఉన్న కర్రలతోను, కట్టెలతోను, కొడవళ్ళతోను, గొడ్డళ్ళతోను, రాళ్ళు, రప్పలతోను రజాకారు ముష్కరులను ఎదిరించి తరిమి తరిమి కొట్టారు. మహిళలంతా ఒకచోట చేరి వారి కళ్ళల్లో కారం చల్లి తప్పించుకున్నారు.

నిజాం సర్కారు రైతులు పండించిన పంటనుండి నిర్భంద లెవీని వసూలు చేసేది. ఆకునూరు, మాచిరెడ్డిపల్లి గ్రామాలలో రజాకార్లు సకలం దోచుకున్నారు. ధాన్యాన్ని బండ్లకెత్తారు. మహిళలంతా ఏకమై బండ్లకెత్తిన ధాన్యాన్ని బండ్ల కాడలను ఎత్తి నేలమీద కుమ్మరించారు. ఆ గ్రామ వాసులు తీవ్రంగా ప్రతిఘటించారు. మహిళలు రజాకారు మూకల కళ్ళల్లో కారం చల్లి మూడు తుపాకులను స్వాధీనం చేసుకుని ధాన్యాన్ని కాపాడుకున్నారు. అలా మూడు రోజులపాటు ఆ గ్రామాల ప్రజలు పోరాడారు. రజాకార్లు మహిళలపై అత్యాచారాలు చేశారు. గ్రామాలను తగులబెట్టారు. చరిత్రలో చెంగిజ్ఖాన్, నాజీలను మించిపోయారు ముష్కరులు. ఆనాటి సంస్థాన పత్రికల సంపాదకులు కష్టనష్టాలను భరించి పత్రికలను నడిపి రజాకార్ల దురాగతాలను నిర్భయంగా ప్రచురించారు. ఆనాటి విలేఖరులు ప్రాణాలకు తెగించి గ్రామాలలో పర్యటించి వాస్తవ విషయాలను సేకరించారు. వారి దురాగతాలను ఖండిస్తూ వార్తలు ప్రచురించినందుకు రజాకార్లు షోయబ్ ఖాన్ అనే పత్రికా సంపాదకుడి తలను, చేతులను నరికి పళ్ళెంలో పెట్టి ఖాసిం రజ్వీకి కానుకగా సమర్పించారు.

దేశం నలుమూలల నుండి వెలువడే వార్తా పత్రికలన్నీ సంస్థానంలో జరిగే భీభత్సాలను ప్రచురించేవి. బయటినుండి వచ్చే పత్రికలను నవాబు నిషేధించాడు. అప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ పాలన ఉంది. ప్రభుత్వం నిజనిర్ధారణ కొరకు పద్మజానాయుడిని సంస్థానానికి పంపింది. ఆ సమయంలో స్వరాజ్యం ఆ గ్రామాల లోనే ఉంది. పద్మాజా నాయుడు మాచిరెడ్డిపల్లి, ఆకునూరు గ్రామాలను సందర్శించి ప్రజలతో మాట్లాడి వాస్తవ విషయాలు తెలుసుకున్నారు. ఒక నివేదిక తయారుచేసి కేంద్రానికి అంద చేశారు. ప్రజలతో మాట్లాడే సందర్భంలో స్వరాజ్యం గురించి విన్నారు పద్మజా నాయుడు. ఆమె రాసిన "హు ఈజ్ హు" అనే ఇంగ్లీష్ గ్రంథంలో స్వరాజ్యం పేరును ఉల్లేఖించారు.

పద్మజానాయుడి నివేదిక తర్వాత కేంద్ర ప్రభుత్వం హైద్రాబాద్ సంస్థానం మీద సైనిక చర్య తీసుకుంది. ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న నిజాం నవాబు లొంగిపోయాడు. సంస్థానం యూనియన్లో విలీనం చేయబడింది. స్టేట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. దాంతో జాగీర్దార్లు, దేశ్ముఖ్లు, దొరలు ఖాదీ ధరించి గాంధీ టోపీలు పెట్టుకుని కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని కొత్త అవతారాలెత్తారు. గ్రామాలకు చేరుకుని దొరతనం మొదలు పెట్టారు. పార్టీ పేదలకు పంచిపెట్టిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం మొదలుపెట్టారు. మొదటిసారి నిజాంకు వ్యతిరేకంగా, రెండవసారి కాంగ్రెస్ పాలనతోనూ పార్టీ పోరాడ వలసి వచ్చింది. ఈసారి అడవుల దారి పట్టారు. పార్టీ తెలంగాణా సాయుధ పోరాటానికి పిలుపు నిచ్చింది. ఆయుధాలు చేబూనారు. అడవుల్లో ఏరియా కమిటీలు ఏర్పడ్డాయి. ఉత్తర ఏరియా కమిటీలో స్వరాజ్యం, ఓంకార్, మల్లు నరసింహారెడ్డి, ముకుందరావు సభ్యులుగా ఉన్నారు. తర్వాత కమిటీ సెక్రటరీగా, రాజకీయ దళ కమాండరుగా స్వరాజ్యం నియమితులయ్యారు. రాజకీయ దళ కమాండర్ పదవి గెరిల్లా పోరాటాలలో అత్యంత బాధ్యతా యుతమైనది. తుపాకీ గురిపెట్టి పేల్చడంలో నిష్ణాతులైన వారిని, ఈతలోను, పరుగులోను ఆరితేరిన వారినే పార్టీ ఆ పదవిలో నియమించేది. చిన్నతనంలో నేర్చుకున్న ఈత, గుర్రపు స్వారీ, కబడ్డీ ఆటలు ఆమెకు ఆ పదవి చేపట్టడంలో ఎంతగానో ఉపయోగపడ్డాయి. గిరిజన మహిళలను సమీకరించి గిరిజన దళాలను ఏర్పాటు చేసి వారికి తుపాకీ గురిపెట్టడం, గెరిల్లా పద్ధతుల్లో మిలటరీ క్యాంపులపై దాడిచేయడం, శత్రువు నుంచి

తప్పించుకుని ఆత్మరక్షణ చేసుకోవడంలోను శిక్షణనిచ్చేవారు. స్వరాజ్యం ఆ పనిలో ఆరితేరి గెరిల్లా పోరాట యోధురాలిగా పేరు పొందారు. అడవుల్లో డా॥రాందాసు వద్ద ప్రాథమిక చికిత్స నేర్చుకుని తండాలోని మహిళలకు కాన్పులు కూడా చేసింది స్వరాజ్యం. నిజాం సర్కారు ఆమె మీద పదివేల రూపాయల రివార్డ్ ప్రకటించింది కూడా. కానీ ఆమె పోలీసులకు చిక్కలేదు.

అనేక కారణాల వలన స్వరాజ్యం 1951లో పార్టీ సాయుధ పోరాటం విరమించుకుంది. దేశం స్వతంత్రమైన తర్వాత 1952లో సార్వత్రిక ఎన్నికలొచ్చాయి. జైళ్ళలో ఉన్నవారు విడుదల చేయబడ్డారు. కేసులున్నవారు, అజ్ఞాతంలో ఉన్నవారు అడవుల్లోనే ఉండిపోయారు. రహస్యంగా ఉండి హిట్‌లిస్ట్‌లో ఉన్నవారు దొరికినప్పుడు కాల్చివేయడం జరిగేది. ఎన్నికల సమయంలో ఆయుధాలు అప్పచెప్పి చర్చలకు రమ్మని విమానాల నుండి కరపత్రాలను వెదచల్లారు. పి.డి.ఎఫ్. పేరుతో ప్రజల అభిమానాన్ని చూరగొన్నవారిని ఆ ఎన్నికల్లో పోటీ చేయించాలని పార్టీ నిర్ణయించింది.

అప్పటికీ అజ్ఞాతంలోనే ఉండి స్వరాజ్యం, ఓంకార్, వినయ్ లాంటి వారు వందలాదిమంది కార్యకర్తలను వెంట బెట్టుకుని పి.డి.ఎఫ్. అభ్యర్థులను గెలిపించవలసిందిగా ప్రజలలో ప్రచారం చేశారు. వారికి ప్రజల అండదండలు అపారంగా లభించాయి. పి.డి.ఎఫ్. అభ్యర్థులందరూ విజయభేరి మోగించారు. ప్రజలు వారికి బ్రహ్మరథం పట్టారు. ఆ ఎన్నికల్లో రావి నారాయణ రెడ్డికి నెహ్రూకంటే అత్యధిక ఓట్లు వచ్చాయి. డాక్టర్ జయసూర్య (సరోజినీనాయుడు పెద్ద కుమారుడు) పి.డి.ఎఫ్. తరపున విశేషమైన కృషిచేశారు. పెద్దవెల్లి పట్టణంలో జరిగిన బ్రహ్మాండమైన సభలో డాక్టర్ జయసూర్య పి.డి.ఎఫ్.ను గెలిపించవలసిందిగా ఉత్తేజపూరిత ఉపన్యాసం చేశారు. ఆ సభకు స్వరాజ్యం రాజక్క అనే మారుపేరుతో (అజ్ఞాతంలో ఆమె పేరు) మారువేషంతో భుజాన స్టెన్‌గన్ తగిలించుకుని అది కనిపించకుండా నిండా గొంగళి కప్పుకుని ప్రజల్లో కూర్చున్నారు. ఆ సభకు ప్రజలను సమీకరించారు. స్వరాజ్యం వచ్చారన్న సంగతి జయసూర్యకు తెలిసింది. సభలో కామ్రేడ్స్ ఉన్నారని వారి త్యాగాలను ప్రశంసిస్తూ పోలీసులకు హెచ్చరిక చేశారు.

1954 నాటికి స్వరాజ్యం మీద నిజాం సర్కారు ప్రకటించిన పదివేల రూపాయల రివార్డును ప్రభుత్వం రద్దు చేసింది. అదే సంవత్సరం హైద్రాబాద్ పట్టణంలో విశాలాంధ్ర మహాసభ జరిగింది. వేలాదిమంది ప్రజలు సభకు వచ్చారు. ఏడు సంవత్సరాలు అజ్ఞాతంలో ఉండి బయట కొచ్చి ఉపన్యసించడానికి వేదికనెక్కిన స్వరాజ్యాన్ని చూడగానే ప్రజల కరతాళ ధ్వనులు, జయజయ నినాదాలు మిన్నుముట్టాయి. ఆమె ఉపన్యాసం విని ప్రజలు ఉద్రూతలూగిపోయారు.

ఉపన్యాసానంతరం అదేరోజు రాత్రి ఎమ్మెల్యే క్వార్టర్సులో బద్దం ఎల్లారెడ్డి, చంద్ర రాజేశ్వరరావుల సమక్షంలో మల్లు వెంకట నరసింహారెడ్డి (వీఎన్)తో స్వరాజ్యం వివాహం జరిగింది. అప్పుడు వీఎన్ అజ్ఞాతంలోనే ఉన్నారు. పూలదండల పెళ్ళే జరిగింది. వీఎన్ కూడా ఉద్యమాలలో, పార్టీలో ప్రధాన పాత్ర నిర్వహించారు. కేసుల వలన రహస్య జీవితంలోనే ఎక్కువ సమయం గడపవలసి వచ్చింది. పోరాట విరమణ తర్వాత కూడా కార్మికవర్గ దృక్పథంతోనే జీవితాన్ని గడిపారు. భూస్వామి బిడ్డయిన స్వరాజ్యం బీదరికాన్ని భరించలేక ఎప్పుడైనా నిరాశ, నిస్పృహలకు లోనైతే ఆమెకు ధైర్యం చెప్పి వెన్నుతట్టి ముందుకు నడిపించిన ఆదర్శనీయుడు వీఎన్.

వివాహానంతరం పిల్లలు పుట్టడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. తల్లిగారి నుండి వచ్చిన ఆస్తిలో రాయనగూడెంలో భూములు కొని వ్యవసాయం చేయడం మొదలుపెట్టారు. చెలకలు (మెట్ట భూములు) వర్షాధారంతో పంటలు పండే భూములు. సకాలంలో వర్షాలు లేక పంటలు పండక ఎన్నో కష్టాలు పడ్డారు. పస్తులున్నారు. కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తూనే వ్యవసాయం చూసుకుంటూనే వీలున్నపుడు సభలకు, సమావేశాలకు వెళ్ళి పాల్గొనేవారు. ఆమె మొదటి కాన్పుకు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా దారిలోనే పురిటి నొప్పులొచ్చి ఒక చెట్టు కిందనే మగబిడ్డకు జన్మనిచ్చారు. బుద్ధుడు లుంబినీ వనంలో జన్మించినట్లుగానే తన కొడుకు చెట్టుకింద పుట్టాడు కాబట్టి ఆ బిడ్డకు గౌతమ్ అని పేరు పెట్టుకున్నారు. స్వరాజ్యం రాయనగూడెంలో ఒక గుడిసెలో ఉండేవారు (అది నేటికీ ఉంది). ఆమె ముగ్గురు బిడ్డలను ఆ గుడిసెలోనే పెంచి పెద్దచేసి విద్యావంతులను చేశారు. గౌతమ్ డాక్టర్‌గానూ, నాగార్జున న్యాయవాదిగానూ పనిచేస్తున్నారు. కూతురు కరుణ బ్యాంక్ ఉద్యోగి. స్వరాజ్యం 1978–83 మధ్య రెండుసార్లు తుంగతుర్తి నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ❑

*స్త్రీవాద పత్రిక 'భూమిక' సౌజన్యంతో..*
*సంక్షిప్తంగా*

# ఎర్ర మందారం - ఆరుట్ల కమలాదేవి

యుద్ధం నిర్దాక్షిణ్యమైనది. అందులోనూ రాజ్యంతో యుద్ధమన్నప్పుడు కత్తుల కొనలపై నిలబడి జీవితాలను మరణం ముందు నిలబెట్టడమే. అలా తన జీవితాన్ని యుద్ధభూమిలోనే నిర్మించుకున్న వీరవనిత ఆరుట్ల కమలాదేవి. నమ్మిన సిద్ధాంతం కోసం, కమ్యూనిజమనే దీపాన్ని నెత్తిన పెట్టుకొని.. బతుకంతా అరుణకాంతిగా వెలిగిన ధీరవనిత ఆరుట్ల కమలాదేవి. నాటి నల్లగొండ జిల్లా నేటి యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మంతపురి గ్రామంలో 1920 లో జన్మించింది. తల్లిదండ్రులు పల్లా లక్ష్మీనర్సమ్మ, వెంకటరాంరెడ్డి. మధ్య తరగతి రైతు కుటుంబం. పుట్టిన ఊరులోనే పెద్ద బాలశిక్ష చదివింది. 11వ యేట తన మేనబావ, ప్రముఖ కమ్యూనిస్టు దిగ్గజం ఆరుట్ల రామచంద్రారెడ్డితో ఆమె వివాహం జరిగింది. కమలాదేవి అసలు పేరు రుక్మిణి. ఆనాటి ప్రముఖ జాతీయోద్యమ నాయకురాలైన కమలాదేవి చటోపాధ్యాయ అంటే ఆరుట్ల రామచంద్రారెడ్డికి ప్రత్యేక అభిమానం. అందుకే రుక్మిణి పేరును కమలాదేవిగా మార్చారు. పేరు మార్చడంలోనే కాదు, ఆమె జీవితాన్ని తీర్చిదిద్దడంలోనూ రామచంద్రారెడ్డి తన ఆదర్శాన్ని చాటాడు. పెండ్లితోనే ఆడపిల్లల జీవితాలు ముగిసిపోతున్న కాలంలో ఆమె జీవితానికి గొప్ప ప్రారంభాన్నిచ్చాడాయన. పై చదువుల కోసం హైదరాబాద్‌లో మాడపాటి హనుమంతరావు స్థాపించిన బాలికల ఉన్నత పాఠశాలలో మూడో తరగతిలో చేర్పించాడు. ఆ రోజుల్లో ఆడపిల్లలు, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల బాలికలకు చదవడమే గగనం. ఇక వసతి గృహాలెక్కడివి? కానీ రాజబహద్దూర్ వెంకటరాంరెడ్డిని ఒప్పించి రెడ్డి హాస్టల్‌కు అనుబంధంగా బాలికల హాస్టల్‌ను కూడా స్థాపింప చేశాడు రామ చంద్రారెడ్డి. అలా ఏర్పడిన ఆ అమ్మాయిల హాస్టల్లో చేరిన మొట్టమొదటి అమ్మాయి కమలాదేవి. హెచ్‌ఎస్సీ వరకు అక్కడే చదువుకుంది.



హాస్టల్లో ఉన్నప్పుడే కమలాదేవి రాంచంద్రారెడ్డితో కలిసి ఆంధ్ర మహాసభలకు హాజరవుతుండేది. నిజామాబాద్‌లో జరిగిన ఆరవ ఆంధ్రమహాసభ, మల్కాపురంలో జరిగిన ఏడవ ఆంధ్ర మహాసభలో వాలంటీరుగా పని చేసింది. ఆ క్రమంలో చదువుతో పాటే రాజకీయ అవగాహనా పెరగడంతో.. తన భర్తతో కలిసి రాజకీయ కార్యకలాపాల్లోనూ చురుకుగా పాల్గొనేది. స్కూల్ ఫైనల్ పాసైన తర్వాత స్వగ్రామం కొలనుపాక చేరింది. కానీ ఇంటికే పరిమితమవడానికి ఆమె సాధారణ మహిళ కాదు కదా! ఆమె ఓ కమ్యూనిస్టు చైతన్యం..!! అందుకే ఆ చైతన్యం ప్రజలకందించ డానికి వారిని అక్షరాలకు చేరువ చేయాలనుకుంది. తన ఆలోచనలను భర్తతో పంచుకుంది. కానీ.. ఆ రోజుల్లో పాఠశాలలు స్థాపించడానికి అవకాశం ఉండేది కాదు. ఉన్నా ఉర్దూలో తప్ప తెలుగులో చదువుకోకూడదు. ఇలాంటి ఆంక్షల నడుమ, జాగీరు ప్రభుత్వం పాఠశాలలకు ఎలాగూ అనుమతివ్వదు కనుక.. "రామానుజ కూటమి" అనే పేరుతో గ్రంథాలయ భవనాన్ని తమ స్వగ్రామమైన కొలనుపాకలో ప్రజల సహకారంతో ఆరుట్ల సోదరులు రెండు నెలల్లో పూర్తి చేశారు. చదువు విలువ తెలిసిన మనిషి కమలాదేవి. తాను చదువుకోవడానికి ఎన్ని ఇబ్బందులు పడిందో తెలుసు. కనుక ఆ కష్టాలు తన ప్రజలకు ఉండకూడదు అనుకుంది. ఆ భవనంలోనే బాలికల పాఠశాలను ప్రారంభించింది. ఆడపిల్లలకు ఉచితంగా చదువు నేర్పడం మొదలుపెట్టింది. అది దినదినాభివృద్ధి చెందింది. విషయం తెలిసిన జాగీర్దార్ల కడుపు మండింది. బలవంతంగా ఆ పాఠశాలను మూసివేశారు.

అక్షరాలు నడిచే దారుల్లో వెలుగుల దీపాలవుతాయని ఆమెకు తెలుసు. అక్షరాలు మట్టి మనుషుల బతుకులు మార్చే ఆయుధాలవుతాయనీ ఆమెకు తెలుసు. అక్షరాలు బానిస బతుకుల బంధ విముక్తికి బాటలు వేస్తాయనీ ఆమెకు తెలుసు. అందుకే మహిళను చదువుకు దూరం చేసి సంప్రదాయాల మాటున వంటింటికే పరిమితం చేసి, రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా వారి పాత్రను పురుషుల నీడగా మార్చివేయ జూస్తున్న ఆ ఫ్యూడల్ ఆధిపత్యాన్ని సహించలేకపోయింది కమలాదేవి. మహిళల జీవితాల్లో ఉషోదయాల కోసం ఉద్యమమై నిలిచింది. మూసివేసిన పాఠశాలను కొలనుపాక జైనమందిరంలో తిరిగి ప్రారంభించింది. "కన్యా బాలికల పాఠశాల" పేరుతో చదువుతో పాటే పిల్లలకు స్వావలంబననూ నేర్పింది. అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసం పెంచటానికి సైకిల్ తొక్కడం నేర్పించింది. సైకిల్ తొక్కడం ఈరోజు మనకు ఓ చిన్న విషయంగా కనిపించవచ్చు. కానీ ఆ కాలానికి అమ్మాయిలు సైకిల్ తొక్కడం ఓ అసాధారణ దృశ్యం. అలాంటి రోజుల్లో కమలాదేవి నేతృత్వంలో వందలమంది ఆడపిల్లలు సైకిళ్లపై దూసుకుపోతుంటే.. ఆ దారుల్లో ఎన్ని కళ్లు మురిసిపోయాయో..! ఎన్ని కలలు మెరిసిపోయాయో..! ఎంత ధైర్యం మొగ్గ తొడిగిందో..!

ఆ ధైర్యమే ఆమెను కమ్యూనిస్టుగా పదును పెట్టింది. ఆ సాహసమే ఆమెను సాయుధ పోరాటానికి నడిపించింది. దొరలూ జాగిర్దార్లూ, నిరంకుశ నిజాం రాచరికం చెర నుండి ఈ నేలను విముక్తి చేయడానికి. కమ్యూనిస్టుపార్టీ ఇచ్చిన సాయుధపోరాట పిలుపునందుకుంది. 1943లో విజయవాడలో జరిగిన మహిళా ఆత్మరక్షణ శిబిరంలో శిక్షణ పొందింది. స్వీయరక్షణ కోసం కారం, రోకలిబండల్ని ఎలా ఆయుధాలుగా ఉపయోగించాలో నేర్చుకుంది. ఆ తరువాత ఆయుధ శిక్షణలో ఆరితేరింది. అనేక పోరాటలలో ముందు నిలిచి.. స్త్రీ అంటే సమాజంలో ఉన్న సుకుమారత్వం, లాలిత్యం అనే భావజాలాన్ని ఛేదించి.. గరిట తిప్పే చేతులలో గన్నులు పట్టి, తూటాల పూలమాలలతో పల్లెపల్లెనూ అలంకరించింది.

అవి సాయుధపోరాటం మహోజ్వలంగా సాగుతున్న రోజులు. 1946లో నిజాం సర్కారు మార్షల్‌లా విధించే సమయానికి కమలాదేవికి రెండేండ్ల పిల్లవాడు. సాయుధ పోరాట యోధులంతా అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. అప్పుడు కమలాదేవి కొడుకు చిన్నవాడు కనుక చాలామంది అజ్ఞాతంలోకి పోవద్దని చెప్పినప్పుడు.. మాతృత్వం అన్నది ప్రజలందరి కోసమంటూ అడవుల్లోకి తరలిపోయింది. ప్రతి మనిషి జీవితంలో అనేక పరీక్షలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ పరీక్షలకు నిలబడినవారికే చరిత్ర పుటల్లో స్థానం లభిస్తుంది. అట్లా నిలిచింది కనుకనే కమలాదేవి చరిత్రలో ఒక అగ్ని శిఖగా నేటికీ జ్వలిస్తూనే ఉంది.

అజ్ఞాత జీవితంలో మహిళా గెరిల్లా దళాలతో నల్లగొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో అనేక ప్రత్యక్షదాడుల్లో పాల్గొంది. చల్లూరు గుట్టలు అప్పట్లో దళాలకు ప్రధాన రక్షణ స్థావరం. అది పసిగట్టిన యూనియన్ సైన్యాలు ఆ గుట్టలను చుట్టు ముట్టాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు పోతాయి. దళాలు నిర్మూలించబడతాయి. యుద్ధంలో శత్రువుది బలమైన సైన్యమే కాదు, బలమైన ఆయుధ సంపత్తి. పోరాడటం తప్ప తప్పించుకునే మరో మార్గం లేదు.. అప్పుడు నలుదిక్కులకూ కాల్పులు జరుపుతూ ఎత్తైన కొండలు ఎక్కుతూ దిగుతూ.. చుట్టుముట్టిన కంపెనీ సైనికుల నుండి దళాలను తప్పించడంలో ఆమె సాహసాన్ని నేటికీ ప్రజలు కథలు కథలుగా చెప్పుకుంటారు.



కంపెనీ సైన్యాలను తిప్పికొట్టిన కమ్యూనిస్టు దళాల ఆ వీరోచిత పోరాట చరిత్రను నేటికీ ఆ చల్లూరు గుట్టలు చెబుతూనే ఉంటాయి. అలా అనేక గ్రామాల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి దళాలను నిర్మించింది కమలాదేవి. పల్లెల్లో పడగవిప్పిన భూస్వామ్య పెత్తనాలు, కంపెనీ సైన్యాల దాడులతో, రజాకారు పిశాచాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రతీ క్షణం జనం కోసం పోరాటమై నిలబడింది కమలాదేవి.

అజ్ఞాత జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అంత సులభం కాదు. ఒకసారి తీవ్రమైన అనారోగ్యంపాలై రహస్యంగా ఆస్పత్రికి వెళ్తుండగా, కమ్మగూడెం దగ్గర మాటు వేసిన బహద్దూర్ పేట పోలీసులు ఆమెను, భర్తతో సహా అరెస్ట్ చేశారు. రామచంద్రారెడ్డిని ఖమ్మం జైలుకు, కమలాదేవిని వరంగల్ జైలుకు పంపారు. ఆ తర్వాత ఔరంగాబాద్, సికింద్రాబాద్ కారాగారాల్లో రెండున్నరేండ్లు ఆమె నరకం చూసింది. అయినా ఎప్పుడూ ధైర్యం, భవిష్యత్తుపై విశ్వాసం కోల్పోని కమలాదేవి 1951లో విడుదలైంది.

సాయుధ పోరాటం విరమణ తర్వాత 1952లో ఆలేరు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా భారీ విజయాన్నందుకుంది. 1967 వరకు ఎమ్మెల్యేగా కమలాదేవిది అప్రతిహత జైత్ర యాత్ర. 1962లో కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నప్పుడు, పుచ్చలపల్లి సుందరయ్య ప్రతిపక్ష నాయకుడిగా, కమలాదేవి ఉపనాయకురాలిగా శాసనసభలో ప్రాతినిధ్యం వహించారు. 1964లో ప్రతిపక్ష నాయకురాలిగా ఎన్నికై మొదటి మహిళా ప్రతిపక్ష నాయకురాలిగా చరిత్ర సృష్టించింది.

1973లో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కార్యదర్శిగానూ పని చేసిన కమలా దేవి.. తన 65 సంవత్సరాల సుదీర్ఘ క్రియాశీల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో కీర్తిశిఖరాలను అధిరోహించారు. అనంతరం ఆమె స్వచ్ఛందంగా రాజకీయాల నుండి విశ్రమించారు. ఆదర్శ మహిళగా, అణువణువునా ధైర్యాన్ని నింపుకున్న యోధురాలుగా, పోరాటవనితగా బహుముఖ ప్రజ్ఞ కలిగిన ఆరుట్ల కమలాదేవిని కాకతీయ విశ్వవిద్యాలయం 1998లో గౌరవ డాక్టరేట్ అందించి తనను తాను సత్కరించుకుంది. జీవితంలోని ప్రతి దశనూ ప్రజా హక్కుల కోసం, అభ్యున్నతి కోసం పంచిన కమలాదేవి 1 జనవరి 2001న తుదిశ్వాస విడిచారు. ఈ విశాలప్రపంచంలో కాలం బహు చిత్రమైనది. మానవ జీవిత ముద్రణలను నిరంతరం అనేక రూపాలుగా తనలో దాచుకుంటుంది. మంచివారు మరణించి బతికితే, చెడ్డవారు బతికుండీ మరణిస్తారు. మరణించినా కమలాదేవి ఎప్పుడూ మనుషుల మధ్యన మహోన్నతురాలిగా వెలుగొందుతూనే ఉంటుంది!! పోరాట జెండాకు ఎరుపురంగు అద్దుతూనే ఉంటుంది !! ❑

స్ఫూర్తి – నవ తెలంగాణా సౌజన్యంతో..

# విప్లవాగ్ని చాకలి ఐలమ్మ



చిట్యాల ఐలమ్మ (సెప్టెంబరు 26, 1895 – సెప్టెంబర్ 10, 1985) చాకలి ఐలమ్మగా గుర్తింపు పొందిన తెలంగాణా వీరవనిత. సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్య శాలి.

**జననం - వివాహం- పిల్లలు**

వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం క్రిష్టాపురం గ్రామంలో ఓరుగంటి మల్లమ్మ, సాయిలుకు నాలుగవ సంతానంగా చాకలి ఐలమ్మ జన్మించింది. పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యతో ఐలమ్మ బాల్య వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం, చాకలి కులవృత్తే వారికి జీవనాధారం. 1940–44 మధ్య కాలంలో విస్నూర్‌లో దేశ్‌ముఖ్, రజాకర్ల అరాచకాలపై ఎదురు తిరిగి ఎర్రజెండా పట్టింది ఐలమ్మ.

**తెలంగాణ ఉద్యమం**

అగ్రకులాల స్త్రీలు, దొరసానులు తమను కూడా 'దొరా' అని ఉత్పత్తికులాల (బీసీ కులాల) చేత పిలిపించుకొనే సంస్కృతికి చరమగీతం పాడినవారిలో ఐలమ్మ ముందంజలో ఉన్నారు. దొరా అని పిలువకపోతే ఉన్నతకులాలతో పాటు వారి అనుంగు ఉంపుడుకత్తెలలో కూడా ఉన్న రాక్షస ప్రవృత్తి అనేక పీడన రూపాలలో బయటకు వచ్చేది. వెనుకబడిన కులాల మీద ఆ పీడన రూపాలు విరుచుకుపడేవి. తమను దొరా అని పిలువని ఉత్పత్తి కులాల స్త్రీల మీద తమ భర్తలను ఉసిగొల్పి, దగ్గరుండి ఆఘాయిత్యం చేయించేవారు. ఈ భూమినాది... పండించిన పంటనాది... తీసుకెళ్లడానికి దొరెవ్వడు... నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రైతాంగ విప్లవాగ్ని చాకలి అయిలమ్మ.

మల్లంపల్లి భూస్వామి కొండలరావుకు పాలకుర్తిలో 40 ఎకరాల భూమి ఉండగా ఐలమ్మ కౌలుకు తీసుకుంది. అందులో నాలుగు ఎకరాలు సాగుచేశారు. పాలకుర్తి పట్వారీ వీరమనేని శేషగిరిరావుకు ఐలమ్మ కుటుంబానికి విరోధం ఏర్పడింది. జీడి సోమనర్సయ్య నాయకత్వంలో ఆంధ్రమహాసభ ఏర్పడింది. ఐలమ్మ ఆ సంఘంలో సభ్యురాలు. పాలకుర్తి పట్వారీ శేషగిరిరావు ఐలమ్మను కుటుంబంతో వచ్చి తన పొలంలో పనిచేయాలని ఒత్తిడి చేయడంతో పనిచేయడానికి నిరాకరించింది. పాలకుర్తి పట్వారీ పప్పులుడకక అయిలమ్మ కుటుంబం కమ్యూనిస్టుల్లో చేరిందని విసునూర్ దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశాడు. కేసులో అగ్రనాయకులతో పాటు అయిలమ్మ కుటుంబాన్ని ఇరికించారు. అయినప్పటికీ కోర్టులో తీర్పు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా వచ్చింది.

అయిలమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా దెబ్బతీస్తే సంఘం పట్టు కోల్పోతుందని భావించిన దేశ్‌ముఖ్ పట్వారిని పిలిపించుకొని, అయిలమ్మ కౌలుకు తీసుకున్న భూమిని తన పేరున రాయించు కున్నాడు. భూమి తనదని, వండించిన ధాన్యం తనదేనని పంటను కోసుకురమ్మని వంద మందిని దేశ్‌ముఖ్ పంపాడు. ఆంధ్ర మహాసభ కార్యకర్తలు వరిని కోసి, వరికట్టం కొట్టి ధాన్యాన్ని ఐలమ్మ ఇంటికి చేర్చారు. భీంరెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, చకిలం యాదగిరిలు సైతం ధాన్యపు బస్తాలను భుజాలపై మోసారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సహకారంతో ఐలమ్మకు అనుకూలంగా తీర్పు వచ్చింది. రజాకార్ల ఉపసేనాధిపతి అయిన దేశ్‌ముఖ్ రెండుసార్లు పరాజయం పాలయ్యాడు. ఐలమ్మ ఇంటిని కూడా తగులబెట్టారు. ధనాన్ని, ధాన్యాన్ని ఎత్తుకెళ్లారు. ఐలమ్మ కూతురు సోమనర్సమ్మపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఐలమ్మ కుమారులు ముగ్గురు పాలకుర్తి పట్వారీ ఇంటిని కూల్చి అదే స్థలంలో మొక్కజొన్న పంటను పండించారు. అనేక రకాలుగా నష్టపోయినప్పటికీ అయిలమ్మ కుటుంబం ఎర్రజెండాను వీడలేదు.

'ఈ దొరగాడు ఇంతకంటే ఇంక నన్ను ఏవిధంగా నష్టపెట్ట గలడు' అని తనలో తాను ప్రశ్నించుకొన్నది. నీ దొరోడు ఏం చేస్తాడ్రా' అని మొక్కవోని ధైర్యంతో రోకలి బండ చేతబూని గూండాలను తరమి కొట్టింది. కాలినడకన వెళ్లి దొరకు సవాలు విసిరింది. అయిలమ్మ భూపోరాటం విజయంతో పాలకుర్తి దొర ఇంటిపై కమ్యూనిస్టులు దాడిచేసి ధాన్యాన్ని ప్రజలకు పంచారు. అలాగే 90 ఎకరాల దొరభూమిని కూడా ప్రజలకు పంచారు. అయిలమ్మ భూపోరాటంతో మొదలుకొని సాయుధ పోరాటం చివరి వరకు నాలుగు వేలమంది ఉత్పత్తి కులాల వారు అమరుల య్యారు. 10 లక్షల ఎకరాల భూమి పంపకం జరిగింది. ❑

# ధీరవనిత కమలమ్మ



కమలమ్మ గారిని జ్ఞాపకం చేసుకోవడమంటే, తలుచుకోవడమంటే నైజాం ప్రభుత్వ ఏలుబడిలో దొరల దౌర్జన్యాలు, వెట్టి చాకిరి, బానిసత్వం, గడీల్లో జరిగిన అరాచకాలు, వాటికి వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ , ఆ పై కమ్యూనిస్టు ఉద్యమం, మట్టి మనుషుల త్యాగాలు ... ఓ మహోన్నత పోరాటాన్ని మననం చేసుకోవడమే. 92 ఏండ్ల వయసులో కన్ను మూసిన కమలమ్మగారి జ్ఞాపకాలు ఉద్యమాల్లో పని చేసేవారికి స్ఫూర్తి దాయకం.

వడ్డించిన విస్తరి కాదు కమలమ్మ గారి జీవితం. ఆవిడ నాయన పేరు చెరకు రంగారావు. అప్పట్లో ఆయన వరంగల్ జిల్లా నెల్లికుదురు మండలం నేనాల గ్రామంలో కరణం దొరల దగ్గర గుమస్తా. ఆనాటి దొరల పాలనలో ప్రజలకు ఏ హక్కులు ఉండకపోయేవి. ఇక స్త్రీల కష్టాలు చెప్పనలవి కావు. వారికి నచ్చిన అమ్మాయిని తీసుకొచ్చి గడీల్లో పెట్టుకున్నా అడిగే పరిస్థితి ఆ రోజుల్లో లేదు. అలా తెచ్చుకున్న అమ్మాయిలను గడీల్లో పెట్టుకున్న వారిని ఆడబాపలనేవారు. వాళ్ళు తమ బతుకంతా గడీల్లో బానిసలుగా ఉండే వారు. పుట్టిన పిల్లలకు తల్లి మాత్రమే తెలిసేది. తండ్రి ఎవరో తెలియక పోయేది. అక్కడ పుట్టినావిడే రంగమ్మ. గుమస్తా పనిచేస్తున్న చెరుకు రంగారావు అక్కడే పరిచయమైన రంగమ్మతో సహా జీవనం చేసాడు. రంగారావు, రంగమ్మ గార్లకు 5 మంది సంతానం. అందులో నాలుగో సంతానమే కమలమ్మ. సహజంగా పిల్లలకు తండ్రి తరపునే ఇంటి పేర్లను పెట్టుకుంటారు. కానీ వీరి పుట్టిన పిల్లలకు తల్లి తరుపున ఉన్న "మందాటి" అన్న ఇంటి పేరు స్థిరపడింది. దానికి ప్రధాన కారణం, ఆనాటికి కరణం దొరలను ఎదిరించి నిలబడే శక్తి రంగారావుకు లేదు. ఒకవేళ ఇంటి పేరు పిల్లలకు పెడితే దొరలు ఊరుకోరు. అందుకే పిల్లలకు భార్య ఇంటి పేరునే ఉంచేశారు. పెద్దవాడు మందాటి వెంకటయ్యకు పెండ్లి చేద్దామంటే కరుణాల పిల్లను ఇవ్వలేదు. ఆ క్రమంలోనే మరిపెడ మండలం చిల్లంచర్ల రాంపురం గ్రామానికి చెందిన చక్రపాణమ్మ బిడ్డ చిత్తారమ్మను వెంకటయ్య చేసుకుంటే, ఆవిడ కొడుకు ముకుందాన్ని కమలమ్మ చేసుకుంది. పెండ్లి సమయానికి కమలమ్మ వయసు 7 ఏండ్లు. ముకుందానికి 18 ఏండ్లు.

### ఉద్యమంలోకి...

తెలంగాణా ప్రాంతం ఆనాడు నైజాంల ఏలుబడిలో ఉండేది. వారి మద్దతుతో గ్రామాల్లో దొరలు, భూస్వాముల పెత్తనాలు చెప్పతరం కాదు. అన్ని కులాల ప్రజలు దొరలకు వెట్టి చేసేవారు. భారతదేశానికి 1947లో స్వాతంత్రం వచ్చినా, తెలంగాణ ప్రాంతానికి మాత్రం రాలేదు. 1946 నుండే కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో ఈ అన్యాయాలను వ్యతిరేకిస్తూ ఉద్యమం మొదలైంది. దొరలకు మద్దతుగా నైజాం ఏర్పాటు చేసిన ప్రైవేట్‌సైన్యం రజాకార్లు రంగంలోకి దిగారు. ఎక్కడ చూసినా అరాచకాలు. పోరాడితే తప్ప బతకలేని పరిస్థితి. ఆ పోరులోకి ముందుగా పోయినవాడు కమలమ్మ పెద్దన్న వెంకటయ్య. ఆయన పార్టీలో దళ కమాండర్. అతడే కమలమ్మను, ముకుందాన్ని ఉద్యమంలోకి తీసుకొని పోయాడు. పోరాటంలోకి పోయినప్పుడు కమలమ్మ గారి వయసు 18 ఏండ్లు. ఆ రోజుల్లో ఉద్యమం జరుగుతున్నప్పుడు నాయకులు మారు పేర్లతో పిలవబడ్డా, కమలమ్మ గారి పేరు మార్చలేదు. ఆమె పేరుతోనే దళాల్లో తిరిగింది. భర్త మాత్రం రహస్యజీవితంలో అప్పన్నగా పేరు మార్చుకొని చివరి వరకు ఆ పేరుతోనే బతికాడు.

### మాతృత్వం మెలిపెట్టినా

ఉద్యమంలోకి పోతున్నప్పుడు కమలమ్మకు ఎనిమిది నెలల బాబు. తన ఎనిమిది నెలల బాబును అప్పన్న చెల్లెలుకిచ్చి దళాల్లోకి వెళ్లిపోయింది. ఒక మామూలు స్త్రీ కమలమ్మ.. సిద్ధాంతాన్ని చదవలేదు. పుస్తకాల జ్ఞానం లేదు. కానీ ఒక సంక్షుభిత సమయంలో సమస్యల పరిష్కారం కోసం తన పిల్లవాడిని వదిలేసి ఉద్యమంలోకి దూకడం ఎర్రజెండా ఇచ్చిన చైతన్యమే. పిల్లవాడిని పంపేసినా పాలు తాగే వయసు కనుక మాతృత్వ మమకారం నిరంతరం మెలిపెట్టేది. ఆ రెండేళ్లలో వాడిని చూడాలని అనుకున్నా నిర్బంధంలో సాధ్యం కాలేదు

### కన్నీళ్లు ఆగలేదు...

అడవిలోకి పోయినపుడు అక్కడ గిరిజనులను ఆర్గనైజ్ చేయడానికి బుర్రకథలు, పాటలు పాడడం, గొల్లసుద్దులు చెప్పడం చేసేవారు. దళాల్లో వైజ్ఞానిక రంగంలో అంటే నర్సుగా దెబ్బలు తాకినప్పుడు కట్లు కట్టడం, సూదులు ఇవ్వడం చేసేది. ఎప్పుడైనా ప్రజాయుద్ధం త్యాగాన్నే

కోరుకుంటుంది. త్యాగం చేయలేనివాళ్లు అక్కడ నిలబడలేరు. ఇద్దరు కలిసే పోరాటంలోకెళ్ళినా అప్పన్న మంతెన మహాదేవపూర్ అడవిలో ఉంటె, కమలమ్మ ఖమ్మం, మానుకోట ఏరియాల్లో ఎక్కువగా పని చేసింది. కొంతకాలం తర్వాత భార్య భర్తలు ఒకే చోట పనిచేసే అవకాశం వచ్చినప్పుడు, గర్భం ధరించిన కమలమ్మ ఎక్కడా వెనకడుగు వేయకుండా దళంలోనే 9 నెలలు అనేక పనులు చేసింది. కాన్పు జరిగిన తీరును చెప్పినప్పుడు మాకైతే కన్నీళ్లు ఆగలేదు. కాన్పు జరిగే సమయం వరకు కూడా దళంలో ఒకచోట నుండి ఇంకొకచోటుకు తిరుగుతూనే ఉందట. నొప్పులొస్తున్నాయని అన్నప్పుడు చుట్టూ దళాల్ని కాపలాగా పెట్టి, గుట్ట లోపల సొరంగంలో మంత్రసానిని పిలిపించి కాన్పు చేయించినట్లు, అప్పుడు అప్పన్న గుట్టపైన కావలి కాసినట్లు చెప్పింది. ఆమెను కాపాడుకోవడానికి దళం ఎంత కష్టపడిందో. 'నీవెంత బాధలు అనుభవించినవమ్మా' అని అన్నప్పుడు, అంత కష్టాన్నైనా భరించే ధైర్యాన్నిచ్చిన దళ సభ్యులను, వారు చేసిన సాయాన్ని ఎంతసేపు తలుచుకుందో. పుట్టిన బాబుకు, అప్పటికే వరంగల్ జిల్లా మానుకోట తాలూకా పిండిపోలు గ్రామంలో పోలీసుల కాల్పుల్లో మరణించిన కామ్రేడ్ సీత రామారావు అని పేరు పెట్టుకున్నారు.

## నిర్ణయం గొప్పది

నైజాం లొంగిపోయాక యూనియన్ సైన్యాలు వచ్చాయి. దాడి తీవ్రమైంది. పోరాటంతో పాటు పిల్లోడు పెరుగుతున్నాడు. అడవిలోనే 6 నెలలు సాదుకుంది. పిల్లోడిని ఎత్తుకొని అనేక పనులు చేసేది. ఒకచోట క్లాసులు జరుగుతున్నప్పుడు పిల్లవాడు ఏడవడం మొదలేసిండు. ఎంతకు ఏడవడం ఆపడం లేదు. దళాల ఉనికే ప్రమాదంలో పడే పరిస్థితి వచ్చింది. ఆ సమయంలో కమలమ్మ గారి ముందు రెండే ప్రశ్నలు. . ఒకటి మాతృత్వాన్ని త్యాగం చేయాలా? రెండు ఉద్యమాన్ని వదిలేయాలా? మాతృప్రేమ కావాలనుకుంటే మంచి తల్లి అవుతుంది. ఉద్యమమే కావాలను కుంటే ఊరందరి తల్లి అవుతుంది. కమలమ్మ గారు ఊరందరి తల్లి అవడానికే నిశ్చయించుకొంది. తెలిసిన వారికి ఇవ్వడానికి, బయటకు పోయే పరిస్థితి లేదు. అడవిలో ఉన్న కోయ వారిని కలిసి పిల్లోడిని సాదుకొమ్మని అడిగింది. 'పిల్లోడు ఎర్రగా ఉన్నాడు. మా కోయ వాళ్లలో కలిసి పోయినట్లు ఉండడు. మాపై పోలీస్ దాడులు పెరగవచ్చు. అదీగాక ఇక్కడ దళ సభ్యురాలి పిల్లవాడిని తెలిస్తే, ఈ ఏరియాలో దళాలకు ప్రమాదం' అని వాళ్ళు వద్దన్నారు.

## నిర్ణయం అసమాన్యం

ఈ ఏరియాలో తీసుకోవడం లేదు కనుక బాబు మెడలో ఒక కాగితం రాసి 'పిల్లవాడిని సాదలేక పోతున్నాను. దయ గల్లవారు సాదుకొమ్మని' అందులో రాసి ఇల్లెందు బొగ్గుట్ట ఏరియాలో ఎవ్వరికైనా ఇచ్చేసి రావాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు పార్టీ కేటాయించిన ఎంకన్న అనే దళ సభ్యుడి సహకారంతో ఒక రాత్రి, ఒక పగలు నడిచి బొగ్గుట్టకు చేరుకున్నారు. అక్కడ ఎర్ర గోపన్న అనే ఆర్గనైజర్ ఉండేవాడు. అతని సహాయంతో ఒకతనికి పిల్లోన్ని ఇచ్చేసి అతని చేతులో పిల్లవాడి కోసమంటూ తన దగ్గరున్న 10 రూపాయలు ఇచ్చిందట. తిరిగొస్తుంటే పిల్లవాడు నాకోసం చూసిన చూపు మరువలేకున్నా నంది. పిల్లవాడిని వదిలేయడమంటే... దారిన పోయే ఒక మనిషి పిల్లోడిని తీసుకుపోతుంటే ఏ తల్లికైనా సాధ్యమేనా? అయినా తను ఎత్తుకున్న ఎర్రజెండా కోసం. తననే నమ్మిన కష్టజీవుల కోసం ఆ నిర్ణయం తీసుకుంది. ఒక్కొక్కరి జీవితం ఇంకొకరి త్యాగంతో పోల్చలేకున్నా, ఒక చారిత్రక దశలో వారు తీసుకున్న నిర్ణయాలు, ఎర్రజెండా కోసం నిలబడ్డ తీరు వారిని అసమాన్యులుగా చేస్తుంది. ఆనాటి పరిస్థితుల్లో ఒక సామాన్య స్త్రీగా కమ్యూనిస్టు దళాల్లోకొచ్చి పార్టీ ఇచ్చిన జ్ఞానంతో వారు తీసుకున్న నిర్ణయం మనల్ని విపరీతంగా కదిలించి వేస్తుంది.

## తెచ్చుకునే అవకాశం ఉన్నా

1952 లో అజ్ఞాత జీవితం వీడి బయటకొచ్చాక పిల్లవాడిని ఏ ఏరియాలో ఏ బొగ్గుగని కార్మికునికి ఇచ్చి వచ్చారో తెలిసే అవకాశం ఉంది కొద్దిగా కష్టపడితే పిల్లవాడిని దొరకపట్టవచ్చని అందరూ చెప్పినా, కమలమ్మ ఆవిడ భర్త అప్పన్న (చివరి వరకు కమ్యూనిస్ట్ ఉద్యమంలో ఉండి చనిపోయాడు) అలాంటి ప్రయత్నాలు వద్దన్నారు. గుండె దిటవు చేసుకొని ఇద్దరు ఒక నిర్ణయానికొచ్చారు. 'ఒకవేళ పిల్లవాడు దొరికినా, పిల్లవాడిని ఇచ్చేటప్పుడు తల్లిగా నేనెంత ఏడ్చానో, సాదుకొన్న తల్లికీ అంతే బాధ ఉంటుంది' అని పిల్లవాడిని దేవులాడవద్దని నిర్ణయించు కున్నారు. ఆ తల్లీ బిడ్డల మమకారం మధ్యన తాను ఒక సమస్యగా మారకూడదని చనిపోయేవరకు ఆ జ్ఞాపకాల్లోనే బతుకుతూ.. కండ్లలో కారే కన్నీటిని తుడ్చుకుంటూ ఆరోజు మాకెన్నో విషయాలు చెప్పింది.

## ఉద్యమ జెండాలై ఎగురుదాం

ఆరోజు మాకు చెప్పిన అనేక విషయాలు మదిలో కొస్తుంటే.. వయసులో అలిసిపోయి.. ఆశయంలో ఆకాశాన్ని ఒడిసిపట్టి మెరిసిపోతున్న అమ్మను చూస్తుంటే.. మనం మళ్ళీ ఉద్యమ జెండాలై ఎగురుతాం. అయినా అమ్మ ఎక్కడికెళ్లింది. చివరికంటా ఎత్తుకున్న ఎర్రజెండాను వారసత్వంగా ఇచ్చి వెళ్ళింది. ఏ ఉద్యమం కోసం ఆ తల్లి మాతృత్వాన్ని చంపుకొని ఊరంతా బిడ్డలనుకుందో వారంతా నేడు పోరాటానికి సన్నద్ధం అవ్వడమే ఆ తల్లికి మనమిచ్చే నివాళి. ❑

స్ఫూర్తి – నవ తెలంగాణా సౌజన్యంతో..

# సామాజిక విప్లవకారిణి సావిత్రీబాయి పూలే



సావిత్రిబాయి మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న ఒక రైతు కుటుంబంలో జన్మించింది. ఆమె తన 9వయేట 12 యేండ్ల జ్యోతిరావు పూలెను 1840లో వివాహ మాడింది. నిరక్షరాస్యురాలిగా ఉన్న ఆమెకు భర్త జ్యోతిరావు పూలే మొదటి గురువు. జ్యోతీరావు పూలె ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది. అహ్మద్‌నగర్‌లో ఉపాధ్యాయ శిక్షణ పొంది 1848లో భర్త జ్యోతిరావుతో కలిసి క్రింది కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించింది. ఈ పాఠశాల నడపటం ఉన్నత, అగ్రవర్ణాలకు నచ్చలేదు. దీంతో ఆమెపై వేధింపులకు, భౌతికదాడులకు పూనుకున్నారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్లు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడటం వంటివి చేశారు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరలా వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చేది. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా "నా విధిని నేను నిర్వహిస్తున్నాను" అని చెప్పేది. ఆ దంపతులకు స్వంత పిల్లలు లేరు. కానీ ఆ జంట యశ్వంతరావు (బ్రాహ్మణ వితంతువు కుమారుడు) ను దత్తత తీసుకున్నారు.

**ఉపాధ్యాయురాలిగా :** భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా పాఠశాలలు ప్రారంభించి, 12 మే 1848న దేశంలో బహుజనులకు మొట్టమొదటి పాఠశాల ప్రారంభించారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి ఆమె. కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యనందించారు. 1848లోనే దేశంలో విద్యా ఉద్యమం ప్రారంభించిన మొదటి మహిళ ఉపాధ్యాయురాలు, దళితుల, స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే. వారి జీవితకాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో ఆమె ఆధిపత్య కులాల వారి నుంచి అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొంది. ఈ నేపథ్యంలోనే 1849లో పూలే, సావిత్రీబాయి దంపతుల గృహ బహిష్కారానికి గురిచేశారు.

**సామాజిక విప్లవకారిణిగా :** ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో మహిళా సేవా మండల్ అనే మహిళాసంఘాన్ని కూడా స్థాపించింది. 1873లో తన భర్త మహాత్మాపూలేతో కలసి "సత్యశోధక్‌సమాజ్"ను ప్రారంభించి బాల్యవివాహాలకు, మూఢ నమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, వితంతువు పునర్వివాహల కొరకు అసమాన బ్రాహ్మనిజ వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్యపర్చి, వితంతువులకు శిరోముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు. ఈ సత్యసోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా వేగుచుక్కగా నిలిచారు. 1854లోనే ఆమె తన కవితా సంపుటి 'కావ్యపూలే'ను ప్రచురించింది. మరో కవితా సంపుటి 'పావన కాశీ సుభోధ్ రత్నాకర్'ను 1891లో ప్రచురించింది. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తక రూపంలో వచ్చాయి.

**భర్త మరణం :** జ్యోతీరావుపూలే. 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖసాగరంలో మునిగిపోయారు. ఈ దుఃఖంలో నుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇది. పూలే మరణాంతరం సత్యసోధాక్ సమాజ్ భాధ్యతనీ స్వీకరించి నడిపించింది.

**మరణం :** 1890వ దశకంలో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించింది. దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 2 వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించింది. ప్లేగు వ్యాధి సోకిన మాంగ్ లాంటి దళిత కులాలకి చెందిన దళిత చిన్నపిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడింది. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకి సోకి మార్చి 10, 1897లో మరణించింది. ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపించాడు. సావిత్రిబాయి జయంతిని భారతదేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నాము. 1997లో భారత ప్రభుత్వం సావిత్రిబాయి జ్ఞాపకార్థం తపాలా స్టాంపును విడుదల చేసింది. పూణే విశ్వవిద్యాలయానికి సావిత్రిబాయి పేరు పెట్టారు. ❑

# మానవతామూర్తి మదర్ థెరిసా



ఇంట్లో ఎవరికైనా జబ్బు చేస్తే వారికి ఓ వారం రోజులు సపర్యలు చేయాలంటేనే ఎంతో కష్టంగా ఉంటుంది. అలాంటిది సమాజాన్నే తన కుటుంబంగా భావించి.. అభాగ్యులు, అనాథల సేవకే జీవితాన్ని అంకితం చేయడం మామూలు విషయం కాదు. వ్యక్తిగత జీవితాన్ని పూర్తిగా త్యజించి.. పేదల సేవకే అంకితమైన అలాంటి దయామయి మదర్ థెరిసా.

ఆగస్టు 26, 1910లో నికోల్లే, డ్రాన బొజాక్షిహ్యూల ఆఖరి సంతానం థెరిసా. చిన్ననాటి నుంచి పలువురికి సేవచేయడంలో ఆమె ముందుండేవారు. 1919లో తండ్రి జబ్బుతో మరణించారు. మృత్యువుకి ముందు తండ్రి పడిన బాధని చూసిన మదర్ థెరిసా.. 12 సంవత్సరాల వయసు వచ్చేసరికే క్రైస్తవ మతం స్వీకరించి సేవకు తన జీవితాన్ని అంకితం చేయాలని నిశ్చయించుకున్నారు.

అలా 18వ ఏట ఇంటి నుండి బయటికొచ్చి సిస్టర్స్ ఆఫ్ లోరెటో అనే సంఘంలో చేరారు. 1937 మే14 లో తూర్పు కలకత్తాలోని లోరెటో కాన్వెంట్ స్కూల్లో టీచర్‌గా చేరినప్పటికీ ఆమె మనసంతా పేదలకు సేవ చేయడంపైనే ఉండేది. దీంతో ఆమె ఉద్యోగం వదిలి సేవ చేసేందుకు మురికివాడలవైపు నడిచారు. మొదట్లో మొతిజిల్ అనే పాఠశాలను స్థాపించి అనాథల అవసరాలు తీర్చారు. అయితే కాలక్రమేణా అనాథల సంఖ్య పెరగడంతో వారి ఆహారం కోసం యాచించారు కూడా. ఈ గొప్పగుణమే తనని గుర్తింపు పొందేలా చేసింది.

అలా 1950 అక్టోబర్ 7నాటికి వాటికన్ అనుమతితోనే మతగురువుల సంఘాన్ని ప్రారంభించి.. మిషనరీస్ ఆఫ్ చారిటీగా రూపొందించే స్థాయికి చేర్చింది థెరిసా. కోల్‌కతాలో 13మందితో మొదలైన ఆ సంస్థ.. నేడు వేల మందికి సేవ చేస్తోంది. 1952లో మదర్ థెరీసా హోమ్ ఫర్ ది డయింగ్ ప్రారంభించారు. ఈ సంస్థ ముఖ్య ఉద్దేశ్యం వైద్య సహాయం అందించి.. మరణించాక వారి ఆచారాల ప్రకారం కర్మలు చేయడం. ఇక అంతటితో ఆగలేదు ఆ సేవా కార్యక్రమాలు 1955లో శిశు భవన్, 1960లో అనేక ధర్మశాలలు, అనాథ శరణాలయాలు, కుష్టు వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు.

అదే విధంగా 1968లో రోమ్, టాంజానియా, ఆస్ట్రియాల్లో, 1970లో ఆసియా, ఆఫ్రికా, యూరప్‌లో ఫౌండేషన్లు స్థాపించారు. ఇవే కాదు.. ఆమె మరణించే వరకూ కూడా ఎన్నో సంస్థలను స్థాపించారు. అందులో నిరంతరం సేవ కార్యక్రమాలు చేసేవారు.

ముఖ్యంగా కుష్టు, ఎయిడ్స్, వృద్ధులకు కూడా ఎంతో ఆనందంగా సేవ చేసేవారు మదర్ థెరిసా.. ఆమె సేవలను గుర్తించిన ప్రభుత్వాలు 1979లో నోబెల్ శాంతి, 1980లో భారతరత్న పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించాయి

అయితే తన జీవితంలోనూ కొన్ని వివాదాలను ఎదుర్కొన్నారు మదర్‌థెరిసా. వయసుపైబడి తీవ్రంగా జబ్బుపడిన మదర్‌థెరిసా వైద్యం కోసం కాలిఫోర్నియాలోని కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు. దీంతో.. ఆమెపై కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఆధీనంలో నడిచే ఆస్పత్రుల్లోనే మీరు వైద్యం చేయించుకోరా? అంటూ ప్రశ్నించారు. ఈ వివాదాలు నడుస్తున్న సమయంలోనే 1997న మార్చి 13న మిషనరీష్ ఆఫ్ చారిటీ అధినేత పదవి నుంచి మదర్ తప్పుకున్నారు. అనంతరం, తీవ్ర అనారోగ్యం కారణంగా అదే సంవత్సరం సెప్టెంబర్ 5న మరణించారు.

చాలామంది పుడతారు.. గిడతారు.. కానీ కొంతమందే చరిత్ర పుటల్లో నిలిచిపోతారు. అనాథలు, పేదలు, అందరినీ తమ వారిగా భావించి సేవ చేసిన మదర్ థెరిసా కూడా అలానే చరిత్రలో నిలిచిపోయారు. ❑



# భారత కార్మికోద్యమాలలో మహిళల ధీరోదాత్త పాత్ర

డా॥ బివి విజయలక్ష్మి
జాతీయ కార్యదర్శి, ఎఐటియుసి

భారతదేశ స్వాతంత్ర పోరాటంతో పాటు ఈనాటికీ దేశాభివృద్ధికై జరుగుతున్న అనేక ఉద్యమాలతో మమేకమయిన ఎఐటియుసి ఉజ్వల చరిత్ర గురించి స్మరించుకోవడం ద్వారా ఆ ఉద్యమ మార్గాన్ని మరింత బలోపేతం చేస్తూ ముందు తరాలకు వాటి ఫలాలనందించడానికి మన కృషిని కొనసాగిస్తూనే ఉండాలి. భావితరాలు కూడా ఈ ఉద్యమ స్ఫూర్తిని అందుకోవడానికి తరతరాలుగా ఈ పునాదుల్ని మరింత బలోపేతం చేసుకుంటూ ముందుకెళ్ళాలి.

1920 అక్టోబరు 31 వ తేదీన బొంబాయిలోని ఎంపైర్ థియేటర్లో లాలాలజపతిరాయ్ అధ్యక్షతన మొట్టమొదటి మహాసభ ద్వారా ఎఐటియుసి పురుడు పోసుకుంది. ఆ రోజున ఆమోదించినటు వంటి తీర్మానాలలో ఆహార ధాన్యాల ఎగుమతుల మీద ఆంక్షలు విధించాలని, నిరుద్యోగుల రిజిస్ట్రేషన్ సక్రమంగా ఉండాలని, డ్యూటీలో ప్రమాదం జరిగినప్పుడు బీమా సౌకర్యం కల్పించాలని, ప్రివిలైజ్ సెలవులు, సిక్ లీవులు ఇవ్వాలని, కార్మికుల మీద పోలీసుల అమానుష చర్యలు ఆపాలని డిమాండ్ చేసింది. మరో ముఖ్యమైన తీర్మానం మహిళా కార్మికులు పనిచేస్తునటు వంటి ప్రతి పరిశ్రమలోను వారి శిశువుల సంరక్షణకై సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. కానీ ఈరోజుకు కూడా మనం పనిచేసే ప్రదేశాలలో శిశుసంరక్షణా కేంద్రాలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తున్నామంటే.. వంద సంవత్సరాల కాలంలో కూడా పాలనలో మహిళా కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడమే.



ఎఐటియుసి అధికారికంగా వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న ప్పటికి అనేక కార్మిక ఉద్యమాలు అంతక్రితం శతాబ్దం నుండే ప్రారంభమైనాయి. ప్రపంచంలో పారిశ్రామిక విప్లవం ముందే వచ్చినా భారతదేశంలో మాత్రం చాలా ఆలస్యంగానే వచ్చింది. దానికి ఒక కారణం భారతదేశం వ్యావసాయిక దేశమయితే మరో ప్రధాన కారణం బ్రిటిష్ పాలకుల వలస పాలన మూలంగా దేశం నుండి కేవలం ముడిసరుకును ఎగుమతి చేయడానికి ఉపయోగించుకుంటూ మనలను ఉత్పత్తుల కోసం వారి మీద ఆధారపడే విధంగా శాసించడం. మనదేశంలో మొట్టమొదటి పరిశ్రమ 1850లలో ముంబయిలో ప్రత్తి, వస్త్ర పరిశ్రమ. అటుపిమ్మట ముంబయిలోనే అనేక బట్టల మిల్లులు వచ్చాయి. బెంగాల్‌లో జూట్ మిల్లులు, కేరళలో కొబ్బరిపీచు మిల్లులు అత్యధిక సంఖ్యలో వచ్చాయి. మెల్లమెల్లగా ఇతర అనేక పరిశ్రమలు ప్రారంభమయ్యాయి.

భారతదేశంలో కార్మికోద్యమాన్ని మూడు దశలుగా పరిగణిస్తారు చరిత్రకారులు. మొదటిదశ 19వ శతాబ్దం మధ్య నుండి మొదటి ప్రపంచ యుద్ధం వరకు.. రెండవ దశ అప్పటి నుండి దేశ స్వాతంత్ర్యం సాధించే వరకు.. అటు తర్వాత కాలాన్ని మూడవ దశగా పరిగణిస్తారు. మొదటి దశలో సంఘటిత కార్మిక సంఘంగా లేకపోయినప్పటికి కార్మికుల్లో ఉన్నటు వంటి వర్గ దృక్పథంతో సమస్యలపై స్పందిస్తూ పరిష్కారందిశగా పోరాటాలు ప్రారంభించారు. మొట్టమొదటి కార్మిక సంస్థ 1851లో బొంబాయిలోని నూలు బట్టల మిల్లులో ప్రారంభమైతే, 1854లో కలకత్తాలోని జూట్ మిల్లులో ప్రారంభమైంది. 1879లోనే కార్మికుల స్థితిగతులను పరిశీలించడానికి కమిషన్ ఏర్పాటు అయ్యింది. 1891లో మొట్టమొదటి భారతీయ పారిశ్రామిక చట్టం సాధించుకోగలిగారు. కానీ అది ఏ మాత్రం ఉపయోగ పడలేదు. 1890లో పదివేల మందితో పెద్ద నిరసన ప్రదర్శన జరిగింది. అందులో ఇతర డిమాండ్లతో పాటు మహిళా కార్మికులు ప్రతిపాదించిన డిమాండ్ వారాంతపు సెలవు ఇవ్వాలని. అటు తర్వాత దేశమంతటా ప్రతి మిల్లులోనూ, ప్రతి రంగంలోనూ యూనియన్లు ఏర్పాటయ్యాయి. మహిళా కార్మికులు కూడా పెద్దసంఖ్యలో యూనియన్లలో

భాగస్వాములయ్యారు. పారిశ్రామికీరణ జరిగిన ప్రాంతాలలో మహిళలు ఎక్కువ సంఖ్యలో పనిలో చేరారు. 1913లో బొంబాయిలో 90 నూలు మిల్లుల్లో 1,10,033 కార్మికులలో 20% శాతం పైగా 22,402 మంది మహిళా కార్మికులు ఉండేవారు.

ఈ మిల్లులలోని కార్మికుల పరిస్థితులు చాలా దుర్భరంగా ఉండేవి. ఏ రకమైన చట్టాలు లేకపోవడంతో విపరీతమైన శ్రమదోపిడీ జరిగేది. నిర్దిష్ట మైన పనిగంటలు లేకపోవడం, కనీసం వారాంతపు సెలవులు లేకపోవడం, అతితక్కువ వేతనాలు పొందడం వల్ల ప్రతి ప్రాంతంలో ఆకస్మిక పోరాటాలు, సమ్మెలు ప్రారంభమయ్యాయి. పరిశ్రమలన్నింటిలో పురుషులతో పాటు స్త్రీలు, వారితో పిల్లలు కూడా పని చేయాల్సిన పరిస్థితులు.. ఈ పోరాటాలన్నింటిలో మహిళలు కూడా పూర్తిస్థాయిలో పాల్గొనే వారు. వారి మీద మిల్లు యజమానుల అత్యాచారాలు అధికంగా ఉండేవి. చాలా బెదిరింపులు చేసేవారు. పనిభద్రత లేదు. అయినా ఏ మాత్రం బెదరకుండా ముందువరుసలో నడిచేవారు.

కేరళలో కొబ్బరిపీచు నుండి తాళ్ళు పేనే పద్ధతి 19వ శతాబ్దంలోనే మొదలై అత్యధికంగా విదేశాలకు ఎగుమతి అయ్యేది. మలయాళంలో కాయర్ అనే పదానికి అర్థం తాడు. ఇంగ్లీష్‌లో జఉ అనే పదం ఆ విధంగా వచ్చిందే. వీటి నుంచి తయారు చేసిన తివాచీలు 1840లలో ఇంగ్లండులో చాలా ప్రసిద్ధి. అలాగే యూరపులో కూడా విరివిగా వాడేవారు. దానితో 1860లో ఆరు లక్షల రూపాయలున్న ఎగుమతులు 1864-65లో 43.6 లక్షల రూపాయలకు పెరిగింది. 1901 సం॥లో అలెప్పిలో వీటిని నేత నేయడానికి పరిశ్రమ స్థాపించి 1100మందిని పనిలోకి తీసుకున్నారు. మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభానికి ముందు ఎగుమతులు తారాస్థాయికి చేరుకున్నాయి. కానీ యుద్ధానంతరం పరిస్థితులు మారాయి. పారిశ్రామికవేత్తలకు కార్మికుల కొరత ఏర్పడింది. వారు గ్రామాలకు వెళ్ళి వ్యవసాయదారుల్ని బ్రతిమాలి పారిశ్రామిక కార్మికులుగా తెచ్చుకోవడం ప్రారంభించారు. 1930లలో కేవలం ఒక్క అలెప్పి ప్రాంతం పరిశ్రమలలో 1,33,000 మంది, ముడిసరుకు తయారుచేసే కుటీర పరిశ్రమ లలో 32000 మంది ఉన్నారు.

ట్రావెంకోర్ లేబర్ అసోసియేషన్(ఎఐటియుసి) 1922లో ప్రారంభమై అతి త్వరలోనే అత్యంత బలమైన సంస్థగా ఏర్పడింది. అప్పటి చరిత్ర కారులు చెప్పిన మాట.. ఈ యూనియన్ నాయకులు, కార్మికవర్గం కేవలం ఆర్థికసమస్యల గురించేకాక సుశిక్షితులైన రాజకీయ దురంధరులుగా రూపాంతరం చెందారు. ఒక క్రమశిక్షణ కలిగిన కార్మికవర్గంగా ఉద్యమాలు చేపట్టారు. 1931 నుండి యాజమాన్యాలు వారికివ్వవలసిన జీతాలలో కోతలు ప్రారంభించాయి. ఉద్యోగభద్రత కొరవడింది. కొబ్బరిపీచు పరిశ్రమలో రెండురకాలు. మొదటిది ముడిసరుకు తయారు చేసేది, రెండవది అసంఘటితరంగంలో వస్తువులుగా రూపాంతరం చేసేది. సంఘటిత రంగమున్న పరిశ్రమలో.. అసంఘటిత రంగంలో దాదాపు 90% పైగా మహిళలే, సంఘటిత రంగంలో 25% పైగా మహిళలు ఉండేవారు. రోజురోజుకు దిగజారుతున్న వేతనాలు, అపరిశుభ్రమైన పని ప్రదేశాలు, విపరీతమైన పనిగంటలు, కార్మికులలో అశాంతి చెలరేగి అనేక ఉద్యమాలు, పోరాటాలు మొదలయినాయి. సంఘటితమైన కార్మికవర్గం పటిష్టమైన యూనియన్ నాయకత్వంలో కార్మిక చట్టాల కోసం డిమాండ్ చేసింది. చివరికి మొత్తం రాష్ట్రంలో 1938లో సార్వత్రిక సమ్మె పిలుపు వచ్చింది. 21 అక్టోబరు 1938 నాడు సమ్మె ప్రారంభమైంది. ప్రతిరోజు సంఘర్షణే. ప్రతిరోజు పోరాటమే. మహిళలందరూ పెద్దసంఖ్యలో భాగస్వాములయ్యారు. 24.10.1938 నాడు కార్మికుల మీద మిలటరీ తుపాకులు పేల్చారు. ఆ ఘటనలో అమ్ము, సుభోద అనే ఇద్దరు మహిళా కార్మికులు తూటాలకు బలి అయ్యారు. అయినా మొక్కవోని ధైర్యంతో మహిళలంతా పోరాటం చేస్తూనే ఉన్నారు. వారి బలిదానంతో, దీక్షతో అనేక డిమాండ్లు సాధించుకోగలిగారు. 15 నవంబరు 1938న సమ్మె విరమణ జరిగింది. అటుపిమ్మట 1941లో ప్రతి ప్రరిశ్రమలోనూ మహిళా కమిటీలు వేశారు. దాని ద్వారా వారికి కూడా కార్మికులను సంఘటితపరచడానికి సరైన శిక్షణ అందచేసేవారు.

ఇదే రంగంలో మరొక చారిత్రాత్మకమైన పాత్ర పోషించి జీవితాంతం సమస్యలతో కష్టాలతో పోరాటం చేసిన మహిళ కె.దేవయాని. ఆమెకు 15 సం॥ల వయస్సులో 1936లో కేవలం మహిళా కార్మికుల కోసమే కార్యరూపిరి తోజివారి యూనియన్ అని అలెప్పీ తాలుకాలో ప్రారంభించింది. కానీ అతి త్వరలోనే ప్రధాన స్రవంతిలో కలిసి మహిళా కార్మికులను పెద్దసంఖ్యలో కార్యోన్ముఖులను చేయగలిగింది. తన స్నేహితులు మీనాక్షి, దాక్షాయని, భవానీలతో కలిసి కమ్యూన్ జీవితం గడుపుతూ మహిళలకు ముఖ్య కార్యకర్తల శిబిరాలు నిర్వహించేది. కాయిర్ వర్కర్స్ తమ పని ముగించుకుని ఆ శిబిరాలలో శిక్షణా తరగతులకు హాజరయ్యేవారు. పారిశ్రామిక మహిళలే కాక

వ్యవసాయక్షేత్ర మహిళలను కూడా సమస్యలపై చైతన్యవంతుల్ని చేసి కాలర్కోడ్ వ్యవసాయ క్షేత్రంలో వారితో సమ్మె చేయించి విజయం సాధించారు. అప్పుడు వారి జీతాలలో 6 అణాలు పెరిగింది. మధ్యాహ్నం అరగంట విరామం దొరికింది. ఆమె మీద పోలీసుల దాడులు క్రమక్రమంగా పెరగసాగాయి. ఒకరాత్రి పోలీసులనుండి తప్పించుకోవడానికి రాత్రంతా స్మశానంలోనే గడపాల్సి వచ్చింది. ఆమె కూతురు రాధామ్మాల్ పేదరికంలో సరైన పోషణ లేక చనిపోయింది. ఈ ఘటన కరివెల్లూరు పోరాటం సమయంలో జరిగింది. అందుకే ఆ పాపని పోరాట మొదటి అమరవీరుడుగా ఉద్యమం కీర్తించింది. తర్వాత దేవయాని పున్నప్రవయలార్ పోరాటంలో మహిళలను సమాయిత్తం చేశారు. జీవితంలో అనేకసమస్యలతో పాటు పేదరికంతో కూడా పోరాటం చేసింది. మహిళా కార్మికులంతా దాదాపు నిరక్షరాస్యులవటంతో వారిని తిరువత్తిర (విప్లవకర) గీతాలతో ఉత్తేజితుల్ని చేసేవారు. మహిళలు యూనియన్లో పని చేయడానికి మహిళా నాయకులు తమ శాయశక్తులా కృషి చేశారు.

మొట్టమొదటి పారిశ్రామికవాడలలో మరో ముఖ్యమైన పరిశ్రమ బెంగాలులోని జూట్ పరిశ్రమ. కలకత్తా పట్టణంలోని బారానగర్ ప్రాంతంలో అనేక జూట్ మిల్లులుండేవి. 1930లలో భర్తతో పాటు పొట్ట కూటి కోసం ఉపాధి వెతుక్కుంటూ కలకత్తాకు చేరిన దుఖ్మత్దీదీ అనే మహిళ జూట్మిల్లులో పనికి చేరారు. భార్యభర్తలిరువురూ కార్మికులుగా మెషీన్ రూమ్ల్లో పని చేసేవారు. వారికి కేవలం రోజుకి ఆరు అణాలు కూలీ దొరికేది. ఆమెతో పాటు ఆ మిల్లులో దాదాపు ఆరేడు వందల మంది మహిళా కార్మికులు పని చేసేవారు. దారుణమైన వేతనాలతో ఉపాధి భద్రత లేకుండా దోపిడీకి గురయ్యేవాళ్ళు. ఈ పరిస్థితికి ఆగ్రహించిన దుఖ్మత్ మహిళా కార్మికులను చైతన్యపరచటం ప్రారంభించారు. మహిళా కార్మికులందరూ ఐక్యమై ఈ అణచివేతకు వ్యతిరేకంగా పోరాడాలని ఆమె బోధించారు. ఈ దోపిడి అణచివేతలకు బలయ్యే కంటే పోరాడి మరణించడం మేలని వాళ్ళలో చైతన్యం రగిలించారు.

1946వ సంబబలో బారానగర్ జూట్ మిల్లులో 14000 మంది కార్మికులు సమ్మె చేశారు. మిల్లు గేటు వద్ద మేనేజర్ కారును ఘెరావ్ చేయడంలో 700 మంది మహిళా కార్మికులతో దుఖ్మత్ సమరశీల పాత్ర పోషించారు. చివరకు పాక్షిక విజయం సాధించారు. 1947 స్వాతంత్ర్యానంతరం ఫ్యాక్టరీ విషయాలు చర్చించడంలో భాగస్వాములయ్యేందుకు కార్మిక సంఘాల ప్రతినిధుల కమిటీకి గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలంటూ కార్మికసంఘాల ఒత్తిడి ఫలితంగా 1950లో యాజమాన్యం అంగీకరించింది. ఆ ఎన్నికలలో మొదటగా అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఎఐటియుసి) ప్రతినిధిగా దుఖ్మత్ ఎన్నికయ్యారు. 1953 సం॥లో కలకత్తాలోని డల్హౌసి ప్రాంతంలో భారత జూట్మిల్లు అసోసియేషన్ ప్రధాన కార్యాలయాన్ని 20,000 మంది జూట్ కార్మికులు చుట్టు ముట్టారు. దుఖ్మత్ దానికి నాయకత్వం వహించారు. జూట్ కార్మికుల విముక్తికి ధనస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా వర్గపోరాటం మాత్రమే పరిష్కారం అంటూ తన జీవిత కాలమంతా నిర్విరామంగా ప్రచారం చేశారామె. వేతనాల పెంపుదల కోసం, ప్రమాదాలలో నష్టపోయిన వారికి వైద్యసౌకర్యం, నష్టపరిహారం, స్త్రీలకు ప్రసూతి సౌకర్యం, అలవెన్సులు, పెన్షన్ సౌకర్యం మొదలైన వాటికోసం ఆమె నిర్విరామ కృషి చేశారు.

జూట్ కార్మిక మహిళలకు నాయకత్వం వహించటమే గాకుండా దుఖ్మత్ దేశంలో పెద్ద ఎత్తున కరువుకాటకాలు ఏర్పడిన కాలంలో ఆహార సమస్యపై పోరాటం వంటి ఇతర ప్రగతిశీల సాంఘిక కార్యక్రమాల్లో సైతం మహిళలను కదిలించి నాయకత్వం వహిస్తున్నందుకు ఆమెను అరెస్టు చేయడానికి పోలీసులు పెద్దఎత్తున వచ్చి ఆఫీసు చుట్టుముట్టినప్పుడు దుఖ్మత్ పురుష వేషం ధరించి పోలీసుల మధ్యనుండే అవలీలగా బయట పడ్డారు. బారానగర్ జూట్మిల్లు ప్రాంతంలోని చీకటిగుహలా ఉండే మురికివాడలో కార్మికులతో పాటు ఒక చిన్న గదిలో అతి నిరాడంబరంగా జీవించేవారామె. ఆమెకు తనదంటూ కుటుంబం లేదు. మొత్తం ఆ మురికివాడలోని కార్మికులనే తన కుటుంబంగా భావించారామె. ఐక్యంగా కలిసి ముందుకుసాగు– ప్రతిఘటించు అనేది ఆమె నినాదం. ఆమె శ్రామికవర్గంలో పుట్టి కార్మికురాలుగా పని చేస్తూ వేలాదిమంది జూట్ కార్మికుల పోరాటాలకు నాయకత్వం వహించారు. ఆమె ఒక సమరశీల కార్మికనేత. అక్కడి ప్రజలు ఆమెను ఆప్యాయంగా దుఖ్మత్ దీదీ (అక్క) అని పిలుచుకునేవారు. 84 సం॥ల వయస్సులో 1994 నవంబరులో ఆమె మరణించారు. దుఖ్మత్ దీదీ లాంటి ధీర వనితలు జూట్ మిల్లులలో, ఇతర అనేక పరిశ్రమలలో ధైర్య సాహసాలతో యూనియన్లలో కార్మికులను చైతన్యపరచడానికి సమస్యల పరిష్కారానికి ముందుండటంలో నిర్మాణాత్మక, నాయకత్వ పాత్ర పోషించినవారు ప్రతి ప్రాంతంలోను ఉన్నారు. అందుకే అంత బలమైన కార్మికసంఘాలు నెలకొన్నాయి. 1956లో ఆంధ్రప్రదేశ్

కన్నా ముందు ఉన్న ఆంధ్ర రాష్ట్రంలోను, హైదరాబాదు సంస్థానం లోనూ అనేక పరిశ్రమలు వచ్చాయి. ఇందులో జూట్ మిల్లులు, బట్టల మిల్లులు, పొగాకు పరిశ్రమ, బీడీ పరిశ్రమ ప్రధానమైనవి. ఈ పరిశ్రమలలో మహిళలు చాలా పెద్దసంఖ్యలో పనిచేసేవారు. ఈ పరిశ్రమలన్నింటిలో మహిళల ఆరోగ్యానికి హానికరం అయినప్పటికీ, అతి తక్కువ వేతనాలు ఉన్నప్పటికినీ వేరే గత్యంతరం లేక ఈ పనిలో చేరేవారు. వారితో పాటు వారి పిల్లల్ని కూడా తీసుకువెళ్ళేవారు. తల్లులు, పిల్లలు కూడా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడేవారు. హైదరాబాదులో బట్టల మిల్లులతో పాటు అనేక ఇతర పరిశ్రమలుండేవి. అగ్గిపెట్టెలు, అగరుబత్తీలు, బీడీలు, గాజులు, మందుల కంపెనీలు, సిగరెట్టు ఫ్యాక్టరీలు వగైరా వీటన్నింటిలో మహిళలు అధిక సంఖ్యలో పని చేసేవారు. హైదరాబాదులో చాలా పారిశ్రామికవాడలు వెలిశాయి. ఇవేకాక అసంఖ్యాక మహిళలు అసంఘటిత రంగంలో పని చేస్తున్నారు. ఆంధ్రపాంతంలోని ఇతర పరిశ్రమలతో పాటు పొగాకు పరిశ్రమలో మహిళలు పెద్దసంఖ్యలో పని చేసేవారు. విజయవాడ గొల్లపూడిలోని ఐటిడిసి పొగాకు గోడౌన్లలో పనిచేసే మహిళా కార్మికులను సంఘటిత పరచడానికి జోస్యభట్ల సుబ్బమ్మ నిరంతరం కృషి చేశారు. ఇలా...వారిని నిర్మాణంలోకి తీసుకు రావడమే గాక వారి సమస్యల్ని పరిష్కరించటంలో చాలా కృషి చేశారు. వారందర్నీ ప్రధాన సామాజిక స్రవంతిలోకి తీసుకు రావటంలో కృత కృత్యులయ్యారు. వ్యవసాయ మహిళాకార్మికులకు సమాన పనికి సమానవేతనం కోసం నిత్యం పోరాటాలు చేశారు. అలాగే గుంటూరులోని అసంఖ్యాక పొగాకు గోడౌన్లలో వేలాది మంది మహిళా కార్మికులు పని చేసేవారు. వారిని చైతన్యపరచ డంలో అనేకమంది మహిళా నాయకులు పని చేశారు. వారిలో భాగ్యమ్మ ఒకరు. భాగ్యమ్మ కార్మికులతోనే గాక ఇతర సామాజిక కార్యక్రమాల్లో కూడా చురుకైన పాత్ర పోషించారు. కానీ ఇప్పటికీ ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ సమస్య అపరిష్కృతంగానే ఉండటం శోచనీయం. కానీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటియుసి నిరంతర పోరాటాలు నిర్వహిస్తూనే ఉన్నాయి. తెలంగాణ సాయుధ పోరాటంలో కొరియర్‌గాను, ఆయుధాలు చేరవేయటంలోను అతి సమర్థవంతంగా పనిచేసిన శ్రీమతి ప్రమీలాతాయి తర్వాత కాలంలో అంతే సమర్ధవంతంగా యూనియన్లను ఏర్పాటు చేశారు. యువతులు పనిచేసే బిస్కట్ ఫ్యాక్టరీలలో ఏఐటియుసి యూనియన్లు నెలకొల్పి వారి హక్కులు సాధించుకోవడంలో కృషి చేశారు. మరో తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత కామ్రేడ్ బ్రిజ్రాణీగౌర్ మహిళా సమాఖ్యలో పని చేస్తూనే అనేకమంది అసంఘటిత రంగంలో పని చేస్తున్న శ్రామిక మహిళలను ఉత్తేజితులను చేశారు. వారి హక్కులను సాధించటంలో విస్తృత కృషి చేశారు. భర్త డాక్టర్ రాజ్ బహదూర్‌తో పాటు పాకీ పనివారికి ఏర్పాటైన కాలనీలోనే అతి నిరాడంబరంగా జీవించేవారు. రాష్ట్ర రవాణా శాఖ (ఏపిఎస్ఆర్టిసి) లో పని చేసినటు వంటి శ్రీమతి పద్మానాయుడు (నాయుడమ్మ) అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తునే రవాణాశాఖలోని మహిళా కార్మికులను పెద్దసంఖ్యలో ఉద్యమాల్లో భాగస్వాముల్ని చేశారు. వారిలో రుక్మిణి, శాంతా ప్రముఖులు. ఒకసారి 1960 లలో రవాణా శాఖలో సుదీర్ఘ సమ్మె జరిగింది. పద్మానాయుడు అందులో చురుకైన పాత్ర పోషించటమేగాక అక్కడి కాలనీలోని కార్మిక కుటుంబాలందర్నీ పిల్లలతో సహా సమ్మె కార్యక్రమాల్లో దింపారు. అప్పుడు నాయుడమ్మ గారి మీద విపరీతమైన లాఠీచార్జీ జరిగి పదిరోజులపాటు జైలులో నిర్బంధించడం జరిగింది. ఆ లాఠీ దెబ్బల మచ్చలు, నొప్పులు నెల రోజులయినా తగ్గలేదు. మనదేశ జాతీయోద్యమంలో ఏ విధంగానయితే మహిళలు ఉత్తేజితులై పోరాట అగ్రభాగాన నిలిచారో అదే విధంగా ఆ కాలం నుండీ కూడా వర్గచైతన్యం పొందిన మహిళలు కార్మికోద్యమ నిర్మాణంలో చాలా త్యాగాలు చేశారు. లాఠీలకు, తూటాలకు వెరవకుండా ముందుకు నడిచారు. మరొక్క విషయం మన రాష్ట్రాలలో ఉన్న మెడికల్ మరియు ఆరోగ్య శాఖలలో పని చేసే మహిళలు ఏఐటియుసి మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్లను అజేయంగా గత 70 సం॥ల నుండి కూడా మొక్కవోని దీక్షతో ముందుకు తీసుకెళ్ళడానికి కృషి చేస్తున్నారు. మన బీడీ యూనియన్లు, ఇతర అన్ని సంఘాలలో కూడా అలాగే అనేక అసంఘటితరంగ యూనియన్లను నెలకొల్ప డానికి విజయాలు సాధించడానికి క్షేత్రస్థాయిలో చాలా నిర్మాణయుతంగా పని చేస్తున్నారు. కానీ నాయకత్వంలోకి రాలేకపోవడానికి కేవలం వారి ఇంటి బాధ్యతలే కారణం గాకుండా పురుషాధిక్య సమాజం అన్ని రంగాలలో విస్తరించి అవరోధాలు సృష్టిస్తున్నది. అయినప్పటికీ గడప దాటడమే తప్పనుకునే రోజుల నాడే స్త్రీలు తమ శక్తిసామర్థ్యాలు నిరూపించుకున్నారు. మధ్యతరగతి మహిళలు, ఉద్యోగినులైన మహిళలు ఉద్యమాలలో పాల్గొనడం చిన్నతనంగా భావించే ధోరణి ఇప్పటికీ సమాజంలో ఉన్నప్పటికి వర్గదృక్పథాన్ని అలవర్చుకున్న మహిళా కార్మికులు దేనికీ వెనుకాడటం లేదు. మరొక గుర్తు పెట్టుకోవాల్సిన అంశం.. కన్నన్

దేవన్ హిల్స్ ప్లాంటేషన్ అనే అతి పెద్ద టీ ఎస్టేట్ కేరళలోని మూనార్ కొండల మీద ఉంది. అందులో సెప్టెంబరు 2015లో దాదాపు 5000 మందికి పైగా మహిళా కార్మికులు వేతన పెంపునకై ఆకస్మిక సమ్మె చేపట్టారు. రోజుల తరబడి శాంతి యుతంగా సమ్మె జరిగింది. వారికి నిర్మాణయుతమైన కార్మిక సంఘం లేదు. అయినప్పటికీ వారి సంఘటిత శక్తితో డిమాండ్లను సాధించుకోగలిగారు. చివరిలో ఎఐటియుసికి చెందిన మహిళా ఎమ్ఎల్ఎ బిజు సహాయంతో చర్చలు ఫలవంతమైనాయి. సెప్టెంబరు 2016లో కేంద్రప్రభుత్వం ప్రావిడెంట్ ఫండ్ ఖాతా లోంచి డబ్బులు డ్రా చేసుకోవడానికి కొన్ని ఆంక్షలు విధించింది. ఈ వార్త వచ్చి వెంటనే బెంగుళూరులోని దుస్తుల పరిశ్రమలోని లక్షా 20 వేల మంది మహిళా కార్మికులు రోడ్డు మీదికొచ్చారు. కొద్ది గంటల వ్యవధిలోనే ఇతర పరిశ్రమలో వారంతా చేరారు. ఈ మహిళా కార్మికులు రెండు రోజులపాటు బెంగుళూరు పట్టణాన్ని దిగ్బంధం చేశారు. చివరికి కేంద్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని మార్చుకోక తప్పలేదు. దీనిని బట్టి మనకు అర్థమయ్యేదేమిటంటే మహిళలకు సమస్య అర్థమయినట్లయితే వారు ఐక్యమత్యంగా స్పందించే సహజగుణం ఉంది. వారిని ఉద్యమాలలోకి మరింత ఎక్కువగా ప్రోత్సహించాలి. ప్రత్యేకించి అసంఘటిత రంగంలో నేటికీ సమస్యలు ఎక్కువగా పెరుగు తున్నాయి. ఉద్యోగ, వేతన, సామాజిక భద్రత లేదు. వ్యవసాయ కూలీలు, చిరువ్యాపారులు, ఇంటి పనివారు, అంగన్ వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు వంటి ఎందరికో "కార్మిక" గుర్తింపు లేదు. అతి తక్కువ వేతనాలతో దోపిడీకి గురవుతున్నారు. అనేక పోరాటాల్లో ముందంజలో ఉండే వీరంతా వారి శక్తి సామర్థ్యాలతో చిన్న చిన్న గెలుపులు సాధించుకోగలిగారు. ఇంకా సాహసోపేత మైన ఐక్యపోరాటాలు ముందున్నాయి. దానికీ వారందరూ సమాయత్తం కావాలి. వారికి మరింత స్ఫూర్తినీ, ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని కల్గించాల్సిన బాధ్యత మనందరిదీ. క్లారాజెట్కిన్, రోజాలగ్జెంబర్గ్, మేరీజోన్స్ లాంటి అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన మహిళల సరసన మన కార్మిక మహిళా నాయకులు అనేకమంది. లండన్‌లో విద్యనభ్యసించి జాతీయోద్యమంలో పాల్గొని కోయంబత్తూరు మిల్లు కార్మికులతో పనిచేసి మూడుసార్లు పార్లమెంటుకు ఎన్నికైన కార్మిక నాయకురాలు మన కామ్రేడ్ పార్వతికృష్ణన్, ఎఐటియుసి ఉపాధ్యక్షులుగా పనిచేశారు. 5000 ఎకరాల భూమి కలిగిన ధనిక కుటుంబంలో జన్మించి వాటిని తృణప్రాయంగా త్యజించి, జీవితమంతా కార్మికుల కోసం పోరాటాలు చేశారు. 94 ఏళ్ళ వయస్సులో 20 ఫిబ్రవరి 2014న మరణించారు. ముంబయిలో అత్యంత సాహసోపేతమైన కార్మిక ఉద్యమాల్లో పనిచేసిన ఉషాతాయి కూడా అదే కోవలోకి చెందుతారు. 1929లో జరిగిన అతిపెద్ద టెక్స్‌టైల్ మిల్లు కార్మికుల సమ్మెలో పాల్గొంటూ, మిల్లు యాజమాన్యాన్ని గేటులోనికి రానివ్వ కుండా తన నెలల పసిబిడ్డను గేటు దగ్గర పడుకోబెట్టిన ధీరురాలు. మిల్లు మేనేజర్ని ఒక రాత్రంతా ఘెరావ్ చేసి కదలనీయకుండా చేసిన మహిళా కార్మికులకు నాయకురాలు ఉషాతాయిడాంగే. ఆనాటి ఆ నెలల పసిబిడ్డనే రోజాదేశ్‌పాండే. తన తల్లిదండ్రుల పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకుని కార్మిక నాయకురాలిగా ఎదిగారు. రోజాదేశ్‌పాండేను బొంబాయివాసులు బొంబాయి రెడ్‌రోజ్ అని ప్రేమగా పిలుచుకుంటారు. బొంబాయిలో ఉన్న అనేక బట్టల మిల్లులతో పాటు అనేక ఫార్మాసుటికల్ కంపెనీలలో యూనియన్లకు ఆమె నాయకత్వం వహించారు. ఈ రోజు అక్కడి మందుల కంపెనీలలో ఉన్న స్థితిగతులు మారాయంటే అవి రోజా వల్లనే అని ఆ కార్మికులు నమ్ముతారు. అప్పటికి అవివాహిత మహిళల్ని మాత్రమే మందుల కంపెనీలో పనికి తీసుకునేవారు. పెళ్ళికాగానే ఉద్యోగంలోంచి తీసివేసేవారు. అలాగే ఎయిర్–ఇండియాలో కూడా ఉండేది. రోజాదేశ్‌పాండే ఈ విధానం మారాలని అనేక పటిష్టమైన ఐక్య పోరాటాలు నిర్విరామంగా చేశారు. చివరికి యాజమాన్యాలు దిగి రాక తప్పలేదు. అంతటి కార్యశూరురాలామె.. 1994లో పార్లమెంట్‌కు అత్యధిక మెజారిటీ తో గెలిచారు. పార్లమెంట్‌లో కూడా తన అనర్గళ ఉపన్యాసాలతో అదరగొట్టి అనేకమందికి ప్రీతిపాత్రులయ్యారు. తన 91సం|| జీవితాన్ని ఇటీవలే 19 సెప్టెంబరు 2020న ముగించారు. వీరే గాక చరిత్రలో పేర్లు కనపడని అనామక మహిళా మణులెందరో చూపిన కార్యదక్షత, నిర్మాణం ఎంతో గొప్పవి. వీరందరి త్యాగ ఫలితమే మన వంద సంవత్సరాల చరిత్ర. వీరు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, వారు తమ జీవితంలో అనుసరించిన ఆదర్శాలు, ప్రజలపై, కార్మికులపై వారికి గల అంకితభావాన్ని, త్యాగాన్ని వారి నుండి నేర్చుకోవాలి, అనుసరించాలి, ఆచరించాలి. స్త్రీ పురుష బేధం లేకుండా కార్మికులందర్ని వర్గపోరాటానికై సుశిక్షితులైన సైన్యంగా తయారు చేయాలి. ❑

*విశాలాంధ్ర సౌజన్యంతో..*

# సారా వ్యతిరేక ఉద్యమ సారథి దూబగుంట రోశమ్మ



నెల్లూరు జిల్లా జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెంలోని ఓ సామాన్య రైతు జక్కంపూడి పిచ్చయ్య, సుబ్బమ్మలకు మూడో సంతానంగా జన్మించారు రోశమ్మ. 16వ ఏటనే కలిగిరి మండలం తూర్పు దూబగుంటకి చెందిన వర్థినేని కొండయ్యతో ఆమెకు వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె.

సాఫీగా సాగుతున్న వారి కుటుంబంలో సారా మహమ్మారి చిచ్చు పెట్టింది. సారాకు బానిసై భర్త చనిపోగా..ఇద్దరు కొడుకులు కూడా సారా మత్తులో తూగుతుండేవారు. సారా తన కుటుంబాన్నే కాకుండా ఎందరి జీవితాలనో కకావికలం చేయడం..లెక్కకు మిక్కిలి కుటుంబాలు రోడ్డున పడటం ఆమెను కలచివేసింది. దీంతో ఈ రక్కసిని తరిమికొట్టేదెలా..? ఇవే ఆలోచనలు ఆమెకు నిద్ర లేకుండా చేశాయి. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా "అక్షర దీపం" కార్యక్రమం ఊపందుకుంది.

సారా తాగి మగాళ్లు పెట్టే బాధలకు విసుగుచెందిన దూబగుంట మహిళలు, అక్షరదీపం పుస్తకాల్లో "సీతమ్మకథ" పాఠం స్ఫూర్తితో 1993 అక్టోబర్ రెండో తేదీన గ్రామానికి వస్తున్న కల్లు, సారా వాహనాన్ని ఊరు బయటే అడ్డుకున్నారు. అంతే కాకుండా జీపులోని కల్లు, సారా ప్యాకెట్లను తగులబెట్టారు. వ్యాపారులు, పోలీసుల సాయంతో అమ్మకాలు జరపాలని చూశారు. కొందరు మగాళ్లు తమ ఇళ్లలో మహిళలపై దాడులు చేయడంతో కొంత మంది మహిళలు వెనక్కి తగ్గారు. కానీ రోశమ్మ మాత్రం వెనకడుగు వేయలేదు. సారా మాఫియా ఆగడాలు, పోలీసుల కేసులు, పెద్దల బెదిరింపులు వంటి ఎన్నింటినో తట్టుకుని ఉద్యమంలా ముందుకు సాగారు. జిల్లాలోనే గాక రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి మహిళల్లో చైతన్యం తీసుకువచ్చారు.

అలా ఆంధ్రదేశం మొత్తం సారా వ్యతిరేక ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడింది. మహిళల్లో చైతన్యం పెరిగింది. రాజకీయ పార్టీలు ఉద్యమ తీవ్రతను గుర్తించాయి. రోశమ్మ ఉద్యమంతో కదిలిన ఆనాటి ప్రతిపక్షనేత ఎన్టీఆర్ తన ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధికారంలోకి వస్తే "సంపూర్ణ మద్యపాన నిషేధం" అమలు చేస్తామని ప్రకటించారు.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం 1995 జూన్ 1 నుంచి సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తున్నట్లుగా ప్రకటిస్తూ ఎన్టీఆర్ తొలి సంతకం చేశారు. అది చూసిన రోశమ్మ ఆనందానికి అవధుల్లేవు.

ఇలా రోశమ్మకు లభించిన గుర్తింపు ఆమె పేరును మార్చేసింది. అప్పటి నుంచి ఆవిడ "దూబగుంట" రోశమ్మగా మారిపోయారు. రాష్ట్రంలో అంతటి కదలిక తెచ్చి మద్యపాన నిషేధాన్ని సాధించిన రోశమ్మ చివరి దశలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. ప్రభుత్వం నుంచి ఆమెకు ఎటువంటి సాయమందలేదు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ.. కనీసం వైద్య పరీక్షలు చేయించుకునే ఆర్థిక స్థోమత కూడా లేక మంచం పట్టారు. మూడు రోజుల నుంచి పరిస్థితి మరింత క్షీణించడంతో నిన్న ఉదయం ఎనిమిది గంటల సమయంలో 93 ఏళ్ల వయసులో రోశమ్మ తుదిశ్వాస విడిచారు. మంచంలో ఉండే చనిపోతానని తెలిసి కూడా సంపూర్ణ మద్యనిషేధమే తన చివరి కోరికని చెప్పడం ఉద్యమం పట్ల ఆమెకున్న పట్టుదలను తెలియజేస్తోంది. ❑






# మహిళా గ్రూపుల అక్షరాస్యతా ఉద్యమం

డా॥ సి. కృష్ణమోహనరావు

ప్రజల అవసరాలకు, ఆసక్తులకు అనుగుణంగా రూపొందిస్తే ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా ప్రజలు, ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొంటారనేదానికి ఉదాహరణ పశ్చిమగోదావరి జిల్లాలో 2000 సంవత్సరంలో నిర్వహించిన 'అక్షర మహిళా' కార్యక్రమం. ఒక ఉద్యమంగా మహిళా స్వయం సహాయక సంఘాలు నిర్వహించుకున్న ఈ నిర్మాణాత్మక కార్యక్రమం మహిళా అక్షరాస్యత పెంపొందించడమే కాకుండా మహిళా సాధికారతకు ఎంతో దోహదం చేసింది.

1995 లో ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించడానికి డ్వాక్రా (Development of Women and Children in Rural Areas) కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. గ్రామీణ మహిళలు ఉపాధి నైపుణ్యాలు, ఆదాయాలు పెంపొందించుకోవడం ఈ కార్యక్రమం లక్ష్యం. దీనిలో గ్రామీణ ప్రాంతాలలోని మహిళలు ఒక సంఘంగా ఏర్పడి, పొదుపు ఆర్థికమైన కార్యక్రమాలలో ఒకరికొకరు సహాయం చేసుకుంటూ సంఘంలోని అందరు సభ్యుల ఆర్థిక పురోగతికి దోహదం చేయాలి. ఈ కార్యక్రమం మొదటి దశలో అనేక మంది మహిళలు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసుకొని ఆర్థిక కార్యక్రమాలు నిర్వహించుకోవడం ప్రారంభించారు. అయితే చదువు రాని మహిళలు ఈ కార్యక్రమాల్లో పాల్గొనలేక సంఘాలు ఏర్పాటు చేసుకోవడంలోనూ, ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించు కోవడంలోనూ ఇబ్బందులు పడ్డారు. ఇది గమనించిన పశ్చిమ గోదావరి జిల్లా యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు ముఖ్యంగా జాతీయ వేదిక సహకారంతో అక్షర మహిళ కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిలో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థిక కార్యక్రమాల్లో ఏ విధంగా భాగస్వాములవుతారో అదే విధంగా అక్షరాస్యతలోనూ భాగస్వాములు కావాలి. అంటే మహిళా సంఘాలలోని చదువుకున్న సభ్యులు చదువురాని మహిళలకు చదువు నేర్పాలి. ఒక వేళ సంఘంలో ఎవరికీ చదువు రాని పక్షంలో సంఘం తరపున గ్రామంలోని చదువుకున్న వ్యక్తుల సహాయంతో సంఘ సభ్యులకు చదువు నేర్పాలి. దీనికి సంఘం మొత్తంగా బాధ్యత వహించాలి. సంఘ సభ్యులు ఆర్థిక వనరులు ఏ విధంగా పంచుకుంటున్నారో విద్య కూడా అదే విధంగా పంచుకోవాలి. ఈ స్వయం సహాయక స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది.




అప్పటివరకు వ్యక్తి ఆధారంగా నిర్వహింపబడుతున్న అక్షరాస్యతా కార్యక్రమం మొట్టమొదటిసారిగా గ్రూప్ ఆధారంగా నిర్వహించడం మొదలుపెట్టారు. అక్షరాస్యత అనేది స్వతంత్ర కార్యక్రమంగా కాకుండా గ్రూప్ కార్యకలాపాలలో ఒక భాగం చేయడం జరిగింది. ఇది దేశంలోనే మొదటిసారి నిర్వహించిన వినూత్న ప్రయోగం. వ్యక్తి ఆధారంగా నిర్వహించుకునే కార్యక్రమాల్లో ఉండే అనేక ఇబ్బందులు ఇందులో తొలగి పోయాయి. చదువురాని మహిళలను చదువుకు ప్రోత్సహించే బాధ్యత ఈ స్వయం సహాయక సంఘాలు తీసుకోన్నాయి. అదే విధంగా చదువుకు అనుకూలమైన వాతావరణాన్ని, వసతులను కల్పించే బాధ్యత కూడా ఈ సంఘాల తీసుకున్నాయి. అక్షరాస్యత నేర్పడానికి కావలసిన బోధనాభ్యాసన పరికరాలు, పుస్తకాలు స్థానిక స్వచ్ఛంద సంస్థల ద్వారా స్వయంసహాయక సంఘాలకు అందజేయడం జరిగింది. చదువు నేర్పటానికి కావాల్సిన వాలంటీర్ల శిక్షణ మాత్రమే జిల్లా యంత్రాంగం ఇచ్చింది. తక్కువ సమయంలో అంటే షుమారుగా మూడు నెలల కాలంలో చదువు పూర్తి చేయడానికి వీలుగాను, మహిళల జీవితాలకు సంబంధించిన అంశాలతో వయోజనవాచకాలు రూపొందించడం జరిగింది. స్త్రీల నిత్యజీవిత సమస్యలు చర్చించడంతోఈ పుస్తకాలు మహిళల్లో ఎంతో ఆసక్తిని రేకెత్తించాయి.

2000 సంవత్సరం ఏప్రిల్ 5 వ తేదీన ప్రారంభించిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు. మొదటి దశలో 4,500 గ్రూపుల్లో అక్షరాస్యతా

తరగతులు నిర్వహించగా 37,283 మంది అక్షరాస్యులు అయ్యారు. తరువాత వివిధ దశల్లో సుమారు 10 వేల గ్రూపులకు విస్తరించి రెండు లక్షల మంది మహిళలు ఈ కార్యక్రమంలో భాగస్వాములై చదువు నేర్చుకోవడం జరిగింది. జాతీయ సేవా కార్యక్రమం ద్వారా అక్షరాస్యత పరీక్షలు నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమం జిల్లాలో అక్షరాస్యత శాతం పెరుగుదలకు దోహదం చేసింది. 1991లో 53.38 శాతం ఉన్న జిల్లా అక్షరాస్యత 2001 నాటికి 73.50కి పెరిగింది. ఈ దశాబ్ద కాలంలో అక్షరాస్యతలో అత్యంత పురోగతి సాధించినందుకు ఈ జిల్లాకు జాతీయ స్థాయిపురస్కారం లభించింది. అదే విధంగా యునెస్కో వారు అంతర్జాతీయ స్థాయిలో గుర్తించిన మూడు అక్షరాస్యత నమూనాల్లో 'అక్షర మహిళ' ఒకటిగా గుర్తించి, యునెస్కో -వైట్ హౌస్ సంయుక్తంగా నిర్వహించిన మొదటి ప్రపంచ అక్షరాస్యత సదస్సులో ఈ కార్యక్రమాన్ని వివరించడం జరిగింది.

ఈ కార్యక్రమ ప్రభావం ఇతర సామాజిక సూచికల పెరుగుదలలో కూడా చాలా స్పష్టంగా కనిపించింది. ఉదాహరణకు ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందు 85 వేల మంది పిల్లలు స్కూల్ బయట ఉండగా కార్యక్రమం తర్వాత 2001 నాటికి ఆ సంఖ్య 20 వేలకు తగ్గడం జరిగింది. అదే విధంగా కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాట్లు లోను సంఘాల ఆర్థిక పురోగతిలో కూడా ఈ కార్యక్రమం ప్రభావం కనిపించింది.

ఎటువంటి ప్రభుత్వ ఆర్థిక సహాయం లేకుండా మహిళా సంఘాలు స్వయంగా నిర్వహించుకున్న ఈ కార్యక్రమం అత్యంత విజయవంతమైన అక్షరాస్యత కార్యక్రమాల్లో ఒకటి. స్వయం సహాయక సంఘాల ద్వారా అక్షరాస్యత నిర్వహణకు ఒక నమూనాగా నిలిచింది. ఈ నమూనా ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం తరువాత దశలో అక్షర సంక్రాంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మహిళలు నిర్మాణాత్మక ఉద్యమాల్లో కీలకపాత్ర వహించగలరని, అవకాశాలు అందిపుచ్చుకుని సామాజిక ఆర్థిక పురోగతికి దోహదం చేయగలరని నిరూపించిన కార్యక్రమం 'అక్షర మహిళ' ❑

## జాతీయ ఉద్యమం - తూర్పుగోదావరి జిల్లా మహిళలు

**(17వ పేజీ తరువాయి)**

**1935-40 :** 1935లో భారత ప్రభుత్వ చట్టం అమలులోకి వచ్చింది. వివిధ ప్రదేశాలలో మహిళలు చట్టసభలలో అడుగుపెట్టారు. తూర్పు గోదావరి జిల్లా నుండి ఎవ్వరు ఎన్నిక అవ్వలేదు. సోషలిస్టు భావాలు కలిగిన మహిళలు కోటిపల్లి రైతు మహాసభలో పాల్గొన్నారు. వీరిలో మహీధర సీతాదేవి, పందిరి జగదాంబ, కంభంపాటి మాణిక్యాంబ మరియు ఉద్ధరాజు మాణిక్యాంబ ముఖ్యులు. 1931లో ర్యాలీలో జరిగిన రైతుసభలో కూడా పాల్గొని రైతు సమస్యలను చర్చించారు. పందిరి జగదాంబ కాకినాడలో కార్మికుల సమ్మెలో పాల్గొన్నందుకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉద్యమాల యెడల ఆసక్తి, దేశభక్తి కలిగిన మహిళలు ఎందరో సదాచారాల తెరల వెనుక ఉండిపోయారు.

**1939-45 :** వ్యక్తి సత్యాగ్రహం + క్విట్ ఇండియా ఉద్యమం రెండవ ప్రపంచ యుద్ధ బ్రిటీష్ ప్రభుత్వం భారత ప్రజల తరపున కూడా ప్రకటించడంతో జాతీయ కాంగ్రెస్ అభ్యంతరం తెలిపింది. సత్యాగ్రహం ప్రకటించింది. వ్యక్తి సత్యాగ్రహం 1939 నుండి 1941 వరకు కొనసాగింది. 1942 జూలైలో కాంగ్రెస్ కార్యాచరణ సంఘం ఒక క్రొత్త ప్రతిపాదన చేసింది. బ్రిటీషు వారు భారతావని నుండి 'వదలి వెళ్ళాలి' ఆ ప్రతిపాదనను ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అంగీకరించింది. దానిలో దేశాన్ని వదిలి వెళ్ళిపో నినాదం ఉద్యమంగా మారింది.

ఉద్యమంలో భాగంగా సమావేశాలు, పాదయాత్రలు, స్కూళ్ళు, కళాశాలల బహిష్కరణ, ఉద్యోగాల నుండి బహిష్కరణ మొదలైన కార్యక్రమాలు చేశారు. జాతీయ పాఠశాలలు, కళాశాలలు నిర్వహించడం మొదలయ్యింది. ఈ ఉద్యమంలో మహిళలలో చిన్నవాళ్ళు ఎక్కువగా పాల్గొన్నారు. ముఖ్యులలో రేచర్ల సామ్రాజ్యం, దిగుమర్తి బుచ్చికృష్ణమ్మ, దుళ్ళ విద్యావతి, బి.సుభద్ర, కె.సరళాదేవి, ఐ.కేశవమ్మ, కంభంపాటి కమలమ్మ మొదలైన వారు ఉన్నారు. రాజమండ్రి ప్రభుత్వ కళాశాల విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. వీరిలో అద్దేపల్లి వివేకానందాదేవి, దిగుమర్తి సరస్వతి, శకుంతలాదేవి ఉన్నారు.

ఈ విధంగా మహిళలలో దేశభక్తి కనిపించింది. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారు. వారిలో దాగిన ఆ శక్తి, నాయకత్వ లక్షణాలు వారి కార్యక్రమాల ద్వారా నిరూపణ అయ్యాయి. కాని సనాతన సంప్రదాయాలు చాలా వరకు వారికి ఆటంకాలుగా నిలిచాయి. ముఖ్యంగా ఆనాడు చదువులు సరిగ్గా లేక, ఇంగ్లీషు భాష రాక, ప్రోత్సాహం తగినంతగా లేక వారు ఉద్యమంలో పాల్గొన్న విషయాలు రికార్డుల్లోకి ఎక్కక సరైన గుర్తింపు లేకపోయింది. ❑



# పర్యావరణ పరిరక్షణ ఉద్యమాల్లో మహిళల మహోన్నత పాత్ర

**డా. పి.నారాయణ రావు**
పర్యావరణవేత్త

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా (మార్చి 8వ తేదీ) అన్ని రంగాల్లో లింగ స్వేచ్ఛ ,సమానత్వం కోసం పోరాడిన మహిళా నాయకులు సేవలను గుర్తు చేసుకుంటాం. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించిన, వహిస్తున్న మహిళామణుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.

నేటి పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారణాలు : పట్టపగ్గాలు లేని పారిశ్రామికీకరణ, వ్యవసాయ రసాయనికికరణ, అడవుల నిర్మూలన, పెద్దపెద్ద ఆనకట్టల నిర్మాణం, అడ్డగోలుగా గనుల తవ్వకం, బొగ్గు ఆధారిత విద్యుత్ ప్రాజెక్టులు తదితర అభివృద్ధి పేరుతో జరిపే చర్యలు...

ఈ చర్యల పర్యవసానాలైన వాతావరణ మార్పుల వలన వచ్చే వరదలు, కరువులు మూలంగా ఏర్పడే నీటి కొరత, సొంత ఇళ్ళ ధ్వంసం, వంటచెరకు లేమి, ఉపాధి కోల్పోవడం, ఆకలి విజృంభణ, ప్రాణాలకు ముప్పు మొదలగు వర్ణనాతీతమైన అన్నింటినీ ఎదుర్కోవడంలో మహిళలే ముందువరుసలో ఉండ వలసి వస్తుంది. వారే కుటుంబ భారాన్ని అధికంగా మొయ్య వలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కావున స్వతస్సిద్ధంగా ప్రకృతి వైపరీత్యాల గురించి ఆలోచించడంలోనూ, పర్యావరణ పరిరక్షణకు పాటుపడటంలోనూ ప్రపంచ వ్యాపితంగా మహిళలే ముందంజలో ఉన్నారనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు.

కావున ఈ ధరిత్రిని కాపాడటం కోసం నడుంకట్టి మార్గదర్శకులైనారు ఆ మహిళామణులు. మన భూగోళంలోని అన్ని ఖండాల్లో మనకు కనిపిస్తారు. వారిలో ముందుగా అభివృద్ధి చెందిన అమెరికా, యూరప్ తరువాత లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా ఖండాల్లోని ప్రముఖ మహిళా పర్యావరణ పరిరక్షణ పోరాట యోధులకు సంబంధించిన జీవిత ఘట్టాలను తెలుసుకుందాం.

## అమెరికా

### రేచల్ కార్సన్ (1907-1964)

రేషన్ కార్డ్ సన్ ప్రసిద్ధ సముద్ర జీవశాస్త్రజ్ఞురాలు. సముద్ర గర్భంలో జరిగే మార్పులపై ఆమె వ్రాసిన పుస్తకాలపై ఆధారపడి ఆనాడు డాక్యుమెంటరీ సినిమాలు కూడా తీశారు. తదనంతరం రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో హిరోషిమా నాగసాకిలపై దుర్మార్గమైన ఆటంబాంబు ప్రయోగానంతరం పంట పొలాల్లో క్రిమిసంహారకానికి ఆటం బాంబు లాంటి డి డి టి ని డ్యూపాంట్ లాంటి రసాయనిక కంపెనీలు తయారు చేసిన నేపథ్యంలో ఆ క్రిమిసంహారక మందుల అతి వినియోగం ప్రజల ఆహారాన్ని విషతుల్యం చేయడంతోపాటు పక్షులను నాశనం చేస్తాయని, క్రిములు కూడా క్రమంగా ఆ మందులకు అలవాటు పడతాయని నిరూపించారు.

ఆమెపై ఆగ్రహించిన రసాయనిక కంపెనీలు ఆమె వ్రాసిన ప్రసిద్ధ గ్రంథం నిశ్శబ్ద వసంతం (సైలెంట్ స్ప్రింగ్)ను ప్రచురించ వద్దని ప్రచురణకర్తలపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఆఖరికి ఆమెపై ఎంత దుష్ప్రచారం గావించారు అంటే నాటి అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ కి వ్యవసాయ కార్యదర్శి అయిన బెన్సన్ రేచల్ కార్సన్ బహుశా కమ్యూనిస్టు అయి ఉంటుందని ఆరోపించారు. అటువంటి ప్రచారం అమెరికాలో ప్రభుత్వ వ్యతిరేక ప్రముఖులపై నిరంతరం జరగడం నేటికీ కొనసాగుతుంది. కార్సన్ తాను రాసిన థెసిస్‌ను నిరూపించడానికి రసాయనిక ప్రయోగశాలలో ఎన్నో సంవత్సరాల పాటు క్రిమిసంహారక మందుల ప్రభావానికి గురై ఆఖరుకు క్యాన్సర్‌తో మరణించారు. ఆమె విజ్ఞాన శాస్త్రవేత్తలను చైతన్యవంతం చేయడం కోసం అమెరికా అంతా తిరిగి ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చారు. ఆమె వ్రాసిన గ్రంథం సైలెంట్ స్ప్రింగ్ ఆరు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పర్యావరణ ఉద్యమాలకు ప్రేరణగా నిలుస్తోంది.

### లోయిస్ మేరీ గిబ్స్

సామాన్య గృహిణిగా నున్న లొయిస్ గిబ్స్ 1978లో న్యూయార్క్ రాష్ట్రంలోని నయాగరా ఫాల్స్ దగ్గర్లో లవ్ కెనాల్ వద్ద తన బిడ్డ చదివే స్కూలు ప్రక్కనే 20 వేల టన్నుల పెద్ద రసాయనిక వ్యర్థాల గుట్టకు వ్యతిరేకంగా ఆ ప్రాంత ఇళ్ల యజమానుల సంఘాన్ని ఏర్పరిచి వారినందరినీ సమీకరించి ఆ వ్యర్థాల గుట్ట నుండి వెలువడే ప్రమాదకర రసాయనాల నుండి ఆ కాలనీని రక్షించడానికి సుమారు 800 ఇళ్లను తరలించడానికి ఉద్యమం చేపట్టి సఫలీకృతం అయింది.

ఆ విజయానంతరం ఆమె ప్రయత్నాల ఫలితంగా అమెరికా దేశంలో అనేకచోట్ల విషపూరిత వ్యర్థాల గుట్టలను శుభ్రం చేయడానికి అత్యంత విలువైన నిధిని (సూపర్ ఫండ్) ఏర్పాటు గావించడంతో బాటు వాటి ప్రభావానికి గురైన వారికి నష్టపరిహార చట్టం కూడా తీసుకురావడానికి ఎంతో కృషి చేసింది. 1980లో ప్రమాదకర వ్యర్థాలను నిర్మూలించే సంస్థను స్థాపించింది. 1998లో ఆ సంస్థ పేరును ఆరోగ్య పర్యావరణ న్యాయ సంస్థగా మార్చింది. ఆ సంస్థ దేశవ్యాప్తంగా స్థానిక ప్రజల్లో పనిచేసే స్వచ్ఛంద సంస్థలకు శిక్షణ ఇస్తూ వాటికి ఎంతో ప్రేరణగా నిలుస్తోంది. 1982లో లవ్ కెనాల్: నా కథ అనే టీవీ సినిమా తీయబడింది. దానిలో ఆమే స్వయంగా నటించారు. ఆమె సేవలకు గుర్తింపుగా ఎన్నో అవార్డులతో పాటు 2003లో నోబెల్ బహుమతికి ఆమె పేరును ప్రతిపాదించడం జరిగింది.

## జూలియా బట్టర్ఫ్లై హిల్

1977 లో క్యాలిఫోర్నియా హంబోల్ట్ కౌంటీలోని రెడ్ వుడ్ అడవులను పసిఫిక్ లంబర్ కంపెనీవారు ధ్వంసం చేయడాన్ని ఎదుర్కొనే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంతో ఆమె జీవిత ప్రస్థానం ప్రారంభించబడింది.

180 అడుగుల పొడవైన రెడ్ వుడ్ చెట్టు చిటారు కొమ్మ మీద గూడుకట్టుకుని 738 రోజులపాటు నివసించి యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఆ రెండేళ్ల కాలంలో ఎన్నో రక్తం గడ్డకట్టే ప్రమాదకర వర్షాలు, తుఫాన్లను తట్టుకుని నిలిచింది. కంపెనీ సెక్యూరిటీ గార్డులు హెలికాప్టర్ ద్వారా ఆమెను వేధించినప్పటికీ మొక్కవోని ధైర్యంతో నిలబడి విజయం సాధించింది. 1999లో కంపెనీతో జరిగిన ఒప్పందం ప్రకారం ఆ పరిసర ప్రాంతాలలో చెట్లను ముట్టుకోము అని కంపెనీవారు అంగీకరించవలసి వచ్చింది. తదనంతరం హిల్ దేశమంతా తిరిగి పర్యావరణ పరిరక్షణకై గొప్ప ఉపన్యాసకులుగా పేరొందింది. ఎంగేజ్ నెట్వర్క్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి సామాజిక మార్పునకు కృషి చేసే నాయకులను తయారు చేస్తుంది.

అంతటితో ఆగక 2002లో ఆమె ఈక్వెడార్లో వర్జిన్ ఆండియాన్ క్లౌడ్ ఫారెస్ట్లో గుండా నిర్మించే ఆయిల్ పైప్ లైన్కి వ్యతిరేకంగా ఆక్సిడెంట్ పెట్రోలియం కంపెనీ ఆఫీస్ ఎదుట నిరసన తెలిపి అరెస్టు కాబడి జైలుకి వెళ్ళింది.

2003లో పన్నుల మళ్లింపు ఉద్యమాన్ని చేపట్టింది. తను చెల్లించాల్సిన పన్నులను ప్రభుత్వానికి నేరుగా కాకుండా నేటివ్ అమెరికన్ల సంక్షేమం కోసం ఖర్చు చేస్తానని అందరూ అలా చేయాలని ప్రచారం చేసింది.

జూలియా బటర్ఫ్లై హిల్పై ఎన్నో డాక్యుమెంటరీ సినిమాలు, టీవీ షోలు తీయబడ్డాయి. ఆమెపై ఎన్నో పాటలు వెలువడ్డాయి. ఆమె నేటికీ యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

# యూరప్

## బ్రాడ్ బ్రూక్

1972 లో ఇంగ్లాండ్లో జన్మించిన బ్రాడ్ బ్రూక్ జంతువుల హక్కులపై ఉన్న శ్రద్ధతో 14వ ఏటనే గ్రీన్ పార్టీలో చేరారు. మాంచెస్టర్ విశ్వవిద్యాలయం నుండి మాలిక్యులర్ బయో ఫిజిక్స్లో డాక్టరేట్ పట్టా పుచ్చుకొని, ఫ్రాన్స్, భారతదేశాల్లో కూడా పోస్ట్ డాక్టరేట్ చేశారు.

2010 నుండి 2013 వరకు ముడి చమురు కోసం కొండలను త్రవ్వడానికి వ్యతిరేకంగా అనేక నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.

2018 మేలో ఇంగ్లండ్లో రోజర్ హాలంతో కలిసి ఎక్స్టింక్షన్ రెబెల్లియన్ (జీవరాశి మనుగడకు తిరుగుబాటు) అనే సంస్థను స్థాపించారు. ఆ సంస్థ వాతావరణ మార్పుల వలన జీవరాశికి కలిగే ముప్పు గురించి ప్రజలలో చైతన్యం తీసుకు రావడానికి అహింసాయుత ఉద్యమం ద్వారా కృషి చేస్తుంది. అనతికాలంలోనే ఆ ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా యువకులను ఆకర్షించింది. పెద్ద ఎత్తున శాసనోల్లంఘన ద్వారా మార్పు తీసుకు రావడానికి ప్రయత్నించడం జరుగుతోంది. ఆ ఉద్యమంలో ఎంతో మంది కార్యకర్తలు అరెస్టయి జైలుకు వెళ్లారు. ఆ ఉద్యమం నేడు వంద దేశాలకు పైగా వ్యాప్తి చెంది యువకులను వాతావరణ మార్పుల దుష్ప్రభావాలు గురించి చైతన్య పరుస్తుంది.

## గ్రేటా థన్బెర్గ్

2003లో స్వీడన్లో జన్మించిన గ్రేట్ థెన్బర్గ్ స్కూల్ విద్యార్థి గా ఉంటూనే వాతావరణ మార్పులపై జరిగిన ప్యారిస్ ఒప్పందం ప్రకారం స్వీడన్ ప్రభుత్వం కర్బన తగ్గించాలని 2018లో పార్లమెంటు ఎదుట మూడు వారాల పాటు ఒంటరిగా నిరసన ప్రదర్శన చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. యూరోప్ వ్యాపితంగా అనేక దేశాల్లో తన ఉపన్యాసాల ద్వారా సామాజిక మాధ్యమాల ద్వారా లక్షలాది మంది విద్యార్థులు నిరసన ప్రదర్శనల్లో పాల్గొనేలా చేయగలిగింది. 2018 డిసెంబర్ నుండి ప్రతి శుక్రవారం స్కూల్ విద్యార్థులు సమ్మెలో పాల్గొనేలా ప్రేరణ కల్పించింది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని నగరాల్లో విద్యార్థులు శుక్రవారపు సమ్మెలో పాల్గొంటున్నారు. దానినుండి ఫ్రైడేస్ ఫర్

ఫ్యూచర్ అనే సంఘం ఆవిర్భవించింది. 2019 సెప్టెంబర్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యాన జరిగిన వాతావరణ మార్పులపై శిఖరాగ్ర సభలో ఉపన్యసిస్తూ దేశాధినేతలను సవాల్ చేస్తూ గ్రేటా చేసిన ప్రసంగం ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించింది. 2019 ఆగస్ట్ నుండి స్కూల్‌కి ఒక సంవత్సరం పాటు సెలవు పెట్టి వివిధ దేశాల్లో తన ఉపన్యాసాల ద్వారా విద్యార్థి సమ్మెలకు ఉత్తేజం కలిగించింది.

ఇటీవల భారతదేశంలోని రైతాంగ పోరాటాలపై ప్రభుత్వ అణచివేతను నిరసిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా తన ప్రచారాన్ని కొనసాగిస్తుంది.

## లాటిన్ అమెరికా

### మరీనా సిల్వా

బ్రెజిల్‌కి చెందిన 62 సంవత్సరాల మరీనా సిల్వా ప్రముఖ పర్యావరణవేత్తయే గాక రాజకీయవేత్త కూడా. తన రాజకీయ జీవితంలో 1995 నుండి 2011 దాకా సెనేటర్ గాను 2003 నుండి 2008 దాకా పర్యావరణమంత్రి బాధ్యతలు నిర్వహించారు.

రెవల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీతో ఆమె రాజకీయ జీవితం ప్రారంభమైంది. మరో ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకుడు, ప్రముఖ పర్యావరణవేత్త కీర్తిశేషులు చికో మెండిస్‌తో కలిసి రెయిన్ ఫారెస్ట్ పరిరక్షణ ఉద్యమాల్లో పాల్గొన్నారు. పర్యావరణ ఉద్యమాలు పాల్గొంటున్న సందర్భంలో లాటిన్ అమెరికా తరఫున గోల్డ్ మన్ ఎన్విరాన్‌మెంటల్ ప్రైజ్ గెలుచుకున్నారు. ఆమె పర్యావరణ మంత్రిగా ఉన్నప్పుడు అమెజాన్ అడవులు చట్ట విరుద్ధంగా నిర్మూలించడాన్నీ ఎదుర్కొన్నారు. ఆమె మంత్రిగా ఉన్న కాలంలో 2004– 2007 మధ్య అడవుల నిర్మూలన 60 శాతం తగ్గింది. జల విద్యుత్ కేంద్రాల నిర్మాణం, జీవ ఇంధనాలు, జన్యు మార్పిడి పంటలపై ఆమె అభిప్రాయాల కారణంగా ప్రభుత్వం నుండి వేరుపడి రాజీనామా చేయవలసి వచ్చింది. ప్రస్తుతం బ్రెజిల్ అణు విద్యుత్ కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ ప్రత్యామ్నాయంగా సౌర, పవన శక్తులపై పెట్టుబడి పెట్టాలని ప్రచారం గావిస్తున్నారు.

### మాక్సిమా అకునా

పెరూకి చెందిన 50 సంవత్సరాల మాక్సిమా ఆకునా న్యూమాంట్ మైనింగ్ కార్పొరేషన్ కాంగా గని విస్తరణ కోసం తన భూమిని ఆక్రమించడాన్ని వ్యతిరేకిస్తూ 2011లో పెద్ద పోరాటాన్ని నిర్వహించింది. ఆ పోరాటంలో ఐదుగురు నిరసన కారులు కాల్చి వేయబడ్డారు. ఆమె తన భూమి పైన బైఠాయించి నందుకు కోర్ట్ 3 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. 2014లో ఇంటర్ అమెరికన్ మానవ హక్కుల సంఘం నిరసనకారులకు మద్దతు తెలిపింది. సెక్యూరిటీ బలగాలు ఆకునా ఇంటిని ధ్వంసం చేయడంపై రాజధాని లిమాలో, అంతర్జాతీయంగా కూడా ఆమెకు మద్దతుగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆమెకు మద్దతు కూడగట్టింది. 2016లో కంపెనీ గుండాలు ఆమెను, కూతుర్ని, భర్తను ఎంతో దారుణంగా కొట్టారు. కానీ ఆమె నేటికీ మైనింగ్ కార్పొరేషన్‌పై తన పోరాటాన్ని కొనసాగిస్తుంది. ఆమె శాంతియుత పోరాటానికి గుర్తింపుగా 2016 గోల్డ్ మన్ ఎన్విరాన్మెంటల్ ప్రైజ్ అందుకున్నారు.

## ఆఫ్రికా

### వంగారి మతాయి (1940-2011)

వంగారి మతాయి కెన్యా దేశానికి చెందిన పర్యావరణవేత్త మాత్రమే కాక రాజకీయవేత్త కూడాను. ఈమె స్థాపించిన గ్రీన్ బెల్ట్ ఉద్యమానికి 2004లో నోబెల్ శాంతి బహుమతి లభించింది అమెరికా, జర్మనీల్లో ఉన్నత చదువులను అభ్యసించి కెన్యా తిరిగి వచ్చి 1977లో గ్రీన్ బెల్ట్ ఉద్యమాన్ని స్థాపించి పెద్ద ఎత్తున చెట్లు నాటడం, పర్యావరణ పరిరక్షణ, మహిళా హక్కులపై కేంద్రీకరించింది. స్థానిక అవసరాలకు అనుగుణంగా స్థానిక ప్రజా సంఘాలు చేయవలసిన కృషిని గురించి, మార్పు కోసం పరస్పర సహకారంతో శ్రమ చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పేవారు. 1986లో ఐక్యరాజ్యసమితి సహాయంతో గ్రీన్ బెల్ట్ ఉద్యమాన్ని ఆఫ్రికా అంతటా విస్తరింపజేశారు. అడవుల నిర్మూలన, నీటి కొరత, గ్రామీణ ఆకలి సమస్యలపై ఎన్నో కార్యక్రమాలను చేపట్టారు. నైజీరియాలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ, మానవ హక్కుల కోసం ఎన్నో నిరసన ప్రదర్శనలు, నిరాహారదీక్షలు చేపట్టారు. 2002లో రెయిన్‌బో కోయలిషన్ తరఫున ఎన్నికై పర్యావరణ మంత్రిగా 2005 వరకు పని చేశారు. 2006లో ఐక్యరాజ్యసమితి శతకోటి చెట్లు నాటే కార్యక్రమానికి ప్రాతినిధ్యం వహించారు. 2011లో క్యాన్సర్ వ్యాధితో తుది శ్వాస విడిచే వరకు పర్యావరణ ఉద్యమకారిణిగా వెలుగొందారు

### అదేనికే ఒలడోసు

నైజీరియాకు చెందిన 26 సంవత్సరాల అదినికే ఒలడోసు విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థికశాస్త్ర పరిశోధన చేసేటప్పుడు పొలాల్లో రైతులు, పశువుల కాపరులు వరదల్లో వారి భూమి కొట్టుకుపోగా వారి మధ్య కొట్లాటలు స్వయంగా గమనించింది.

వాతావరణ మార్పులే అందుకు కారణమని తెలుసుకొని తోటి విద్యార్థులకు వాతావరణ సంక్షోభాన్ని గురించి వివరిస్తూ చెట్లు నాటడానికి ప్రోత్సహిస్తూ తన పర్యావరణ ఉద్యమాన్ని ప్రారంభించింది. దేశమంతా తిరిగి ఆ ప్రజలకు పర్యావరణ న్యాయం ఎంత అవసరమో తెలియజేసింది. నేడు ఆమె ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్, ఎర్త్ అప్ రైజింగ్, ఆఫ్రికన్ యూత్ క్లబ్ నైజీరియా రాయబారిగా పని చేస్తుంది.

### వానేస్సా నకటే

ఉగాండాకు చెందిన 24 సంవత్సరాల వనేస్సా నాకటే వాతావరణ న్యాయ ఉద్యమకారిణి. గ్రేటా థంబ్గ్ నుండి ఉత్తేజం పొంది వాతావరణ సంక్షోభంపై నైజీరియా దేశం సరైన చర్యలకు పూనుకోనందున నిరసనగా పార్లమెంటు ఎదుట 2019 జనవరిలో ఒంటరిగా సమ్మె ప్రారంభించింది. కొన్ని నెలలు గడిచిన తర్వాత క్రమంగా ఆమె పిలుపు మేరకు యువత స్పందించడంతో వారితో కలిసి యూత్ ఫర్ ఫ్యూచర్ ఆఫ్రికా, ఆఫ్రికా వ్యాపిత రైజ్ అప్ మూవ్‌మెంట్‌ని స్థాపించింది. కాంగోలియాన్ రైన్ ఫారెస్ట్‌ల తరుగుదలపై ప్రచారాన్ని కొనసాగించింది. హరిత పాఠశాల ప్రాజెక్టు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు ద్వారా స్కూల్లో సౌరశక్తి వాడాలని, పర్యావరణ అనుకూల పొయ్యిలను వాడాలని ప్రచారం చేసింది. నాకటే అభ్యుదయ వామపక్ష రాజకీయాలకు చెందిన ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ సభ్యులు. పెట్టుబడిదారీ విధానం వాతావరణ క్షీణతకు తోడ్పడుతుందని విమర్శిస్తుంది.

## ఆసియా

### జియూల్

దక్షిణ కొరియాకు చెందిన 63 సంవత్సరాల జియూల్ తన పర్యావరణ క్రియాశీల కార్యక్రమాలలో అవలంబించే ప్రత్యేక తరహా పద్ధతుల ద్వారా జాతీయ అంతర్జాతీయ స్థాయి దృష్టి ఆకర్షించింది. దీర్ఘకాల ఆమరణ నిరాహార దీక్షలు ఆమె ఆయుధాలు. 2005 ఫిబ్రవరిలో హై స్పీడ్ రైల్వే లైన్ నెట్‌వర్క్‌లో భాగమైన సొరంగ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా వందరోజుల ఆమరణ నిరాహార దీక్ష చేసింది. ఆ సొరంగం వలన తాను నివసించే పర్వత ప్రాంత పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటుందని ప్రచారం చేసింది. ఆమె చేసే నిరాహార దీక్షకు మిగతా పర్యావరణ మానవ హక్కుల, మత సంఘాలు మద్దతు తెలిపాయి. ప్రభుత్వం ఆ ప్రాజెక్టును తాత్కాలికంగా నిలిపివేసింది.

2009లో నాలుగు నదుల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా వీడియోలు తీసి స్కూళ్లలో, బహిరంగ సభలో చూపించి ఉపన్యాసాలు ఇచ్చేది. ఆ విధంగా ప్రజలను చైతన్యవంతులను చేస్తూనే ఉంది.

### లే పెంగ్ పువా

మలేషియాకు చెందిన 48 సంవత్సరాల లె పెంగ్ పువా రాజధాని కౌలాలంపూర్ ప్రక్కనే ఉన్న జెంజారం పట్టణవాసి అమెరికా నుండి దిగుమతి చేసుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే పరిశ్రమల ద్వారా వెలువడే విషవాయువులకు వ్యతిరేకంగా ఆ పట్టణంలోని తోటి వాలంటీర్లతో కలిసి పోరాటం నిర్వహించారు ఆధునిక పరికరాలైన డ్రోన్‌లను, జిపిఎస్ పద్ధతులను వినియోగించి రీసైక్లింగ్ చేసే పరిశ్రమలను పసిగట్టి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చేయగలిగారు. ఆ సందర్భంగా ఆమెకు ఫ్యాక్టరీ యజమానులు నుండి చంపుతామని ఎన్ని బెదిరింపు కాల్స్ వచ్చినా ధైర్యంగా నిలబడి పోరాడారు. ఆమె లక్ష్యం ఆ దేశంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం.

### వందనా శివ

ప్రపంచ ప్రఖ్యాత పర్యావరణ వేత్తల్లో ఒకరైన వందనా శివ నేటి ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో 1952లో జన్మించారు ఆమె మనదేశంలో, ఇతర దేశాల్లో గొప్ప చదువులు చదివిన అనంతరం డెహ్రాడూన్‌లో 1982లో రీసెర్చ్ ఫౌండేషన్ ఫర్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఎకాలజీ అనే సంస్థ స్థాపించారు. తదనంతరం 1991లో నవధాన్య అనే సంస్థను స్థాపించి, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, దేశీయ విత్తనాలను, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడం అనే లక్ష్యంతో రైతులకు శిక్షణ గడుపుతున్నారు.

వందన శివ ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమం నాయకుల్లో ప్రముఖులు. విత్తనాలపై కార్పొరేట్ కంపెనీలు పేటెంట్లు సంపాదించడానికి వ్యతిరేకంగా పోరాడారు. అమెరికా వ్యవసాయ శాఖ మన వేపను పేటెంట్ చేసుకున్నప్పుడు దానికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించారు. బి టి కాటన్‌కు వ్యతిరేకంగా మొంసాంటో, కార్గిల్ లాంటి బహుళ జాతి కంపెనీల నయా వలస విధానాలకు వ్యతిరేకంగా పోరాడారు.

నేటికీ రైతుల పోరాటాలకు మద్దతు తెలుపుతూ వ్యవసాయాన్ని, పర్యావరణాన్ని రక్షించడానికి కంకణబద్ధురాలుగా కొనసాగుతున్నారు.

☞ మిగతా 51వ పేజీలో



# ఐక్య రాజ్య సమితి మహిళా సమ్మేళనం 2020

**ఎ.అన్నపూర్ణ**

అమెరికాలోని న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో ప్రతి సంవత్సరమూ "అంతర్జాతీయ మహిళా దినోత్సవం" జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఏ దేశం వారైనా పాల్గొనవచ్చు. ఈ సమావేశం మార్చి నెల ఆరవ తేదీ ఉదయం పది గం. నుంచి ఒంటి గంట వరకూ జరుగుతుంది. un.woman.org లో ప్రత్యక్ష ప్రసారం కోసం వెబ్ కాస్ట్‌లో ట్యూన్ చేసుకోవచ్చు. ఈ సంవత్సరం సమావేశం "నేను జనరేషన్ ఈక్వాలిటీ" మహిళాహక్కులను తెలుసుకోవడం మీద చర్చ జరుగుతుంది.

## సమానత్వ ప్రచారం

ప్రపంచ వ్యాప్తంగా లింగం వయసు, జాతి, మతంతో నిమిత్తం లేకుండా దేశప్రజలకు సమానత్వం కల్పించాలి. ఎక్కడైతే మహిళలపై హింస జరుగుతుందో దాన్ని అంతం చేయడానికి అందరినీ సమీకరించాలి అనే ఆలోచనే ఈ సమావేశం ఉద్దేశ్యం. "అందరికీ హక్కులు, ఆర్థిక న్యాయం కలిగించాలి" అన్నది పిలుపు. శారీరక లైంగిక ఆరోగ్యం వాతావరణ పరిస్థితులు స్త్రీవాద నాయకత్వం సాంకేతిక పరిణామం పట్ల నూతన ఆవిష్కరణలను వారు కోరుతున్నారు. మహిళల సమానత్వాన్ని సాకారం చేయడంలో చిన్న అడుగులే పెద్ద ఫలితాలు చూపిస్తాయని మహిళా దినోత్సవం రోజున జనరేషన్ ఈక్వాలిటీలో చేరి ఉద్యమంలో భాగస్తులు కావాలి అన్నది వారి విజ్ఞప్తి. ఐక్యరాజ్య సమితి ఉమన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫుంజీలే 2020 ను మహిళా సమానత్వ సంవత్సరంగా ప్రకటించారు. మహిళకు వ్యతిరేకంగా ఉన్న అడ్డంకులను అవరోధాలను పరిష్కరించాలని స్త్రీ –పురుష సమానత్వం కోసం పోరాడాలని పిలుపునిచ్చింది.

లైబీరియన్ దక్షిణాఫ్రికా మహిళల "మీ టూ"ఉద్యమం యొక్క ప్రభావాన్ని ప్రపంచ వ్యాప్తంగా లైంగిక సమానత్వం కోరుతూ శాంతి మార్గాన్ని సుగమం చేసిందని సామూహిక క్రియాశీలక క్రియల ద్వారా మార్పు సాధించగలమని చరిత్ర మనకు నేర్పిందని అన్నారు. "జనరేషన్ ఈక్వాలిటీ" కోసం మనం తీసుకునే చర్యలను ప్రపంచ వ్యాపిత పోరాటంలో భాగస్వామ్యంగా సాగిస్తున్నామని అన్నారు "వయసు దేశం వివక్షత లేకుండా సమానత్వంతో సమిష్టి పోరాటాలు చేసాం. ఇకపై సాధించబోయే చర్యలకు కూడా అందరూ కలిసి రావాలి" అన్నారు.

ఐక్యరాజ్య సమితి మహిళల ప్రచారంలో న్యాయవాదులను ఒకచోట సంఘటితం చేసింది.సమాజంలో మహిళల ప్రాతినిధ్యం తప్పనిసరి అంటూ "హింగ్రైడ్ మార్సెల్లీ రైట్జి జీసస్ కమ్యూనిటీ ఫెసిలేటర్ సైఫ్ దబ్బస్ హి ఫోర్నే (యూత్ యాక్టివిస్ట్) (వీరు జనరేషన్ ఈక్వాలిటీ సభ్యులు.) మై టేక్ యువర్ టేక్ సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లో కొత్త తరం మహిళా నాయకులను ప్రవేశ పెట్టడం చేస్తోంది. ఉక్రెయిన్ దేశం లింగ మార్పిడి జరిగిన మహిళ అంస్టిక్ యూఏవ డోమని తన హక్కులకోసం పోరాడిన కార్యకర్తగా వచ్చి పాలుపంచుకుంది. మరొకరు జనరేషన్ ఈక్వాలిటీలో క్రియాశీల కార్యకర్తగా వున్న సిండీ సిరిణ్య పాల్గొన్నారు.

అంతర్ జాతీయ మహిళా దినోత్సవానికి ముందు జరిగిన ఈ సమావేశం నివేదికను పరిశీలిస్తే స్త్రీ పురుష సమానత్వ పురోగతి మందగించిందనీ మహిళలు కష్టాల్లో వున్నారని హెచ్చరించింది. న్యూయార్క్‌లో జరిగిన అంతర్ జాతీయ మహిళా దినోత్సవ అధికారిక సమావేశం సందర్భంగా ఐక్యరాజ్య సమితి అండర్ సెక్రటరీ జనరల్ యూ ఎన్ ఇక్క్యూటివ్ డైరెక్టర్ ఫ్లమ్లె మాబ్స్లో చెప్పిన ముగింపుమాటల్లో ఆమె రాబోయి ముప్పును తెలియచేసారు. ఒకరినొకరు బలోపవేతం చేసుకుందుకు భవిష్యత్‌లో మహిళల సమీకరణ కోసం అన్నిదేశాల మహిలకూ మద్దతు ఇవ్వడానికి ఇది గొప్ప అవకాశం అన్నారు. ప్రజలు నివసించే ప్రాంతాలలో మహిళలు సాధించిన విజయాలు నినాదాలు పెట్టాలి. ఈ అవకాశం ఉపయోగించుకోవడం వలన ప్రపంచమంతా మహిళా సమానత్వం ఆవశ్యకత తెలుస్తుంది; ఎందుకంటే వైకల్యం కలిగిన ఒక మహిళా ఎలైన క్రాస్మరి మొల్డోవన్. తన హక్కుల కోసం పోరాడి ఎన్నికల్లో గెలిచింది. ఇలాంటి విషయాలు గొప్ప ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయి.

లైజీరియాలో న్యాయం కోసం జండర్ సమానత్వం కోసం పోరాటం చేసిన జండా డిజైర్ ఇలా అన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా బాల్యవివాహాలు ఇంకా ఇప్పుడు కూడా జరుగుతూనే వున్నాయి. వారు హింసకు దౌర్జన్యానికి గురి కాబడ్డారు. చదువుకోవాలని ఆశపడిన వారు పాఠశాలనుండి గెంటివేయబడ్డారు. అకాల మాతృభారాన్ని మోస్తూ దిగజారి

☞ మిగతా 62వ పేజీలో

# నూతన సహస్రాబ్దిలో వృత్తి, ఉద్యోగాలలో స్త్రీల పాత్ర



డా.ఆలూరి విజయలక్ష్మి

మానవ జాతి ఏర్పడినప్పటినుండి మనిషి పనిని చేస్తూనే ఉన్నప్పటికి పారిశ్రామిక విప్లవం, మధ్య తరగతి ఆవిర్భావంతో 'ఉద్యోగం' అనే పదం వాడుకలోనికి వచ్చింది. మనిషి తన ఉనికిని నిలుపుకోవడానికి, బ్రతుకును కొనసాగించడానికి చేసే ఏ పనినైనా 'ఉద్యోగం' గా భావించవచ్చు.

ఏ గృహిణినైనా 'మీరు వర్క్ చేస్తున్నారా?' అని ప్రశ్నిస్తే 'లేదు ఖాళీగానే ఉన్నాను' అనే సమాధానం తరచుగా వినపడుతుంది. స్త్రీలు రాత్రింబవళ్ళు విరామం లేకుండా ఇంటెడు పనినీ చేస్తున్నప్పటికి ఆ పనివలన డబ్బు రూపేణా ఆదాయం రాదు కనుక ఆ పని విలువను దేశం, సమాజం, కుటుంబం, చివరికి ఆ పనిని చేసే స్త్రీ కూడా గుర్తించదు. జాతీయ సంపదోత్పత్తి అధికారిక అంచనాలలో స్త్రీల శ్రమశక్తి విలువలు సక్రమంగా ప్రదర్శితం కావడం లేదు. ప్రపంచ జనాభాలో సగభాగంగా (మొత్తం జనాభాకు బాధ్యులుగా) ఉన్న స్త్రీలకు, ప్రపంచంలోని శ్రమలో మూడింట రెండు వంతులు చేస్తున్న స్త్రీలకు, ప్రపంచ ఆదాయంలో పదవ వంతు, ప్రపంచ సంపదలో కేవలం 1 వంతు మాత్రమే దక్కడం పెద్ద అన్యాయం. క్రమేపీ అస్థిరమైన, తక్కువ వేతనాలు వచ్చే ఉద్యోగాలే స్త్రీలకు దక్కుతున్నాయి. దాని ఫలితంగా దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న వారిలో 70 శాతం మంది స్త్రీలే ఉన్నారు.

### మహిళలు ఉపాధి రంగంలో ప్రవేశించడానికి కారణమైన అంశాలు :

ప్రపంచయుద్ధాలు, ఆర్థిక సంక్షోభాల కారణంగా కుటుంబ ఆదాయాలు పడిపోయి, పెరిగిన ధరలతో జీవనం గడవని పరిస్థితిలో పురుషులతో పాటు స్త్రీలు కూడా ఆదాయాన్నిచ్చే ఉద్యోగాలు చేయవలసిన పరిస్థితి వచ్చింది.

పెట్టుబడిదారీ వ్యవస్థ అవసరాలు కూడా స్త్రీలను ఇంటి లోపలి నుంచి బయటి సమాజంలోకి ఉపాధి కోసం లాక్కొచ్చాయి.

### స్త్రీలు ఉద్యోగాల్ని ఎందుకు చేస్తారు?

తమ కుటుంబపు బ్రతుకు గడవడం కోసం, భర్త ఆదాయానికి అదనంగా సంపాదించి కుటుంబపు ఆర్థిక స్థాయిని పెంచడం కోసం, సామాజిక హోదా కోసం, ఇంటిపనులు, పిల్లల్ని కని, పెంచడమే కాక ఇతర పనుల్ని కూడా చేయగలమనే ఆత్మవిశ్వాసాన్ని పొందడం కోసం, జీవితంలో ఒక ఉన్నతమైన గమ్యాన్ని నిర్దేశించుకుని, ఆ గమ్యాన్ని చేరడానికి ఆర్థిక స్వాతంత్ర్యం తప్పనిసరి అని గుర్తించడం వలన స్త్రీలు ఉద్యోగాల్ని చేస్తున్నారు.

### భారత దేశంలో శ్రామిక శక్తిలో మహిళల ప్రాతినిధ్యం :

మహిళల ఆర్థిక సాధికారతకు కొలమానంగానే కాక, దేశ ఆర్థిక ప్రగతిలో మహిళల భాగస్వామ్యపు కీలకమైన సూచికగా కూడా ఉద్యోగం పరిగణింపబడుతుంది.

గత కొన్ని దశాబ్దాలుగా భారతదేశ శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం క్రమేపీ తగ్గుతూంది. అది 1983లో 29.6 శాతం, 2011-2012 లో 21.9 శాతం, 2018లో కేవలం 16.5 శాతానికి పడిపోయింది. శ్రామిక భాగస్వామ్యపు రేటే కాక సంఖ్య కూడా తగ్గిపోయింది. 2004-2005 లో 148.59 మిలియన్ల మంది ఉండగా, 2017-2018 కి అది 104.1 మిలియన్లకు తగ్గిపోయింది. లేబర్ మార్కెట్లో మహిళల సంఖ్య తగ్గిపోవడం దేశ ఆర్థిక స్థితి మీద తీవ్రమైన ప్రభావం చూపుతోంది.

ప్రపంచం లోనే 15-34 వయసు యువ జనాభా అత్యధికంగా ఉన్న భారతదేశం దేశం యువ దేశంగా పరిగణింపబడుతూంది. ఉత్పత్తిదాయక యువ జనాభా కలిగించే లాభాన్ని, శ్రామిక శక్తిలో మహిళల ప్రాతినిధ్యం తగ్గడం నీరు కారుస్తూంది. మరొక ముఖ్యమైన అంశం మహిళలు ఎక్కువ సంఖ్యలో లేబర్ మార్కెట్లో ఉండడమేకాక వారి శ్రామిక శక్తిలో మహిళల స్థితిగతుల్ని ప్రతిబింబించే ఉద్యోగాల నాణ్యత కూడా ప్రధానం.

గత కొన్ని దశాబ్దాలుగా అనేక ప్రభుత్వ రంగ సంస్థలు, సర్వీసులు ప్రైవేటీకరించబడుతున్నాయి. ప్రైవేట్ యజమాన్యం క్రిందకు వచ్చిన సంస్థల యజమానులు అధిక లాభాల నార్జించడానికి ఖర్చులు తగ్గించే సందర్భంలో ముందుగా మహిళల్ని ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. శాశ్వతమైన

ఉద్యోగాలను కోల్పోయిన ఈ మహిళలు ఉపాధికి అసంఘటిత రంగాన్ని ఆశ్రయిస్తున్నారు.

మహిళా శ్రామికులలో అత్యధిక భాగం అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. సంఘటిత రంగంలో ఉండే ఖచ్చితమైన పనిగంటలు, పురుషునితో సమాన పనికి సమాన వేతనం, నిర్ణీత నియమనిబంధనలు, ఉద్యోగ భద్రత, సాంఘిక హోదా, ప్రసూతి శెలవు, పిల్లలకు డేకేర్ సెంటర్లు, పెన్షన్ లాంటి వసతులు, వారి హక్కులకోసం పోరాడే ట్రేడ్ యూనియన్లు లాంటి అంశాలు అసంఘటిత రంగంలో ఉండవు.

వ్యవసాయరంగంలో సంప్రదాయ పంటల పెంపకంలో మహిళల పాత్ర ఎక్కువ ఉంటుంది. ఆర్థిక సరళీకరణల ఫలితంగా ఎగుమతి ప్రాధాన్యత ఉన్న వాణిజ్య పంటల్ని వేయడం వలన, ఆ పంటల పెంపకంలో అధిక భాగానికి శ్రామికుల అవసరం తక్కువగా ఉండడం వలన, ఆ పంటల మార్కెటింగ్, రవాణా, ఎగుమతులలో పురుషులే ప్రాధాన్యత వహిస్తూ ఉండడం వలన వ్యవసాయ రంగంలో కూడా మహిళలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఆధునిక సాంకేతికత, బయోటెక్నాలజీ, జీన్ టెక్నాలజీ వ్యవసాయ రంగంలో ప్రవేశించిన కొద్దీ మానవ శ్రమ ప్రాధాన్యం తగ్గి, అప్పటి వరకు తక్కువ నైపుణ్యాలు, ఎక్కువ మానవ శ్రమ అవసరమైన పనుల్ని చేస్తున్న మహిళలు ఉపాధిని కోల్పోతున్నారు. వృత్తి విద్యానైపుణ్యం ఉన్న స్త్రీలకు మాత్రమే అవకాశం దక్కుతూంది.

సర్వీసెస్ రంగం మహిళలకు ప్రధాన ఉపాధి రంగంగా ఉంది. గుమాస్తాలు, సెక్రటరీలు, క్యాషియర్లు, సేల్స్ గర్ల్స్ లాంటి ఉద్యోగాల్ని చేస్తున్న స్త్రీలు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రవేశం కారణంగా భారీ సంఖ్యలో ఉపాధిని కోల్పోగా కేవలం వృత్తి, విద్యార్హతలు, వృత్తి నైపుణ్యాలు ఉన్న వారు మాత్రమే మిగులుతున్నారు. ఖాతాదారుల్ని మెప్పించగల ఓర్పు, నేర్పు, మార్కెటింగ్ సామర్థ్యం, వ్యాపారాన్ని లాభదాయకంగా నడిపించగల సామర్థ్యం ఉన్న వారికే ఉపాధి ఉంటుంది.

పారిశ్రామికోత్పత్తి రంగంలో పని చేస్తున్న మొత్తం ఉద్యోగులలో స్త్రీలు మూడవ వంతు మందే. చిన్న తరహా పరిశ్రమలను నడుపుతున్నవారు, స్వయం ఉపాధి రంగంలో ఉన్నవారు, డబ్బు తీసుకోకుండా కుటుంబ ఉత్పత్తిలో పాల్గొంటున్న స్త్రీలు సుమారుగా 41శాతం ఉన్నారు. ఎగుమతి కొరకు సరకును ఉత్పత్తి చేస్తున్న పరిశ్రమలు ఇంటి వద్ద పనిచేసే కాంట్రాక్ట్ పద్ధతిలో మహిళలకు ఉపాధిని కల్పిస్తున్నాయి. ఇంటి వద్ద కాంట్రాక్ట్ పనులు, పీస్ వర్క్, పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేసేవారిలో అత్యధిక భాగం స్త్రీలే.

**ఉన్నత స్థాయి ఉద్యోగాలో స్త్రీల పాత్ర :**

గత కొన్ని దశాబ్దాలుగా మేనేజీరియల్, పరిపాలనా విభాగాల్లోనూ, ప్రొఫెషనల్, టెక్నికల్ రంగాల్లోనూ ఉన్నత స్థాయికి కొద్ది మంది మహిళలు చేరుకుంటున్నారు. స్వయం ఉపాధి, వ్యాపార సంస్థల్ని నడుపుతున్న స్త్రీలు కొంతమంది ఉన్నారు. భారీ పారిశ్రామిక వ్యాపార సంస్థలలో పరిపాలన, మేనేజీరియల్ ఉద్యోగాలకు అతికొద్దిమంది మహిళలు మాత్రమే చేరగలుగుతున్నారు. పారిశ్రామికవేత్తలుగా కొంతమంది మహిళలు రాణిస్తున్నారు. కాని, పెద్ద, పెద్ద కార్పొరేట్ స్థాయి ఉద్యోగాలలో స్త్రీల సంఖ్య నామమాత్రంగానే ఉంది. ఈ పరిణామాన్ని ఉపాధి రంగంలో స్త్రీల పురోగమనాన్ని, విజయసాధనను నిరోధిస్తున్న 'గ్లాస్ సీలింగ్' గా అభివర్ణిస్తున్నారు. అంటే చేరవలసిన గమ్యం గాజు పలకలో నుండి చేరువగా ఉన్నట్లు కనిపిస్తుంది. కాని గాజు పలక ఉద్యోగిని దానిని చేరకుండా నిరోధిస్తుంది. ప్రపంచమంతటా తరతమ భేదాలతో స్త్రీల పరిస్థితి ఇలాగే ఉంది.

**మహిళల ఉపాధిపై సాంఘిక, సాంస్కృతిక ప్రభావాలు:**

ఒక నిర్దిష్ట ప్రాంతపు సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు ఆ ప్రాంత మహిళలు ఉద్యోగ రంగంలో పాల్గొనడాన్ని, ఆధునిక పారిశ్రామిక వ్యవస్థలో విస్తరిస్తున్న ఉపాధి అవకాశాలను వినియోగించడాన్ని ప్రభావితం చేస్తాయి. స్త్రీలకు పురుషులకంటే విద్య, నైపుణ్యాల స్థాయి తక్కువగా ఉండడం వలన పారిశ్రామిక రంగంలో ఉన్నత, మధ్య స్థాయి ఉద్యోగాలు లభించడం లేదు. ఉద్యోగ స్థాయిలో ఉన్న భేదం వలన స్త్రీల సంపాదన తక్కువగా ఉంటూంది.

కొన్ని సమాజాలలో స్త్రీలు పర పురుషులతో కలిసి వ్యవహరించడం నిషిద్ధం. సమాజ సంప్రదాయాల కారణంగా ఉద్యోగాలు చేస్తున్న యువతులు వివాహం కాగానే లేక మొదటి బిడ్డ పుట్టగానే ఉద్యోగాలు మానేస్తున్నారు. పితృస్వామిక కుటుంబ వ్యవస్థ నిర్దేశించిన జెండర్ నమూనాలు, జెండర్ వివక్ష పని చేసే ప్రదేశాలకు కూడా విస్తరించి కొన్ని ఉద్యోగాలు స్త్రీలు మాత్రమే చేయవలసినవీ, కొన్ని ఉద్యోగాలు స్త్రీలు ప్రవేశించగూడనివిగా ఉన్నాయి. స్త్రీకి అలవాటు చేసిన ఓర్పును, ఎదురు తిరగకుండా, వినయ విధేయతలతో ఎన్ని గంటలైనా పని చేయడాన్ని ఉద్యోగ

రంగంలో కూడా ఉపయోగించుకోవడం వలన సృజనాత్మకత లేని, విసుగు కలిగించే, శారీరక, మానసిక శక్తుల్ని హరించే పనులకు మహిళలు పరిమితమవాల్సి వస్తూంది.

ఒకే పదవిలో ఉన్న స్త్రీని ఒకలాగా, పురుషుడిని మరొకలాగా గుర్తించడాన్ని, గౌరవించడాన్ని (డబుల్ బ్లైండ్) చూస్తూ ఉంటాము. స్త్రీ దృఢంగా నిర్ణయాలు తీసుకుంటే 'మగరాయుడు, స్త్రీత్వమే లేదు' అని, మృదువుగా వ్యవహరిస్తే 'ఆడవాళ్ళలాగే మెతకగా ఉంటారు, గట్టిగా, కఠినంగా వ్యవహరించలేరు' అని తీసి పడేస్తారు. స్త్రీల సామర్థ్యంతో నిమిత్తం లేకుండా వాళ్ళు స్త్రీలు కాబట్టి ఈ పనుల్ని చేయలేరని నిర్ధారించేసుకుని, గుర్తింపునిచ్చే ఛాలెంజింగ్ బాధ్యతల్ని వారికి అప్పజెప్పకుండా పక్కన పెట్టేస్తారు. ఒక స్త్రీ తన వృత్తి, ఉద్యోగ విధుల్లో విజయం సాధిస్తే, సామాన్యంగా ఆ విజయం కాకతాళీయంగా, ఏదో పరిస్థితులు కలిసొచ్చి లభించిందే తప్ప ఆమె ఘనతేమీ లేదని, ఒకోసారి మరీ దుర్మార్గంగా ఆమె అందం కారణంగా ఆ విజయం లభించిందని ప్రచారం చేస్తారు.

వ్యవసాయం, నిర్మాణాలు, స్వయం ఉపాధి పనులు, బీడీలు చుట్టడం వంటి అసంఘటిత రంగాల పనుల్లో లైంగిక పరమైన శ్రమ విభజన స్పష్టంగా కనిపిస్తుంది. యంత్రాలతో సులభంగా చేసే పనుల్ని పురుషులు, మానవ శ్రమ అధికంగా అవసరమైన పనుల్ని స్త్రీలు చేస్తున్నారు.

ఉత్పత్తిరంగ పనుల్నేకాక మానవజాతి మనుగడకే అత్యంత అవసరమైన ప్రత్యుత్పత్తి విధులను కూడా నిర్వర్తిస్తున్న స్త్రీలు కుటుంబానికి, సమాజానికి చేస్తున్న సేవల విలువను లేబర్ మార్కెట్లో, స్త్రీ శ్రమ విలువల అంచనాలలో పరిగణనకు తీసుకోకపోవడం వలన పురుషుడి కంటే స్త్రీ రెట్టింపు పనిని చేస్తున్నప్పటికి అతని వేతనంలో 50–80 శాతాన్ని మాత్రమే పొందుతూంది.

పురుషాధిక్యత అంతర్భాగంగా ఉన్న కార్పొరేట్ సంస్కృతి, పురుషానుకూల కార్పొరేట్ వ్యవస్థా నిర్మాణం, ఉద్యోగ నియామక నిబంధనలు, పనితనపు కొలమానాలు మొదలైనవి స్త్రీల ఎదుగుదలకు అవరోధాలుగా ఉన్నాయి. మహిళల ప్రవర్తన, పనిచేసే విధానం, తల్లిగా, గృహిణిగా ఆమె నిర్వహిస్తున్న విధులను పురుషులు అనుకూల దృక్పథంతో చూడటం లేదు. పురుషాధిక్య కార్పొరేట్ సంస్కృతి వ్యక్తులలోకి కూడా విస్తరించి స్త్రీలను లైంగికంగా వేధించడం, స్త్రీల ప్రతిభను, నైపుణ్యాలను తక్కువ చేసి చూడడం లాంటి వికృత ధోరణులు కనిపిస్తున్నాయి. సాధారణంగా గృహ నిర్వహణ, భర్త, పిల్లలు, కుటుంబ సభ్యుల సంరక్షణకు భంగం కలగని ఉద్యోగాల్ని స్త్రీ ఎంపిక చేసుకోవలసి వస్తూంది. గృహనిర్వహణకు, శిశు సంరక్షణకు స్త్రీ ప్రాధాన్యత నిస్తుంది కనుక ఉన్నతోద్యోగ విధుల్ని ఆమె సక్రమంగా చేయలేదనే నెపంతో యజమానులు మహిళలకు ప్రమోషన్లనివ్వడానికి, శిక్షణలనివ్వడానికి నిరాకరిస్తున్నారు. అత్యున్నత స్థాయి పదవులు, ఉద్యోగాల తాలూకు మానసిక ఒత్తిడిని స్త్రీలు తట్టుకోలేరనే నెపంతో ఆస్థాయి పదవుల్ని, ఉద్యోగాల్ని మహిళలకు దక్కకుండా చేస్తున్నారు.

### మహిళల ఉపాధిపై ఆర్థిక సంస్కరణల ప్రభావం :

ప్రభుత్వ రంగ పరిధి తగ్గింపు, ప్రైవేట్ రంగపు విస్తరణ, ఎగుమతుల పెంపుకు కృషి, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడం, కార్మిక సంక్షేమ కార్యక్రమాల్ని సవరించడం, కొన్ని దేశాలలో కుటుంబ వ్యవస్థ సంబంధిత చట్టాల పరిశీలన, వాటి సంస్కరణ ప్రధానాంశాలుగా గల ఆర్థిక పునర్వ్యస్థీకరణ కారణంగా ప్రభుత్వ అదుపు లేకుండా స్త్రీలకు వేతనాల్ని నిర్ణయించే స్వేచ్ఛను పూర్తిగా మార్కెట్‌కు వదిలినప్పుడు స్త్రీల పునరుత్పత్తి పాత్ర యొక్క సాంఘిక విలువకు తగినంతగా ప్రాధాన్యత లభించదు. మహిళా సిబ్బంది సంక్షేమానికి అనుకూలంగా మార్కెట్ తీరును నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైతే ఉద్యోగ రంగంలో పోటీని స్త్రీలు తట్టుకోలేక ఉద్యోగాల్ని కోల్పోతారు. స్థూలంగా ఈ సంస్కరణల వలన పురుషులతో పాటు కొంతమంది స్త్రీలు కూడా లాభపడినప్పటికి ఎక్కువమంది స్త్రీలు నష్టపోతున్నారు.

### మహిళా ఉపాధిపై బహుళ జాతి సంస్థల ప్రభావం :

ఉత్పత్తితో సంబంధం లేని టెలి కమ్యూనికేషన్స్, రవాణా, టెక్నాలజీ రంగాలలో ఈ సంస్థలు ప్రధానంగా పెట్టుబడి పెడతాయి. ఈ రంగాలలో మహిళల ఉపాధి పెరుగుతుంది. ఈ సంస్థలలో కంప్యూటర్ల మీద చేసే పనులను ప్రధానంగా మహిళలే చేస్తున్నారు. అయితే, వీరిని తాత్కాలిక పనివారుగానే పరిగణిస్తున్నారు. యువతులకు, ముఖ్యంగా అవివాహిత యువతులకు, బిడ్డలు లేని వారికి నియామకాలలో ప్రాధాన్యం లభిస్తుంది. ఈ పరిశ్రమల అవసరాలు, విధానాలు మారినప్పుడు, ఆధునిక టెక్నాలజీని ప్రవేశపెట్టినప్పుడు స్త్రీల ఉపాధి అవకాశాలు మళ్ళీ తగ్గిపోతున్నాయి

## స్త్రీల జీవితాలపై వారి ఉద్యోగాల ప్రభావం :

స్త్రీలు అన్ని రంగాలలోనూ, ఇంతకు మునుపు పురుషుడి కోటలుగా ఉన్న ఉద్యోగాలతో సహా అనేక రకాల ఉద్యోగాలు, వృత్తులలో ప్రవేశిస్తున్నారు. చదువుకుని, ఉద్యోగం చేస్తున్న పట్టణ మహిళలు ఇంతకు మునుపు కంటే సమానత్వ దిశలో కొంత ప్రగతిని సాధించారు. ఐతే, స్త్రీలకు లభించిన ఆర్థిక స్వాతంత్ర్యం తాము స్వేచ్ఛనూ, సమానత్వాన్ని పొందడానికి, కుటుంబంలోని అసమానతను ప్రతిఘటించడానికి, పనిచేసేచోట ఎదురవుతున్న అనేక వివక్షల్ని ప్రశ్నించడానికి తగిన చైతన్యాన్నివ్వడం లేదు. అత్యధిక స్త్రీలకు తమ సంపాదనను స్వతంత్రంగా ఖర్చు పెట్టుకునే అధికారం, దాచుకునే, మదుపు చేసుకునే స్వేచ్ఛ లేవు, పురుషుడే లాలించో, బెదిరించో, మోసగించో, హింసించో ఊడలాక్కుంటున్నాడు.

అసలు స్త్రీ ఉద్యోగం చేయాలా, వద్దా, చేస్తే ఎలాంటి ఉద్యోగం చేయాలి, ఎప్పటి వరకు చేయాలి, ప్రమోషన్లను, ట్రాన్స్‌ఫర్లను అంగీకరించాలా, వద్దా అనేది నిర్ణయించేది ఉద్యోగిని భర్తే తప్ప ఆమె కాదు.

తన అవసరాలకోసం స్త్రీలను ఇంటినుండి బయట సమాజం లోకి లాక్కొచ్చి శ్రామికుల్ని, ఉద్యోగినుల్ని చేసిన పెట్టుబడిదారీ సంస్కృతి స్త్రీలకు ఇంటి పని నుండి విముక్తి కలిగించే భావజాలాన్ని వ్యాపింపచేయకపోవడం వలన స్త్రీలు రెట్టింపు పనిభారంతో శారీరక అనారోగ్యాలకు, మానసిక ఒత్తిడులకూ గురవుతున్నారు. కుటుంబంలోనూ, పనిచేసేచోట శారీరక, మానసిక, లైంగిక హింసను ఎదుర్కొంటున్నారు. 'శీలం' విషయంలో స్త్రీ, పురుషుల పట్ల ద్వంద వైఖరిని ప్రదర్శించే పితృస్వామ్య సమాజంలో అనుక్షణం అమలవుతున్న నిఘాను సహిస్తున్నారు, కొన్ని సందర్భాల్లో అనుచిత నిందల్ని, పుకార్లను ఎదుర్కొంటూ మానసిక వ్యధకు గురవుతున్నారు.

## పరిష్కారాలు :

ప్రస్తుతం ఉన్న వివక్షలూ, అసమానతలూ సహజమైనవి లేక బయోలాజికల్‌వి కాక సామాజికంగా, రాజకీయంగా స్థిరపరచినవి కనుక జెండర్ సంబంధాల పునర్నిర్మాణం జరగాలి. ఆర్థిక సంస్కరణల రూపకల్పన, అమలు విధానం మహిళా సంక్షేమ దృష్టితో జరగాలి. స్త్రీల ఉపాధిని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేసే పాలసీలను రూపొందించేటప్పుడు వారి అవసరాల్ని, ఆలోచనల్ని, ఆకాంక్షల్ని పరిగణనలోకి తీసుకోవాలి.

'మానవ ముఖం' లోపించిన స్ట్రక్చరల్ ఎడ్జస్టమెంట్ పాలసీల కారణంగా అమలులో ఉన్న అభివృద్ధి నమూనాలు వివిధ ప్రాంతాల మధ్య, ధనికులూ పేదల మధ్య, స్త్రీ,పురుషుల మధ్య అసమానతల్ని పెంచుతూ, పేదరికానికి స్త్రీ ముఖాన్ని తగిలిస్తూ స్త్రీలను విద్య, ఆరోగ్యం, ఉద్యోగం మొదలైన ప్రాథమిక అవసరాలకు దూరం చేస్తున్నాయి. ఈ అభివృద్ధి నిర్వచనాన్ని, నమూనాలను, అభివృద్ధి సాధనకు అమలుచేసే వ్యూహాల్ని ప్రజల, ముఖ్యంగా స్త్రీల సంక్షేమం దృష్ట్యా మార్చాలి.

స్త్రీలతో పాటు పురుషులు ఇంటిపనిలో పాలుపంచుకోవాలి. స్త్రీల ఉద్యోగాల పట్ల కుటుంబ వైఖరి మారాలి. ఆర్థిక సరళీకరణల కారణంగా స్త్రీలు నష్టపోకుండా సంఘటిత రంగంలో లభించే వసతులనన్నిటిని అసంఘటిత రంగంలో ఉన్న వారికి కూడా విస్తరింపజేయాలి. సమాచారం, శిక్షణావకాశాలు, రిజర్వేషన్లు, సామాజిక సేవలు అందేలా చూడాలి, క్రెషెస్, హాస్టల్స్, రవాణా మొదలైన సపోర్టివ్ సేవల్ని అందించాలి

మహిళలు కేవలం ప్రణాళికల లబ్ధిదారులుగా మిగిలి పోకుండా ప్రణాళికా రచనలో భాగస్వాములవాలి. అందుకు అవసరమైన విద్యార్హతల్ని సంపాదించుకోగల అవకాశాల్ని వారికి కల్పించాలి. స్త్రీల సృజనాత్మక శక్తుల వికాసాన్ని నిరోధించడం వలన అవి నిరుపయోగమవుతాయి. ఆ మేరకు దేశం నష్ట పోతుంది తగిన అవకాశాల్ని కలిగిస్తే తమ గమ్యాన్ని చేరుకోవ డానికి అవరోధంగా ఉన్న 'గ్లాస్ సీలింగ్' ని ఛేదించగలుగుతారు. జాతీయ విధానాల నిర్ణయాత్మక స్థాయిలో మహిళా ప్రాతినిధ్యం పెరగాలి.

స్త్రీల పట్ల వివక్షాపూరితంగా ఉన్న చట్టాల్ని మార్చాలి. పనిచేసే చోట స్త్రీలపై జరుగుతున్న లైంగిక వేధింపుల విషయంలో ఉన్న చట్టాల్ని పటిష్టంగా అమలు పరచాలి. శతాబ్దాలుగా స్థిరంగా నిలిచి, వర్తమాన కాలంలో తప్పని సరిగా మారవలసిన నమూనా నుండి బయటపడగల చైతన్యం స్త్రీలలో రావాలి. స్త్రీలను సమాన స్థాయిలో గౌరవించగల వివేకం పురుషులకు రావాలి. తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యావేత్తలు, విధాన నిర్ణయకర్తలు అందరూ కలిసి స్త్రీల అసమానతలో అంతర్గతంగా ఉన్న అమానుషాన్ని గుర్తించి, మార్పు కోసం పోరాడవలసిన తప్పనిసరి అవసరాన్ని బాల్యంలోనే చిన్నారుల మెదళ్ళలో నాటాలి. భూస్వామ్య వ్యవస్థలో నిర్మించబడి, పెట్టుబడిదారీ వ్యవవస్థలో బలపడిన 'స్త్రీలపై వివక్ష'ను నూతన శతాబ్దిలో, నూతన సహస్రాబ్దిలో కొనసాగనివ్వడం మానవ జాతికే కళంకం ❑

# సవాళ్లను స్వీకరిస్తేనే సాధికారత



యస్. మనోరమ

మహిళల అసమానత్వ వ్యక్తిగతమైనది కాదు. సమాజపరమైనది. ప్రపంచవ్యాప్తమయినది. ప్రపంచం ఒక్కటే కాని అసమానతలతో నిండి వుంది అనేది వాస్తవం.

1910 దశకంలో సోషలిస్టు ఇంటర్‌నేషనల్ నాయకురాలు క్లారా జెక్టవిన్ మహిళల స్థితిగతులు వెరుగుపరచడానికి మహిళా దినోత్సవం జరపడం అవసరం అని భావించి, పిలుపిచ్చారు. ముందుగా రష్యాలో, తర్వాత సోషలిస్టు దేశాలు మహిళా దినోత్సవ కార్యక్రమాలు చేబట్టాయి. నేడు అన్ని దేశాల మహిళలు ప్రత్యేకంగా మార్చి 8వ తేదిన సమానత్వం కోసం, హక్కుల కోసం నినదిస్తూనే ఉన్నారు, యీ సంవత్సరం ఐక్యరాజ్యసమితి మహిళా దినోత్సవం సందర్భంగా "సవాళ్ళను ఎంచుకోండి" అనే నినాదాన్ని ప్రకటించింది. (choose to challenge) ప్రశ్నిస్తేనే ప్రపంచం జాగృతమవుతుంది. మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్ళకు మహిళలు సంసిద్ధులు కావాలనేది ఆ పిలుపు లక్ష్యం.



మహిళా సాధికారత అనే అంశానికి చాలా విస్తృతమైన పరిధి వుంది. క్లుప్తంగా చెప్పాలంటే మహిళ తన జీవితానికి సంబంధించి సామాజిక, ఆర్థిక, రాజకీయ నిర్ణయాలు స్వయంగా, స్వచ్ఛగా తీసుకోగలిగిన స్థితిని కలిగి ఉండడము. తన శక్తి సామర్థ్యాలను వికసింప చేసుకోవడానికి అవకాశాలు కలిగి ఉండడము.

మా చిన్నతనం ఎలిమెంటరీ విద్య పాఠం పుస్తకంలో కలవారి కోడలు కలికి కామాక్షికి స్వయంగా పుట్టింటికి వెళ్ళే నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛ లేదు. పుట్టింటికి వెళ్ళడానికి బావగారిని, భర్తను బతిమిలాడి అనుమతి పొందుతుంది కామాక్షి. గత దశాబ్దాలలో మహిళల స్థితిగతులకు అద్దం పట్టిన పాఠం అది. అందుకనే ప్రఖ్యాత రచయిత కొడవటిగంటి కుటుంబరావు గారు మన సమాజంలో కొందరు వెనుకబడిన కులాల్లో పుడతారు. మరి కొందరు ఆడవారిగా పుడతారని ఆడ జన్మ' కథలో వాఖ్యానించారు.

కందుకూరి వీంశలింగం, గురజాడ అప్పారావు గార్లు ఆనాటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షతను ప్రశ్నించిన మహానుభావులు, దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహిళల ప్రవేశాన్ని ప్రోత్సహించి, భాగస్వాముల్ని చేసింది జాతిపిత మహాత్మాగాంధీ. తర్వాతి కాలంలో వామపక్ష పార్టీలు మహిళల స్వచ్ఛ, సమానత్వాల కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరాయంగా నిర్వహించడం చరిత్రలో నమోదయిన వాస్తవం.

1950లో అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం మహిళలకు సమాన అవకాశాలు, స్వేచ్ఛ, హక్కులు చట్టపరంగా పొందు పరిచింది. తరతరాలుగా వివక్షతకు గురి అయిన స్త్రీలకు చట్ట సమానత్వం లభించడం గొప్ప మలుపు. మహిళ అభివృద్ధి చెందితేనే దేశాభివృది సాధ్యమని ప్రథమ ప్రధాని నెహ్రూ అభిప్రాయం. ఆమె మారితే ఇల్లు, ఊరు, దేశం మారతాయని స్పష్టం చేసారాయన.

1970 దశకం నుండి తరతరాలు సమాజంలో కరడు కట్టుకుపోయిన వివక్షతను అనుభవిస్తున్న మహిళల స్థితి గతులు మార్చవలసిన అవసరముందని ప్రపంచ దేశాలు గ్రహించి, చర్చించడం ప్రారంభమయింది. అందులో భాగంగా న్యూయార్కు లో గల ఐక్యరాజ్యసమితి 1975 సంవత్సరాన్ని "అంతర్జాతీయ మహిళ సంవత్సరం"గా ప్రకటించింది. అతివలు వెనుకబాటుకు సంబంధించిన అన్ని అంశాలను అంతర్జాతీయంగా ఆలోచించి, స్థానికంగా అమలు చేయాలనే లక్ష్యాన్ని ప్రపంచ దేశాల ఐరాస ప్రకటించింది.

పై లక్ష్యంలో భాగంగా మహిళలు ఎదుర్కొంటు సమస్యల చర్చ, పరిష్కారాల కోసం నాలుగు ప్రపంచ శిఖరాగ్ర మహాసభలు జరిగాయి. ప్రథమ ప్రపంచ మహిళా మహాసభ మెక్సికో నగరంలో జరిగింది 1975 సంవత్సరంలో. తర్వాత 1985 నైరోబి, 1989 కొపెన్ హగన్, 1995 బీజింగ్ (చైనా) లో నిర్వహించారు.

స్త్రీల కోణం నుంచి బహుముఖమైన మానవీయ అభివృద్ధికి పై మహిళా శిఖరాగ్ర సభలు ప్రాముఖ్యతనివ్వడం గొప్ప చోదక శక్తిగా మలచబడింది. అభివృద్ధికి, మహిళల స్థితిగతులు మెరుగు పరచడానికి మధ్య గల సంబంధాన్ని యీ మహాసభలు స్పష్టం చేసాయి. (Development has women's face).

1995 బీజింగ్ మహిళా మహాసభ "బీజింగ్ ప్రకటన, కార్యాచరణ వేదిక పేరుతో ఒక చారిత్రాత్మక ప్రణాళిక తయారైంది. 189 దేశాల ప్రభుత్వాలు, 12 కీలకమైన అంశాలను గుర్తించి, అమలు కోసం సంతకాలు చేశాయి. దేశదేశాల నుంచి 71000 మహిళా ప్రతినిధులు పాల్గొన్న మహాసభలో హిల్లరీ క్లింటన్‌తో సహా 'మహిళల హక్కులు, మానవ హక్కులవి' ముక్త కంఠంతో నినదించడం అపూర్వ సంఘటనగా నిలిచిపోయింది. మహిళ కన్నులతో ప్రపంచాన్ని వీక్షించమని పిలుపిచ్చింది. పురుషానుభవమే లోకానుభవంగా చెలామణి అయిన పరిస్థితికి యీ శిఖరాగ్ర మహాసభ వీడ్కోలు పలికింది.

ఐక్యరాజ్య సమితి 1979 సంవత్సరంలో కొన్ని అంశాలలో గల మహిళా వివక్షతను అంతం చేయాలని తీర్మానం చేయడం మహిళా ప్రగతికి మరో ముందడుగు. భారత ప్రభుత్వం 2001 వ సంవత్సరాన్ని మహిళా సాధికారత సంవత్సరంగా ప్రకటించి వారి సమస్యలపై దృష్టి సారించింది. తర్వాత వచ్చిన యుపిఎ ప్రభుత్వం తన కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో పొందుపరిచిన 6 మౌలిక అంశాలలో మహిళా ప్రగతికి ప్రాధాన్యమివ్వడం మంచి పరిణామమేనూ! విద్య, ఆర్థిక, రాజకీయ,చట్టాల అంశాలలో మహిళా అభ్యున్నతికి కృషి చేయాలని ఆ ప్రోగ్రాం సూచించింది.

2000 సంవత్సరంలో ఐరాస నిర్దేశించిన శతాబ్ధి లక్ష్యాలలో సింహభాగం మహిళలు సాధికారత సాధించే క్రమానికి సంబంధించినవే. ఆ 8 లక్ష్యాలలో మొదటి రెండు పేదరికం, నిరక్షరాస్యత తగ్గించే అంశాలు. పేదలు, నిరక్షరాస్యులలో అతివలే అధికం. మరో లక్ష్యం మహళ సమానత్యాన్ని సాధికారతను పెంపొందించడానికి తీసుకోవలసిన చర్యలు. శిశుమరణాలు తగ్గింపుకు తీసుకోవలసిన దిశగా తీసుకోవలసిన ప్రణాళికలు, బాలింతల మరణాలను తగ్గించేందుకు, ప్రసూతి ఆరోగ్య సంరక్షణతో బాటు హాస్పటల్స్‌లో ప్రసవాలు పెంచేటట్లు చూడడం. అంటువ్యాధుల తగ్గింపు చర్యలతోబాటు పర్యావరణ పరిరక్షణకు ప్రయత్నాలు ముమ్మరం చేయడం. ముఖ్యంగా యీ లక్ష్యాల అమలుకు అంతర్జాతీయ సహకారాన్ని బలపరచడం.

దాదాపు 70 శాతం మహిళలు వ్యవసాయ రంగంలోనే పని చేయడం వల్ల, మూడు వ్యవసాయచట్టాల ముప్పును తెలిగ్గా గ్రహించి, ఉద్యమానికి వెన్ను దన్నుగా నిలుస్తున్నారని చెప్పాలి. మూడు చట్టాలు రద్దు చేయవల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి విసిరిన సవాలు ద్వారా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు నడుం బిగించారనేది స్పష్టం. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మహిళల బాధలను చూడలేక, ఇళ్ళు మళ్ళమని ఇచ్చిన పిలుపును మహిళలు లక్ష్యపెట్టలేదు. యీ రైతాంగ ఉద్యమం అసంఖ్యాక మహిళలతో కూడి ప్రపంచ ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షించడంలో ఎనలేని మహిళల పట్టుదల స్ఫూర్తిదాయకం.

పై రెండు ఉద్యమాలలో మహిళల పాత్ర రాబోయ కాలంలో యీ దేశ ప్రజాస్వామ్య పరిరక్షణలో కారుచీకట్లో కాంతిరేఖకు దారి తీస్తుందేమో!

ఆంధ్రప్రదేశ్ రాజధాని తరలింపు నిలుపుదల ఉద్యమంలో సంవత్సరాలు తరబడి మహిళలు పాలు పంచుకుంటున్న ఘటన మహిళలలో వస్తున్న మార్పు సంకేతమే!

మహిళల పట్ల చిన్నచూపు చూసే పితృస్వామిక తత్వం సమాజంలో తరతరాలుగా రక్తగతమైనది. ఈ తరం పురుషుల సంస్కారంలో మార్పు వస్తే, ఆ మార్పు రక్త గతం కావాలంటే కనీసం కొన్ని తరాలు పట్టవచ్చు. కొత్త సంస్కారం అలవడిన పురుషునికి స్త్రీని సమానంగా చూడడం రక్తసంబంధమయిన లక్షణంగా మార్పు చెందుతుంది. మహిళను చిన్నచూపు చూడడం అతని సంస్కారానికి పరాయిదిగా వుంటుంది .

స్త్రీ సమానత్వం, స్వేచ్ఛ కోసం రెండు రంగాలలో పోరాటం అవసరం ఒకటి శాసన రంగం, రెండవది సాంస్కృతిక రంగం.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ పిలుపు సోషలిస్టు భావజాలం పిలుపు అది నేటి మహిళా సాధికారతకు పునాది రాయిగా నిలిచే వుంది.

ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుందన్న గురజాడ భవిష్యత్ ఆకాంక్ష అడుగు నేడు రచ్చబండ మీదకు రావడం అక్షర సత్యం, అలాంటి సవాలును ఎదుర్కొవడమే అంతర్జాతీయ మహిళా దినోత్సవ నినాదం.

2000 – 2015 వరకు దేశదేశాల్లో అమలుపరిచిన శతాబ్ధా లక్ష్యాలను ఐరాస సమీక్షించింది. తిరిగి 2015 – 2030 వరకు నిర్దేశించిన లక్ష్యాలు నిలకడ కల అభివృద్ధిని సాధించడానికి ప్రయత్నించాలని తీర్మానించింది. అభివృద్ధి లక్ష్యాలకు మహిళా పార్శ్వం ఉందనేది ప్రపంచ దేశాలు గుర్తించాలని నిర్దేశించింది. (Development has women's face).

మహిళా సాధికారతకు స్పష్టమయిన అంశాలను

ప్రచారంలోకి తెచ్చిన ప్రముఖుడు, నోబుల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్. మానవ వనరుల అభివృద్ధికి మహిళా సాధికారిత అత్యంత అవసరమయిన భూమిక అని ఆయన తేల్చి చెప్పారు, "అభివృద్ధే స్వేచ్ఛ" అనే భావనను మహిళాస్వేచ్ఛ, సమానత్వ సాధనకు ముడిపెట్టారు. ఇల్లు, పిల్లలు నిర్వహణభారం మహిళలతో బాటు మగవారు సమంగా భాగం పంచుకుంటేనే, మహిళలు బయట రంగంలో అభివృద్ధిని సాధించగలరని తన పరిశోధనలో తేల్చి చెప్పిన మహామనీషి అమర్త్యసేన్. ఇటీవల మన దేశంలో జరుగుతున్న రాజకీయ, ఆర్థిక పరిణామాలకు మహిళలు చైతన్యంతో స్పందించడం శుభ పరిణామం.

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నెలలు తరబడి ఢిల్లీలో షాహిన్‌బాగ్ వద్ద జరిగిన ఉద్యమంలో మైనారిటీ మతానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున క్రియాశీలకంగా భాగస్వాములవడం ప్రగతిశీల పరిణామం. ముఖ్యంగా దిల్‌కుష్‌భాను అనే వృద్ధ మహిళ ఆ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచి ఉత్తేజపరిచారు. అమెరికన్ టైం పత్రిక గత సంవత్సరం ప్రభావం కలిగించిన ప్రపంచ ప్రముఖులు 100 మందితో ప్రధాని మోదితో బాటు, ఆమెకు స్థానం దక్కడం హర్షనీయం. ఆ విధంగా షాహిన్‌బాగ్ ఉద్యమానికి అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందన్న మాటే !

కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం పాస్ చేసిన 3 వ్యవసాయానికి సంబంధించి ఢిల్లీలో నెలలు తరబడి నడుస్తున్న ఉద్యమం లోకాన్ని రాష్ట్రాల మహిళలు అసంఖ్యాకంగా పోరాట పటిమతో భాగస్వామ్యం పంచుకోవడం విస్తరిస్తున్న మహిళా చైతన్యానికి ప్రతీక ! ❑

## పర్యావరణ పరిరక్షణ ఉద్యమాల్లో మహిళల పాత్ర

**(43వ పేజీ తరువాయి)**

### సునీత నారాయన్

భారతదేశంలోని ప్రముఖ పర్యావరణవేత్తలలో సునీత నారాయన్ అగ్రగణ్యులు. 1961లో ఢిల్లీలో జన్మించి 1982 నుండి ప్రఖ్యాత పర్యావరణవేత్త కీర్తిశేషులు అనిల్ అగర్వాల్ స్థాపించిన సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ అనే స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తూ అగర్వాల్ అనంతరం ఆ సంస్థ డైరెక్టర్ జనరల్‌గా కొనసాగుతున్నారు.

కోకాకోలా, పెప్సీ కంపెనీలు తయారు చేసే శీతల పానీయాల్లో క్రిమిసంహారక మందుల అవశేషాలు ఉండటాన్ని ఎత్తి చూపుతూ దేశ ప్రజల దృష్టిని ఆకర్షించారు. పౌర సమాజం నిర్వహించే అన్ని జాతీయ అంతర్జాతీయ పర్యావరణ ఉద్యమాల్లో పాల్గొంటూ ప్రజాస్వామ్యంలో ప్రకృతి వనరులపై స్థానిక సంస్థల నిర్ణయాధికారానికై పోరాడుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా భారతదేశ పర్యావరణపరిస్థితిపై వార్షికనివేదికను ప్రచురిస్తున్నారు. ఆమె సేవలకు గుర్తింపుగా కలకత్తా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. 2016లో టైమ్ మేగజైన్ ప్రపంచ వ్యాపితంగా వంద మంది అత్యంత ప్రతిభాశీలురలో ఒకరిగా ఆమెను గుర్తించింది.

### మేధా పట్కర్

మేధాపట్కర్ 1954లో ముంబైలో స్వాతంత్ర సమరయోధుల కుటుంబంలో జన్మించింది. ఆమె నాన్నగారు ముంబైలో ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులుగా ఉండేవారు. మూడు దశాబ్దాలకు పైగా నర్మదా లోయలో గిరిజన కర్షక సముదాయాల్లో పనిచేస్తూ 1985లో ప్రారంభించిన నర్మదా బచావ్ ఆందోళన ద్వారా ప్రపంచ ప్రఖ్యాతి గాంచారు. పెద్దపెద్ద ఆనకట్టల వలన నిరాశ్రయులు అయ్యే వారి పక్షాన నిలబడి పోరాడుతున్నారు. ప్రత్యేకించి సర్దార్ సరోవర్ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలను సమీకరించి వారి పునరావాసానికి కృషి చేస్తున్నారు. 1992 లో ప్రజా సంఘాల జాతీయ కలయిక నేషనల్ ఆలయన్స్ ఆన్ పీపుల్స్ మూమెంట్స్ అనే సంస్థను స్థాపించి దేశంలో జరుగుతున్న సామాజిక ఉద్యమాలకు కేంద్రబిందువుగా ఆ సంస్థను రూపుదిద్దారు. ఆ సంస్థ ముఖ్య ఉద్దేశం నేటి ప్రభుత్వాల అభివృద్ధి నమూనాను ప్రశ్నిస్తూ ప్రత్యామ్నాయ పర్యావరణ అనుకూల అభివృద్ధి నమూనాను ప్రచారం చేయడం ఆమె సేవలకు గుర్తింపుగా ఎన్నో జాతీయ అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు.

ఇటీవల జరుగుతున్న రైతు పోరాటాలకు మద్దతుగా నిలిచారు.

పైన పేర్కొన్న వారే గాక వివిధ ఖండాల్లో పర్యావరణ పరిరక్షణ ఉద్యమాల్లో పనిచేసే మహిళామణులు ఎందరో ఇంకా ఉన్నారు. వారి గురించి మరోసారి మనం చేసుకుందాం

మనం తెలుసుకోవడంతోపాటు మన దేశంలోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో చేపట్టే పర్యావరణ విధ్వంసక చర్యలను వ్యతిరేకిస్తూ వామపక్ష ప్రజాస్వామ్య శక్తులు నిర్వహిస్తున్న అన్ని ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించవలసిన సమయం ఆసన్నమైందని భావిస్తున్నాము. ❑



# స్త్రీవాదం కేవలం లింగ వివక్షకే పరిమితం కాదు, కాలేదు

## ఓల్గా గారితో గోదావరి అంతర్జాల సాహిత్య మాస పత్రిక

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భముగా గోదావరి అంతర్జాల సాహిత్య మాస పత్రికకు ఓల్గా గారు ఇచ్చిన ఇంటర్వ్యూ

1. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? తద్వారా కలిగే ప్రయోజనాలు, ప్రేరణలు ఏమిటి?

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని చారిత్రక ప్రాధాన్యతను మర్చిపోకుండా పోరాట స్ఫూర్తి, మహిళా ఐక్యతను, వాటి ప్రాముఖ్యతనూ గుర్తు చేసుకుంటూ వర్తమాన కాలంలో ఐక్య పోరాటాల అవసరాన్ని అంచనా వేసుకుంటూ అర్థం చేసుకోవాలి. చరిత్ర తెలుసుకుంటే ప్రేరణ కలుగుతుంది. ఆ ప్రేరణ ఈ కాలంలో ఎంతో అవసరం. మహిళలపై హింస ఊహాతీతంగా పెరుగుతున్న వర్తమానంలో స్త్రీలు పోరాటం చేయాలని, ప్రతిఘటనకు పూనుకోవాలనీ, ఒకప్పుడు మహిళలు అద్భుతమైన పోరాటాలు చేసి అనేక హక్కులు పొందారనీ తెలుసుకోవటం అవసరం. అదే ప్రయోజనం కూడా!

2. అంతర్జాతీయ మహిళా దశాబ్ది చైతన్యం ఏమిటి?

అంతర్జాతీయ మహిళా దశాబ్ది గడిచిపోయింది. ఆ కాలం లోని స్త్రీల ఉద్యమాలు, వాటి ద్వారా రూపొందిన స్త్రీవాద సిద్ధాంతాలు ఈనాటికీ స్త్రీలకు మార్గదర్శకంగా ఉన్నాయి. అంతర్జాతీయ సదస్సులలో అనేక కీలకాంశాలు చర్చకు వచ్చాయి. స్త్రీల పట్ల ప్రపంచమంతా ఉన్న వివక్షను, దాని వ్యతిరేక ఫలితాలను అన్ని దేశాలూ చర్చించాయి. ఆ చర్చలు సామాన్య మహిళల వరకూ చేరుకునే వీలు కలిగింది. మహిళల హక్కులు మానవ హక్కులనే నినాదం ప్రపంచ మంతా ప్రతిధ్వనించింది. మహిళలు తమ హక్కుల గురించి ప్రశ్నించటం, పోరాడటం కొనసాగిస్తూనే ఉన్నారు.

3. స్త్రీవాదాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

స్త్రీవాదం సమాజాన్ని అర్థం చేసుకునే ఒక విశ్లేషణాసిద్ధాంతం. సమాజంలోని సమస్త అసమానతలనూ, వివక్షలనూ పరిశీలించి, అర్థం చేసుకుని, వాటిని నిర్మూలించేందుకై పోరాడాలని చెప్పే ఒక దృక్పథం. స్త్రీ పురుషులిద్దరూ ఈ దృక్పథాన్ని కార్యాచరణలో పెట్టాలని చెప్పే సిద్ధాంతం. లింగ వివక్షకు మాత్రమే స్త్రీవాదాన్ని పరిమితం చేయలేము. కుల, మత, జాతి, వర్ణ, లైంగిక సంబంధిత అసమానతలన్నిటినీ స్త్రీ వాదం గుర్తిస్తుంది. పరిగణనలోకి తీసుకుంటుంది. పర్యావరణం గురించి మాట్లాడుతుంది. శాంతి ప్రాధాన్యతను గుర్తించమంటుంది. అభివృద్ధి అంటే అసలైన అర్థమేమిటో వివరిస్తుంది. వీటన్నిటినీ గమనించకుండా ఇంకా 30 సంవత్సరాల క్రితం వేసిన పాత ప్రశ్నలోనే కూరుకుపోతే స్త్రీవాదాన్ని అర్థం చేసుకోలేము.

4. మహిళా జన జీవన అధ్యయనాలకు, స్త్రీవాదానికి వున్న సంబంధమేమిటి?

అధ్యయనాలు, గణాంకాలు సామాజిక అభివృద్ధిని, మహిళా భివృద్ధినీ అంచనా వేసేందుకు ఉపయోగపడే పరిశోధనలో ముఖ్యమైన భాగం. మహిళల స్థితిగతుల గురించి తెలియటం సిద్ధాంతపు సమకాలీనతకు ఎప్పుడూ మంచిదే ఈ అధ్యయనాలు స్త్రీవాద సిద్ధాంతపు పదునును పెంచుతాయి.

5. స్త్రీ వాద భావజాలం తెలుగు సమాజాన్ని ఎలా ప్రభావితం చేసింది? అందువల్ల వచ్చిన గుణాత్మక పరిణామాలు ఏమైనా ఉన్నాయా? గతంలో అది వేసిన ప్రభావానికి వర్తమానంలో దాని ప్రభావానికి మధ్య భేదం ఏమైనా గుర్తించారా?

స్త్రీవాద భావజాలం జండర్ దృక్పధాన్ని సమాజానికి పరిచయం చేసింది. ప్రతి విషయాన్నీ జండర్ దృష్టితో పరిశీలించటం, అర్థం చేసుకోవటం ముఖ్యమని చాలా వరకు తెలుగు సమాజం గుర్తించింది. మహిళలు చేసిన, చేస్తున్న పోరాటాలలో స్త్రీవాద ప్రభావమెంతో ఉంది. పితృస్వామ్యం ఒక వ్యవస్థగా ఎట్లా పనిచేస్తుందో అర్థం చేసుకోలేకపోతే స్త్రీల సమస్యలు అర్థం చేసుకోలేమనే ఆలోచన ఇచ్చింది. పితృస్వామ్యం విధించే అణిచివేతల, ఆంక్షల లోతును, సంక్లిష్టత్వాన్ని విప్పి చూడాలని తెలియజెప్పింది. ఈ విషయాలను అర్థం చేసుకున్నపుడు తమ అణచివేతలను గుర్తించటం సులభమవుతుంది.

గతంలో ప్రభావం తరువాతి తరాలు అందిపుచ్చుకున్నాయి. ఇప్పటి మహిళాఉద్యమాలలో, పోరాటాలలో స్త్రీవాద ఉద్యమ ప్రభావం లేదని ఎవరనగలరు? అంటే అది చరిత్రను విస్మరించటమే.

6. తెలుగులో స్త్రీవాద సాహిత్యం వెలువడడానికి భూమిక ఏమిటి? స్త్రీవాద సాహిత్య అవసరం ఈనాటికి ఉన్నదను కుంటున్నారా?

స్త్రీలు తమ పట్ల సమాజంలో అమలవుతున్న అణచివేతను, వివక్షను, వీటిని అమలు చేస్తున్న పితృస్వామ్య భావజాలాన్ని అర్థం చేసుకునే క్రమంలోనే తెలుగు స్త్రీవాద సాహిత్య భూమిక యేర్పడిరది. స్త్రీవాద సాహిత్య అవసరం ఉందా అనే ప్రశ్న హాస్యాస్పదం. ఇవాళ వస్తున్న సాహిత్యంలో స్త్రీవాద దృక్పధం

లేకపోతే దానిని ప్రశ్నించటానికి పాఠకులు సిద్ధంగా ఉన్నారు. స్త్రీ పురుష సమానత్వాన్ని గురించి ప్రశ్నలు రేకెత్తించే సాహిత్య అవసరం ఉందా అని అడుగుతున్నారా? అసమానత్వం ఉన్నంత కాలం దానిని వివరించే, ప్రశ్నించే సాహిత్యం వస్తుంది. ఇపుడు కూడా వస్తూనే ఉంది.

7. 80, 90 దశకాల్లో స్త్రీవాద సాహిత్యం బలంగా వెలువడడానికి కారణాలు ఏమిటి?

80, 90 దశాబ్దాలలో స్త్రీవాద సాహిత్యం ఉధృతంగా ప్రారంభమై, ఇపుడు కూడా బలంగా వస్తున్నది. అది ప్రారంభం గనుక అందరూ గమనించేలా వచ్చింది. కొత్త చూపునిచ్చింది గనుక ఆ దశాబ్దాలకు ఒక ప్రాధాన్యత ఉంది. తర్వాత రచయితలందరూ జండర్ దృక్పథాన్ని ఒంట బట్టించుకోవటం తప్పనిసరైంది. ఒక్క స్త్రీ పురుష అసమానతల మీదే కేంద్రీకరించటం వల్ల 80, 90 దశకాలలో స్త్రీవాదం బలంగా వచ్చినట్లు అనిపించవచ్చు. క్రమంగా స్త్రీవాద పరిధి విస్తరించింది.

8. ఇప్పుడు విడిగా ప్రత్యేకముగా స్త్రీ వాదం పేరిట ఉధృతంగా రచనలు రాకపోవడానికి కారణాలు ఏమిటని మీరు అనుకుంటున్నారు?

రచనలు వస్తూనే ఉన్నాయి అని నేనంటున్నాను. రాకపోవటానికి కారణాలు నన్నడిగి లాభం లేదు.

10. నవల, కథ, విమర్శ, నాటకం వంటి ప్రక్రియల కంటే స్త్రీ వాద సాహిత్యం ఎక్కువగా కవిత్వంలోనే వెలువడింది. దీనికి కారణాలు ఏవంటారు?

కవిత్వంతో పాటు కథ, విమర్శ ఈ రెండింటిలో స్త్రీవాద సాహిత్యం వచ్చింది అనేక కథా సంకలనాలు వెలువడ్డాయి. వెలువడుతున్నాయి. నవల ప్రచురణ కష్టం కావటం వల్ల తక్కువ వెలువడ్డాయని నా అభిప్రాయం. నాటకం స్త్రీవాదంలోనే కాదు ఏ వాదంలోనూ అంత బలంగా లేదు.

11. స్త్రీ వాదం ఎక్కువగా తనకు మద్దతు ఇచ్చే ఉద్యమాలను, ఉద్యమ నాయకత్వాన్ని ప్రశ్నించింది కానీ పాలకులను ప్రశ్నించలేదని ఒక అభియోగం. దీని గురించి మీరు ఏమంటారు?

స్త్రీవాదం పితృస్వామ్య రాజకీయాలన్నిటినీ ప్రశ్నిస్తుంది. వామపక్ష ఉద్యమాలలో అసమానత్వాన్ని, వివక్షను ఎదుర్కొని వచ్చిన స్త్రీవాదులు ఆ ఉద్యమ నాయకత్వాన్ని ప్రశ్నించారు. అందులో ఆశ్చర్యపడవసిందేమీలేదు. ఎక్కడ సమానత్వం ఉంటుందని నమ్మారో అక్కడ లేకపోవటం స్త్రీవాదులను ప్రశ్నించేలా చేసింది. తమకు సగభాగం దక్కుతుందని నమ్మకంతో వెళ్ళిన చోట కూడా వివక్షలు ఎదురవటాన్ని స్త్రీ వాదులు ప్రశ్నించారు. పాలకులను ప్రశ్నించక పోవటం ఏమిటి? స్త్రీవాదఉద్యమాలు ఎవరికి వ్యతిరేకంగా నిర్మించబడ్డాయి? వరకట్న హత్యలు, స్త్రీలపై లైంగిక అత్యాచారాలు, లింగ నిర్ధారణ పరీక్షలు, పనిచేసేచోట లైంగిక వేధింపులు – ఈ ప్రశ్నలు లేవదీసింది, పోరాటాలు, ఉద్యమాలు చేసింది పాలక వర్గాలతోనే కదా! ఎంతో కొంత మార్పుతెచ్చే చట్టాల కోసం, వాటి అమలు కోసం ప్రశ్నిస్తున్నది ఉద్యమిస్తున్నది పాలకులతో కాక మరెవరితో?

పాలకులంటే కేవలం అప్పుడు అధికారంలో ఉన్నవారే కాదు. పాలకవర్గం పూర్తిగా పితృస్వామ్య భావజాలాన్ని అమలు చేసే పనిలో నిమగ్నమై ఉందని, పితృస్వామ్యం లేకుండా పాలకవర్గం మనలేదని స్త్రీవాదమే మొదటగా గుర్తించింది. స్త్రీవాద పోరాటమంతా పిత్రుస్వామ్య వ్యతిరేకపోరాటమే. సారాంశంలో పాలక వర్గాల వ్యతిరేక పోరాటమే.

12. దళిత బహుజన మైనారిటీ అస్తిత్వ ఉద్యమాలు, ఉద్యమ సాహిత్యం స్త్రీవాద సాహిత్య విస్తరణకు అవరోధం అయ్యాయని భావిస్తున్నారా?

అసలు భావించటం లేదు. ఆ అస్తిత్వ వాదాలన్నీ స్త్రీవాదానికి బలం చేకూరుస్తాయి. అసమానతలు ఎక్కడున్నా గుర్తించటం నేర్పింది స్త్రీవాదమే.

13. స్త్రీ వాదానికి ప్రాంతీయ అస్తిత్వ చైతన్యంతో సహా దళిత బహుజన మైనారిటీ అస్తిత్వాలకు వైరుధ్యం ఉందని అనుకుంటున్నారా?

వైరుధ్యమేమీ లేదు.

14. స్త్రీవాద అస్తిత్వ ఉద్యమానికి మిగిలిన అస్తిత్వ వాద ఉద్యమాల కంటే భిన్నంగా ఉన్న ప్రత్యేకత ఏమిటి?

ప్రత్యేకత ఏమో గానీ స్త్రీవాదం కేవలం లింగ వివక్షకే పరిమితం కాదు. కాలేదు. సమస్త అణచివేతను, అసమానతను గుర్తించే శక్తి, విశ్లేషణా పటిమ స్త్రీవాద సిద్ధాంతానికి ఉంది.


15. "సామాజిక ఉద్యమాలు బలహీనపడ్డాయి కనుక స్త్రీ వాదం బలహీనపడింది అంటున్నారు" ఇది నిజమా? ఎందుకు?

స్త్రీవాదం బలహీనపడలేదు. స్త్రీల గొంతులు ముందెన్నటి కన్నా బలంగా ఉన్నాయి. బలహీనపడిందనుకుని సంతృప్తి చెంది కళ్ళూ, చెవులూ మూసుకునే వారిని ఏం చేయగలం? సామాజిక ఉద్యమాలకు ఆటు పోట్లు ఉంటాయి. ప్రస్తుతం ఇది ఉద్యమ కాలం.

16. గ్లోబలైజేషన్ కాలంలో అస్తిత్వ ఉద్యమాలకు స్థానం ఉన్నదంటారా?

ప్రపంచీకరణ కాలంలోనే గదా అస్తిత్వ ఉద్యమాలు పుట్టి పెరుగుతున్నది. ❑

*గోదావరి అంతర్జాల పత్రిక సౌజన్యంతో..*



# స్త్రీవాద కవిత్వం - ఒక పరిశీలన

**అద్దేపల్లి రామమోహనరావు**

స్త్రీలు తమపై జరుగుతున్న అన్ని విధాలైన దోపిడీని చైతన్యవంతంగా ఎదిరించి పోరాడాలని ప్రబోధించే కవిత్వాన్ని ఫెమినిస్టు కవిత్వం లేదా స్త్రీవాద కవిత్వం అంటున్నారు. ఒక విశాల పరిధిలో దోపిడీ స్పృహ నుండి పోరాట చైతన్యం దాకా ఈ కవిత్వం విస్తరించి వుంటుంది. వ్యక్తిగతంగా పురుషాధిపత్యాన్ని వ్యతిరేకించే ధోరణి నుండి, వ్యవస్థాగతమైన రాజకీయాలతో సంఘర్షించే వరకు, ఈనాటి స్త్రీవాద కవిత్వం, విభిన్న దశల్ని ప్రతిబింబిస్తోంది. ఆయా దశల్ని పరిశీలించడం, సాహితీపరమైన అభివ్యక్తిరీతుల్ని విశ్లేషించడం ఈ వ్యాసం లక్ష్యం.

1970 నుండి ఆంధ్ర సాహిత్యంలో విప్లవభావ సృష్టి తీవ్రతరంగా ప్రారంభమయింది. విప్లవోద్యమం ప్రధానంగా వర్గ దృక్పథం కలిగిన రాజకీయపోరాటం. తెలుగు సాహిత్యంలో ఆ రాజకీయ పోరాట ప్రారంభంతో, దానికి అనుబంధమైన అన్ని భావధోరణుల చర్చలు సూక్ష్మాతిసూక్ష్మంగా కొనసాగడం ప్రారంభ మయింది. మార్క్సిస్టు అవగాహన పునాదిగా, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ భావాలన్నీ మేధావుల చేత విశ్లేషింపబడినై. ఏ విధంగానైనా సరే వ్యవస్థపై తిరుగుబాటును కోరేవారందరూ, విప్లవోద్యమానికి సన్నిహితులైనారు. రాజకీయ పోరాటంపై అభినివేశం లేనివారు క్రమక్రమంగా ఎవరి ప్రత్యేక భావాలపట్ల వారు ఆకర్షితులైనారు. వీటిలో స్త్రీవాద భావజాలం ఒకటి (మిగిలినవి, హేతువాదం, భౌతికవాదం మొదలైనవి)

అందుకే తర్వాతి కాలంలో, మిగిలిన భావజాలాలన్నిటికీ వర్గ రాజకీయాలకి అనుబంధంగా ఆలోచించేవారుగానూ, అలా కాకుండా విడిగా ఆలోచించేవారుగానూ, రెండు శిబిరాలుగా చీలిపోయారు. (వర్గరాజకీయాల్నే లక్ష్యంగా చెప్పుకొన్నప్పటికీ, ఆయా భావజాలాలకి సంబంధించినవారు, ప్రధానంగా దేనికి తమ వాదంలో ప్రాముఖ్యమిస్తున్నారనే దాన్ని బట్టి వారి లక్ష్యం సులభంగా తెలుస్తుంది) స్త్రీవాద సాహిత్యానిక్కూడా ఈ పరిణామం అన్వయిస్తుంది.

ఇక్కడి సాంస్కృతిక పరిస్థితుల దృష్ట్యా మార్క్సిస్టు భావజాలాన్ని అన్వయించుకుని, విముక్తి పోరాటంలో భాగస్వామ్యం పొందడం కొందరి లక్ష్యంకాగా పాశ్చత్య దేశాల స్త్రీ విముక్తి భావాల్ని ప్రధానంగా మరికొందరు భావించారు. ఈ రెండోవారినే ఎక్కువగా 'ఫెమినిస్టు'లు అని పేర్కొనడం జరుగుతోంది. 'మేం ఫెమినిస్టులం' అని ప్రత్యేకంగా చెప్పుకునే వారు కూడా అలాగే తమ అవగాహనని అందిస్తున్నారు. అందుకనే ఒకసారి 'మానుషి' పత్రిక సంపాదకురాలు మధుకిశ్వర్ "Why I do not call myself a Feminist" అనే వ్యాసం రాయవలసి వచ్చింది. ఆ వ్యాసంలో ఆమె ఒకచోట యిలా అంటారు

However, given our situation to day, where the general flow of ideas and of labels is one way from west to east, in the over all context of a highly imbalanced power relation. Feminism, as appropriated and defined from the west, has too often become a loot of cutural imperialism. The definitions, the terminology, the assumptions, even the issues, the forms of struggle and institutions are exported from west to east, and too often we are expected to be the echo of what are assumed to be more advanced women's movements in the west.

ఇలా పాశ్చాత్య భావజాల ప్రేరితులైన వారికి, పురుషాధిపత్యం మాత్రమే ప్రధాన శత్రువు. మార్క్సిస్టు భావ ప్రభావితులకి పురుషాధిపత్యం శత్రువే అయినా, దానికి మూలకారణమైన వర్గ వ్యవస్థ ప్రధాన శత్రువు. భావజాలాల్లో ఎన్ని అంతర్విభేదాలున్నా స్థూలంగా ఈ రెండూ ప్రధానమైనవి. ఫెమినిజమ్ యొక్క శాస్త్రీయ నిర్వచనాల సంగతి అటుంచి, కవిత్వానికి సంబంధించినంత వరకూ, స్త్రీ తనపై జరిగే దోపిడీని గుర్తించిన దగ్గరనుండి, విముక్తి పోరాటానికి పురోగమించేదాకా గల భావాలతో కూడిన కవిత్వమంతటినీ ఫెమినిస్టు (స్త్రీవాద) కవిత్వంగానే పేర్కొనడం జరుగుతోంది. కాబట్టి కవిత్వం విషయంలో, ఈ అన్నివిధాలైన భావ, అభివ్యక్తిరీతుల్ని పరిశీలిద్దాం.

స్త్రీవాద కవిత్వ పరిణామానికి సుమారుగా 1980 ప్రారంభ కాలం అనుకోవచ్చు. అందుకు నేపథ్యంగా నిలిచిన కొన్ని సామాజిక పరిస్థితుల్ని గమనించవలసి వుంది. 1980 నుండి స్త్రీ చైతన్య వికాసానికి ఒక వేగం ప్రారంభమయింది. స్త్రీలు వివిధ ఉద్యోగాలలోకి రావడంలోని విస్తృతి అధికమయింది. ఏ ఉద్యోగమైనా చెయ్యగలమనే స్పృహ పెరిగింది. మగవాళ్ళు

ఉద్యోగినులైన భార్యలను కోరడం సర్వసాధారణం అయింది. సమాజంలోని పెట్టుబడిదారీ విధానానికి ఒక ఊపు రావడంతో, స్త్రీలపై అత్యాచారాలు, వరకట్న హత్యలు, మిగిలిన సమస్యలు కూడా వేగాన్ని పుంజుకున్నది సుమారుగా అప్పటి నుంచే, నేర ప్రవృత్తి విపరీతంగా పెరగడం మొదలయింది. పత్రికల్లో ఈ విషయాల్ని గూర్చి వివిధ కోణాల్లో వివరణ నివ్వడం, అవి స్త్రీలలో ఒక సామాజిక చేతనని మేల్కొలపడం ప్రారంభమయింది. రెసిడెన్షియల్ స్కూళ్ళవల్లా, ప్రయివేటుగా అన్ని పరీక్షలకి వివాహితలు కూడా వెళ్లగలిగే సదుపాయం వల్లా, విద్యావంతుల శాతం పెరగనారంభించింది. యిది ఆత్మగౌరవభావాన్ని, సామాజిక అవగాహననీ పెంచింది. అంతకుముందుదాకా, ఏ సమస్యకైనా తమ కర్మ మూలకారణమనుకున్న స్త్రీకి సామాజికంగా తమ సమస్యని అర్థం చేసుకునే చైతన్యం పెరిగింది. దీనికి తోడు చలనచిత్రాల్లో పెరగనారంభించిన అసభ్యత, అశ్లీలత, పెట్టుబడి దారీవ్యవస్థ విషఫలితంగా వ్యాపిస్తున్న వ్యాపార నాగరికత, కామకోసం, కామం కోసం స్త్రీ వ్యక్తిత్వం మీద గౌరవం తరిగిపోతున్న పరిస్థితి – యివి స్త్రీ మనస్సుని కలత పెట్టి, కసి కలిగించడానికి పరోక్షంగా కారణమైనాయి. ఈ వాతావరణ మంతా ఒక వేగవంతమైన స్థితికి రావడం, సుమారుగా 1980 నుండి గమనించవచ్చు. ఇవన్నీ భౌతికమైన కారణాలు కాగా, 1970ల నుండి విప్లవోద్యమంలో తీవ్రంగా చర్చించబడుతున్న దోపిడీ భావాల ప్రభావం కవయిత్రుల భావనని బాగా ప్రభావితం చేసింది. మార్క్సిజమ్‌ని నమ్మినా నమ్మకపోయినా, భౌతికవాదాన్ని విశ్వసించకపోయినా, పురుషాధిపత్యమూ, ఆర్థిక సామాజిక రాజకీయ దోపిడీతత్వం అందరికీ అవగాహనలోకి రావడానికి విప్లవ సాహిత్యం చేసిన దోహదం ప్రధానమైనది.

పైన చెప్పిన కారణాలు, 1980ల నుండి స్త్రీవాద కవిత్వం వికసించడానికి కారణమైనై, 70, 80ల మధ్య ఒక విచిత్రస్థితి కనిపిస్తుంది. సంప్రదాయ ప్రభావంతో వచన కవిత రాస్తున్న వారిలో నాయని కృష్ణకుమారిది బలమైన స్వరం, వాసా ప్రభావతి మొదలైన కొద్ది మంది కూడా సంప్రదాయ ప్రభావంతోనే రాసేవాళ్లు. ఐతే, 1970ల నుండి విప్లవ భావజాలం ప్రభావితం చేసిన బి.భారతి, విమల, ప్రభావతి, ఓల్గా మొదలైన వారు రాజకీయ విప్లవ ప్రధానమైన కవితల్ని రాసేవారు. శీలా సుభద్ర, యలమంచిలి తాయరు మొదలైనవారు ప్రగతిశీల భావాలతో రాసేవారు. ఐతే ఈ అన్నివిధాలైనవారూ స్త్రీ సమస్యలకి ప్రాధాన్య మివ్వలేదు. 1980 నుండి మాత్రమే యిలాంటి ప్రాధాన్య భావన తెలుగు కవిత్వంలోకి ప్రవేశించిందని చెప్పవచ్చు.

ఒక విధంగా చూస్తే, 1979లో 'శిలాలోలిత' కవితల్ని రచించిన రేవతీదేవి, స్త్రీవాద కవిత్వానికి మొట్టమొదటి బలమైన గొంతుగా చెప్పవచ్చు. ఈమె కవిత్వంలో అచ్చమైన ఆవేదన ఉంది. లోతైన అనుభూతి ఉంది. విస్తృతమైన సమాజ విమర్శ వుంది. ఆమె రాసిన 'దూరం అనే కవిత, స్త్రీ పొందే శారీరకమైన దోపిడీని బలంగా చెప్పింది.

> *"మనిషికి మనిషికి మధ్య నాగరీక నగరాల వెలుతురు తెరల దూరం తనకీ తనకీ మధ్య వైరుధ్యాల చీలిక గీతల దూరం ద్వంద్వ ప్రమాణాల పిత్రుస్వామికంలో పెళ్ళికాని తల్లికి బిడ్డకీ మధ్య మూగవేదనల కారుచీకట్ల దూరం కొన్నేళ్ళుగా కాపురం చేస్తున్న భర్తకీ భార్యకీ మధ్య మనసెరగని గానుగెడ్ల దూరం దూరం లేనిది శరీరానికి శరీరానికి మధ్య మాత్రమే పావలా యిచ్చినా చాలు సూత్రంతాడు కట్టినా చాలు….."*

రుచించని మాట' అనే కవితలో యిలా అంటుంది :

> *"మగవాళ్ళకి చాటుగానూ ఆడవాళ్లకి పబ్లిగ్గానూ రుచించని మాట చెప్పనా మగకీ ఆడకీ శీలాన్నీ ఆస్తినీ సమంగా వర్తింపించండి కాగితాల మీదా వేదికల మీదా కాదు. నిజంగా సమంగా వర్తింపించండి"*

మగవారికి, ఆడవారికి శీలం సమంగా ఉండాలి. ఆస్తి సమానంగా ఉండాలి. ఈ కోరిక మగవారికీ, ఆడవారికీ కూడా రుచించదని చెప్పడంలో చమత్కారం ఉంది.

బహిరంగంగా చెప్పవలసి వచ్చినప్పుడు స్త్రీ కూడా ఏ విధంగా పురుషుని భావజాలంలోని బంధింపబడుతుందో పై పంక్తులు వ్యక్తం చేస్తాయి, స్త్రీ పురుష సంబంధాల్ని గూర్చి భావజాల పునాదితో రాసిన రచయిత్రి కాకపోయినా, రేవతీదేవి కవితల్లో స్త్రీగా తాను పొందే అనుభూతుల గాఢమైన ఆవిష్కరణ ఉంది.

1980లలో స్త్రీవాదానికి సంబంధించిన భావజాలాల చర్చ విపరీతంగా జరగడం ప్రారంభించింది. ఏవేవో భావాలతో కవితలు ప్రారంభించిన కవయిత్రులు కూడా ఈ భావాలపట్ల ఆకర్షితులైనారు. పునాదిగా వున్న భావజాలంతో ప్రశ్న లేకుండా, తమపై కొనసాగుతున్న దోపిడీని తీవ్రంగా అభివ్యక్తం చేస్తున్న ఈ కవిత ప్రత్యేకంగా ప్రజల్ని ఆకట్టుకోవడం ప్రారంభమయింది. 1980ల నించి ఆ రచనలు సాగుతున్నా, 1985 నుండి ప్రచండమైన వేగం పుంజుకున్నది. అంతకు ముందు రచింపబడిన కవితలు గూడా సంపుటాలుగా రావడం, అప్పటి నుండే ప్రారంభ మయింది. స్త్రీవాద కవయిత్రులకి ప్రతిష్ఠ (image) రావడం కూడా అప్పట్నించే మొదలయింది.

వీరిలో మొదటగా చెప్పుకోవలసిన కవియిత్రి 'జయప్రభ',

ఆమె ఆ రోజుల్లో రచించిన 'భావ కవిత్వంలో స్త్రీ' అనే గ్రంథం సాహిత్యంలో స్త్రీని చూచిన నిత్య శృంగార దృష్టిని కొత్త కోణాల్లో చూపించింది. స్త్రీలపై సానుభూతితో రాసిన ప్రసిద్ధ మగకవుల కవితల్లో ఉన్న లోకువ దృష్టిని ఎత్తి చూపడం ఆనాడు సంచలనం కలిగించింది. పురుషాధిక్య భావజాలాన్ని కసితో ఎదిరించే ఫెమినిస్టుకవయిత్రి రూపుదాల్చిందని అనేకమంది సంతోషించారు. ఆమె రచించిన 'చూపులు' అనే కవిత విశేషమైన ప్రాచుర్యం పొందింది. రోడ్డు మీద ఆడవాళ్ళని మింగేసేట్టుగా కొందరు మగవాళ్ళు చూస్తారు. ఆ చూపులు స్త్రీలని ఎంతో బాధపెడతై, ఈ విషయాన్ని యింతకు ముందెవరూ వస్తువుగా తీసుకోలేదు. అతి సహజమైన ఈ వస్తువుని చాలా కసితో చెప్పడమే ఈ కవితకి ప్రాధాన్యం తెచ్చింది.

> *"చిక్కని ఈ అడవిలో వెలుగుకి చీకటికి తేడాయే ఉండదు చూపుల నుండి చాటుకోవడానికి స్థలమనేదే ఉండదు రోడ్డు మీద, బస్సుల్లోనూ, క్లాసులోనూ వేసే ప్రతి అడుగు వెనకా శరీరంలోని ఏదో ఒక భాగాన్ని గాయంచేస్తూ విషపు చూపులు గుచ్చుకుంటూనే వుంటాయి"*

ఈ పరిస్థితి నుంచి లొంగిపోకుండా ఎదిరించాలని చెప్పడంలో ఈ కవిత గొప్పతనం ఉంది.

> *"ఇప్పుడు ఆ కళ్ళని వెంటాడడానికి కళ్ళతోనే యుద్ధం చేస్తాను సూటిగా రెండు క్షణాలు కళ్ళలోకి చూడలేని పిరికి చూపులు పాతాళంలోకి పారిపోతాయి అప్పుడనుకుంటాను కళ్ళకే కాదు ఈ దేశంలోని ఆడదానికి వళ్ళంతా ముళ్ళుండే రోజు ఎప్పుడొస్తుందా అని"*

సున్నితమైన ఒక మానసిక సమస్యని, ఒక సాంస్కృతిక దోషాన్ని, తిరుగుబాటుతో ముగించిన ఈ కవిత పాఠకుని గుండెలో ముల్లులాగే గుచ్చుకుని ప్రభావితం చేస్తుంది.

బాగా సంచలనం కలిగించిన ఆమె మరొక కవిత 'పైట తగలెయ్యాలి' అనేది. పైటవల్లనే తనకు స్త్రీత్వం గుర్తుకొస్తుందనీ, అది తన వ్యక్తిత్వానికే అభ్యంతరమనీ ఈ కవితలో చెప్తుంది.

> *"నన్ను నిటారుగా నిలవనివ్వక పైట నా గుండెలపై తన అంచుల చేతులాచ్చి నన్ను వంగదీయాలని చూస్తుంది. నాకు అలవాటు లేని సిగ్గుని మప్పుతుంది. ఏదో కంగారుని పిట్టలా నాచుట్టూ తిప్పుతుంది. నువ్వు ఆడదానివంటూ హిప్నటైజ్ చేస్తుంది. నేనూ మనిషినన్న భావాన్ని నాచేత మరిపిస్తుంది."*

అంతేగాక,

> *'నన్ను అబలని చేసిన*
> *పితృస్వామ్యపు అదృశ్యహస్తం పైట'*

అంటుంది. మార్క్సిస్టు పరిభాషలోనే చెప్పినట్లుంది కానీ, అవయవాలు బహిర్గతం చెయ్యడమనే సంస్కృతి, మరొకవంక ఎలాంటి సామ్రాజ్యవాదపు ఊబిలోకి లాక్కుపోతుందో కూడా గమనించాలి. ముల్లు తీసి శూలం పొడవడం వాంఛనీయం కాదు.

జయప్రభ – తీవ్రవాద భావాలు గల మార్క్సిస్టుగా ఫెమినిస్టుగా కనిపించే కృషి చేసింది కాని, 'వామనుడి మూడో పాదం' అనే ఆమె మొదటి కవితా సంపుటిలోనే, ఆ భావానికి ఎన్నో వైరుధ్యాలున్నై. ఒంటరితనపు అనుభూతులు, అత్యాశ్రయ భావాలు, తాత్విక భావాలు మొదలైనవన్నీ సంకీర్ణంగా ఉన్నై, తర్వాత 'జయప్రభ జాలీగీతాలు" మొదలైన రచనల ద్వారా ఆమెలో నిబద్ధత ప్రధానం కాదని వ్యక్తమయింది. ఏమైనా ఫెమినిస్టు భావాలు వ్యక్తీకరించడంలో బలమైన గొంతు.

ఈ వ్యవస్థలో, కుటుంబ జీవితంలో స్త్రీకి గల అస్తిత్వవేదనల్ని సూక్ష్మసూక్ష్మంగా కవయిత్రులు కవితలుగా రాస్తున్నారు. మనస్తత్వాల్ని, నిరాశల్ని అక్షరబద్ధం చేస్తున్నారు. ఈ దృష్టిలో 'వాణిరంగారావు" కదిలించే కవితల్ని రాశారు. 'తివాచీ' అనే కవితలో సాంప్రదాయికంగా పెరిగిన స్త్రీనీ, తర్వాత వాస్తవ జీవితంలో దెబ్బతినే మనస్తత్వాన్నీ రూపుగడతారు.

> *"తొలిగా నువ్వు పుట్టిన యింటిని పిచ్చిగా ప్రేమిస్తావు ఎంత పిచ్చిగా అంటే ఆ యింటి గోడలలో దాక్కున్న ప్రతి ఇటుకా నాదేనన్నంతగా, ఆ యింటి చూరుకి వేలాడే పిచ్చుకతల్లి తన గూటిని ప్రేమించినంతగా ప్రేమ అనే పిచ్చిపూల తీగని నీవాళ్ళ హృదయాలకు ఒత్తుగా అల్లుకోనిస్తావు...."*

యిటువంటి ఒక నిష్కల్మషమైన ప్రేమనే పరమార్థంగా ఎంచిన స్త్రీకి ప్రతిఫలంగా అలాంటి ప్రేమ లభించదు.

> *''మానసిక సౌందర్యం మరకలు పడి ఆర్ద్రతలూ ఆప్యాయతలూ అవసరాలై నువ్వు చచ్చిపోతావు. ప్రేమరాహిత్యంలోనూ భావశూన్యతనలోనూ నీచత్వంలోనూ న్యూనతలోనూ మగ్గిపోతావు ఇంకా ఎన్నిటివల్లనో నువ్వు చచ్చిపోతావు పిచ్చితల్లీ! ఊపిరి పీలుస్తూనే ఉన్నావు కానీ చచ్చిపోయావు, చచ్చిపోతున్నావు"*

స్పందనకి సరైన నిండైన ప్రతిస్పందన పొందలేకపోవడం, స్త్రీ జీవితంలో ఎక్కువగా కనబడే వేదన, ఈ వేదనే పై కవితలో తీవ్రంగా వ్యక్తపరిచింది కవయిత్రి,

పురుషుడు స్త్రీని చూసే దృష్టిని గురించి 'కేంద్రం' అనే

కవితలో వాణిరంగారావు చాలా సూటిగా చెప్పుంది.

*"స్మృతులు తొలిచిన మెదళ్ళ యిరుకుతనంలోంచి సూత్రాలు మొలిచి కళ్ళూ చెవులూ నోరూ కుట్టేసి చీకటిలోకంలోకి తోసి వాకిళ్ళు మూసిన బతుకు – గొంగళి ఒళ్లంతా కళ్ళయిన కథలూ చచ్చి బతికిన కథలూ సూర్యుణ్ణరచేత్తో ఆపిన కథలు ఒకటేమిటి! నిప్పులో దూకమనీ, మొగుడి కళేబరంతో కాలమనీ ఎన్నో ఎన్నో ఉత్ప్రేరకాలు అన్నిటికీ కేంద్రం కటిక్రిందనే !"*

వ్యక్తిత్వానికే మాత్రం గౌరవం లేదనే ఆవేదన పై కవితలో తీవ్రమైన ఆవిష్కరణ పొందింది. అలాగే భావజాలాలతో సంబంధం లేకుండా స్త్రీ అస్తిత్వంలోని వేదనల్ని రూపొందించిన కవయిత్రులు చాలా మంది ఉన్నారు.

అమ్నియోసెంటిసిస్ (లింగనిర్ధారణ పరీక్ష) ని మూలంగా చేసుకుని ఈ వ్యవస్థలోని స్త్రీ యొక్క అస్తిత్వ వేదనని అద్భుతంగా పలికించింది. 'ఈశ్వరి'. 'మంచిరోజులు' అనే కవితలో...

*"నీకూ మంచిరోజులొస్తున్నాయిరా కన్నా! ఆడదిగా పుట్టానని, అడవిలో మ్రానైనా కాలేదని విలపించే రోజులు పోతున్నాయిలే తల్లీ.... అమ్మకు – నీ జాతినే కంటోందని నాన్న నుండి విదిలింపులే ఉండవురా చిన్నీ! కట్నాలు కానుకలు సమర్పించాలనే తపన నీవు పుట్టిన్నాటి నుంచీ నీ వాళ్ళకింకక్కర్లేదురా! ఎందుకంటే, నీవే పుట్టవుగా! అమ్మ పొట్టలోనే ప్లస్సువా, మైనస్సువా అని తేల్చేసుకుంటారుగా నీవేనని నిర్ధారణ అయితే నిన్నక్కడే అంతమొందిస్తారుగా! అందుకే, నీకూ మంచిరోజులొస్తున్నాయిరా కన్నా !*

ఈశ్వరి, మార్క్సిస్టు భావాలపట్ల ఆకర్షితురాలైనా, ఆమె రాసిన కొద్ది కవితలూ అస్తిత్వ వేదననే నిరూపిస్తాయి.

కుటుంబంలోని స్త్రీ జీవితంలోని అనేక ఘట్టాలకి సంబంధించి బాధల్నీ, స్వయం వ్యక్తిత్వం లేక సంకెళ్ళలో కుంచించుకున్న ఆమె వ్యక్తిత్వాన్ని వెలువరిస్తూ కె. వరలక్ష్మి అనేక కవితల్ని రచిస్తున్నారు. ఆమె 'నేను' అనే కవితలో స్త్రీ జీవితంలోని కృత్రిమత్వాన్ని ఈ విధంగా వివరిస్తారు :

*'రోజుకో కొత్త చిరునవ్వు తగిలించుకుని రకరకాల ముఖాల్ని అతికించుకుని నాకో 'బ్రెయి'నుందనే విషయాన్ని మరిచిపోయి అతని ముందు 'కీ' యిచ్చిన బొమ్మలా కదలాడుతూనే వుంటాను. పురిటి నొప్పులు తప్ప పుట్టిన్రోజులు లేవు నాకు వరిసరాల్నే పట్టించుకోని నేను ప్రపంచ రాజకీయాల్నేం పరిశీలిస్తాను. ఎక్కడో జరిగే గల్ఫ్ వార్ కన్నా ఎదలో జరిగే నిరంతర యుద్ధం ముఖ్యం నాకు నాలుగ్గోడల మధ్యా సంకుచితంగా అణగారిపోయిన 'బోన్సాయ్' శిలాజాన్ని నేను. తరతరాల తరగల నురుగుల్లో చిరదీక్షా సమాధినొందిన శిలాస్త్రీ మూర్తిని నేను"*

'గర్భవిచ్ఛిత్తి' (అబార్షన్) స్త్రీకి కొన్ని పరిస్థితుల్లో అనివార్యమైన సంఘటన అయింది. మాతృహృదయాన్ని విలవిల్లాడించే సన్నివేశం అది. ఆ సమయంలోని హృదయావేదనని పాటిబండ్ల రజని 'అబార్షన్ స్టేట్‌మెంట్ అనే కవితలో చాలా కవితాత్మకంగా హృదయాన్ని కదిలించేటట్లు రూపుగట్టింది. ఒకే ఒక్క వాక్యంగా రాసిన ఈ క్రింది పంక్తులు, గుండెలోని బాధకు సుదీర్ఘమైన రూపాన్నిచ్చినట్లు స్ఫురిస్తుంది :

*"నా టెంపరరీ ఉద్యోగమూ, ఆరోగ్యమూ నీకు మరణశిక్షను ఖాయంచేస్తే, తల్లడిల్లుతూనే తప్పొప్పుల మధ్య తడబడుతూనే తలార్నై బల్లెక్కి రబ్బరుచేతుల ముసుగు నీ ముఖంపై కప్పి అభిమన్యుని శరాలకప్పజెప్పి నిస్సహాయులైన పాండవుల్లా రోదిస్తూ, పెథిడ్రిన్ పెడేషన్‌లో నిన్ను పోగొట్టుకుని పగిలిన జిల్లేడుకాయ తాలూకూ పింజనై సోలిపోతూ నాలోని అమ్మను పాతి పెట్టుకుని చెరకు పిప్పినై పారిపోతూ కంసుడి కత్తిలాంటి ప్లాస్టిక్ బకెట్ మింగిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముద్దలాటి నిన్నుచూసి మళ్ళీ నాపొత్తిళ్ళలో పొదువుకోవాలని పాలకై తడుపుకునే పెదవులుగా అమ్మకై వెదుక్కునే చూపులుగా చెక్కుకోవాలనీ ఛిద్రకలశాన్ని పూర్ణ శిల్పంగా దిద్దుకోవాలనీ ఇంత సుఖంగా నిన్ను చంపుకునే మార్గం కనిపెట్టిన వీళ్ళ ముఖాలపై ఉమ్మనీళ్ళతో ఉమ్మెయ్యాలనీ వెర్రి ఆవేశంగానూ కడుపు చించుకుంటే మనసు గాయం అయ్యి కడివెడు కన్నీళ్ళు దుఃఖంగానూ ఉందిరా! అయ్యో! పాలింకిపోవడానికున్నట్లు మనసింకి పోవడానికి మాత్రలుంటే ఎంత బావుండు."*

పగిలిన జిల్లేడు కాయతాలూకు పింజతో పోల్చుకోవడం, ఆమెలోని ఒళ్లు తేలిపాయే నీరసానికితోడు, తనమీద తనకి కలిగిన అసహ్యాన్ని వ్యక్తం చేస్తుంది. అనుభవంలోనించి అక్షరరూపం పొందిన యిలాంటి కవితలు అరుదుగానే కనిపిస్తై.

సామాజికమైన కొన్ని రుగ్మతలను కూడా, కేవలం సామాన్య దృష్టితో కూడా, వాటిలోని భయంకరమైన అంశాల్ని హృదయం కదిలేటట్లు చెప్పిన కవయిత్రులలో ఘంటశాల నిర్మల ఒకరు. ఆమె రాసిన 'ఏ కాల్‌గర్ల్స్ మోనోలాగ్' ఒక వేశ్య మాటల్లో ఆమె బాధని కళ్ళ ముందు నిలుపుతుంది.

"వేలవేల వీర్యాల వర్షాల్ని కళ్ళు మూసుకుపోయినా భరిస్తున్న దాన్ని రంగులు దిద్దిన రతిరోతకు జ్వరిస్తున్న దాన్ని ఆవేశమూ అసహ్యమూ రెండు చేతులుగా సాగే ఆగంతకుల ఆలింగనాన్ని ఆప్యాయిస్తున్నదాన్ని చుంబనని చీత్కారాన్ని దోయిలించినదాన్ని..."

తనను చూసి కళ్ళు చిట్లించినవారు నీచులని కవిత ముగుస్తుంది. ఘంటశాల నిర్మలకి మంచి భాషాశక్తి ఉంది. భావానికి తగిన పదాన్ని ఎన్నుకునే నైపుణ్యం వుంది. శబ్ద శిల్పం మీద శ్రద్ధ వుంది. ఆమె రాసిన 'జుగల్‌బందీ' ఆమెలోని ఈ గుణాలన్నిటినీ ప్రతిబింబించిన కవిత. ఈ కవితని కొందరు విమర్శకులు ఎంతో ప్రశంసించారు. ఇందులో మూడు వంతులు రతి వర్ణన, బాలగంగాధర తిలక్ శైలిలో, పంథాలో ఈ వర్ణన సాగుతుంది. గొప్ప కవితాశక్తి ఈ వర్ణనలో వ్యక్తమౌతుంది. కాని, చివరలో "యదార్థాల యాంటీ క్లైమాక్స్ ఎప్పటిలా ఎదురొస్తుంది" అని, రతి సుఖానంతరం యధార్థ సమస్యలు ఎదురై, ఆ సుఖాన్ని మింగేస్తై అని చెప్పడం చేత, ఈ ముగింపు కవితకి వాస్తవిక సమస్యాత్మకమైన గొప్పతనాన్ని తెచ్చిందని విమర్శకులంటారు. కాని, పాఠకుణ్ణి, రతివర్ణన చేసిన పంక్తులు మాత్రమే ఎక్కువ ఆకర్షిస్తై, ఈ వర్ణన ఎంత గొప్పదైనా, సమకాలీన ప్రయోజనం ఏమీ ఉండదనుకుంటాను. కొందరు, రచయిత్రులు ఇలాంటి శృంగార వర్ణనల్ని స్వేచ్ఛగా చెయ్యడం చాలా కోరదగిందని చెప్తున్నారు. అంటే, యింతకాలం మగవారు స్వేచ్ఛగా రాశారు గనక, యిప్పుడు స్త్రీలు రాయడం వారి స్వేచ్ఛకు నిదర్శనంగా భావించడం, వారి అభిప్రాయం కావచ్చు. కాని, సమస్యల్ని ప్రతిబింబించని యిలాంటి వర్ణనలు కేవలం అనుభూతిలోనే అంతమౌతై.

రతికార్యం కూడా స్త్రీకి ఎలా సమస్య ఔతుందో మందరపు హైమవతి రాసిన 'సర్ప పరిష్వంగం'లో ఉన్నతస్థాయిలో కనిపిస్తుంది.

"అంతా బాగానే ఉంటుంది అప్పటివరకు కామంతో నైతేనేమి మోహంతోనైతేనేమి ఇరువురి తనువులొకటైనాక అద్వైత సిద్ధి పొందినాక ఈ లోకాన్నే మరచిపోయిన అమృత ఘడియలలో అక్షరతూణీరంనించి ఒక ప్రశ్నల బాణం సంధిస్తావు 'జీతమెప్పుడిస్తారు' వేశ్య కూడా ఆ సమయంలో ఆ ప్రసక్తి తేదు"

యిది ఆర్థిక సమస్య. పురుషాధిపత్యం స్త్రీ అత్యున్నత ఆనందాన్ని కూడా చెరిపేసే వాస్తవికత. అటువంటి మగవాడితో రాజీపడి బతకడమే ఈ వ్యవస్థలో ఆమె చెయ్యగలిగింది.

"జీవితం నుంచి కాదుగదా శరీరం నుంచైనా కించిత్తుగూడా దూరమవడం నా చేతుల్లో లేనివని క్షణక్షణం యిలా రాజీపడుతూనే మృత్యు పర్యంతం బ్రతికేస్తూనే ఉంటాను. నీ సర్పపరిష్వంగంలో"

అని కవితని ముగిస్తుంది హైమవతి. ఇలాంటి అతి సున్నితమైన సమస్యల వ్యక్తీకరణ, పాఠకుడికి లోతైన అవగాహన ఇస్తుంది.

ఈనాటి యువ ఫెమినిస్టు కవయిత్రులలో కె.గీతకి ఒక ప్రత్యేకమైన శైలి ఉంది. అభివ్యక్తి విధానం ఉంది. మనస్సులోని భావాల్ని సరిగ్గా ఎదుటివారితో మాట్లాడుతున్నట్లు రాసే ధోరణి ఈమెది. చాలా తేలికైన సంభాషణల వెనుక ఒక సాంస్కృతిక నేపథ్యాన్ని స్ఫురింపజేస్తూ రాసుకుపోతుంది. 'ఇంకా ఎన్నాళ్ళు' అనే కవితలో, ఈ వ్యవస్థలో స్త్రీ పురుషుల ప్రవర్తనలోని భేదాన్నీ పురుషాధిపత్యాన్నీ సవాల్ చేస్తూ యిలా రాస్తుంది.

"ఇంకా ఎన్నాళ్ళు పాదం కదిపినా పాపం లెక్కగడ్తారు ? పెదవి విప్పితే పళ్ళికిలించినట్లు 'హాయ్' అంటే ప్రమాద మయిపోయినట్లూ ఇంకా ఎందుకంత కండువాలు భుజానేసుకుని కన్నీళ్లొత్తేసుకుంటుంటారు. రోజంతా రోమియో వేషాలేసుకుంటూ రోడ్లంట తిరుగుతున్నప్పుడు పత్తాలేని పాతివ్రత్యం ఇంటిపడుచుపిల్లలు పరాయివారిని పల్కరించబోయినప్పుడు గుర్తుకొస్తుంది సిగరెట్లతో పర్వాన్ని మరచి చచ్చిపోతున్నప్పుడు లేని సిగ్గులేనితనం సిరిమల్లె పువ్వులాంటి అమ్మాయి సగర్వంగా తలెత్తుతున్నప్పుడు అంటగట్టాలన్పిస్తుంది. బయట అడుగు పెడితే బరితెగింపు మీకు మాట్లాడితే మాయలాడి మీకు.... ఇంకా ఎన్నాళ్ళూ.... అలాగే విననట్లు నటించకండి వేగపు యుగంలో వైయక్తికంగా ముందుకుపోతూ వీక్షిస్తూనే ఉంటాం మేం వరస పెట్టి మీకు గుండెపోట్లొచ్చేయడాన్కి"

కవిత ముగింపు కూడా ఒక కొసమెరుపులాంటి భావంతో గాక సహజధోరణిలో ముగిస్తుంది. జీవితంలోని ఏదో ఒక సన్నివేశానికి చలించి, వెంటనే రాసినట్లుంటాయి ఈమె కవితలు,

ఏవిధమైన భావజాలాల్లోనూ సంబంధం లేకుండా సరిగ్గా స్త్రీ జీవితంలోని విభిన్న సంఘటనల్లోని వేదనని అత్యద్భుతంగా వ్యక్తీకరించిన కవయిత్రి కొండేపూడి నిర్మల, ఈమె శైలిలో భావోత్తేజంతో పరిగెత్తించే వేగం వుంది. ఆ వేగంలో సరిగ్గా భావాన్ని హత్తుకునేటట్లు చేసే ఉపమానాలూ, రూపకాలూ, భావచిత్రాలూ దొర్లిపోతూ ఉంటై. భావనాశక్తి ప్రవహిస్తూ వుంటుంది. వాస్తవికత తళుక్కుమంటూ వుంటుంది. ఈ లక్షణాలు

ఆమెది ఒక ప్రత్యేక ధోరణిగా చేసినై – 'లేబర్ రూమ్' అనే కవితలో స్త్రీ ప్రసవవేదనని యిలా రూపుగడుతుంది.

*ప్రపంచంలోని నరకమో నరకంలోని ప్రపంచమో త్రీడీలో చూసినట్లే వుంటుంది లేబర్ రూంలో అడుగు పెడితే చాలు మీరంతా చెప్తున్న తెల్లచీర మల్లెపూలు పాలగ్లాసు వరుసల్లో పరాధీనతా బానిసకన్నీరు ద్వీపాంతరవాసం ఫ్రేంకట్టినట్టు కనిపిస్తాయి. బల్లలకొక బాధలనేది కాయితప్పడవలా చినికి చీకిపోతున్న రోదనలగది ఆమ్మో అయ్యోలు, కెవ్వు – కెవ్వులు ఇష్ అబ్బా–లు దేవుడా రక్షించు–లు చాలా మామూలు, మామూలు..."*

ఇలా సాగుతుంది. వక్షాన్ని ఆధారం చేసుకుని స్త్రీ జీవితమంతటినీ విభిన్న దశల్లో వ్యాఖ్యానించిన 'హృదయానికి బహువచనం' అనే కవిత ఆమె భావనాశక్తికి, కవితాత్మకతకీ పరాకాష్ఠ. సమర్థుడైన అనువాదకుడుంటే ఏ భాషలోనైనా పేరు పొందగల కవిత.

మార్క్సిస్టు పోరాట చైతన్యంతో, విప్లవాత్మకమైన స్త్రీవాద కవితల్ని రాసిన వారిలో విమలను మొట్టమొదటగా చెప్పుకోవాలి, వర్గపోరాటం ఆమె 'అడవి ఉప్పొంగిన రాత్రి' కవితా సంపుటిలో ప్రధాన విషయం. దానికి అనుబంధమైన స్త్రీ పోరాటాన్ని తన అవగాహనతో మిళితం చేసి ఆమె రాస్తుంది. ఉదాహరణకి వేశ్యా సమస్యపై యితరులు రాసిన కవితల్లో, బీభత్సమైన అనుభూతికి ప్రాధాన్యముండగా, ఈమె రాసిన 'వేశ్యాశిశువు' అనే కవితలో ఎంతో లోకజ్ఞానంతో కూడిన వర్ణనా, సమాజంలో వారి స్థితిని గూర్చిన అవగాహనా, పోరాట చైతన్యమూ, ఒక సుదీర్ఘ వేదనాగ్ని ప్రవాహంగా రూపొందుతై.

*"మానవారణ్యం మధ్య బెదిరిపోయిన చిన్ని కుందేలు పిల్లలా కంగారుగా, భయం భయంగా పరుగిడతావు గజగజ వణికిపోతూ ఈ రాకాసి లోకం కోరల్నుండి ఎక్కడికో, ఏ తల్లి గర్భంలోనో దాక్కునేందుకు పరుగిడతావు ఎక్కడికి పోతావ్ పాపా దిక్కుమాలిన ఈ దీర్ఘ రాత్రుల్ని తప్పించుకుని ఈ చీకటి ప్రపంచాన్ని దాటి ఎక్కడికి పారిపోగలవ్ పాపా! కోర్టుల్లో క్రీస్తు దేవుడిలా న్యాయమూర్తి తీర్పు చెప్తాడు. తప్పిపోయిన ఈ గొర్రెపిల్లని తిరిగి మందలో కలపండంటూ ఒకవేళ నువ్వు తిరిగి అమ్మ కడుపులోకి వెళ్లి దాక్కున్నా ఎర్రటోపీలు లాక్కొచ్చి మళ్ళీ నిన్ను మందలో కలుపుతాయి విదేశీ మారకద్రవ్యానికి నువ్వు పరమపదసోపానమని ప్రభుత్వం ప్రకటించింది. ఎక్కడికి పోతావ్ పాపా! నువ్వింక ఎక్కడికి పోలేవు "*

విమల రాసిన 'వంటిల్లు' కవిత తరతరాల స్త్రీ బానిసత్వాన్ని పురుషాధిపత్యాన్ని అతి తీవ్రంగా వ్యక్తం చేస్తుంది.

*"ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మేరాణి అయినా చివరకు వంటింటి గిన్నెలన్నింటిపైనా మా నాన్న పేరే ! అదృష్టవశాత్తూ నేనో మంచి వంటింట్లో పడ్డానన్నారందరూ గ్యాసు, గ్రైండర్లు, సింకులు, టైల్సు – అమ్మలా గారెలు, అరిసెలు కాక ఇప్పుడు కేకులు, పుడ్డింగులు చేస్తున్నాను నేను ఇంకా గిన్నెలపై పేర్లు మాత్రం నా భర్తవే ..... నేనొక అలంకరించిన వంటగదిలా కీ యిచ్చిన బొమ్మలా యిక్కడ తిరుగుతూ ఉంటాను"*

కవిత చివరలో, 'వంటరి వంటగదులు కూల్చేందుకు రండి' అంటుంది. ఇక్కడ మగవారు స్త్రీ శ్రమలో తానూ పాలుపంచుకోవాలనే విషయం సూచింపబడుతోంది. భార్య ఎంత శ్రమపడుతున్నా, ఆమెకు పనిలో సహకరించడం తనస్థాయిని తగ్గించేస్తుందన్న పురుషాధిక్య భావన నశించాలని ఆమె కవితలో ధ్వనిస్తుంది.

స్త్రీలపై జరిగే ప్రతి అమానుషకృత్యానికి స్పందించి, ఈనాడు కవయిత్రులు కవితల్లో తమ ప్రతీకార భావాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాజస్థాన్‌లో ఒక కుటుంబంలో పుట్టిన వెంటనే ఆడపిల్లల్ని చంపడమనే ఆచారానికి తీవ్రమైన కసితో స్పందించి కవిత రాసింది వి. వర్మ

*"మీ పరువుల మీద నలగడానికి మీకోసం వంటగదుల్లో మగ్గి చావడానికి మీరు బతుకుతూ మమ్మల్ని చంపడానికి మీరు చస్తూ మీ శవాలపై మమ్మల్ని తగలేసుకోడానికి అన్నిటికీ మేం కావాలి గానీ కన్నబిడ్డలుగా ఆడపిల్లలం మేం పనికిరాలేదేం? మేం శవాలుగా మారిన ప్రతిసారీ పచ్చికడుపుతో అమ్మ కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంది"*

వి. పద్మకు రాజకీయ పోరాట అవగాహన వుండడం చేతనే, తన కవితల్లో సమిష్టి పోరాటాలకి ప్రాధాన్యమిస్తుంది. 'అనామిక గీతం' అనే కవితలో యిలా అంటుంది.

*"మనల్ని మనం హృదయాలకు హత్తుకోకుండా ఒకరి కోసం ఒకరు చేతులు చాచకుండా కాంక్రీటు పంజరాలను కట్టిన కుట్రను గుర్తించనంతకాలం మన కలల సమాధుల ప్రక్కనే వేల సమాధులు మొలుస్తై"*

'కాంక్రీటు పంజరాలను కట్టిన కుట్ర'లో దోపిడీ స్వభావమంతా యిమిడి వుంది. దాని ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ

పార్శ్వాలన్నీ ధ్వనిస్తై. దాని మీద పోరాటం చెయ్యడం సమస్య మూలంలోకి వెళ్ళి సమగ్రమైన మార్పుకి దోహదం చెయ్యడమే అవుతుంది.

ఈ విధంగా 1985 నుండి వేగం పుంజుకున్న స్త్రీవాద కవయిత్రులలో కొంతమంది ప్రముఖుల కొన్ని రచనల్లోని ధోరణుల్ని వివరించడం జరిగింది. మానసికమైన వేదన దగ్గర నుండి, రాజకీయమైన పోరాటం దాకా, వీరి భావాలు ప్రస్తుత వ్యవస్థలోని అన్ని రంగాల్నీ పరుచుకుని ఉన్నై, కవయిత్రుల నుండి ఉత్తమస్థాయికి చెందిన కవిత్వం రావడానికి స్త్రీవాదం చేసిన దోహదం అపూర్వమైంది. స్త్రీవాదం మొత్తం తెలుగు సాహిత్యంలోనే ఒక ప్రధాన ధోరణిగా స్థిరపడి యింకా విస్తృతంగా వికసిస్తోంది. పైన పేర్కొనబడిన వారు కాక యింకా బి. పద్మావతి, కొండవీటి సత్యవతి, శిలలోలిత, రావులపల్లి సునీత, ఏలూరు పార్వతి, భార్గవీరావు, జహ ఆరా, మహెజబీన్ మొదలైనవారు శక్తిమంతమైన కవితలు రాస్తున్నారు.

ఇంతవరకు కవయిత్రుల రచనల్నే విశ్లేషించడం జరిగింది. ఎందుకంటే ఆ భావాలు వారి అనుభవపూర్వకమైన స్పందనలోంచి వచ్చినవి. తమదైన తిరుగూటు ధోరణిని ప్రతిబింబించేవి. ఫెమినిస్టులనే మాటకి సమగ్రమైన అర్థానికి వారే తగిన వారు గనుక. కాని కొందరు మగవారు కూడా, వారి వేదనని పూర్తిగా అర్థం చేసుకుని అక్షరబద్ధం చేసినవారున్నారు. ఉదాహరణకి ఒకే ఒక్క కవితను పేర్కొంటారు. ఇది జి.గౌరునాయుడు అనే కవి రాసింది. కవిత శీర్షిక 'ఆఫీసు నుంచి ఇంటికొచ్చాక' ఒక స్త్రీ ఇంటినుండి బస్సులో ఆఫీసుకు వెళ్ళి, సాయంత్రం యింటికి రావడం యిందులోని వస్తువు.

> *"నాలుగు రోడ్ల కూడలిలో తలవంచి నడిచిపోతున్న ఆమె ముళ్లకంచెల్ని విదదిలించుకుంటూ వీచే పిల్లవాయువులా వుంటుంది, బండల్ని ఒరుసుకోకుండా ప్రవహించలేని కొండవాగులా ఉంటుంది. ఆర్టీసీ బస్సులో కుంచించుకు పోయి నిలుచున్న ఆమె తలుపు సందున ఇరుక్కుపోయిన పసిపాప వేలులా వుంటుంది. చెట్టు మొదలుకీ, ఒరిపిడి పెడుతున్న దున్నపోతు ఒంటికీ మధ్య రాలిపడిన పువ్వులా వుంటుంది.. ఆఫీసు కుర్చీలో కూరుకుపోయి.. చుట్టూరా ఉన్న కుర్చీల కళ్ళ పల్లేరు పైన ఒళ్లారేసి కాగితాలకు కళ్ళతికించిన ఆమె అంపశయ్యమీది భీష్ముడిలా ఉంటుంది ఆమె తడారిన పెదాల మీద ప్లాస్టిక్ పూలు విరబూస్తూనే ఉంటాయి. ఇంటికొచ్చాక తీరిగ్గా ఒళ్ళంతా గుచ్చుకుని సలపరం పెడుతున్న చూపుల ముళ్ళను ఒక్కొక్కటే ఏరి గాయాల్ని కడుక్కున్నాక ఉదయం బయల్దేరినప్పుడు, ఛార్జీల డబ్బులూ, చిల్లర నాణేలూ, చేతిరుమాలు, ప్లాస్టిక్ బొట్టూ, పౌదరు పొట్లంతో పాటు దాచుకున్న స్పర్శజ్ఞానాన్ని బయటికి తీసి నేతచీరతో పాటు ఒంటికి చుట్టుకుంటుంది. గుండెనిండా ఊపిరిపీల్చి ఆమె 'ఆమె'గా నవ్వుతుంది"*

ఆ కవిత ప్రారంభంలోని పోలికల్లో ఉన్న అతి తీవ్ర వైరుధ్యం ఆమె పరిస్థితిని బాగా వ్యక్తం చేస్తుంది. ముళ్ళకంపలు – పిల్లవాయువు బండలు–కొండవాగు, తలుపు సందు పసిపాపవేలు, దున్నపోతు ఒళ్ళు, రాలినపువ్వు. ఈ పోలికల్లో ఒకదానికొకటి స్పృశించక తప్పనివి. కాని ఆ స్పర్శలో చెప్పరాని బాధవుంది. ఆమె తప్పనిసరి పరిస్థితిని ఈ పోలికలు సరిగ్గా ప్రతిబింబిస్తే తనదైన స్పర్శజ్ఞానాన్ని, తనకిష్టమైన స్పర్శని యింటి దగ్గర మాత్రమే పొందుతుంది. ఉద్యోగం చేసే స్త్రీని బయటి వాతావరణం ఎలా పరాయీకరణకు గురిచేస్తుందో ఈ కవిత, ఆ అనుభూతి కలిగేట్లు చెప్తుంది.

ఈనాడు స్త్రీవాద కవిత్వంలో మూడు రకాలైన ధోరణుల్ని గమనించవచ్చు. మొదటిది ఏ భావజాల పునాది లేకుండా స్త్రీ సమస్యల్ని వ్యక్తీకరించేది. మిగిలిన రెండూ భావజాల పునాది కలిగినవి. వాటిలో మొదటిది స్త్రీ అణచివేతకి మూలమైన పురుషాధిపత్యం కుటుంబంతోనే ప్రారంభమౌతుంది కాబట్టి, స్త్రీ విముక్తికి కుటుంబ రహిత వ్యవస్థ అవసరమని చెప్పేది. స్త్రీ పుట్టదు, తయారు చెయ్యబడుతుంది అనేది వీరి భావాలకి పునాది కాబట్టి, వీరి ప్రధానపునాది, సామాజికంగా పురుషుడితో అన్ని విధాలైన సమానత్వాన్ని సాధించాలని ప్రబోధించేది. ఇది ముఖ్యంగా వ్యక్తిగతమైన పరిణామాన్ని కోరుతుంది. రెండో వాదం స్త్రీ విముక్తిని మార్క్సిస్టు పోరాటమే సాధించగలదన్న రాజకీయ లక్ష్యం ప్రధానంగా గలది. ఇది స్త్రీ పరిణామం గతి తార్కికంగా ఉండాలని కోరుతుంది. మొదటి వాదానికి పురుషాధిపత్యమే ప్రధాన శత్రువు. రెండో వాదానికి పురుషాధిపత్యం శత్రువే అయినా, దోపిడి వ్యవస్థ ప్రధాన శత్రువు. అందుకే మొదటి పోరాటం, ఉన్నత మధ్యతరగతుల్లో భద్రతగల స్త్రీ నాశ్రయించి ఉంటే, రెండో పోరాటం, శ్రామిక సంఘటిత శక్తి నాశ్రయించి వుంటుంది. ఈ విధమైన చైతన్యంలోంచి వికసించిన కవిత్వం మాత్రమే సమాజాన్ని ముందుకు నడుపుతుంది. అటువంటి కవిత్వం స్త్రీల నుండి యింకా విస్తృతంగా రావలసిన అవసరం వుంది. ❑

# మరో వందేళ్లూ మహిళలకు సమానత్వం కలే!

**సతీష్ ఊరుగొండ**
బీబీసీ తెలుగు ప్రతినిధి

మహిళలు ఆకాశంలో సగమన్నారు. స్త్రీ-పురుషులు సమానమేనని రాజ్యాంగమూ చెబుతోంది. సమాన అవకాశాలు కల్పిస్తామని పాలకులూ తరచూ చెబుతుంటారు. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని వరల్డ్ ఎకనమిక్ ఫోరం నివేదిక చెబుతోంది.

ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే సమానత్వం కోసం మహిళలు వందేళ్లు నిరీక్షించాలట. అంతేకాదు స్త్రీ-పురుష అసమానతలు గతంతో పోలిస్తే పెరుగుతున్నాయని కూడా డబ్ల్యూఈఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది.

2006 నుంచి పోల్చి చూసుకుంటే ఈ ఏడాది స్త్రీ-పురుష అసమానతలు పెరిగాయని డబ్ల్యూఈఎఫ్ చెబుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 144 దేశాల్లోని విద్య, వైద్య, రాజకీయ రంగాలతో పాటు ఆర్థిక విషయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని అధ్యయనం చేసి డబ్ల్యూఈఎఫ్ ఈ నివేదిక తయారు చేసింది.


మగవాళ్లకు ఉన్న అవకాశాల్లో స్త్రీలకు కేవలం 68 శాతం మాత్రమే ఉన్నాయని ఈ నివేదిక స్పష్టం చేసింది. గతేడాది ఈ సంఖ్య 68.3శాతంగా ఉంది.

ప్రపంచ వ్యాప్తంగా అన్నిరంగాల్లో మహిళలకు సమానత్వం రావాలంటే 83 ఏళ్లు పడుతుందని 2016లో అంచనా వేశారు. కానీ ఇప్పుడా వ్యత్యాసం మరింత పెరిగింది. మహిళల సమానత్వానికి కాస్త అటుఇటుగా వందేళ్లు పడుతుందని డబ్ల్యూఈఎఫ్ నివేదిక చెబుతోంది.



అయితే, విద్య, ఆరోగ్యం విషయంలో మహిళల పరిస్థితి కాస్త బెటర్గానే ఉంది. కానీ ఆర్థిక, రాజకీయ విషయాల్లో మహిళల భాగస్వామ్యం ఆశించినంతగా మెరుగు పడలేదని తన నివేదికలో డబ్ల్యూఈఎఫ్ పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

ఉద్యోగాల్లో సమానత్వం రావాలంటే మహిళలు 217 ఏళ్లు ఎదురుచూడాలట. అంటే మరో మూడు తరాలు మారాలన్న మాట. అప్పటికి కూడా పరిస్థితులు అనుకూలిస్తేనే. అలాగే స్త్రీ-పురుషుల జీతాల విషయంలోనూ విపరీతమైన వ్యత్యాసం ఉందని నివేదిక చెబుతోంది.




ఫిన్లాండ్, ఐస్లాండ్ వంటి స్కాండినేవియా దేశాలు స్త్రీ-పురుష సమానత్వంలో ముందంజలో ఉన్నాయి. ఐస్లాండ్‌లో స్త్రీ-పురుషులకు దాదాపు సమాన అవకాశాలు ఉన్నాయి. అక్కడ 12 శాతం వ్యత్యాసం మాత్రమే ఉంది. నార్వే, ఫిన్లాండ్, స్వీడన్ టాప్ 5 దేశాల్లో నిలిచాయి. రువాండలో ప్రతీ ఐదుగురు ఎంపీల్లో ముగ్గురు మహిళలే ఉన్నారు.

నికరాగువా, స్లోవేనియా, ఐర్లాండ్, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్ టాప్ 10 ర్యాంకుల్లో నిలిచాయి.

మధ్య ప్రాచ్యం, ఉత్తరాఫ్రికాలోని మహిళలు ఎక్కువగా వివక్ష ఎదుర్కొంటున్నారు. సమానత్వం విషయంలో యెమన్ చాలా వెనకబడి ఉంది. అక్కడ 52 శాతం మాత్రమే స్త్రీ-పురుషుల మధ్య సమానత్వం ఉంది.

స్త్రీ-పురుష సమానత్వంలో దేశాల ర్యాంకులు

| ర్యాంకు | దేశం | ర్యాంకు | దేశం |
|---|---|---|---|
| 1 | ఐస్‌లాండ్ | 135 | జోర్డాన్ |
| 2 | నార్వే | 136 | మొరాకో |
| 3 | ఫిన్‌లాండ్ | 137 | లెబనాన్ |
| 4 | రువాండ | 138 | సౌదీ అరేబియా |
| 5 | స్వీడన్ | 139 | మాలి |
| 6 | నికరాగువా | 140 | ఇరాన్ |
| 7 | స్లోవేనియా | 141 | చాద్ |
| 8 | ఐర్లాండ్ | 142 | సిరియా |
| 9 | న్యూజిలాండ్ | 143 | పాకిస్తాన్ |
| 10 | ఫిలిప్పీన్స్ | 144 | యెమన్ |

ఆధారం: గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్ 2017, వరల్డ్ ఎకనమిక్ ఫోరం BBC

## సమానత్వంలో భారత్ ఎక్కడుంది?

- స్త్రీ-పురుష సమానత్వం విషయంలో భారతదేశం 21 పాయింట్లు దిగజారి 108 స్థానానికి పడి పోయింది.
- పొరుగు దేశాలైన చైనా, బంగ్లాదేశ్ కూడా భారత్ కంటే మెరుగ్గా ఉన్నాయి.
- మహిళలకు తక్కువ వేతనాలు, ఆర్థిక వ్యవహారాల్లో వారి భాగస్వామ్యం లేకపోవడం దీనికి ప్రధాన కారణంగా డబ్ల్యూఈఎఫ్ అంచనా వేసింది.
- 170 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నివేదిక తయారు చేశారు.
- మహిళలకు గోవా సురక్షిత ప్రాంతమని, బీహార్‌లో స్త్రీలకు రక్షణ తక్కువగా ఉందని ఈ నివేదిక పేర్కొంది.
- మహిళా ఆరోగ్యం విషయంలో కేరళ టాప్ ప్లేస్‌లో ఉంది. ఆ తర్వాత తమిళనాడు, సిక్కిం, కర్ణాటక, ఏపీ, గోవా, మహారాష్ట్ర ఉన్నాయి.
- ఈ విషయంలో బీహార్ అట్టడుగు స్థానంలో ఉంది.
- విద్య, వైద్యం, ఆర్థిక రంగాల్లో మొత్తంగా చూస్తే తెలంగాణ 11వ స్థానంలో, ఏపీ 12వ స్థానంలో నిలిచాయి. ❑

## ఐక్యరాజ్యసమితి మహిళా సమ్మేళనం 2020

**(44వ పేజీ తరువాయి)**

పోతున్నారు.ఇలాంటి స్థితిలో ప్రపంచ వ్యాప్తంగా 'ప్రేమికుల రోజు' జరుపుకోవడంలో అర్థం వుందా...?చెప్పండి.అత్యాచారం నుండి బయటపడిన వారికీ న్యాయం కరుణతో కూడిన ఆశ్రయం గురించి బాలికలు మహిళలు బాలికలు వారిజీవితకాలం శారీరకంగా లైంగికంగానూ హింసను అనుభవిస్తున్నారు.

ఇలాంటి పరిస్థితి అత్యధికంగా వున్న ఫిజీ దేశం యూ ఎన్ డీ పి యూరోపియన్ యూనియన్ తో కలసి పనిచేస్తూ వీరికి న్యాయపరమైన ఆశ్రయం కలిపిస్తోంది. సువాలోని మెడికల్ సర్వీసెస్ పసిఫిక్ (ఎం.స్.పి) క్లినిక్ గాయపడిన బాధితులకు భద్రతా కల్పిస్తోంది. రక్షణపరంగా స్త్రీలకూ స్వర్గధామం అనవచ్చు" వారు ఎం ఎస్ పి కి వస్తారు. మేము వారిని వెంటనే ఆలస్యం లేకుండా కాపాడుతాం. కొందరు రోగులు ఎవ్వరిని విశ్వసించని స్థితిలో వుంటారు." అని జాసిన్టా రాబర్ట్ అనే సలహాదారు చెప్పారు. ఆ వివరాలు చూద్దాం ...బాధితులకు సురక్షితమైన వాతావరణం కల్పించడమే మా కర్తవ్యం. పోలీసులకు రిపోర్ట్ చేయడం కోర్టులకు వచ్చేవారి సంఖ్య కూడా పెరుగుతోంది. సాధారణ ఆసుపత్రులలో వైద్యవిద్య చదివే వారు కూడా అత్యాచారాలను ఎదుర్కొంటున్నారు. చట్టబద్ధంగా ఆమోదమైన రీతిలో సాక్ష్యాలను సేకరించడం రికార్డులను నిర్వహించడం గోప్యతను కాపాడటం

ప్రాణాలతో బయటపడిన బాధితులకు ఉపశమన కలిగించే విధంగా సంభాషించడంలో శిక్షణ పొందినవారు వున్నారు. కౌన్సిలర్ సమక్షంలో బాధితులకు పూర్తి ఫోరోన్సిక్ వైద్య పరీక్ష నిర్వహిస్తారు. అన్ని విధానాల డాక్యుమెంట్స్ చట్టపరమైన నిబంధనలతో నిర్ధారిస్తారు. ఆమె కోర్టుకు వెళ్ళినపుడు సహాయకారిగా వుంటారు.

ఫిజీ మెడికల్ ఎగ్జామినేషన్ ఫారం పబ్లిక్ డాక్యుమెంట్. ఇది ప్రభుత్వానికి చెందినది. కాబట్టి ఎలాటి పొరబాట్లు జరగరాదు. కోర్టులో వీటిని సబ్మిట్ చేయాల్సివుంటుంది. కోర్టులో ఫలితాలు నేరారోపణ-లేదా నిర్దోషిగా నిరూపరించడానికి వైద్య పరీక్ష ఫలితాలే కీలకం. ఈ సర్వీసులకు ఫిజీ యాక్సెస్ టూ ప్రాజెక్టులో భాగస్వామిగ యూరోపియన్ యూనియన్ నిధులు సమకూరుస్తుంది. ప్రజలను ధైర్యవంతులుగా శక్తిమంతులుగా చేయడానికి వారికీ కీలక న్యాయం అందచేయడానికి పేద బలహీన వర్గాల వారికీ తోడ్పడుతుంది. పౌర సమాజాన్ని ఆదుకొంటూ ఆ వారి జీవితాలలో వెలుగులు నింపుతోంది. వారికీ జీవితం పట్ల భవిత˘పట్ల విశ్వాసాన్ని అందించింది. నేను ఈరంగంలో సాధించిన విజయాలకు గర్వపడతాను. 2012 నుండి 900 మంది బాధితులకు చికిత్స చేసినట్టు మద్దతు ఇచ్చినట్టు నేను కోర్టుకి వెళ్ళినపుడు నామీద నమ్మకాన్ని కలిగించే ఈ వృత్తి పట్ల బాధితుల ఆశలను నెరవేర్చగలిగిన ఈ అవకాశంపట్ల ఎనలేని గౌరవం కలుగుతుంది....అని ఆత్మసంతృప్తితో డా –"ఓనెబిగ్స్ చెబుతారు. ❑

# రోజుకు 87 అత్యాచారాలు..
# మహిళలపై హింస పెరుగుతోంది

నాగమణి

భారతావనిలో మహిళలపై అత్యాచారాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించిన ఈ గణాంకాలు అంశం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2018తో పోలిస్తే, 2019లో దేశ వ్యాప్తంగా మహిళలపై అత్యాచారాలు పెరిగాయలని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించింది. 2019లో దేశంలో 87 వేల అత్యాచార కేసులు నమోదయ్యాయనీ.. 2020లో మహిళలపై పాల్పడిన నేరాలకు సంబంధించి 4.05 లక్షలకు పైగా కేసులు రిజిస్టర్ అయ్యాయని వెల్లడించింది. గతం కంటే అత్యాచారాలు 7.3శాతం పెరిగాయని తెలిపింది. అంటే ఏడాది ఏడాదికి అత్యాచారాలు పెరుగుతున్నాయని తేటతెల్లమవుతోంది.

'క్రైమ్స్ ఇన్ ఇండియా-2019' పేరిట ఈ నివేదిక విడుదల కాగా, మహిళలపై నేరాలు 7.3 శాతం పెరిగాయని, ప్రతి లక్ష మంది మహిళల్లో 62.4 మంది అత్యాచారాలు, వేధింపులను ఎదుర్కొన్న వారేనని తెలిపింది. 2018లో మహిళలపై వివిధ రకాల నేరాలకు పాల్పడిన కేసులు 3,78,236గా ఉండగా, 2019లో వాటి సంఖ్య 4,05,861కి పెరిగాయని పేర్కొంది.

2018లో 58.8 శాతంగా ఉంటే 2019నాటికి అది 62.4 శాతానికి పెరిగింది. మహిళలపై మహిళలపై నేరాలు నేరాల సంఖ్య పెరిగింది. అత్యాచారాల కేసుల సంఖ్య 32,559 నుంచి 33,356కు పెరిగాయని తాజా రిపోర్టు పేర్కొంది. ఇక వీటిలో అత్యధిక కేసుల్లో మహిళలు భర్త లేదా బంధువుల నుంచి వేధింపులు ఎదుర్కొన్నవేనని కూడా వెల్లడించింది. ఈ తరహా కేసులు 30.9 శాతం ఉండగా, మహిళలపై దాడులు, అత్యాచారాల కేసులు 21.8 శాతం ఉండగా, కిడ్నాప్ కేసులు 17.9 శాతం ఉన్నాయని ఎన్సీఆర్బీ పేర్కొంది.

మహిళలతో పాటు చిన్నారులపైనా వేధింపులు, దాడులకు పాల్పడిన కేసుల సంఖ్య గత సంవత్సరం పెరిగింది. 2018తో పోలిస్తే చిన్నారులపై నేరాల సంఖ్య 4.5 శాతం పెరిగి మొత్తం 1.48 లక్షలకు పైగా కేసులు రిజిస్టర్ అయ్యాయి. వీటిల్లో 46.6 శాతం కిడ్నాప్ కేసులు కావడం గమనార్హం. కాగా, ఈ నివేదికలో పశ్చిమబెంగాల్‌లో 2019లో జరిగిన నేరాలను మాత్రం చేర్చలేదు.

ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వం అందించలేదని ఎన్సీఆర్బీ తెలియజేసింది. 2018లో దేశ వ్యాప్తంగా మహిళలపై 3లక్షల 78 వేల 236 నేరాలు నమోదు కాగా వీటిలో 33,356 అత్యాచారాల కేసులే ఉన్నాయని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించింది. ❑



# మహిళా స్వావలంబన దిశగా కేరళ మరో ముందడుగు

స్త్రీ, పురుషుల సమానత్వం కోసం కృషి చేస్తున్నామని డప్పాలు కొడతాయి కొన్ని ప్రభుత్వాలు. ఆ ఆర్భాటానికే పరిమితమవుతాయి. కానీ, మావి మాటలు కాదు; చేతలు అని ఆచరించి మరీ చూపిస్తోంది పినరయి విజయన్ నేతృత్వంలోని కేరళ వామపక్ష ప్రభుత్వం. అందులో భాగంగానే దేశంలోనే మొట్టమొదటి 'లింగ పార్కు' (జెండర్ పార్క్)ను ఫిబ్రవరి 11న కేరళ కోజికోడ్‌లో ఏర్పాటు చేస్తోంది. అందులో ఏముంటాయి? దానివల్ల ప్రయోజనమేంటి?

రూ.300 కోట్ల వ్యయంతో 24 ఎకరాల విస్తీర్ణంలో మూడంతస్తుల భవనంలో ఈ పార్కు నిర్మిస్తున్నారు. 2021 ఫిబ్రవరి 11 నుంచి 13 వరకు జరిగే అంతర్జాతీయ లింగ సమానత్వం (ఐసిజిఇ-2) లో భాగంగా కేరళ ముఖ్యమంత్రి దీన్ని ప్రారంభిస్తారు. ఆ సమయంలోనే అంతర్జాతీయ మహిళా వాణిజ్య కేంద్రాన్ని (ఐడబ్ల్యుటిసి) ఏర్పాటు చేసిన ఘనత కూడా కేరళ ప్రభుత్వ సొంతమౌతోంది. కేరళ మహిళలు వ్యవస్థాపకంగా అభివృద్ధి చెందేందుకు ఈ కేంద్రం విశేషంగా కృషి చేస్తుంది. అలాగే లింగ సమానత్వమే లక్ష్యంగా ప్రారంభించిన జెండర్ పార్క్‌లో మొదటిదశగా జెండర్ లైబ్రరీ, జెండర్ మ్యూజియం, యాంపీథియేటర్, కన్వెన్షన్ సెంటర్లు నిర్మిస్తారు.



## దశలవారీగా..

**జెండర్ మ్యూజియం :** ఇక్కడ వివిధ సామాజిక పోరాటాలు ప్రదర్శితమౌతాయి. వాటిలో ప్రధానంగా మహిళల స్థితిగతులు, వారి జీవితంలో ఎదురైన మలుపులు, విజయాలు, పునరుజ్జీవనోద్యమం భాగం కానున్నాయి.

**జెండర్ లైబ్రరీ :** సమాజ అభివృద్ధిలో లింగ సమానత్వ పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించే సన్నాహాలను ఇక్కడ సిద్ధం చేశారు.

**కన్వెన్షన్ సెంటర్ :** 500 మంది కూర్చొనే సామర్థ్యంతో దీన్ని నిర్మించారు. అలాగే ప్రకృతి దృశ్యాల బ్యాక్‌గ్రౌండ్‌తో యాంఫీథియేటర్ను నిర్మించారు.

'జెండర్ పార్కు ఏర్పాటు చేయడం దేశంలోనే కాదు, బహుశా ప్రపంచంలోనే మొదటిది' అంటారు ఆ రాష్ట్ర ఆరోగ్య, సామాజిక న్యాయ, మహిళా శిశు అభివృద్ధి శాఖా మంత్రి కె.కె శైలజ. లింగ సమానత్వాన్ని పొందే లక్ష్యంతో ప్రాజెక్టులు, ప్రచారాలను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా ఐక్యరాజ్య సమితి మహిళ ఎంసిఓ (మల్టీ కంట్రీ ఆఫీస్) దక్షిణ ఆసియాలోకెల్లా కేరళలో జెండర్ పార్కు నిర్మించేందుకు ఆసక్తి కనబరిచి అందులో దీర్ఘకాల భాగస్వామ్యమైంది.


'ఈ భాగస్వామ్యంతో లింగ న్యాయం, సమానత్వం సాధించేందుకు కేరళ సాగించిన సుదీర్ఘ కృషిని గుర్తించనట్లైం' దంటారు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్. అంతేకాక కేరళ దీర్ఘకాలిక చరిత్ర, లింగ సమానత్వ ఉద్యమంలో కేరళ అనుభవం, విస్తృత, ప్రాంతీయ, ప్రపంచ ప్రేక్షకుల ముందు ప్రదర్శించేందుకు ఇది దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

'లింగ సమానత్వం, మహిళల సాధికారితే లక్ష్యంగా గల ఎజెండాను ముందుకు తీసుకెళ్లడంలో.. జెండర్ పార్కు దీర్ఘకాల భాగస్వామి, సామాజిక న్యాయ శాఖతో అధికారికంగా సంబంధం కలిగి ఉండటం... మాకు గర్వంగా ఉంది. ఇది మహిళలు, బాలికలందరీ స్థితిగతుల్లో స్థిరమైన మార్పు కోసం కృషి చేయాలని కోరుకుంటున్నాం' అంటున్నారు ఐక్యరాజ్య సమితి మహిళ ఎమ్‌సిఒ డిప్యూటీ రిప్రెజెంటేటివ్ అండ్ ఆఫీస్ ఇన్‌ఛార్జ్ నిష్తా సత్యం.

మహిళల హక్కులను బలోపేతం చేయడానికి... జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా లింగ సమానత్వాన్ని పెంపొందించేందుకు జాతీయ వ్యూహాలను రూపొందించేందుకు మహిళలు, పురుషులు, స్త్రీవాదులు, మహిళాసంఘాలు, ప్రభుత్వాలు, స్థానిక అధికారులు, పౌర సమాజంతో కలిసి పని చేయడమే ఐక్యరాజ్య సమితి మహిళా ఎంసిఓ లక్ష్యం. ❑

ప్రజాశక్తి సౌజన్యంతో..




## IWD 2021 campaign theme: #ChooseToChallenge

A challenged world is an alert world. Individually, we're all responsible for our own thoughts and actions - all day, every day.

We can all choose to challenge and call out gender bias and inequality. We can all choose to seek out and celebrate women's achievements. Collectively, we can all help create an inclusive world.

From challenge comes change, so let's all **choose to challenge**.

# SRI VENKATA KRISHNA EDUCATIONAL SOCIETY

Old Town, TANUKU - 534 211.
West Godavari District, A.P. Website : svke.net

**Sri Chitturi Subba Rao**
Founder, Secretary & Correspondent




## S.K.S.D. GROUP OF INSTITUTIONS

### S.K.S.D. MAHILA KALASALA DEGREE & PG

(Autonomous) Estd : 1982

Affiliated to Adikavi Nannaya University, Rajamahendravaram
Thrice-Accredited by NAAC with B++ Grade at 2.82 CGPA

Phone : 08819-222154, Email : womens.sksd@gmail.com

Courses Offered UG : BA (HEP), BA (HPCA), B.Com (General), B.Com (Vocational)
B.Sc., : MPC, MPCs, MSCs., MCCs., BZC, BZCs., MBBCC, MBBCCs.,

*Courses Offered PG :*
M.Sc., Organic Chemistry, M.Sc., Microbiology

### S.K.S.D. MAHILA KALASALA JUNIOR

Estd : 1982

Affiliated to Board of Intermediate Education, AP

Phone : 08819 - 224243
Email : sksdmahilajunior@gmail.com

*Courses Offered :*
General : MPC, BiPC, CEC, MEC, HEC,
Vocational : A&T, CSE, MPHW(F), CGT

### S.D. COLLEGE OF INFORMATION TECHNOLOGY

*(Co-Education)*
Estd : 2001

Phone : 08819 - 229742
Email : sditco@yahoo.co.in

Approved by AICTE, New Delhi

Affiliated to Adikavi Nannaya University, Rajamahendravaram

Courses offered : MCA, MBA

### SAROJINI DEVI COLLEGE OF D.ED.,

*(Co-Education)*
Estd : 2012

Phone : 08819 - 297245

Email : sarojinidevided@gmail.com

Approved by NCTE, Bangalore

Affiliated to C & DSE., Govt. of A.P.,

Courses offered : D.El., Ed.,

### VIVEKANANDA E.M. HIGH SCHOOL

Affiliated to CBSE, New Delhi. Affiliation No. 130505 - Phone : 08819 - 241450/51/52
website : vgstnk.org Email : vgs.sksd@gmail.com
Courses offered : Nursery to X

**Jaateeya Spurthi,** Fortnightly Printed and Published by **N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : DVVS Varma**